290

4B

1117

4

నందన - జ్యేష్ఠము - భారతి -

సంపుటము 30 -
సంచిక - 1



నందన
పుష్యము

భారతి

సంపుటము 30
సంచిక 1

స్వవిషయము

తల్లీ నిన్ను దలంచి పుస్తకము చే
తం బూనితిన్ నీవు నా
యుల్లంబందున నిల్చి జృంభణముగా
నుక్తుల్ సుశబ్దంబు శో
భిల్లం బల్కుము నాదు వాక్కునను సం
ప్రీతిన్ జగన్మోహినీ
ఫుల్లాబ్జాక్షీ సరస్వతీ భగవతీ
పూర్ణేందు బింబాననా!

నందన పుష్యముతో భారతి పత్రిక ముప్పదవ ఏట ప్రవేశించినది. నూత్నవస్త్రాలంకృతయై పాఠకసదస్యులకు నమస్కరించుకొనుచున్నది. ముప్పది ఏండ్లుగా భారతి పురోగమనమునకు, అభివృద్ధికి తోడ్పడుచు, భారతి సాహిత్యవిశిష్టత్వము నభిమానించి గౌరవించుచు భారతి పత్రికా స్థాపకులగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారి యాశయములకు ఆదర్శములకు ఉన్ముఖముగా 'భారతి'ని నడిపించు ప్రయత్నములో చేదోడు వాదోడుగా నిలిచిన తెలుగు పాఠకులకు, రచయితలకు, విద్వత్ శ్రేణికి మా హృదయపూర్వ కాభినందములు.

ఉత్తమ సాహిత్య పత్రికల కిది కాలము కాదని పలువు రాడుదురు. పలువు రాడు మాటగా నది పాటియై ధర చెల్ల వచ్చును. కాని ఉత్తమ సాహిత్య సృష్టికి, ప్రచారమునకు కూడ, ఐన కాలము, కాని కాలమనునవి లేవని మా విశ్వాసము. ఏ కాలమునకూడ ఉత్తమసాహిత్య మొక్కసారిగా బహుళప్రజాదరణ మందుకొనలేదు. రామాయణభారతములవంటిసద్గ్రంథములు పురాణములుగా, పగటి భాగవతములుగా, తోలుబొమ్మలాటలుగా పాటకప్రజానీకములో బహుళప్రచారము నందుకొని, శ్రోతల కా పురాణవస్తువులయందు గౌరవాభిమానములను పురిగొల్పగల్గినవి. గ్రంథప్రచురణారంభ పూర్వకాలమునాటి సాంఘిక విద్యాప్రచారవిధానము లంత సూక్ష్మముగ

అంత విస్తృతఫలప్రదములుగ నుండెడివి. మంచికో చెడ్డకో నేటిసంఘమున ఆ విధానములు మారినవి. శ్రుతసాహిత్యప్రచారము యాంత్రికయుగమహాత్మ్యమున పత్రికల, సినిమాల పాలపడినది. భారతాది పురాణపఠన మొనరించు పౌరాణికులను, 'తారాశశాంక విజయ'మే పురాణము చెప్పవలసినదని ప్రజ లేనాడును అడుగలేదు. ప్రజల అభిరుచి పేరిట పౌరాణికులు లా కావ్యపఠనములకు ఏనాడును పూనుకొనలేదు. ఆనాటి సరస్వతికి అత్తగారి అలజడి తక్కువ. ఈనాడైనను ఉత్తమ కళాస్వరూపములను, శ్రుత, ప్రదర్శక వస్తువులుగా ప్రజలు నిరాకరించిన ప్రబల నిదర్శనములు లేవు. కాని ఈ కళాసృష్టి యంత్రలక్ష్మి అధీనములో జరుగవలసివచ్చినది. ఆ నిర్మాతలు ప్రజాభిరుచికి వింత స్వరూపము నేర్పరుచుచున్నారు.

మానవ విజ్ఞాన వికసనసమయమున, ప్రపంచమున ప్రతివిషయమును విచక్షణరహితముగ, జ్ఞానసముపార్జన కాకరమే యనిపించును. కాని మహాప్రతిభులలో దక్క ఈ జీర్ణశక్తి యుండదు. సామాన్యుల మందరము, స్వవిజ్ఞాన వికాసములకు ఉత్తమ సాహిత్యమార్గము లేర్పరుచుకొని మనలోని జ్ఞానతృష్ణకు తగిన రసాస్వాదన మమర్చుకొన్నతప్ప సంస్కృతిపథమున పురోగమనమే క్లిష్టమయిపోవును. ఉత్సాహకులగు పాఠకులకు, రచయితలకు వర్తమాన సాహిత్య విశిష్ట స్వరూపమును, అందుబాటొనరించు ఆదర్శముతో భారతి స్థాపకులు భారతిని ప్రారంభించిరి. ఈ ఆదర్శముఖమున మేమెంతవరకు ప్రయాణము కొనసాగించగలుగుచున్నామో తెలుగు పాఠకలోకమే నిర్ణయించవలెను. ఈ నిర్ణయమే అభిమాన స్వరూపమున భారతి పురోభివృద్ధి కారకము కాగలదు. ఈ ఆశయ నిర్వహణమున లోపములు కనిపించిన మమ్ము హెచ్చరించి జాగరూకుల నొనరించు విధి పాఠకలోకముది. పాఠకుల అభిమానప్రమాణముల గ్రహించి తమ హృద్యసాహిత్య సుమములతో "భా ర తి" నలంకరించు బాధ్యత రచయితలందరిపైననూ కలదు. ఈ నిర్వహణమున తమ కృషితో మాకు తోడ్పడగలందులకు పాఠకులనూ రచయితలనూ కూడ "భారతి" నూత్న సంవత్సరారంభమున ప్రార్థించుచున్నాము.

'భారతి' జననము దేశ అస్వతంత్ర కాలమున. 'భారతి' రజతోత్సవమునకు కొంత పూర్వమే తన దేశ స్వాతంత్ర్యోత్సవమున పాల్గొని "భారతి" హర్షించినది. ఈ ముప్పదవయేట ఆంధ్రరాష్ట్రవాంఛాసిద్ధి భారతికి ముదము గూర్చగలదు.

భాషారాష్ట్ర ప్రాతిపదికపై ఏర్పడు తెలుగుదేశమున, దేశ సర్వవ్యవహారములు తెలుగుభాషలో నడువవలసిన కాలమున, దేశమున కుత్తమ సాహిత్య పత్రికల అవసరము అత్యధికము కాగలదు. ఆ అవసరముల కనుగుణ్యముగ తన్ను సంస్కరించుకొనుటకు భారతి ఉత్సాహపడుచున్నది. తెలుగు సాహితీలోక ఆదరణయు, భారతి కటాక్షమును మాకు తోడ్పడుగాక!

ఆంధ్రవీరా!

శ్రీ బులుసు వేంకటేశ్వరులు

★

ప్రతికేఁ లేని మహాంధ్ర వీరవర! సంభావార్హమై పోయె నీ
యతిలోక ప్రతిభాన సంయుత మహాత్మోత్కృష్ట శౌర్యోన్నతుల్
నతు లర్పించి నివాళు లిత్తు రెపు డాంధ్రస్త్రీలు పుణ్యార్యభా
రత మాతృత్రాణ విమోచనాత్మక భవత్ప్రాబల్య శంసార్థమై.

అంతటి వాడవు నీకీ
వంతలు తగునయ్య? కలిసి వచ్చునటయ్యా?
శాంతియుతంబుగ బని సా
ధింతము క్షణమాత్ర యేల దీనత్వ మిటుల్?

కోపము చూపబోకు మరికోటులపై, దెగిపోవనట్టి సం
తాపమె కూర్చుగాని యొకదమ్మిడి కూడను గూడిరాదు నీ
యోపును జూపి శాంతముగ నెల్లర నేకముఖానగూర్చి నీ
వే పరికించి మార్గమును నెత్తుమయా! తెలుగుంబతాకమున్.

సిద్ధించె స్వరాజ్యం బని
యుద్ధతులై పెద్దవార లున్నా రిక స
న్నద్ధుడవై నిజరాష్ట్రము
సిద్ధించెడి దాక నిద్ర కెందకు మన్నా!

మనరాష్ట్రంబు గడించుకోన మని యేపుణ్యాత్ము లెంతెంత త్యా
గ నిరూఢిన్ దమ సర్వమున్ విడిచిరో కై సేసి వా రెల్లరిన్,
దనువుల్ నేడు తృణంబుగా విడువగన్ బ్రాయోపవేశంబు చే
సిన యాంధ్రర్షుల కంజలించియును సంసిద్ధుండవై లెమ్మికన్.

వలె నన్న వారిపైబడి
వల దని ఘోషించువారు వారలపై సం
కుల సమరమునన్ డీకొని
వలె-వల దని హుంకరించు వారై రాంధ్రుల్.

పదియేండ్లకైనగానీ
యిదియే తం తగునో యేమొ ? యిదియే యుగునో
మొదటికె వచ్చునుగాదా ?
మదరాసు సమస్య యెన్ని మాటల దేలున్ ?

చూచితి మెన్నో యేండ్లు రుచి చూచియె యుంటిమి తత్ఫలంబు లా
లోచన లింక మాని యెటులో యిది తేల్చుట లెస్స యాంధ్రవీ
రా ! చను మింక ముందునకె రాష్ట్రము వచ్చుటొ రాకపోవుటో
చూడకొనంగ నౌనిపుడె చూపుము నీదగు దూరదర్శితల్.

పురుషత్వము జూపించుచు
బరమం బగుధర్మ మార్గ పాటవమున నే
యిరవొందెడు రాష్ట్రంబును
ద్వరగా నేర్పఱుప గూర్పు త్యాగధనంబున్.



అమరజీవి ★

శ్రీ దండిపల్లి
వేంకటసుబ్బాశాస్త్రి

అమరజీవివి నీవు-మహాత్మగాంధి
అనుచరుల ముఖ్యగణ్యుడవయ్య! ఆంధ్ర
జనత కేబది యెన్మిది దినము లుపవ
సించి ప్రాణాలు వీడిన సిద్ధు డీవు!

నీ దీక్షామయ సత్తపస్సులు ఫలోన్మేషంబు, లాంధ్రావనీ
ప్రాదుర్భూత శుభారుణోత్సవ జయప్రారంభ రేఖావిలా
సా దర్శంబులు, నాంధ్ర సంస్కృతి ప్రతిష్ఠాంకప్రవృత్తమ్ములై
మోదం బబ్బెను జాతికంతటికి నీమూలమ్మునన్ ధన్యుడా!

ఒకనాడే ధరణీవిభాగమున విశ్వోద్యన్మహాయోగని
ష్ఠకు పేర్మ్రోగిన ఆంధ్రజాతికి ప్రతిష్ఠాజ్యోతి వెల్గించి, తా
వక ప్రాణమ్ముల రాష్ట్రసిద్ధికయి నివ్వాళించి, మా ఆంధ్రమా
తకు వ్యక్తిత్వము గూర్చగల్గితి మహాత్యాగీ! నమోవాకముల్.

"ఉదయం బస్తనగంబు, సేతువు, హిమవ్యూహంబునన్ జుట్టి రా
విదితంబైన" మహోర్వినంతటను వైవిధ్యైతిహాసమ్ములన్
మదియింపం బడనట్టి స్వార్థరహితాత్మత్యాగయజ్ఞమ్మునన్
హృదయస్పందన కారణుండ వగు నీకేనోయి బాష్పాంజలుల్.

పూన్కి ముక్కోటి ఆంధ్రుల పుణ్యమనగ—
రాష్ట్ర నిర్మాణ మను బరార్థమ్ముగోరి
కనులు మూసిన నీవెన్న ఘనుడవయ్య!
దేశచరితలో నీకెందు దీటుగలరె?

సేవాధర్మము బాటిచెప్పితివి, ఆసీమాంత భూఖండమం
దీవైలక్ష్యము నీకె దక్కెనుగదా, ఏమైన నీ ఆంధ్రరా
జ్యావిష్కారము నీదు పుణ్యమని వ్యాఖ్యానించి చారిత్రకుల్
భావిఖ్యాతికి దోహద మ్మపుడు రాయన్ జాల రెవ్వారలున్.

భౌతికమ్మైన దేహము వదలినావు—
అయిన ముక్కోటి ఆంధ్రహృదంతరముల
నిలిచిపోయెను నీఆత్మ నిశ్చయముగ;
అమరుడవు పొట్టి శ్రీరామ! అవనియందు.

ఆత్మయజ్ఞం

★

'ఆనంద్'

మానవుని ఐచ్ఛిక శక్తి అడుగంటి, అతను సృజించు యంత్రసాధనముల ప్రచండశక్తి అపరిమితమగుచున్న యుగము ఇది. ఈ మహాసంకీర్ణ భువనమందు ఇతర జీవులకన్న తాను భిన్నయనుట కాధారమైన మానవుని వ్యక్తిత్వము ఉడిగి, వైయక్తిక ప్రాభవమునకు గ్రహణము పట్టి, సమూహ శక్తికి సమారాధన జరుగుచున్న శతాబ్దమియ్యది.

ఇట్టి భ్రష్ట వ్యక్తిత్వ తమసంలో, ఈ ఉద్దండ సమూహముల మేఘాచ్ఛాదిత గగనంలో, ఒక మెఱుపు తటిత్తున మెరసి, జనసహస్రముల నేత్రాలను మిరుమిట్లు గొల్పినది. అవును, తటిత్తు కాలప్రమాణమున ఏబది ఎనిమిదిరోజులు! కాని జ్ఞానప్రమాణమున ఒక త్రుటికాలము! దీపము వెలుగుచున్నంతసేపు నిర్లక్ష్యము. అది ఆరిన తర్వాత......నడుము విరిగిన పాము బుస్సులు...దగ్ధగృహయజమాని భస్మరాసులపై విన్పించు పెడబొబ్బలు ... ఇది మనకు ఎప్పటి కప్పుడే పరిపాటి.

రాజకీయమని ఒకరు; వైయక్తిక వైషరీత్యమని మరొకరు; బలాత్కారసాధనమని కొందరు; తంత్రాంగమని మరికొందరు; శాక్యమని, ఇంకేమేమో యని ఎవరికి తోచినట్లు వారు నిర్వచించారు. తనకు తానే ఏర్పరచుకొన్న అంపశయ్య, పూలపాన్పు...నల్దిక్కులనుంచి దూసుకొనివచ్చు ఈ అంప పరంపర జ్వాలాతోరణము.

గారడీ యని చూడబోవువారు కొందరు; నైజమును పరిశోధించబోవువారు కొందరు; నలుగురితో పాటు నారాయణఅని పోవువారు కొందరు; దైనందిన జీవితపు బజారు దృశ్యములతో తీరిక లేక, 'వ్యర్థ కాలహరణమున'కు ఒడిగట్టని వారు కొందరు!

చాటున పాలుపంప్లు, ఇత్యాది, సేవింపబడుచున్నవని 'అపరాధపరిశోధకు'ల తాజా వార్తలు! ఎవ్వరినో అవమానించుచున్నటుల భావన! ఆత్మవంచన అని గుర్తించుటకు గుడ్డిదయ్యె మనోనేత్రము.

ఇంకను మృత్యుచ్ఛాయలు కమ్మలేదే? మాటలలో 'యమునిమహిషపు లోహఘంట'ల ప్రతిధ్వని వినబడలేదే? మృత్యువుయొక్క కొరివిదీపమును చూపి, బెదిరించుచున్నాడని యన్నవారుకూడ లేకపోలేదు.

ఇదొక తమాషా. ఇదొక సాధింపు అని తీవ్రనిర్లక్ష్యమును ప్రదర్శించిరి పెద్దలు కొందరు. కాని మృత్యుశీతలముకంటె



ఆంధ్రరాష్ట్ర సాధనలో ఏబదియెనిమిదిరోజుల నిరశనదీక్ష పూని, ఆత్మబలిదాన మొనర్చిన
మహామహుడు శ్రీ పొట్టి శ్రీరాములుగారు.

మానవ హృదయ శీతలమే ఎక్కువ వాడి అని స్పష్టమైనప్పుడు, మృత్యువు సైతం జాలి కలిగి, తన చల్లని చేతులతో కనులు మూసినపుడు, ప్రశంసా వాక్యములకు కొరత లేదు.

బాహ్యమున వ్యక్తమగునదే మన నాకర్షించును. అంతస్సునకేసి మనము చూడము. బాహ్యవిషయములపై మనము కేంద్రీకరించు శ్రద్ధలో రవ్వంత అంతర విషయములపై చూపినచో, ఇంత సంక్షోభ యుండదు.

"ఈ విధమైన సాధనమునకు తలొగ్గితిమే, ఇంక రాజ్యాంగము నడచునదెట్లు అని విమర్శించుట తప్ప, ఈ వ్యక్తి పరద్వేషచింత ఇసుమంత మాత్రముకూడ లేకుండ ఇట్టి అత్యసాధారణ కార్యమున కెందుకు పూనుకొనినాడు? అని అవలోకించుకొనుటకు పూనుకొనరు.

భిన్న, విభిన్న అభిప్రాయపరులందరూ సంకుచితత్వమును విసర్జించి, స్నేహపూర్వకముగ ఒక సర్వసమ్మత అభిప్రాయమునకు రావలెనని ఉద్దేశించిన ఈ వ్యక్తియొక్క ప్రవిమలోద్దేశ్యమును క్షణమాత్రమైన గ్రహించినచో, ఇట్టి రసాభాస విమర్శ వినబడదు.

తప్పనిసరిగా ఒకపనిని చేసితీరవలెననుటకు కాదీ పూర్ణాహుతి. కార్యోన్ముఖత కల్గించుటకు. స్వదృక్పథముల శాఠ్యమును విసర్జింపజేసి, లక్ష్యసాధనకు ప్రేరేపించుటకు.

ఇంత నిర్లక్ష్యముగా వ్యక్తిని మృత్యుజ్వాలల కర్పించుట, వ్యక్తిత్వముపట్ల చూపబడుచున్న తీవ్రనిరాదరణకు నిదర్శనం. సాముదాయక తత్త్వమే ప్రచండ శాసనముగా ఎంచబడుచున్న దృక్పథానికి ప్రతిఫలం.

"ఒక వ్యక్తియొక్క ఉద్యమము!" అని నవీన ఉద్యమకర్తలు విమర్శించెదరు. అవహేళన చేసెదరు. మూకల నుక్కుమ్మడిగ నున్మత్తులజేయని ఈ ఏకాకి యత్నము హాస్యాస్పదము!

కాని దౌర్జన్యముతో, హింసాఘటనలతో కలిగింపలేని కోలాహలము, ఈ ఏకాకి తుది యూర్పువలన నల్దిశల మిన్నుముట్టినది. సందేహపరులు ముక్కున వేలు వేసుకొనిరి. హేళనపరులు నాలుకలు కొరుకుకొనిరి. నిర్లక్ష్యపరులు తెల్లపోయి, గుండెబాద చేయి వేసుకొనిరి. 'వ్యక్తియత్నం' అని ఈసడించిన ఉద్యమధీరులు చకితులై జోహారులర్పించిరి! నిరశనవ్రతమని నవ్విన వారు దాని ఫలితాలనుచూసి విప్లవం బహుముఖమైనదని గ్రహించిరి.

ఏ యత్నమునకైన చిత్తశుద్ధి మూలమగుచో, సత్యము మూలమగుచో, ద్వేషరాహిత్యము మూలమగుచో, అట్టి యత్నము ఒక్క వ్యక్తియే అనుసరించినా ఫలప్రదమయితీరును— అన్న విస్మృత సత్యము స్పష్టమైనది. కేవలము సంఖ్యాబల ప్రదర్శనమును తప్ప ప్రభుత్వములు, ప్రజలు మెచ్చని, తలొగ్గని ఈ తరుణములో కేవలమొక్క వ్యక్తి జీవితానంతరం ఎంత ప్రచండమైన పరిణామం తెచ్చాడు! సమస్యల ప్రసక్తి పరిష్కారకులకు. కాని ఈ సంఘటనలోని అంతర, నిరంతర సత్యాన్ని, వ్యక్తిప్రాభవం అమరమనే సత్యాన్ని గ్రహించుట అందరకూ ప్రసక్తి



నవల:

శాఫో

★

ఆల్ఫాంజ్ డాడె(ట్)

8

ఛావిల్లి అనే పల్లెలో బస ఏర్పరుచుకొన్నారు. మాగాణిపీఠులకు కొండగుట్టలకు మధ్యనున్న చిట్టడవి అంచున ఉన్న పల్లె. అక్కడ 'వుడ్‌మన్స్ వాక్' అన్నరోడ్డుచివర దాదాపు అడివినంటుకొనిఉన్న ఒక చిన్న యిల్లు అద్దెకు పుచ్చుకొన్నారు. ఆ యిల్లు పూర్వం ఎప్పుడో అడవిలో వేటలకు వచ్చినవాళ్ళకు బసగా ఉండేది.

ఆ యింట్లో మూడుగదు లున్నాయి. దాదాపు పారిస్‌లో యింట్లో ఉన్నగదు లంతేంతవే. అక్కడి సామానుఅంతా, పేము పడక కుర్చీ, బొమ్మలబీరువా, అన్నీ తర్లించుకొని తెచ్చుకొన్నారు. పడకగది గోడలకు ఆకుపచ్చని కాగితాలు అంతటా గిలాబు చేసి ఉన్నాయి. అక్కడి గోడకు తగిలించేందుకు, ఫానీ పోర్ట్రెయిట్ ఒక్కటే మిగిలింది. 'కాస్లెట్' ఫోటో, సామాను తర్లింపులో ఫ్రేమ్ విరిగి అద్దం పగిలిపోయేటప్పటికి అటుకమూల పారవేశారు.

కాసెట్‌ను గురించి ఇప్పు డిద్దరూ ఎక్కువ సంభాషించుకోటం లేదు. 'మామా' 'కోడళ్ళ' మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఎప్పుడో ఆగిపోవటంతో ఆ ప్రసక్తి రావటం ఆగిపోయింది.

మొదటిసారి తమ కాపురం చెడగొట్టటానికి షోకేలాకూడా అత్యుత్సాహంతో సాయపడ్డా డన్న విషయం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా, "భలే, జారుడు చేరగాడే" అనేది. కవలపిల్లలుమాత్రం అన్నకు ఇంటి విషయాలు తెలుపుతూ ఉత్తరాలు వ్రాస్తూండేవారు. దివోనీ ఉత్తరాలు వ్రాయటం మానేసింది. బహుశా ఆవిడ కతనిమీద ఇంకా కోపం తగ్గలేదో, లేక తన అమాయికపు పల్లెటి తల్లిపలుకుల ఉత్తరాలన్నీ చింపి చూసి అవాకులూ చవాకులూ వాగేందుకు, ఆ సెకిసే మళ్లీ తమ కుఱ్ఱాడిదగ్గరకు చేరిందని ఆమె ఊహించిందో!

ఇంకా రూ డి ఆమ్‌స్టర్‌డామ్ లోనే ఉన్నామేమో అన్నట్టే ఒక్కొక్కప్పుడు వాళ్ళకు అనిపించేది. ప్రొద్దున్నే నిద్ర మేల్కొంటంలోనే, హెట్టీమాల జంటగాత్రం మేల్కొలుపులుపాడుతూ వినిపించేది. హెట్టీమాలు ఇప్పుడుకూడా ఆపల్లెకేవచ్చి వాళ్లున్న ఇంటిప్రక్క ఇంట్లోనే నివాసం ఏర్పరుచుకున్నారు. రోడ్డుకు ఇవతలప్రక్క చిక్కయిల్లు. అవతలప్రక్కగా పార్కు దాటి రైలురోడ్డు. అస్తమానం అటు ఇటూ తిరుగుతూ చెట్లమధ్య కనబడుతూ పోతూండే రైళ్ళకూతలుకూడా పారిస్‌లో చేరువనే ఉన్నామన్న భ్రమ కల్పించేవి. కాని పారిస్‌లోలాగా ఇంటి ఎదురుగా గాజుకప్పు స్టేషన్ మేడా, తెరచిన కిటికీల్లోంచి కనబడ్తూండే రైల్వే గుమాస్తాలు, అహోరాత్రాలూ ఇంటిముందరి పెద్దరాస్తా సందడీ, మాత్రం ఉండేవి కావు. వాట్ల బదులు, పచ్చని ప్రశాంత విశాల ప్రకృతీ, తమ తోట కొద్దిసంటుకొని వరుసగాఉన్న గృహారామాలచెట్ల జొంపాల మధ్యనుంచి కనుపడుతూన్న ఇళ్ళకప్పులూ, కొండవాలున బార్లు తీరినట్లుండి, కన్నులపండువౌతూ ఆనందాన్ని చేకూర్చేవి.

ప్రొద్దున్న ఆ చిన్న భోజనాల గదిలో ఫలహారంచేసి ఆఫీసుకు బయలుదేరేవాడు. భోజనాలగదికిటికీ ముందు రోడ్డుమీదకు తెరచుకొని ఉండేది.

రోడ్డు మధ్యమధ్య పచ్చిక, పాత గుడ్డకు మాసికలు వేసినట్లుగా మొలిచిఉంది. రోడ్డు కిరుప్రక్కలా,

తెల్లని పూల మళ్ళె మొక్కలు కంచెలుగా వేసి ఉన్నాయి. వాట్ల తియ్యని సువాసనలు పరిసరాలను నింపుతున్నాయి. రోజూ ఈ దోవనే నడిచిపోయి పదినిముషాల్లో రైలు స్టేషను చేరుకుంటూంటాడు. ప్రొద్దుపొద్దునా కంచె అవతలున్న పార్కు సమ్మర్ద ధ్వనులతో సంతోషంతో కలకలలాడుతూండేది. రాత్రిపూట మళ్ళీ అతను స్టేషనునించి ఈ త్రోవనే ఇంటికి వస్తూంటే, కంచెల్లోంచి గుసగుసల శబ్దాలు ముమ్మరంగా వినిపిస్తూన్నట్లూండేవి. సూర్యాస్తమయ వర్ణంలో రోడ్డుమీద పచ్చికదుబ్బులుకూడా ఎఱ్ఱబడిపోయి ఇటూ అటూ నీలి నీడలు రోడ్డుమీదకు ప్రాకుతూండేవి. పొదలలోంచి కోయిలల కుహూ కుహూ రావాలతో, రాత్రి పక్షుల సంగీత రావాలు కలిసిపోతూండేవి.

కొత్త కాపురం కొత్త కుదుటపడి ఈ ప్రశాంత ప్రకృతిరమ్యత్వం పరిపాటై అయిపోయి, నవ్యత్వ విభ్రమాన్ని కోల్పోయాక, అతనికి మళ్ళీ పూర్వపు మనస్సంక్షోభము పొటమరించింది. మళ్ళీ ప్రేయసి విషయంలో వ్యర్థపూర్వపు అనుమానాలు, ఈర్ష్యలు, అసూయలు, వికృతకోర్కెలుగా మనస్సును తొలవటం ప్రారంభించాయి. తన ప్రియురాలు రోజాతో దెబ్బలాడి ఆ వసతిగృహాన్ని వీడి వచ్చేసిన ఘట్టంతో, పూర్వ జీవిత సంపూర్ణ స్వరూపం మళ్ళీ బట్టబయలో నర్చుకొన్నట్లయి, మళ్ళీ ఆమెపట్ల పూర్వపు అనుమానాలు, ఆతురతలు, మనస్సును వేధించసాగాయి. రైలులో వెళ్తూన్నప్పుడు కిటికీలోంచి తమ యింటి వేపే చూస్తూ చూపులతో గోడలను ఛేదించుకొని ఇంటిలోపల ఏం జరుగుతుందో చూడ ప్రయత్నిస్తున్నట్లు చూచేవాడు. "ఏమో! ఎవరికి తెలుసు!" అని అనుకొనేవాడు. ఆ ఊహలే రోజుపొడుగునా, ఆఫీసుకాగితాల మధ్య ఉన్నాకూడా అతన్ని వెంటాడుతూండేవి.

సాయంత్రంపూట ఇంటికి రాగానే, ఆమె రోజంతా ఎల్లా గడిపిందీ, ఏం చేసిందీ, ఏం ఆలోచించిందీ, అన్నీ వివరంగా అడిగేవాడు. ఎంత స్వల్పవిషయమైనా పూర్తిగా చెప్పేదాకా వేధించేవాడు. ఉండి ఉండి "ఏమిటి ఆలోచిస్తున్నావు! ఆలోచించకుండా వెంటనే చెప్పు" అంటూ ఆమె నదరగొట్టూండేవాడు. ఆ పూర్వస్మృతుల నన్నిటినీ తలుచుకొంటూందేమో, వేటికోసమైనా మళ్ళీ తహతహలాడుతుందేమో నని నిత్యమూ భయమే! ఆ ప్రశ్నలన్నిటికీ ఆమె తన సహజధోరణిలో మనస్సులో ఏం అరమరికలు లేకుండా, తొణకకుండా జవాబు చెప్పేది.

ఆ మధ్యకాలంలో, ఆదివారాలు తప్ప ఒకర్నొకరు కలుసుకోలేక, ఆ రోజుకోసం ఇద్దరూ ఆత్రంతో తహతహలాడుతూ గడిపిన రోజుల్లో మాత్రం, ఆ వియోగ ఆవేదనలో నిత్యం ప్రతి స్వల్ప విషయంలోనూ ఆమెలో తప్పులు వెదికే ఈ బుద్ధికి, తావు లేకపోయింది. కాని ఇప్పుడు మళ్ళీ ఇద్దరూ కలిసి జీవితం సాగించేటప్పటికి, ఒకళ్ళ నొకళ్లు మళ్ళీ వేధించుకో సాగారు. ఎంతటి గాఢపు కౌగిలింతలోనూ, ఎంతటికైవల్యానందపరవశ సమయంలోనూ కూడా, ఏదో మూగకోపం, ఏ దిద్దుబాటుకూ ఆస్కార మేమాత్రమూ లేకుండా ఏదో భ్రష్టమైపోయిందన్న లోటెరుకతో కూడిన ఆవేదన, నిత్యం కుమిలించేస్తూండేది. కామశాస్త్రరహస్య సర్వస్వంలో గడితేరిన, ఈ స్త్రీలో, ఆమె ఎన్నడూ ఎరుగని ఒక అపూర్వ నూతన అనుభవాన్ని కల్పించాలన్న ప్రయత్నంలో, అతను నిస్తేజుడై పోతూండేవాడు. తన పూర్వకాముకులు ఏ పదిమందికీ ఏనాడూ ఇయ్యలేనంత ఆనందాన్ని అతనికి సమకూర్చటానికి, ఏవిధంగా పడితే ఆవిధంగా తన్ను ఆహుతి చేసికొని అతని కర్పించుకోవాలన్న ఆవేశంతో ఆమె ప్రయత్నించి, విఫలురాలై, అశక్త కోపంతో కన్నీరు కార్చేది.

కొన్నాళ్లకు మనస్సంక్షోభాలు కొంత తగ్గి తేరుకొన్నారు. బహుశా ఆ చల్లని ప్రకృతివాతావరణంలో విషయవాంఛలు తృప్తిపడి తీరటంవల్లనో, లేక కేవలం పొట్టేమాల పరిసరప్రభావంవల్లనో కొంత మనశ్శాంతి చేకూర్చుకోగలిగారు.

ఆ పారిస్ పివారు పల్లెల్లో నివసించేవారెవ్వరూ కూడా, గ్రామీణ జీవిత సౌకర్యాలను సంపూర్ణంగా ఆనందించటంలో పొట్టేమాలకు దీటురారు. దుస్తుల నియమాలు పాటించక్కరలేకుండా పాతబట్టలు వేసుకొని, గాకబారుగడ్డిలో పీలతో ఇద్దరూ కలిసి షైటికి బయలుదేరేవారు. పొట్టీమాసతికి గౌను లోపల రవిక తొడగాలన్న బాధ ఉండేది కాదు. భర్తకు జనపనారజోళ్లు తొడుక్కొని బయలుదేరటమే సుఖంగా ఉండేది. తిండి తింటూన్నప్పుడు కూడా ఏ ఎబ్బెరికమూ లేకుండా, బల్ల క్రిందపడ్డ రొట్టెముక్కలూ అవీ తెచ్చి, దొడ్లో కాతుంకూ, కుందేలుపిల్లలకు తినిపించి, మళ్ళీవెళ్ళి బల్లదగ్గర కూర్చుని భోజనాలు సాగించుకొనేవారు. ఇంక తోటపని, గొప్పుత్రవ్వటం, పాదులు పెట్టటం, మొక్కలకు నీళ్ళు పోయటం, ఈ పనులలో వాళ్లకున్న ఆనందం ఇక చెప్పనే అక్కరలేదు.

హెట్టీమా ఆఫీసునుంచి ఇంటికి రాగానే, ఇద్దరూ తోటపనిలో నిమగ్నులైపోయేవారు. హెట్టీమా ఆఫీసు దుస్తులు విప్పి, రాబిన్‌సన్ క్రూసోలాగ ఒక చిరుగులకోటు తొడుక్కుని తోటపనిలోకి దిగేవాడు. రాత్రి భోజనాలయాక మళ్లీ ఇద్దరూ తోటకు నీళ్లు పెట్టటంలో మునిగి పోయేవారు. అర్ధరాత్రి దాకా చేదలలో నీళ్ళు పట్టుతూన్న చప్పుడూ, చేదలమోతలు, పంపు కొట్టూన్న గడబిడ, చేదలు బరువుగా చేరేయటంలో వాళ్ళ వగర్పులు, నిశ్వాసాలు, ఒక పూలకుండినుంచి మరోక పూలకుండిదగ్గిరకు కదలికల్లో సంరంభం, చెట్లకి పోసిన నీళ్ళు ఆకులమధ్యనుంచి, శ్రామికుని నుదుటినుంచి రాల్తున్న చెమట బిందువులాగా, ఎడతెగకుండా చిటపట చిటపట రాల్తూన్న చప్పుళ్ళు, వినబడుతూనే ఉండేవి. ఉండుండి విజయగర్వంతో కేకలు వినబడుతుండేవి.

"బఠాణీ మొక్కలకు ముప్ఫైరెండు చేదలనీళ్లు పోశాను"

"నేను చేమంతి మొక్కకు పధ్నాలుగు చేదలు పోశాను"

హెట్టీమాలు కేవలం సౌఖ్యం అనుభవించటంతో ఊరుకునే మనుష్యులు కారు. ఆ సౌఖ్యాన్ని ఉండచుట్టి, నాలుకచివర చప్పరించి, నోరూరించుకొంటేతప్ప తృప్తిపడరు. ముఖ్యంగా ఆ భర్త. శీతాకాలంలో దంపతు లిద్దరే ఉండి, జీవితపు వెచ్చదనం అనుభవించటంలో కల సౌఖ్యాలను అతను వివరిస్తూంటే, వినకుండా వదిలిపెట్ట బుద్ధయ్యేది కాదు.

"ఇప్పుడంతా బాగానే ఉందనుకో! కాని డిసెంబరు వచ్చేటప్పటికి చూడు ఎల్లా ఉంటుందో! ఇంటికొచ్చేటప్పటికి బట్టలంతా బురదా బాడి కొట్టుకొని, తడిసి ముద్దయి, పగలంతా పారిస్‌లో పడ్డ చిరాకులతో విసిగిపోయి ఇంటికి వస్తావు. ఇంటికొచ్చేటప్పటికి ఇంటిదగ్గర వెచ్చగా హాయిగా, వెలిగించిన దీపము, పచనమౌతూ సువాసనల పొగలు జిమ్ముతూన్న భక్ష్యపానీయాలు, బల్లక్రింద కాళ్ళు వెచ్చబడేస్తూ గడ్డిదిళ్లు—ఎందుకు నే చెప్తున్నా విను, కాస్త రెండు వేడి వేడి ముద్దలు కడుపులో పడి, ఒక గ్లాసెడు ఘాటుఅయిన షర్బత్ పుచ్చుకొని, హాయిగ్గ దగ్గిరకు పడకకుర్చీ లాక్కుని వెన్ను వాల్చుకొని కూర్చుని, రెండు దమ్ములు పొగ పీలుస్తూ, వేడివేడి కాఫీలో తియ్యదనానికి రెండు చుక్కలు బ్రాందీ కలిపి చప్పరించుకొంటూ వెచ్చగా నిప్పువగ్గర అటుపైపు ఆవిడా, ఇటుపైపునువ్వూ ఇద్దరేకూర్చుని,— బైట గాలివాన కిటికీ అద్దాలమీద జోరుగా కురుస్తూ చలితీవ్రమయిపోతుంటే—లోపల ఇద్దరూ వెచ్చగా కూర్చుని, కాస్త తిన్నది అరిగేదాకా ఒక్క కునుకు తీస్తూంటే—ఏం హాయిగా ఉంటుం దనుకొన్నావు! ఆ తర్వాత ఆవిడ ఎంగిళ్లు అవీ తీసేసి కంచాలు కడిగి, బల్లలు శుభ్రపరిచి, పక్కలు వేసేలోపల కాస్త ఆఫీసు పని ప్లానులూ డ్రాయింగులూ వేసుకొంటూ కూర్చోవచ్చు... ఆ తర్వాత ఆమె ముందు పక్కలో చేరి పక్క కాస్త వెచ్చబడేశాక, నువ్వు ఉండ గట్టుకొని పక్కమీద పడితే, ఒళ్లంతా చక్కగా ఆవంలో పెట్టినట్లు వెచ్చబడుతూ వచ్చి, 'చమ్మగా' ఉంటుంది."

ఆ ఇంద్రియ సౌఖ్యాలను వర్ణించటంలో మహా వక్త అయిపోయేవాడు, హెట్టీమా!—రోమకళ ఉట్టిపడుతూ అస్థ దవడలతో ఎడ్డెమనిషి అనిపించే ఈ స్థూలకాయుడు! నంగినంగి, నత్తినత్తి, పది మాటల కొకమాట జవాబు చెప్పలేని ఈ మాట పిరికి వ్యక్తి!

ఆ బిగిరిగడ్డం, ఆ మహాస్థూల కాయం, భీకర మూర్తిగా కనబడే ఈ వ్యక్తిలో, మాటలోనూ చేతలోనూ వ్యక్తమయ్యే ఆ విపరీత భీరుత్వమే, అతని ఈ వివాహానికి, ఈ ప్రశాంత జీవితానికీకూడా, పునాది అయింది. యౌవనారోగ్యాలతో, ఉరుకులాడుతున్న రోజులలో, ఇరువది ఐదవ ఏడు వచ్చేదాకా, హెట్టీమాకు, స్త్రీల సంపర్కంగాని ప్రేమ వాసనగాని తగలనే తగలలేదు. ఒకనాడు క్లబ్బులో విందు అయాక అతని స్నేహితులు అతన్నొక పడుపుగృహానికి తీసుకుపోయి కావలసినదాన్నెన్నుకోమని అతన్ని బలవంతం చేశారు. తను ఏం చేస్తున్నదీ తెలియని త్రాగుడుమైకంలో ఉన్నా డతను. ఆ ఇంటినుంచి బైటపడేటప్పటికి తెలివికివచ్చి, దెబ్బ తిన్నట్లయి విభ్రమంలో మునిగిపోయాడు. మర్నాడు అక్కడికే పోయి నిన్నటి పిల్లనే పిలుచుకొని, ఆ అమ్మాయి బాకీలన్నీ తీర్చి, వెంటపెట్టుకొని తీసుకొని వెళ్లిపోయాడు. ఆ అమ్మాయిని ఎవళ్ళన్నా తన్నుకుపోతారేమో, ప్రేమతతంగం అంతా మళ్ళీ ప్రారంభించవలసివస్తుందేమో అన్న అకలుతో ఆ అమ్మాయిని పెళ్లి చేసుకొన్నాడు.

"అతిశాస్త్రయుక్తమైన పెళ్లి!" అంటూ ఫ్రాన్సి విజయగర్వంతో పకపక నవ్వేది. అనవ్వు వింటూంటే జేన్‌కు అదిటు కళ్లేది. "నాకు తెలిసిన శాస్త్రీకపు పెళ్లిళ్లు వేటి కన్నకూడా, అతి మర్యాదైన, అతి బుజాన్తైన పెళ్లి సుమా" అనేది.

ఆమాట తన అజ్ఞానంతో మనస్ఫూర్తిగానే అనేది. నిజానికి, ఆమెకు అంతరంగిక పరిచయమున్న మర్యాదస్థుల కుటుంబాల విషయంలో, ఆమె అభిప్రాయం అక్షరాలా నిజమనేందుకు సందేహం లేదు. ప్రతి జీవితవిషయంలోనూ ఆమె అభిప్రాయాలు అంత తప్పుగానూ అంతే మనస్ఫూర్తిగానూ ఉండేవి.

హొట్టెమాల సాన్నిహిత్యంలో, ఏదో ఉపశమనమిచ్చే ప్రభావం ఉంది. వాళ్ళెప్పుడూ కోప, తాపాలుండేవి కావు. తమకు పెద్ద భారమనిపించని చిన్న చిన్న ఉపచారాలు నిత్యం ఇతరులకు చేస్తూ ఉండేవారు. వాళ్ళకి ఘర్షణలంటే అపరిమితమైన భయం. ఆ ఘర్షణలలో తాముకూడా ఇరుక్కోవాల్సి వస్తుందేమోనని అదురు. అసలు తిన్న అన్నం అరగకుండా అడ్డుపడే విషయం ఏదైనా వాళ్ళకు అంతే! హొట్టెమా పతిఘాన్నికూడా, కోళ్ళ పెంపకం, కుండీళ్ళ పెంపకం, కులాసా అయిన తోటపని, ఇల్లాంటి వాట్లలోకి దింపుదామని ప్రయత్నించింది. కాని ఫలితం కలగలేదు.

గానిన్ ప్రేయసి, పారిస్ అలగా వీధులలోంచి రంగేళీ జీవిత మార్గంలో నడిచివచ్చిన వ్యక్తి. అందుకని, ఆమెకు, విప్రేమవిహారాల్లోనో ప్రియునితో స్వేచ్ఛగా గంతులు వేసుకొంటూ తిరగటం మాత్రానికో, లేక ఏ సంతర్పణలూ విందులూ వాట్లల్లో పాల్గొనటం మాత్రానికో, అప్పుడప్పుడు తప్పవిడిచి, గ్రామీణజీవితం అంటూ ఉన్న ప్రత్యేక ఆకర్షణ లేమీ లేవు. అసలు కాయకష్టమే ఆమెకు గిట్టదు. పనిచెయ్యటమంటేనే తలనొప్పి. అదీకాక వసతి గృహంలో ఆర్నెల్ల ఉద్యోగమూ ఆమెను పిప్పి పిప్పి చేసి, ఆ తర్వాత చాలాకాలందాక ఏ పని చెయ్యటానికీ ఆమెలో ఓపిక లేకుండా చేసింది. దాంతో, ఆమె నిమ్మదిగా, కదరాని మందగొడితనంలో మునిగిపోయింది. ఏదో జీవితం సుఖంగానే గడిచిపోతున్నట్లు, ఆ ఆరుబయట గాలిలో కలలు కంటూ గడపవచ్చునన్నట్లుగా, బద్ధకం ప్రబలిపోయి, తలదువ్వుకోనేందుకు, వంటి శుభ్రం, బట్టశుభ్రం చూచుకోటానికైనా, చివరకు పియానో మీద వేలు వేసి వాయించటానికికూడా, ఓపికలేనిదిగా తయారయిపోయింది.

ఇంటి పనంతా పల్లెటి దాసీమనిషికే వదిలేసేది. అంతతో సాయంత్రంపూట జీన్ ఇంటికివచ్చి ఆవేళ విశేషాలేమిటని అడుగుతూంటే, చెప్పటానికి చేసిందేమీ కనబడేదికాదు. ఒలింపీ హొట్టీమా వచ్చి వెళ్ళిందనీ, దడిదగ్గిర అటూ ఇటూ నిలబడి కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకొన్నామనీ, సిగరెట్లు కాల్చుకొంటూ కూర్చున్నామనీ, ఇంతకుమించి చెప్పేందుకేమీ కనబడేదికాదు. ఆ సిగరెట్టుపీకలూ, మసిగదిమున్న రాతిగూటిపైన పాలరాతి చప్పరం నిండా పడిఉండేవి. అరె, అప్పుడే ఆరుగంటలయిందా? గౌను తొడుక్కొని పైటపైన రోజాపువ్వు అలంకరించుకొని అతనికి ఎదురు వెళ్ళటానికికూడా వ్యవధి చాలేదికాదు.

ఆ తర్వాత వర్షాకాలం రాకతో మంచూ, వర్షాలు ఎక్కువగాసాగి, త్వరగా చీకటి పడసాగాక, షికారెళ్ళకుండా ఉండేందుకు వంకలూ చాలా దొరకసాగాయి. ఒక్కొక్కనాడు అతను సాయంత్రం ఇంటికొచ్చేటప్పటికి, ఆమె యింకా పొద్దుటి వదులుపాటి ఊలుగౌనే తొడుక్కొని, పొద్దున్న లేవగానే ఆదరాబాదరాగా, జుట్టు నడినెత్తికి అమర్చుకొన్న కాకటి ముడిలోనే అల్లాగే ఉండిపోయేది. ముచ్చిలి గుంటదగ్గిర మెత్తెమన్నగా కన్నెకోమలి సౌకుమార్యంతో మృదువుగా కనబడుతూ, పల్చని చర్మంలో కదులుతున్న నాడుల కదలికతో ఆకర్షణీయంగా ఉండేది. కాని మనిషిలో వేషభాషల ప్రమాణాలు ఇల్లా దిగజారడం అతనికి దిగ్భ్రాంతికల్పించి, ఏదో రాగల మహావిపత్తులాగా భయం పుట్టించేది.

కాపిటెట్ కు ఉత్తరం వ్రాసి డబ్బు తెప్పించుకోవక్కరలేకుండా, చిల్లర సంపాదనలద్వారా ఆదాయం వృద్ధిచేసుకోనేందుకు శాయశక్తులా ప్రయత్నించాడు. హొట్టీమాకు ప్లానులు, డ్రాయింగులు, ఇంజన్ల మాడెలు చిత్రాలు, మొదలైనవి చేసి పెట్టి సాయంకాలాలు గడిపి, ఆరీతిగా హైరాళ్ళ నాలుగు, చెమటోడ్చి సంపాదించేవాడు. కాని అకస్మాత్తుగా పల్లెటి జీవితం, ఆ ఏకాంతం, తమ ప్రభావంలో అతని చైతన్యశక్తులను కరిగించేసుకో ప్రారంభించినట్లతని కనిపించింది. ఎంతెంతటి చైతన్యంగల వాళ్ళూకూడా, ఆ శాంత ప్రకృతి స్తోమతలో సోమరితనానికి లొంగిపోతారు. అందులో చిననాడే పల్లెటి మారుమూలల ప్రకృతి ప్రభావాలు బీజప్రాయంగా నాటుకొని పోయిఉన్న అతను, ఆ ప్రభావానికి ఇట్టే లొంగిపోయే ఆస్కారముండేది.

దీనికితోడు, హొట్టీమాల సాహచర్యంలో, ఒకరియిళ్ళకొకరు నిత్యం వస్తూపోతూ వుండటంవల్ల, ఐహికవస్తు సౌభాగ్యాలలో ఓలలాడే హొట్టీమాల జీవిత విధానంతోపాటు, వాళ్ళ నైతిక అలసత్వం, తింది

పోతురితనం కూడా కొంతకొంత అలవడసాగాయి. చివరికి గాసిన్ అతని ప్రేయసీ, ఇద్దరూ కలిసి తీరుబడిగా, ఏం కూరాగీరా చేసుకోవాలో పడకవేళ ఎప్పుడో, ఇల్లాంటి విషయాలు చర్చించుకొనే స్థితికి దిగజారారు. పిటేర్ బాబాయి తన ద్రాక్షతోటల్లో తయారుచేసిన "పంటనీటి సారాయం" ఒక పీపాడు పంపించాడు. ఒక ఆదివారం ప్రొద్దున్నంతా సారా కొట్టం తలుపు తెరిచి పీపాలో సారాయం అంతా సీసాల కెక్కించసాగారు. ఆ ఋతువులో అప్పటిదాకా ఇంకా పగటిపూట ఎండచాయ పడుతూ వేఉంది. ఆకాశం నీలంగా ఉంది. అడవిలో గడ్డి నలుముకొన్న మంచు పరియలలాగా తెలినీలి వర్ణంలో, చిన్న చిన్న మబ్బులు ఆకాశంలో అక్కడక్కడ అలుముకొని ఉన్నాయి ఆ సంవత్సరానికి ఇక ఎండ కనబడటం అదే ఆఖరు. ఆ తర్వాత వాళ్ళు కూడా హెట్టిమా వర్ణించినట్లు చలిసెగళ్ళ కిటూ అటూ కూర్చుని నిద్రకు తూగుతూ, గడ్డిలొత్తలు కాళ్ళక్రింద వచ్చేగా నొక్కుకొనే రోజులుకూడా వచ్చేందుకు ఎంతో కాలం పట్టదు. వాళ్ళ అదృష్టవశాత్తూ ఆ జీవితగతి మార్చేందుకు ఒక సంగతి జరిగింది.

ఒకనాడు సాయంత్రం అతను ఇంటికివచ్చేటప్పటికి ఫానీ చాలా ఉద్విగ్నురాలై ఆతురతతో ఉంది. అంతకుముందే ఒలింపీ ఒక పేద పిల్లాడి విషయం ఆమెతో చెప్పిందట. మోర్వన్ జిల్లాలో ఆపిల్లడి ముత్తవతల్లి పిల్లడిని పెంచుతూంది. తల్లీ తండ్రీ పారిస్‌లో కలపవ్యాపారస్థులు. కొన్ని నెల్లనుంచీ పిల్లడి ఖర్చుకు ముసిల్దానికి డబ్బు పంపించటం మానేశారట. ముత్తవతల్లి అకస్మాత్తుగా చనిపోయింది. పడవవాళ్ళెవళ్ళోవతల్లి తండ్రుల కప్పచెప్తామని ఆ పిల్లడిని పడవలో వేసుకు తీసుకొచ్చారట. కాని తల్లీ తండ్రీ ఎవరూ పత్తాలేరట. కలపలడితి మూసేసి ఉంది. తల్లి ఎవడినో లేవదీసుకుపోయింది. తండ్రి తాగుడుతో దివాళా తీసి ఐపు లేకుండాపోయేడు. అదుగో తమరు చెప్పిన శాస్త్రీయమైన వివాహం! అదుగో పాపం, ఆ ఆరేళ్ళ ముద్దుబిడ్డడు, తిన తిండి లేక కట్ట బట్టలేక, ప్రపంచంలో నా అన్నవాళ్ళు లేక అల్లాడిపోతున్నాడు.

ఆ కథంతా చెప్తూ జాలితో కంటతడిపెట్టుకుంటూంది. ఇంతలో అకస్మాత్తుగా అడిగింది.

"పోనీ ఆ పిల్లాడిని మనం పెంచుకొంటే? ఏమంటావ్!"

"పిచ్చెత్తిందా!"

"ఏం!" అంటూ అతనికి దగ్గరగా జరిగి లాలిస్తూ చెపుతూంది. "నీవల్ల నాకొక కొడుకు కల్గాలని ఎంత తపించానో నీకూ తెలుసు కదా! మన పిల్లాడిలాగే పెంచుకొందాం! వాడిని ఒక రోవకు తెద్దాం. ఇల్లా దిక్కులేక పెంచుకొన్న పిల్లలంటే నేనొన్నాళ్ళు పోయేటప్పటికి మమకారం పెరిగి స్వంతపిల్లలలాగే చూసుకొంటాము."

రోజంతా ఒంటరిగా, అసహ్యపు ఆలోచనల్తో కుములుతూ, ఏమీ తోచకుండా గడుపుకొంటూన్న తనకు ఇల్లాంటి అవకాశమే దొరికితే ఎంత ఉత్సాహంగా కాలం గడపగలదో వివరించసాగింది. పిల్లలుంటే తల్లికి రక్ష. అని, ఇంతలో ఖర్చు విషయం అతను భయపడుతున్నాడని ఆవిషయంలో అతనికి ధైర్యం చెప్పసాగింది. "అసలు ఇప్పటికన్నా ఖర్చు ఏమంత ఎక్కువవదు. చూడు? వాడికింకా ఆరేళ్ళే! వాడికి బట్టలు, నువ్వు వదిలిన పాతవాట్లను తిరిగి కుట్టి ఇయ్యవచ్చు. ఒలింపీకి అల్లాంటివన్నీ చేతౌను. అసలు పాతబట్టల నుంచి కుట్టినట్లే కనుకోక్క లేకుండా కుట్టగలదు."

"పోనీ ఆవిడే ఎందుకు పెంచుకోరాదు" అంటూ, తనలోని వీరసగుణానికి లొంగిపోయే వ్యక్తి కుండే, అశక్తకోపంతో, చిరాకుతో అన్నాడు. అక్కడికీ ఇంకా కొంతసేపు వాదించాడు. "నేను నిన్ను వదిలివెళ్ళిపోయాక, అప్పటి సంగతి ఏమిటి." అంటూ తనకున్న బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. తను ఆమెను వదిలివెళ్ళిపోవటం విషయం, సామాన్యంగా ఆవిడదగ్గర తెచ్చేవాడుకాడు. ఆమె వ్యాకులపడుతుందని! కాని మనస్సులో చాలా మాట్లు ఆలోచించుకొంటూనే ఉంటూండేవాడు. ఈ గుడిసేటిబ్రతుకులో ఇమిడున్న అపాయాలు, డీపాట్టర్ అంతరంగికంగా తనకు తెల్పుకున్న విషాద ఘట్టాలూ, అన్నీ జ్ఞప్తికివచ్చి మనస్సు దిగులు పడినప్పుడల్లా, ముందు విడిపోగలనున్న భావం ఆసరా చేసుకొని మనస్సును దిట్టపరుచుకో చూచేవాడు. "అప్పుడు ఈ పిల్లాడు ఒక తంపుగా తయారవడా? ముందు ముందు నీ మెడకు గుదిబండ అయి కూర్చోడా!"

ఫానీ కళ్ళు చెమర్చాయి. "అక్కడే పొరపాటు పడుతున్నావు, ప్రియతమా! నిన్ను గురించి మాట్లాడుకొనేందుకు ఈ ఒకడైనా నాకుఉంటాడు. అదే నాకు ఉపశమనమిస్తుంది. నాలో బాధ్యత పురికొల్పుతుంది. జీవించటానికి, జీవనాధారానికి

కష్టించటానికి, నాకు ఆసరా అంటూ ఒకటి దొరకుతుంది."

ఒక్క నిముషం ఆలోచిస్తూ, ఆ ఖాళీ ఇంట్లో ఆమె ఏకాంతంగా ఉండటం భావించుకొంటూ నిలచాడు.

"ఎక్కడున్నాడు పిల్లాడు?"

"ఆ పడవబ్బాయే కొద్దిరోజుల మాత్రానికని కుజ్జాడిని తన యింటికి, శాన్‌మ్యాథ్యూస్ తీసికెళ్ళాడు. అక్కడినుంచి బిడ్డకు ప్రభుత్వ ధర్మసత్రం చేరుకోవలసి ఉంటుంది."

"సరే! నీకు అంత ఇష్టంగా ఉంటే పోయి తెచ్చుకో."

విసురుగా రెండు చేతులా అతన్ని మెడ చుట్టూ కౌగిలించుకొంది. ఆ సాయంత్రం అంతా పసిపిల్లలాగున ఉత్సాహంతో గంతులేసింది. పియానో తీసి వాయించసాగింది. ఆనందం ఉబికిపోతూ, ఆటలతో పాటలతో ఉత్సాహంతో, మనిషే మారిపోయింది.

మర్నాడు ప్రొద్దున్న రైల్లో వెళ్తున్నప్పుడు హెట్టీమాతో ఈ విషయం ఎత్తాడు. అతని కిదంతా తెలిసేఉన్నట్లు, అయితే తనేం జోక్యం కల్పించుకో నిచ్చగించనట్లూ, కనిపించాడు. బండిలో మూలకూర్చుని పత్రిక తెరిచి చదువుకొంటూ పత్రిక మొగానికి అడ్డంగా చేసుకొని, గడ్డంలోనుంచి గొణిగాడు.

"ఔను విన్నాను—ఆడవాళ్ళదే అదంతా - నాకేం తెలియదు." అని ఒక్కక్షణం మాత్రం పత్రికపై అంచునుండి తొంగిచూసి, "మీ ఆవిడ చాలా సరసురాలు లాగుందే" అన్నాడు.

సరసమో, విరసమో, ఆ సాయంత్రం మటుకు, ఆ కుజ్జాడిని మచ్చిక చేసుకోలేందుకు, కుజ్జాడి ముందర మోకరిల్లి ఒకచేత్తో పాయసం పళ్ళెం పుచ్చుకొని, కుజ్జవాడిచేత తాగించటానికి అష్టకష్టాలూ పడుతూంది. కుజ్జవాడు గోడకు తన్ని పెట్టి సుల్చాని, మొగం దాచుకొంటూ, అందమైన చింపిరి జుట్టు విదిలించుకొంటూ, ఏం తినటానికీ, ఏమాటకు జవాబు చెప్పటానికీ, నిరాకరిస్తూ మొరాయించి, ఆమెవంక కన్నెత్తి చూడనన్నా చూడకుండా, మాటిమాటికీ, ఒకే స్వరంలో గట్టిగా, బొమ్మరుద్ధ కంఠంతో అరుస్తున్నాడు.

"మేనిని కావాలి! మేనిని కావాలి!"

"మేనిని, వాళ్ళ ముత్తవతల్లి అనుకొంటాను. రెండు గంటలనించీ యాతనపడుతున్నా ఇంకేమీ పలికించలేకుండా ఉన్నాను" అంది ఫాన్నీ.

ఆ పిల్లడిచేత పాయసం తాగించటానికి జీన్ కూడా ఆమెతో కలిసి ప్రయత్నించాడు. కానీ లాభం లేకపోయింది. ఒకళ్ళు చెమిచా, ఒకళ్ళు పాయసంపళ్ళెమూ పుచ్చుకొని పిల్లడిదగ్గిర మోకరిల్లుతూ, జబ్బు పిల్లడికి మందు తాగించ ప్రయత్నిస్తున్నట్లు, నానాయాతనలు పడ్డారు. చేతనైనంతగానూ బుజ్జగిస్తూ తియ్యని మాటలెన్నో చెప్పారు. కాని మాట్లాడించ లేకపోయారు.

"బహుశా, ఇద్దరం కలిసి బెదరగొట్టేస్తున్నామేమో. కూర్చుందాం పట్టు. అటు మనం చూడకపోతే తింటాడేమో!"

కాని, అల్లాగే నిశ్చలంగా, దిగ్భ్రమ చెంది పోయినట్లు నిలబడి, అట్టే గోడకానుకొనిపోయి, అడివిజంతువు కూనలాగా, దీనంగా అదే అరుపు అరుస్తూన్నాడు. "మేనిన్ కావాలి" అమాటే అంటూ వెక్కులు పెడుతున్నాడు. ఆ ఏడుపు వింటూంటే గుండెలు పగిలిపోతున్నాయి. చివరికి అల్లానే గోడ దగ్గిర బల్ల కానుకొని నిద్రపోయాడు. ఆ నిద్ర గాఢంగా పట్టిందేమో, వాళ్లు ఆ పిల్లడిదుస్తులు మార్చి పెద్ద ఉయ్యాల మంచంలో పడుకోబెట్టినా కూడా కళ్ళు తెరవకుండా అల్లాగేఉండిపోయాడు. "చూడు! ఎంత ముద్దొస్తున్నాడో!" అంటూ ఆ బిడ్డను తెచ్చుకొన్నందుకు మురిసిపోతూ సగర్వంగా అంటూంది ఫాన్నీ. ఆ పెంకిముదురూ, అరుబయటి బ్రతుకులో వచ్చిన ఒంటి చామనచాయా, ఆ లలితమైన ముఖమూ, ఆ చక్కని అంగసౌష్ఠవమూ, లేడి కాళ్ళలాంటి పొడుగు కాళ్లూ, బలమైన నడుమూ, చేతులూ, అన్నిటినీ ప్రియుడు మెచ్చుకొనేటట్లు చేసింది. ఆ పసి అందాన్ని మెచ్చుకొంటూ తన్మయురాలయి పోయింది ఫాన్నీ.

"ఏదైనా కప్పు! చలివేస్తూంది!" అన్నాడు జీన్. ఆ తన్మయత్వంలో ఆతనిమాటవిని, కలలోంచి మేలుకొన్నట్లు, అదిరిపడింది ఫాన్నీ. పిల్లడి వంటి నిండా ఆప్యాయంగా శాలువలు కప్పింది. ఆనిద్రలో పిల్లవాడు, పెద్దపెద్ద వెక్కులు పెడుతూనే ఉన్నాడు. ఆ నిద్రలోకూడా ఆ గాఢదుఃఖం పొంగి పొర్లివస్తూనే ఉంది.

రాత్రి నిద్రలో కలవరించసాగాడు.

"నేను "గూర్లాకేని"— మేనిన్!"

"ఏమిటంటున్నావు? విను"

ఏదో, సిపాయి నవ్వులా నంటున్నట్టున్నాడు. కాని ఆ భాషలో ఆమాటకర్థం ఏమిటో? జీన్ యూదాలాపంగా చెయ్యిచాచి, ఆ బరువు ఉయ్యాల ఊప నారంభించాడు.

అతను అల్లా చెయ్యి చాపగానే, ఆ పిల్లడు కాయలుకాచి గరుకుబారిన తన అరచేత్తో అతని చెయ్యి గట్టిగా పట్టుకొని, పక్షం రోజులక్రింద చనిపోయిన తన అమ్మమ్మ 'మేనినీ' చెయ్యి అనుకొంటూ, కలవరింతలులేని శాంతంగా నిద్రపోయాడు.

దగ్గరకు వచ్చినవాళ్ళను బరుకుతూ, కొరుకుతూ, ఇష్టం వచ్చినప్పుడుమాత్రం కాస్త తింటూ, పళ్ళెందగ్గిర కెవరైనా వస్తే గుర్రుమని బుసలు కొట్టూ, అచ్చు అడివిపిల్లిని తెచ్చి పెట్టుకొన్నట్టనిపించాడు ఆ కుర్రవాడు. వాడి నోటివెంబడి రప్పించగల నాలుగైదు మాటలూ, మొరాక్కోవాళ్ళ భాషలో యాసలో ఉండేవేమో ఎవ్వరికీ అర్థమయ్యేట్టుండేవి కావు. అదృష్టవశాత్తూ హెట్టీమాలుకూడా ఆ జిల్లాలనుంచే వచ్చారేమో వాళ్ళ కొక్కళ్ళకూ మాత్రం అతని మాటలు అర్థమయి, వీళ్ళకు వివరించి చెప్పేవారు. ఎల్లాగో మెల్లిగా మెల్లిగా మంచిమాటలాడి జాగ్రత్తగా కనిపెట్టిచూసి ఆ కుర్రవాడిని కొద్దిగా మచ్చిక చేసుకోగలిగారు. ఆ చింపిరి గుడ్డలు విప్పించి, శుభ్రమైన ఉన్నిలాగూ చొక్కా లతనిచేత తొడిగించేటప్పటికి బ్రహ్మాండమయింది. పెంపుడు కుక్కకు తొడిగే గనిసెన అడివికుక్కకు తొడగబోతే ఎల్లా ఎదురు తిరుగుతుందో, అల్లాగే మొదటి రోజుల్లో ఈ కొత్తబట్టలు కట్టుకోమంటే ఉగ్రుడై యాగీ చేసేవాడు. భోజనాల బల్లదగ్గిర కూర్చుని మర్యాదగా చెంచాలతోనూ చాకూతోనూ నాగరికంగా తినటం నేర్పారు. నీ పేరేమిటని అడిగితే, పల్లెటి జక్కన "జోసఫ్" అనేవాళ్ళని మెల్లిగా చెప్పే స్థితికి వచ్చాడు.

చదువూ సంధ్యా నేర్పటానికి కుర్రవాడింకా పక్వానికి రాలేదు. అడివిమధ్యన బొగ్గు పనివాళ్ళ గుడిసెలలో అంతవరకూ పెరిగాడు. ఆ అడివిలో ప్రకృతి వినిపించచేసే గుసగుసలు, సందడులూ, ఈ ఆటవిక జీవనని పెంకి బుర్రలో సముద్ర తరంగ ఘోషమంతా శంఖపుచిప్ప రేఖలలో స్థిరీకృతమైపోయి నట్లు, స్థిరపడిపోయి ప్రతిధ్వనిస్తున్నాయి. అందుచేత ఆ బుర్రలోకి ఇంక ఏమి చొప్పించటానికి అవకాశమే ఉండేదికాదు. ఇక ఎంత మంచు కురుస్తున్నా, గాలీవానా, ఎంత హోరెత్తుతున్నా, అతన్ని ఇంట్లో నిలపటం శక్యమయ్యేది కాదు. వానలో, మంచులో, ప్రొద్దువాలిన చెట్లకొమ్మల మంచు ముత్యాలు గడ్డగట్టుకుపోతూంటే, తుప్పలలోనుంచి, కంచెలలోనుంచి దూసుకుపోతూ, అడివిజంతువు క్రౌర్యంతో, కుందేటి బొరియలను ఎలుకకన్నాలను కాపలాకాసి, ఛట్టున చెయ్యి దూర్చి, వాట్లను బైటికి లాగేవాడు. బట్టలన్నీ బురద కొట్టుకొని ఆకలితో నకనకలాడ్తూ అతను యింటికి వచ్చేటప్పటికి, జేబుల్లో చచ్చిన కుందేలుపిల్లో, పందికొక్కో, పక్షో, ఏదీ కాకపోతే చివరికి నేలను వేళ్ళతో పెళ్ళగించి తెచ్చిన దుంపముక్కో, ఏదో జేబులో ఉండేది.

అతనిలో ఆ దొంగ దోపిడీ బుద్ధి మరలించటం ఏవిధంగానూ సాధ్యం కాలేదు. మెరిసే వస్తువులను కైసేసుకోవాలనే పల్లెటి స్వభావం కూడా దీనికి తోడయింది. మెరుస్తూ కనబడే చిన్న వస్తువు లేదైనా సరే, ఇత్తడి బొత్తాములూ, తళుకు పూసలూ, తగరపు కాగితం, ఏదైనా సరే ఎక్కడ కనబడ్డా సరే ఇట్టే గుప్పిట్లో బిగించేసి, ఎత్తుకుపోయి, తన దాపరికపు స్థలాలలో దాచేసేవాడు. ఈ దోపిడీవస్తువు లన్నిటికీ 'సొత్తు' లని ఒకటే సామాన్య వాచకం వాడేవాడు. నయానా ఎంత చెప్పినా, కొట్టినా తిట్టినాకూడా, ఎవళ్ళేం నష్టమయినా, ఈ సొత్తులు పేకరించటం మాత్రం అతను మానలేదు.

హెట్టీమాలు ఒక్కరే దీనికి సరియైన మందు కనిపెట్టారు. హెట్టీమా డ్రాయింగ్ బల్ల పరిసరాల్లో అక్కడి కాంపస్ లూ, రంగురంగుల పీమసున్నాలూ, చూస్తూ కళ్ళదొంగలా జోసఫ్ తచ్చాడుతున్నప్పుడల్లా, హెట్టీమా కొరడా ఒకటి దగ్గిరుంచుకొని, కాళ్ళదగ్గిర ఛెళ్ళుమనిపించేవాడు. కాని జీన్ గాని ఫానీగాని జోసఫ్ నెప్పుడూ ఇల్లా భయపెట్టేవాళ్ళుకారు. అయినా పిల్లడు వాళ్ళంటే అనుమానంతో దొంగచూపులు చూస్తూ, వాళ్ళు ఎంత మంచితనం చూపించినా, ఎంత వల్లమాలిన గారాబం చేసినా, మచ్చిక అయేవాడుమాత్రం కాదు. ఆ ముసలమ్మ మేనినీ చచ్చిపోతూ, అతనిలో ఉన్న కాస్త అనురాగమూ దోచుకుపోయిందేమో అనిపించేది. "మంచి కంపు వేస్తుంది" గనుక ఎప్పుడైనా ఫానీయే ఒక్క క్షణంసేపుమాత్రమైనా అతన్ని ఒళ్ళో కూర్చోపెట్టుకోగలిగేది. కాని ఎంత మెల్లిగా, మంచిగా, లాలించినా, జీన్ దగ్గిర కొరకొరలాడుతూ, చెరుకు

చూపుచూస్తూ బరకటానికి సిద్ధంగా గోళ్ళు తెరుచు కొన్నట్లై, రుసరుస లాడుతూండేవాడు.

ఆ కుఱ్ఱవాడికి తనంటే, ఆ తీరని అసహ్యం, వాడావు ఆజన్మసిద్ధమా అన్నట్లు కన్పించే ద్వేషం, ఆ చిన్ని నీలికన్నులలో తనపట్ల కన్పించే క్రౌర్యం, అన్నిటికన్నా తను జీవితంలోకి అకస్మాత్తుగా రాలి పడ్డ ఈ నూతనుడంటే ఫాన్నికున్న వల్లమాలిన ప్రేమ, ఇన్నీ జీన్‌లో మళ్ళీ కొత్త అనుమానాలు రేకెత్తింప సాగాయి. బహుశా ఆమె పిల్లడేనేమో! ఎవళ్ళ దగ్గిరో పెంపకానికిచ్చిందేమో! ఫాన్నీ సవతి తల్లి మాచావిడయే పెంచిందేమో ఇన్నాళ్ళూ! సరిగ్గా పిల్లడువచ్చినరోజుల్లోనే మా చావిడ చనిపోయిందన్న వార్తకూడా రావటం, అతని అనుమానాన్ని మరింత తీవ్రమొనర్చింది. ఒక్కొక్కప్పుడు రాత్రిళ్ళ పిల్లవాడు తన చెయ్యి గట్టిగా పట్టుకొని, ఆ నిద్రలో తన అమ్మమ్మ చెయ్యి అనుకొని గాఢంగా నిద్ర పోతుంటే, అతనిహృదయాంతరాళంలో అవ్యక్తంగా కలచివేస్తున్న ప్రశ్నలే, పిల్లడివంక చూస్తూ అడిగే వాడు.

"ఎక్కడినుంచి వచ్చావు? ఎవరు నువ్వు"—

ఆ పిల్లడిఒంటి వెచ్చదనం, ఆస్పర్శలలో, ఎల్లాగో తన ప్రశ్నలకు జవాబులు వస్తాయేమో నన్న ఆశతో ఎదురుచూసేవాడు.

కాని ముసిలిలిగ్రాండ్ ఒకనాడన్న మాటతో అతని ఆదుర్దా తీరిపోయింది. పెళ్ళాం గోరీమీద స్మృతి శిల చెక్కించటానికి చందా అడగటం కోస మని లిగ్రాండ్ అతనింటికి వచ్చాడు. ఆ ఉయ్యాల మంచం చూసి సంతోషంతో కూతురువంక తిరిగి అరుస్తున్నాడు.

"ఏమిటి! చంటోడే! బిడ్డలు పుట్టలేదు పుట్టలే దని గోలెత్తేదానివి, భలే సంతోషపడ్డా నను కొంటాను"

జీన్ పరమానంద భరితుడయిపోయాడు. ''స్మృతిశిల'' వివరా లడగకుండానే చందా యిచ్చేసి, ఫలహారాని కాగమని లిగ్రాండ్‌ని బల వంత పెట్టాడు.

ఆ ముసిలి బండి అబ్బి ఇప్పుడు పారిస్—వర్సెల్స్‌మధ్య ట్రాం వేలో పనిచేస్తున్నాడు. అతి తాగుడువల్లా, ఒంట్లో రక్తపుపోటువల్లా, మొగం కందగడ్డలా ఉంది. కాని మనిషి మంచి ఉత్సాహంగా, చలాకీగానే కనబడేవాడు. నెత్తిమీద టాప్ హాట్, భార్యాస్మృతి గౌరవచిహ్నంగా దాని చుట్టూ నల్ల క్రేప్ రిబ్బనూ, దర్పి పాకరులా ఉన్నాడు.

తన కూతురి కోడెగాడు, తన నింత ఆదరణతో చూడటం, అతని కుల్లాసం గల్గించింది. ఆ తర్వాత కూడా అప్పుడప్పుడు వస్తూ అందరితో కాస్త ఫల హారం చేసిపోతూండేవాడు. బుంగలాగ పొంగి నున్నగా క్షౌరం చేసిఉన్న ముగం, తలచుట్టూ నెర సిన చెంద్రుకలూ, పొగమోతు దగ్గూ, అంతా అచ్చు బఫూన్‌లా ఉండేవాడు. ఆ కొరడా, పసిబిడ్డను దించి నట్టు, జాగ్రత్తగా ఒకమూలచేర్చి ఆనించేవాడు. ఈ వికృతి వ్యక్తిత్వమూ, ఈ కొరడా అంటే ఆతను చూపే భక్తి, జోసఫ్‌కు బాగా నచ్చాయి. ముసి లాడూ ఆతనూ ఇట్టే మంచి స్నేహితులైపోయారు.

ఒకనాడు అందరూ భోజనాలదగ్గి రున్నారు. ఇంతలో హెట్టీమాలు ఉత్సాహంతో తలుపు తోసు కొని లోపలకు వచ్చారు.

"ఓ! క్షమించండి! కుటుంబ సమావేశంలా నుంది" అంటూ ఇకిలించింది హెట్టీమాసతి. ఆ మాట జీన్‌కు ఛెళ్ళుమని తగిలింది. చెంప పెట్టుకన్నా అవ మానకరంగా అనిపించింది.

తన కుటుంబం! బల్లమీద తలకా దొట్టుకొని గుఱ్ఱుకొడుతున్న ఆ సుంటాసు, ఈ బుఱ్ఱ లేని ముసిలి బండాభోయి! నోట్లో చిలుంగొట్టంతో అప్పటికప్పుడే మాటొకటోసారి చెప్తున్నాడు—తన కంచికళ్ళలోదు ఆరునెల్లు పైకాలం పనిచేసిందనీ, ఆ కఱ్ఱకు ఇరవై యేళ్ళనుంచీ, కొత్తపిడి వెయ్యవలసిన అవసరమే లేకపోయిం దనీ... తన కుటుంబం! ఎంత మాట! ఇది తన కుటుంబమూ కాదు; ఈ స్త్రీ, వయసు మళ్ళి, శక్తి ఉడిగి, మోచేతులమీద ముంగుకు తూగుతూ సిగరెట్టు పొగలలో మునిగిపోయిన ఈ ఫాన్ని లిగ్రాండ్ అన్న స్త్రీ, తన భార్య అంతకన్నా కాదు. ఇంక ఒక ఏడాదినాటికి, ఇదంతా తన జీవితంనుంచి, ప్రయాణాల్లో పరిచయాల్లాగా, ఛాయామాత్రంగా, తేలిపోయి అంతరించి పోతుంది.

తను దిగజారిపోతున్నానని, అంతకంతకు ఊబిలో కుక్కుకుపోతున్నానని, అనిపించినప్పుడల్లా, తర్వాత వదిలేసి పోతానన్న భావం తలపుకు తెచ్చుకొని, తన నీరసాన్ని సమర్థింప జూచుకొనే వాడు. కాని ఒక్కొక్కప్పుడు ఆ వదలిపోతానన్న భావం, స్థైర్యం చేకూర్చి మనశ్శాంతి నియ్యటానికి బదులు, ఇక్కడ ఎన్ని బంధాలు తన్ను బంధిం

చేస్తూవున్నాడో చూపించి, ఆ వదిలి వెళ్ళిపోవటంలో ఒక తెంపుగాక పది తెంపులుగా ఎల్లా తయారవుతుందో, ఎన్ని తెగ తెంపులు చేసుకోవాలో ఎరుకకు తెచ్చేది. ఒక్కొక్కప్పుడు రాత్రిళ్ళు ఆ పసివాడి చేతినుంచి తన చెయ్యి వదిలించుకోవటమే బాధగా ఉండేది. చివరకు ఫాన్ని పెంచుతూన్న పంజరంలోని బంగారుపక్షికూడా అతని హృదయంలో స్థానమాక్రమించుకొని, అక్కడనుంచి తోసెయ్యటం గుండె చించుకోటం కాగలదే అనిపిస్తోంది.

అయినా, అనివార్యమైన ఆ వియోగకాలం కూడా సమీపిస్తోంది. ప్రకృతి పూతపూసి కిలకిలలాడే వసంతకాలం, వచ్చే జూన్ నెల, అది ఒకటే ఇంక వాళ్ళిద్దరూ జీవితంలో కలిసి జీవించే కాలం! అందుకే నేమో ఆవిడ అంత కంగారుగా ఉద్రిక్తంగా ఉంటోంది! లేక జోసఫ్‌కు చదువు చెప్పటం కార్యక్రమంవల్లనో! చదువంటే జోసఫ్‌కు పరమాసహ్యం. ఆ అక్షరాలముందు గంటల తరబడి కూర్చుని అటు చూడటానికీ, వల్లించటానికీ మొరాయించేవాడు. కాంపౌండు గేటు తలుపులు మూసేసినట్టు, ఆ పెంకి నుదురు ఒక్క అక్షరాన్ని లోపలకు ప్రవేశించనీయకుండా బుఱ్ఱను మూసేసేది. అంతకంతకూ ఆ విసుగుతో ఆమెలో కోపతాపాలూ, ఏడుపులూ, రాగాలూ, ఎక్కువౌతూవచ్చాయి. జీన్ ఎంతో అనునయంగా సర్దుకొంటూ వచ్చినా చీటికి మాటికి పెద్ద రాద్ధాంతం చేస్తూ, కన్నీళ్ళు కారుస్తూ రాగాలు మొదలెట్టేది. ఆ కోపంలో, మురికి బంపబూతులన్నీ నోటికి వచ్చినట్లు తిట్టటం సాగించేది. అతని యౌవనం, చదువు, కుటుంబం, అతనికీ తనకూ మధ్య ఉన్న అంతరం, ఇకముందు అది ఇంకా ఎల్లా మరింత ఎక్కువవుతుందీ, అన్నీ తలచి మండిపోతూ, ద్వేషిస్తూ అక్కసుతో తిట్టసాగేది. అతనికి ఏమంటే మనస్సు చివుక్కుమంటుందో, ఆ మాటలన్నీ మహా చాకచక్యంతో వాడేది. చివరికి అతనూ కోపం ఆపుకోలేక ఎదురుతిట్టేవాడు.

కాని అతని కోపంలో నిగ్రహం ఉండేది. పాపం, అభిజాత్యం అడ్డువచ్చేది. మాటకు మాట అప్పగించటం తెలిసికవినా, ఘోరమైన మాటలన్నీ అనకుండా బిగబట్టుకొనేవాడు. ఆమెలో అల్లాంటి అడ్డంకు లేమీ లేవు. ఏ పెద్దరికమూ లేకుండా తెగించి బరిలో కురికిన బాజారులంజలా విచ్చలవిడిగా ప్రతి స్వల్పవిషయాన్నీ దుయ్యబట్టూ, ఆ తిట్లు అతను భరించలేక కుమిలిపోతూ మొగమంతా ముడుచుకుపోయి బాధపడుతూంటే పైశాచికానందంతో ఇంకా కుళ్ళబోతు మాటలంటూ, సాగించేది. అన్నీ అట్టే, తీరా అకస్మాత్తుగా అతని కౌగిలిలోకి ఎగబడి ఆవేదనతో క్షమాభిక్ష కోరేది.

ఈ కలహాలు సామాన్యంగా భోజనాలవేళ సంభవించేవి. అల్లాంటప్పుడు ఎప్పుడైనా హెట్టీమాలు అక్కడుంటే ఇక వాళ్ళ మొగాలు చూడాలి! ఆ మొగాలలో భయం బహు స్పష్టంగా ఉండేది. ఈ భక్ష్యాలేవైనా మనవోట్లోకి వస్తేనా, లేక పళ్ళాలు చెమచాలు భక్ష్యాలతోపాటు కిటికీలోంచి వీధిలోకి గిరవాట్లు పడేగతేనా!

ఎప్పుడైనా రెండు కుటుంబాలూ విందులకు పిలుచుకోటం తటస్థిస్తే, "మీ పుణ్యమాయిరి, ఘర్షణలు లేకుండామాత్రం జరగనీయండి" అని ప్రతిమాటూ ముందే చెప్పుకొనేవాళ్ళు హెట్టీమాలు. ఒక ఆదివారం ఫాన్ని హెట్టీమాసతిని అడివిలోకిపోయి భోజనం ఆరగిద్దామని ఆహ్వానించింది, దొడ్డిగోడ కటూ ఇటూ ఇద్దరూ నిల్చుని కబుర్లు చెప్పుకొంటూండగా. ఒలింపీ, అప్పుడుకూడా ఆడపోద్దామే అప్పచెప్పింది. అవ్వే, ఇవాళేం చిలిపికజ్జాలుండవు. ఇంత హాయైన రోజున కూడానా! అంటూ, పిలడికి దుస్తులు తొడిగేందుకూ, తను త్వరగా అలంకరించుకొనేందుకూ లోపలికి పరుగెత్తింది.

అన్నీ సిద్ధం చేసుకొని వైటికి బయలుదేరబోతూంటే పోస్టుమన్ వచ్చి రిజిస్టర్డు ఉత్తరం ఒకటిచ్చి వెళ్ళాడు. అది సంతకం పెట్టి పుచ్చుకోటంలో జీన్ కొంత వెనుకబడ్డాడు. అడివి అంచుకు వెళ్ళేటప్పటికి వాళ్లను కలుసుకోగలిగాడు. నెమ్మదిగా ఫానీతో అన్నాడు.

"బాబాయిదగ్గిరనుంచి. సంతోషంతో పొంగిపోతున్నాడు. అద్భుతమైన ద్రాక్ష పంట పండిందట. వెంటనే అమ్మేసి ఆదా కూడా చేసుకొన్నాడట. డెషిలెట్ తీయాల్సిన ఎనిమిదివేల ఫ్రాంకులూ పంపించాడు. తన మేనకోడలికి సర్వవిధాలా కృతజ్ఞతలు ఆశీర్వచనాలు తెల్పుకొన్నాడు..."

"ఔనౌను. మేనకోడలు! రాచోరి వరుసలు, కదూ! వృద్ధజంబుకం..." అంది ఫాన్ని. వల్లైతే పట్టు 'బాబాయి'ల విషయంలో ఫానీకి అమాయకపు భ్రమలన్నీ ఎప్పుడో పోయాయి. అని, ఇంతలో ముగిం విప్పొగ్పుకొంటూ, "అసెబ్బు. మనం, ఏదైనా సద్వినియోగం చేసుకోవాలి" అంది.

పరద్రవ్యం విషయంలో ఆవిడ ఎంత నీతిగా నిక్కచ్చిగా ఉంటుందో నిత్య అనుభవంలో బాగా

ఎరిగున్నవాడవటంవల్ల, ఆమాట ఆమె దగ్గిరనుంచి వచ్చేటప్పటికి ఆశ్చర్యపోయి ఆమెవంక తెల్లబోయి చూస్తున్నాడు. "మనం వాదటమేమిటి? ఇది నీది కాదుగా!"

"అదికాదు. అసలు నిజానికి, అప్పుడు నీతో చెప్పలేను, కాని..." అంటూండగానే ఆమె మొగం సిగ్గుతో ఎఱ్ఱబడింది...ఆమె కళ్ళు మసకగమ్మాయి. ఏమాత్రం అబద్ధం చెప్పబోయినా అదిషలో ఆ లక్షణాలు ఇట్టే కనిపించేవి. ఆ సత్పురుషుడు డెషిలెట్, జోసఫ్‌ను తను పెంచుకొంటూన్న సంగతి విని హర్షించాడనీ, ఆ డబ్బు కుఱ్ఱాడి పెంపకానికి వినియోగించుకోమన్నాడనీ చెప్పింది. "అయినా, నీకు ఏమాత్రం ఇష్టం లేకపోయినా, ఆ డబ్బు అతనికే పంపించేద్దాం. అత నిప్పుడు పారిస్‌లోనే ఉన్నాడు."

హెట్టీవాలు ఇంగితంతో ముందుకు నడిచిపోయారు. ముందున్న చెట్లక్రిందనుంచి వాళ్లే కేకలు వినవచ్చాయి.

"కుడివైపు తిరగాలా, ఎడమవైపా" అంటూ అరుస్తూ అడిగారు.

"కుడివైపే! కుడివైపే! చెరువులకేసి" అంటూ ఫాన్నీ అరిచింది. అరిచి ప్రేమికుని కేసి పక్కకు తిరిగి "ఇదిగో, మళ్లీ ఇప్పు డీ చిన్న విషయం పెట్టుకొని కుముల్తూ కూర్చుంటావేమిటి! ఇన్నాళ్లు కలిసి కాపురం చేశాంకదా, ఇంకా ఇదేనా. తిగలెట్టి" అంటూంది.

అతని పెదవులుపాలిపోవటం, నఖశిఖపర్యంతం పృచ్ఛిస్తున్నట్లుగా, పిల్లడివంక ఆ కోరచూపూ, అన్నీ ఆమెకు అవగతమౌతూనే ఉన్నాయి. కాని ఈమాటు, ఆ ఈర్ష్యానలం చిన్న నిప్పురవ్వను మించి లేదు. అతనికికూడా, కొత్త సుఖంగా శాంతంగా గడుపుకొద్దామన్న ప్రయత్నంలో, ఎన్నిటినో చూసీ చూడనట్టు ఊరుకోటం, ఎక్కడి కక్కడ సర్దుకుపోవటం ఆ దిగజారుడంతా అలవాటైపోతున్నది. "నన్ను నేను క్షోభ పెట్టుకొని ఏం లాభం! ప్రతి విషయం మొదలంటా తరిచిచూసి ఏంలాభం! ఒక వేళ ఆవిడబిడ్డే అయితే, ఆవిడ దరిచేర్చటంలో విరుద్ధమేముంది? నేను యిన్ని రాద్ధాంతాలు చేసి ఇంతరభస పెట్టాక ఆ విషయం నా దగ్గిర దాచకుండా ఎల్లా ఉంటుంది? ఉన్నదాంతో తృప్తి పడి, ఇక ఇద్దరం కలిసి గడపవలసిన కొద్దిరోజులూ, కంపకద్పులకుండా ఊరుకోని, కిమ్మనకుండా గడుపుకుపోవటం మంచిది కాదా?"

ఆ అడివిదోవల్లో పడి ఫలహారాల బుట్ట బరువుగా మోసుకొంటూ, ఆ బరువుకు వంగిపోయి, ఆ ఎగుడు దిగుడు నేలను దిగుతుంటూ నీరసంగా, విసుగుదలతో పోతున్నాడు. తల్లీ పిల్లడూ ముందు వెళ్ళిపోయారు. జోసఫ్‌కు నీలైన డ్రెస్ వేసిందేమో, ఆ డ్రెస్ అతను ఇష్టమొచ్చినట్లు పరుగెత్తటానికి అడ్డుగా ఉంది. ఆమె భుజాలు మెడా, నగ్నంగా కనుపర్చుకొంటూ, లేతరంగు గౌను తొడుక్కొని, జపాను గొడుగు వేసుకొని పోతోంది. వసుం కొంచెం వలమెక్కి నడక మందంగా సాగుతూంది. సన్నగా దువ్వి చుట్టిన తిలకట్టులో నెరసిన వెంట్రుకలచాలు స్ఫుటంగా కనిపిస్తూంది. ఆ నెరసిన వెంట్రుకలు కనబడకుండా చేద్దామన్న ప్రయత్నంకూడా ఆమెలో అంతరించి పోయింది.

ఇంకా ముందరగా, బాగా కొండదిగువను, హెట్టీవాలు పోతున్నారు. ఇద్దరూ బర్మాటోపీల లాంటి పెద్దపెద్ద గడ్డిటోపీలు పెట్టుకొని, ఎఱ్ఱటి ఫ్లానెల్ దుస్తులు ధరించి, చేతుల ఫలహారాలబుట్టలూ, చేపల గాలాలు, చిక్కాలూ పుచ్చుకొని ఒకళ్ళనొకళ్ళు ఒరుసుకొంటూ పోతున్నారు. పెళ్ళాం ఆ పెద్ద రొమ్ములమీద పడేట్టు పేట బూరా మెడకు తగిలించుకొని పాడుకొంటూ వెళ్తోంది. అతనుకూడా వంత కలుపుతున్నాడు.

"సాయంత్రం సీటిమీద,
సరదాగా తెడ్లాడే
చప్పుళ్ళే నా కిష్టం.

అడవిలోని జింకపిల్ల
మెడలో మువ్వలు మోగే
నడులే నా కానందం..."

ఒలింపీకి ఇల్లాంటి చాకబారు పిలపాటలు కోకొల్లలు గావచ్చు. ఎలాంటి హీనపరిస్థితుల్లో ఆవిడ ఆ పాటలు నేర్చుకొందో, గడిచేసిన పడుపు గదులగుడ్డి వెలుగు చీకటి [సిగ్గుపాటులలో ఎందరు పరాయి మొగుళ్ళ నా పాటలతో అలరించిందో, జ్ఞాపకం ఉంచుకొంటే, ఇంతటి శాంత సంతోషాలతో ఆ పాటలే ఆవిడ హాయిగ పాడటం, అంతకన్న అధర్త ఆపాట

(5)

లకు వంత కలపటం, చూస్తే, అందు ఏదో మహద్గాంభీర్య మున్నట్లే స్ఫురించేది.

ఆ దంపతుల స్థూలకాయాలు కొండ దిగువను మాటుపడుతున్నాయి. పాటువింటూ ఆగిన జీన్ మళ్ళీ అడుగు ముందుకు వెయ్యబోతూండగా, బండిచక్రాల చప్పుడూ, పిల్లల పకపక నవ్వుల కోలాహలమూ వినబడింది. ఇంతలో అతనికి కొద్ది గజాల దూరంలోనే, బండెడు ఆడపిల్లలు, కేరింతాలు కొట్టూ గంతులేస్తూ, తల విరబోసుకుని జుట్లు గాలికి జీరాడుతూ, పోతున్నారు. అందరిలోకీ పెద్దపిల్ల బండికి కట్టిన గాడ్దె పరుగు లెత్తూంటే కళ్ళెలు గట్టిగా పట్టుకొని గతుకులలో బండి బోల్తా కొట్టకుండా కళ్ళెలు బిగలాగుతూంది.

ముందర వెళ్లిన లావాటి స్త్రీ, ఆవిడ మెళ్ళో కొమ్ము బూర, అవన్నీ చూసి ఆ పిల్లలు ఎకసెక్కంగా నవ్వుకొంటూ వస్తున్నారు. ఇప్పుడు జీన్ కూడా ఆ జట్టులోవాడే అని ఆట్లోకీ ఆవీ చూసి గ్రహించి, మళ్లీ ఇందాకటి నవ్వు నెమరేసుకొంటూ పిల్లలంతా విరగబడి నవ్వసాగారు.

ఆ బండి వస్తూంటే దోవయియ్యటానికి మర్యాదగా అతను ఒక అడుగు వెనక్కు వేశాడు. బండి తోలుతూన్న పెద్దపిల్ల అకస్మాత్తుగా ఆ ముసిలి దుస్తుల్లో అతని ఆ పడుచు మొగం చూసి, సిగ్గుతో మొగం ఎఱ్ఱబడి, ఆశ్చర్యం వెలిబుస్తూ నమస్కార పూర్వకంగా క్షమాపణ కోరింది.

అతనుకూడా జంకుతో ప్రతి నమస్కారం చేశాడు. కాని ఎందుకు తను సిగ్గు పడ్డాడో అతనికి అర్థం కాలేదు. ఆ పిల్లల బండి ఇంకా ఎగువకు పోయి నాలుగురోడ్ల మొగలో ఆగింది. పిల్లలు నాలుగురోడ్ల పేర్లూ గట్టిగా చదువుతూంటే జీన్ వెనక్కు తిరిగి, సూర్యకాంతిలో రత్నకంబళంలా మెరుస్తున్న పచ్చని పచ్చిక వీధిలో, సాగిపోతూన్న ఆ బండి చక్రాలవంకా, ఆ ప్రశాంతపు వృక్షాల నీడలలో ఆ బండిలో తొణికిసలాడుతూన్న శైశవానందోల్లాసాలవంక తుదిచూపు పరపాడు.

అకస్మాత్తుగా హెట్టీమాల కొమ్ముబూరా వినిపించి అతని ధ్యానముద్రకు భంగం కల్పించింది. తక్కినవాళ్లందరూ చెరువు ఒడ్డునే కూర్చుని బుట్టల్లోనుంచి భక్ష్యాలుతీసి బైట పరుస్తున్నారు. దూరాన్నుంచి ఆ పచ్చని పచ్చికలో హెట్టీమాల ఎఱ్ఱకోట్లు వేటగాళ్ళదుస్తుల్లాగా కనబడుతున్నాయి. చెరువునీటిలో భోజనాలకు పరిచిన తెల్ల దుప్పటి మెరుస్తూ కనబడుతూంది.

"త్వరగా రా! రొయ్యలు నీ బుటలో ఉన్నాయి" అంటూ హెట్టీమా కేక వేశాడు.

"దోవలో నిన్నాపింది, బూచరో పిల్లే అనుకొంటానేం?" అని కేక వేస్తోంది ఫాన్నీ.

"ఔను. ఆపిల్లే. గాడిదను తోల్తుందే, పెద్ద పిల్ల, ఆ పిల్లే డాక్టరుగారి తమ్ముడి కూతురు. తనదగ్గిరే పెంచుతున్నాడు. వేసంగి అంతా ఇలికీలో గడుపుతారు. పిల్ల బాగుంటుంది" అంటూ హెట్టీమా జీన్ చేతిలో బుట్ట అందుకొన్నాడు.

"ఓ, బాగుండకేం! ఏమైనా బరిమీరిన మొగమేలే," అంటూ, ఫాన్నీ ప్రియుడివంక చూస్తూ అడ్డుకోత కోసింది. అతని చూపులో ఆ పరధ్యాన్నం ఆమెకు గిట్టలేదు.

హెట్టీ మాసతి, భక్ష్యాలు బైటకితీస్తూ, చిన్న పిల్లలను ఇల్లా విచ్చలవిడిగా అడవుల్లో తిరగనియ్యటాన్ని నిరసిస్తూ దీర్ఘోపన్యాసం చేస్తూంది. "అదంతా ఇంగ్లీషు పద్ధతి అనీ, ఆ అమ్మాయి లండన్‌లో పెరిగిందనీ ఏమేమో చెప్తారుగాని నాకవేం నచ్చవు సుమా! ఎక్కడ పెరిగితే ఏం, ఏమైనా అల్లాటి తిరుగుళ్ళు మర్యాద అనిపించవు."

"కాదులే! కాస్త జల్సా కావాలంటే అదే మార్గం."

"ఫాన్నీ!"

"క్షమించాలి. మరిచిపోయాను. ఈ పెద్దమనిషి గారికి అమాయకపు కన్నెలంటే మాంచి నమ్మకం లెండి."

"సరే! సరే! ఫలహారాలు చేద్దామంటారా!" అంటూ, మళ్ళీ ఏదో గలాటా రాబోతోందన్న భయంతో హెట్టీమా అడ్డు తగిలాడు. కాని ఫాన్ని ధోరణి ఆపలేకపోయాడు. తను ఎరిగున్న కులీన కుటుంబాల పడుచు పిల్లల కథలన్నీ ఏకరువు పెడ్తూంది. ఆ పిల్లలు వెళ్ళే కాన్వెంటులు, బోర్డింగ్ స్కూళ్ళు—ఆ కథలు ఎన్ని వినలేదని! అక్కడ వాళ్ళ వ్యవహారాలు, ఓ, ఏం చక్కగా ఉంటాయి! ఆ చదువులనుంచి బైటపడేటప్పటికి, నిస్త్రాణలతో, యౌవనం అంతా వాడిపోయి, మగవాళ్ళ పేరు చెప్తేనే విసిగిపోయి, చివరికి పిల్లలను కనటానికి కూడా పనికిరాకుండా, తయారవుతారు. "ఓరి పిచ్చి మొహోల్లారా, ఆ వాడిపోయిన సరుకే తమలాంటి వాళ్ళకు పెళ్ళిళ్ళల్లో అప్పగించుతారు. ఉహూ! కమ్మని అమాయకపు కన్నెపడుచులేం! అసలు

ప్రపంచంలో అమాయకపు కన్య అంటూ ఎవతో ఒకతె ఉన్నట్టు! ఏ సంఘంలో అయినా సరే, పుట్టిన నాటినుంచి, సృష్టిలో ఏది ఏమిటో తెలియని ఆడపిల్లంటూ లేదు. ఎందుకూ నా సంగతే చూడు. నాకు పన్నెండేళ్ళు వచ్చేటప్పటికి నాకు తెలియని విషయం అంటూ లేదు. ఏం, ఒలింపీ, నీకు అంతే కాదా?''

"నిస్సందేహంగా" అంటూ బుజాలు ఎగరేస్తూ చెప్పింది హెట్టీనా పతి. కాని అవిపెద్దృష్టంతో, అంతకన్నా ఫలహారాలు చల్లారిపోతాయేమోనన్న విషయంమీదే ఉంది. గాసిన్‌లో కోపం పెరుగుతోంది. అతినా వాదిస్తున్నాడు. అన్నిరకాల ఆడపిల్లలూ ఉంటారు. ఇప్పటికీ, చూడాలంటే, కొన్ని కుటుంబాలలో......

"ఔనౌను, కుటుంబాలుంటాయి'' అంటూ ఈసడింపుగా విసిరి కొట్టా ఫాన్ని అంటూంది. "కుటుంబాల విషయమే చెప్పుకొందాం! ముఖ్యంగా తమరి కుటుంబం.''

"నోరు ముయ్యి, చెప్తున్నా.''

"ఓ! పత్తిత్తు."

"ఓసి చెకిసీ! ఇది ఇంక ఎన్నాళ్ళో ఉండదని సంతోషిస్తున్నానే! త్వరలోనే నీ బాధ నాకు తప్పుతుంది లే!"

"పో! పో! వెంటనే కదిలిపో! మనస్ఫూర్తిగా సంతోషిస్తాను. ఫో!"

ఇద్దరూ నోళ్ళు పారేసుకొంటూన్నారు. మధ్యన, గడ్డిమీద బోర్లబొక్కలుగా పడుకొని, పిల్లను, విశ్వతోత్సాహంతో ఇద్దరి మొగాలూ పరికిస్తున్నాడు. ఇంతలో ఆ గలభాను ముంచేస్తూ చెరువు పరిసరాలంతటా శతఘ్నప్రతిధ్వనిస్తూ భయంకరంగా బాకా మోత వినబడింది. హెటీనాను వీళ్ళ దెబ్బలాట ఆపేందుకు ఇంకో విధానం తోచక ఊపిరంతా బిగబట్టి కొమ్ము బూరా గట్టిగా ఊదాడు. అతని మొగమంతా కందిగడ్డయిపోయి, కొమ్ము ఆయాసంగా కొట్టుకొంటూంది. "ఏం పూర్తి అయిందా! ఇంకా మళ్ళీ సాగించాలా" అంటూ బూరా కొమ్ము నోటిలోనే పెట్టుకొని వాళ్ళ మొగాల మీదకు బూరా పెట్టి అడుగుతున్నాడు. బూరాకు కట్టిన పెద్దగంట వాళ్ళ నెత్తిన పసిబోయే పిడుగులా వేలాడుతోంది.



దేవీస్తుతి పంచకము

శ్రీ అల్లంసెట్టి అప్పయ్య

శ్రీదమ్మై నిరవద్యమై నిశితమై చిద్రూపమై నిత్యమై
ప్రాదుర్భావ చరాచరాత్మక జగత్రాగ్భార ధౌరేయ దీ
క్షా దాక్షిణ్య విభూతి శోభిత మహోత్సాహ ప్రసిద్ధ స్థితిన్
నీ దివ్యాకృతి వెల్గగంటిమి భవానీ ! రాజ రాజేశ్వరీ!
అంబవై చిర చిదాలంబవై నివసత్కదంబవై సుగుణ కదంబవగుచు
దుర్గవై ప్రీణిత భర్గవై కరుణానిసర్గవై పుషిత సద్వర్గ వగుచు
కాళివై నతసజ్జనాళివై జితదోషపాళివై సంగ్రామ కేళివగుచు
మాతవై భువన విఖ్యాతవై మంత్ర ప్రపూతవై వైభవోపేత వగుచు
ప్రణవ పీఠస్థవై శ్రుతి పంక్తి కొలువ
నిండు పేరోలగంబున్న నీరజాక్షీ!
పూష వసురుద్ర గణముల బ్రోల్చు శక్తి!
సకల సంపన్మయీ ! నిన్ను సంస్మరింతు.
పరమేష్ఠి జగము లుద్భవ మొనర్పగ లేడు జనని! నీ యనుకంపమున నె గాక
విశ్వంభరుడు జీవవితతి బోషింపలేడమ్మ! నీ కరుణాలవమ్ము లేక
హరుడు సంహారకుండగుట విచిత్రమా నర్థి నీ సాహాయ్య మందకున్న
అన్య దైవతములం దణిమాది సిద్ధులం దంటియుండెదవు బాహ్యమున లోన
నైగమోద్యాన శారి ! సన్నయ విహారి !
సకల దురితాపహారిణి! స్వపర భేద
రహిత సద్భావనాశీల ! రమ్యలీల!
శరణు చిచ్ఛక్తి ! జోహారు పరమభక్తి !
చాలవు మంత్ర తంత్ర జపసాధన లా నిగమాగమంబులున్
జాల వసంత లీలల నెసంగెడు నీ ప్రతిభన్ గణింపగా,
జాలు నటంచు భక్తిమెయి సల్పిన మా ప్రణతుల్ గ్రహించి మ
మ్మేల గదే జగజ్జనని ! హే! శుభదాయిని ! చిత్స్వరూపిణీ!
శ్రుతి సూక్తి ప్రతిపాది భావుక కళా శోభాన్వితన్ నిన్నహో
క్షితి భృద్వర్గము గాయకాళి సుకవుల్ క్రీడర్థు లర్థార్థులం
చితవృత్తిన్ గతిగా దలంచి ప్రబల క్షేమార్హతం గాంతు ర
ప్రతిమానస్థితి, కామ్యదాయిని ! మమున్ రక్షింపు రాజేశ్వరీ!

చాళుక్య చోళులు

౧. కులోత్తుంగరాజేంద్రచోడదేవుడు

క్రీ. శ. ౧౦౭౦-౧౧౧౮

శ్రీ భావరాజు వేంకటకృష్ణారావు

రాజరాజనరేంద్రుడు శకాబ్దములు ౯౮౩ వ పరియగు శోభకృతు సంవత్సరమున వైశాఖ జ్యేష్ఠ మాసములనడుమ (క్రీ. శ. ౧౦౬౧, మేయి-జూనులనడుమ) పరమశత్రుడైన కుంతలాధీశుని సేనానులతో పోరాడుచు రణరంగమున మరణించెను. ఆనాటికి యువరాజేంద్రచోడుడు వేంగిభూమియందు లేడు. అతడంతకుముందు తండ్రిపనుపున చక్రకూట రాజ్యమున సామంతనృపతియైన ధారావర్ష దేవుని తిరుగుబాటును బలిమివాటించి యణచి అదిమి కప్పముగొనుటకు పోయియుండెను. అది మంచి యదనుగా గ్రహించి, రాజ్యతృష్ణతో యగ్రజుని చావు కెదురుచూచుచున్న వీర విజయాదిత్యదేవుడు తక్షణము తన వేంగీశ్వరత్వమును ప్రకటించెను. కులరాజధానియగు రాజమహేంద్రవరమునువీడి దాక్షారామము చెంతనున్న జననాథ నగరమునకు, ప్రాయశః తనకు నివాసమైయుండిన నగరమునకు రాజధానిని మార్చి, యచ్చట పట్టాభిషిక్తుడయ్యెను. తండ్రి మరణ వార్తను పినతండ్రి రాజద్రోహమును విని రాజేంద్ర చోడుడు ఆలసింపక వేంగికి మరలి వచ్చెను. అంత లోపల నా యువరాజుకు మేనమామయు మామయు నిచ్చినమామయునగు చోళభూపతి రాజేంద్రదేవుడు మరణించెనన్న వార్తగూడ తెలియవచ్చెను. చోళ రాజ్యమున తపు డుత్తరాధికారి లేడు. మేనమామల రాజ్యము—మాతామహుని రాజ్యము తనకు రాదగినదని యువరాజ రాజేంద్రచోడుడు సంకల్పించుకొనెను. అంతట చోళరాజ్యాభిలాషియై పితృవ్యునితో కలహింపక, సంధిచేసుకొని ప్రియముమీర కులక్రమాగతమైన వేంగీమహీమహారాజ్యమును వీరవిజయాదిత్యునికి సమర్పించి విజయసేనాసమేతుడై యువరాజు దక్షిణమునకు పోయెను.

వీరవిజయాదిత్యుడు వేంగీశ్వరుడై పదునైదు సంవత్సరములు శ. ౯౮౩-౯౯౫ (క్రీ. శ. ౧౦౬౧-౧౦౭౩) ఆంధ్రభూమిని సంరక్షించెను. అతడు శ. ౯౯౫ యగు పింగళ సంవత్సర చైత్ర వైశాఖముల నడుమ వృద్ధుడై పుత్రవిహీనుడగుచు, మనఃక్లేశము ననుభవించి, మరణించెను. పినతండ్రి మరణించిన వార్త వినినంతనే తడవుచేయక రాజేంద్ర చోడుడు వేంగీశ్వరుడగుచు తన రెండవకుమారుని, రాజరాజ-ముమ్మడిచోడుని తనకు ప్రతినిధిగా వేంగీశునిజేసి ఆంధ్రభూమిని సంరక్షించుటకు జననాథ పురమునకు బంపెను. ముమ్మడిచోడుని రాజ్యాభిషేకము జననాథపురమున శ. ౯౯౫ యగు పింగళ సంవత్సర శ్రావణబహుల దశమి బుధవారమునాడు, (క్రీ. శ. ౧౦౭౩ జూలయి ౨౭) జరిగెను.1

ముమ్మడిచోడుడు సరిగా నొక్క సంవత్సరము మాత్రము వేంగీమహీమహారాజ్యమును పరిపాలించి చోళమండలమునకు మరలిపోయెను. అతని రాజ్యపాలనము శకవర్షములు ౯౯౫-౯౯౬ అగు పింగళ-కాలయుక్తి సంవత్సరముల నడుమ నడచెను. రాజ్యసుఖముకంటె తలితండ్రుల శ్రీపాద సేవాసుఖము ఎక్కువ యని తలచి యా రాకుమారుడు తండ్రి సన్నిధికి అరిగెనని యానాటిశాసనములు నుడువుచున్నవి.2 ముమ్మడిచోడుడు తిరిగి వచ్చిన తక్షణము కులోత్తుంగ చోడదేవుడను నామాంతరము గైకొన్న రాజేంద్రచోడుడు తన మూడవ కుమారుని, పదునా రేండ్లప్రాయమువాని కుమారవీరచోడుని తన ప్రతినిధిని చేసి వేంగీమహారాజ్యమును సంరక్షించుటకు బంపెను. ముమ్మడిచోడుడు తండ్రి సన్నిధికి రాగా

1. ముమ్మడి చోడుని సర్వలోకాశ్రయుని యేలూరు తామ్రశాసనము. *C. P. NO. 3 of* **1922**; *ARSIE*, **1922**, *Para* 6. *PP.* **92** *ff.*

2. వీరచోడుని చెల్లూరు తామ్రశాసనము: *S.I.I., T, P.*

శ్లో. శ్రీపాదసేవా సుఖతో గురూణాం
నజాతు రాజ్యం సుఖమిత్యవేత్య
సంరక్ష్య వేంగీ భువమేకమబ్దం
భూయస్సపిత్రోరగమత్సవిూపమ్.

త్తుగా వరుసుటకు తెలిసినకారణము కవిచాతుర్యముతో నిండి, యథార్థమును గప్పి పుచ్చిన యుక్తి వాక్యముగ నూహింపవలయును. ఈ భీమ క్షత్రియ కులసంజాతుడైన ముమ్మడిచోడునకు భీముని తలపరాదు. అతడు మరలిపోవుటకు తగినంత కారణ ముండును. అతడు పరిపాలించిన యొక్క సంవత్సర కాలమునాటిది దానశాసన మొకటి గలదు. ఆ శాసన విషయములు ఇతరవిషయములతో కలిపి సూర్చి పరిశీలించినపుడు ముమ్మడిచోడుడు ఎంత అవ్యవధానముగ ఆంధ్రదేశమును విడిచి తండ్రిసమీపమునకు, చోళ మండలమునకు, జనిన కారణము స్ఫురించును. ఆ దాన శాసనము ముమ్మడిచోడుని విజయరాజ్యవర్షము రెండవ యేట, శ. ౯౯౯ సంవత్సరమున భాద్రపద ఆశ్వయుజ మాసములందు ఎప్పుడో యొక శుభముహూర్తము నందు ఒసగబడెను. అందలి విషయసారాంశ మిది: నారాయణి యను విప్రకన్యకందు కన్నరదేవుడను మహావీరుడు, మహారికుణ సుమకీర్తిగలవాడు జన్మించెను. అతనికి క్షత్రియవంశకరుడగు భీమభూపతి పుట్టెను. భీమభూపతి భీమసేనసదృశుడైన భీమబలాఢ్యుడు. విక్రమోపేతుడు. భీమభూపతికి సంకియ యను తనయుడు కలిగెను. అతని భార్య కామాంబిక. ఆ దంపతులకు జన్మించిన కుమారుడు ముమ్మడి భీముడు. అతడు మహావీరుడు. చిరకాల మా ముమ్మడి భీముడు వీరవిజయాదిత్యదేవుని యాశ్రయించి యనుచరుడై యాజ్ఞానువర్తియై మెలగుచు నా రాజేంద్రుని కనేక సంగ్రామరంగములందు ఖడ్గయిక సహాయుడై విజయలక్ష్మిని సమకూర్చియుండెను. ఆ వృద్ధవీరుడు రాజరాజ ముమ్మడిచోడుని యాశ్రయముబొంది గంగ కళింగ, కుంతలేశ్వరులతోడి దారుణ సంగ్రామములందు ఖడ్గసహాయము చేయుచు పరమాప్తభృత్యుడై మెలగుచుండెను. అట్టి వీరునకు అతడొసర్చిన ప్రభుసేవకు పరితుష్టుడై ముమ్మడిచోడుడు వేంగీసహస్ర విషయమునకు సంబంధించిన మన్నియనిబద్ధాధిపత్యముతోపాటు కమలూరు ఆదిగాగల ద్వాదశగ్రామములను సర్వకరపరిహారముగా వీరమాన్యమొసఁగి దానమిచ్చెను. ముమ్మడిభీముని సంభావించెను. ఈ దానమును ప్రాయశః ముమ్మడి చోడుడు క్షేత్రయాత్రకై వెడలువేళ చేసియుండుననుటకు కారణములు గలవు.

కళింగమునందా నాడు గంగ వంశజులు, జ్యేష్ఠ కనిష్ఠవంశములవారు పోరాటముల దగుల్కొనియుండిరని యూహించుటకు అవకాశ మున్నది. కళింగదేశమున కళింగనగరము రాజధానిగా జ్యేష్ఠవంశమువారు బలవంతులై రాజ్యమును బరిపాలించుచుండ చిన్నవంశమువారు, "శ్వేతక" నగరము (ఇది క్రమముగా జనులనోట చీకటియైనది.) రాజ్యాభిలాషులై అప్పుడప్పుడు బలవంతులై బలాత్కారముగ సకల కళింగాధిరాజ్యమును ఆక్రమించి పెద్దవంశమువారిని త్రోసిరాజనుచు పరిపాలించుచుండిరి. ఆ కారణమున కళింగ మెప్పుడును దాయాదుల అంతఃకలహములతో సంకటపడుచుండెను. ఆదికాలమునుండియు పెద్దవంశమువారు వేంగీశ్వరులకు అహితులైయుండి బలిమిచాటించి అనాక్రోక్కబడినపుడుమాత్రము అతిగావులై ప్రవర్తించి యుండిరి. వేంగీశ్వరులకు చిన్నకుటుంబమువారు ఆప్తబంధువులై తమయింటి యాడుబిడ్డలనిచ్చి రాజచాళుక్యవంశముతో సంబంధ బాంధవ్యములను కలుపుకొనుచుండిరి. కళింగ గంగభూపతులకును వేంగీచాళుక్యనృపాలురకును వీరవిజయాదిత్యునినాడు బద్ధవైరమేర్పడియెను. వీరవిజయాదిత్యుకు శత్రువులనాక్రమించుకొని విస్సహాయుడై యిడుములబడుచుండిన నాడు కళింగభూపతి, దేవేంద్రవర్మయైన రాజరాజు అనుమతిని యాతని బ్రాహ్మణసేనాని ప్రతీహారి వనపతి (బణపతి) పలుమార్లు వేంగిమీదికి దండెత్తివచ్చి రాజధాని జననాథపురమును ముట్టడించి పట్టుకొని దోచుకొనెను.1 ఒకప్పుడు చోళభూపతి, వీరరాజేంద్రుడు వేంగిపైకి దండెత్తిరా, వీరవిజయాదిత్యుడు గత్యంతరము గానక కళింగేశ్వరుని దేవేంద్రవర్మయైన రాజరాజును శరణుజొచ్చెను. (క్రీ. శ. ౧౦౬౬) అట్టి రాజరాజ దేవేంద్రవర్మయొక్క రాజ్యావసాన కాలమున కనిష్ఠరాజగంగవంశజుడైన దేవేంద్రవర్మ యనువాడు బలవంతుడై విక్రమించి రాజరాజ దేవేంద్రవర్మపై కయ్యమునకు గాలు సాచెను. అది శ. ౯౯౯ అగు కాలయుక్తి సంవత్సరమున (క్రీ. శ. ౧౦౭౭) జరిగెను. ఆనాడు వేంగీశ్వరుడై రాజరాజ ముమ్మడిచోడుడు ఆంధ్రదేశమును బరిపాలించుచుండెను ప్రాతిపగలనుమరచి దేవేంద్రవర్మయైన రాజరాజు, ముమ్మడిచోడుని సహాయమును, స్నేహమును

---

1. దీర్ఘాసిశిలాశాసనము. (*E.I. Vol. IV*, V. ౩౧౮. శ్లో. ౬.

జిత్వా సమ్యగ్వేంగి ధరాధినాథం
తస్యా జహారాఖిల వస్తురాశిమ్.

గోరెను.1 ఉత్తమక్షత్రియధర్మమును పాటించి రాజరాజ-ముమ్మడిచోడుడు దేవేంద్రవర్మరాజరాజునకు సహాయము జేయ గళింగమునకు బోయెను. ఆ ప్రస్థాన వేళను ముమ్మడిచోడుడు ప్రాయశః ముమ్మడిభీమునకు అతి దొడ్డవచ్చిన ఖడ్గసహాయమునకు బరితుష్టుడై వేంగీసహస్రవిషయమునకు చెందిన మున్నియనిబద్ధాది సత్కారములతో ద్వాదశ గ్రామమహాస్య దానములతో సంభావించెను. కళింగమునందు ఉభయదేవేంద్రవర్మలకును యుద్ధము దారుణముగా నడచినట్లు తోచును. ఆ పోరు చివరకు సమముగా పరిణమించినట్లు అగుపడుచున్నను, రాజరాజ-దేవేంద్రవర్మ, — నిండు యౌవ్వనమునమున్నవాడు, — రణభూమిని ప్రాణముల గోల్పోయెను. తద్వృత్తాంతము శ. ౯౯౪ న ఆశ్వయుజ కార్తికములందు (క్రీ. శ. ౧౦౭౨ అక్టోబరు నవంబరు) జరిగియుండును. ఆయుద్ధమునందు వేంగీశ్వరుడగు రాజరాజ-ముమ్మడిచోడుడు ప్రబలముగ గాయపడి ప్రాణములతో జననాథపురముజేరి యచ్చటనుండె జాలక తండ్రిసన్నిధికి చోళమండలమున కరిగెను.2 అచట కొంతకాలమున కతడు మరణించెను. కావుననే యాతడు మరల వేంగీశ్వరుడై రాలేదు.

రాజరాజ-ముమ్మడిచోడుడు చోళరాజధానికి మరలి వచ్చినవెనుక కులోత్తుంగ చోడదేవుడు తన మూడవకుమారుని కుమార వీరచోడుని వేంగీసవిజేసి జననాథపురమునకు బంపెను. వేంగిభూమికి పయనమైనప్పుడు కుమారవీరచోడుడు వరుసగా తలిదండ్రులకు అగ్రజులైన రాజరాజచోడగంగనికి, రాజరాజ ముమ్మడిచోడునకును సాష్టాంగముగ ప్రణమిల్లి వారిదీవెనలను బడసెను. కుమార వీరచోడుడు వీరుడు, మరియు ధీశాలి, విక్రమాఢ్యుడు. చక్రవర్తిలక్షణోపేతుడు. బాలుడైనను. అతడు ధురంధరుడని తలచి, చక్రవర్తి కులోత్తుంగుడు, కతిపయ శ్లోకములతో గూడిన వేంగీసామ్రాజ్యసంరక్షణమునకు నియమించి యిట్లు పలికెను.3 "ధీరుడా! కులక్రమాగతమైన వేంగీరాజ్యసంరక్షణభారమును బూనుము! తేజస్వినులైనవారు బాలురైనను స్వకార్యనిర్వహణదక్షులు ధురంధరులు!" మరియు నిట్లని ఆనతిచ్చెను. "ఉదయశిఖరమును అధిష్ఠించిన సూర్యుడు తన కిరణములను పర్వతశిఖరములపై నెట్లు ప్రసరింపజేయునో, ఆరీతిగా, నీవు వేంగిభూమి కరిగి, నీపాదములను శత్రురాజుల శిరములపై నుంచుము" కులోత్తుంగ చోళదేవుని నోటి నుండి వెలువడినట్లు శాసన కావ్యకర్తలు దెలుపు ఈ వాక్యములందు విశేషార్థము గంభీరముగ నిమిడియున్నది.

కళింగమున దేవేంద్రవర్మయైన రాజరాజునకు అతని విరోధియైన దేవేంద్రవర్మకును నడుమ అనేక యుద్ధములు నడచెనని చెప్పియుంటిమి. ఆ యుద్ధములన్నియు ఆదియందు సమములుగా నడచినను అంత్యమందు దేవేంద్రవర్మయైన రాజరాజునకు జయప్రదములయ్యెను. కాని జయలక్ష్మి వరించివచ్చిన ప్రయోజనము లేకుండ రాజరాజు రణరంగమున కూలి వీరస్వర్గము నొందెను. ఆ వృత్తాంతము శ. ౯౯౯ మార్గశిరమాసమునందు జరిగియుండినట్లు ఊహించితిమి. ఓడిపోయినను దేవేంద్రవర్మ ప్రత్యర్థిమరణమును బురస్కరించుకొని కళింగరాజ్యమును బలిమి నాక్రమించుకొనెను. అప్పటికింకను రాజరాజ-దేవేంద్రవర్మ అగ్రమహిషి రాజసుందరి గర్భవతియై యుండవలయును. ఆమె భర్త మరణించినతరువాతనే ప్రసవించి అనంతవర్మచోడగంగదేవుని గనియుండును.4

---

1. ఈ యూహా యనేకవిషయములను చర్చించినమీద తేలిన సారాంశము. వీరచోడుని చెల్లూరు, పిఠాపురం తామ్రశాసన వాక్యములు, సర్వలోకాశ్రయ రాజరాజ-ముమ్మడిచోడుని ఏలూరు తామ్రశాసన వాక్యములు. కళింగదేశ వ్యవహారములు మొదలయినవాటిని చర్చించినపుడు తేలిన సారాంశము.

2. వీరచోడుని, రాజరాజ-చోడగంగని తామ్రశాసనములోని

శ్రీపాదసేవా సుఖితో గురూణాం
వలాతు రాజ్యం సుఖమిత్య వేత్య
సంరక్ష్య వేంగీ భువమేష ముగ్ధం
భూయస్య చిత్రోరగమత్ప్రియాపత్. అను శ్లోకమునకు ఈరీతిగా అన్వయించి వ్యాఖ్యానము చేయవలెను.

3. వీరచోడుని చెల్లూరు పిఠాపుర తామ్రశాసనములు.

కులక్రమాగతాం ధీర!
ధురం వేంగీ భువో వహ|
బాలా అపి స్వకార్యేషు
క్షమాస్తేజస్వినః ఖలు|| ఇత్యాది.

4. అనంతవర్మ కులక్రమాగతమైన రాజ్యము. ఆ శిశువు చోడగంగవంశముల రెండింటిని గల్గిన పుత్రిఫలమునుబట్టి చోడగంగ దేవుడయ్యెను.

అగర్భశ్రీమంతుడైన నా శిశువుకు వేంగీశ్వరుని సాహాయ్యముతో ఆప్తమంత్రి మాండలిక, సేనాపతులు జననము నొందినవెంటనే రాజ్యాభిషేకము గావించిరి. ఆ యుత్సవము శ. ౯౯౯ అను కాళయుక్తిసంవత్సర కుంభ మాఘ శుక్ల 3 శనివారము నాడు (క్రీ. శ. ౧౦౭౮ ఫిబ్రవరి ౧౬ తేదినాడు) జరిగెను.1

శెల్లూరు తామ్రశాసన కావ్యమును2 పరిశీలనతో చదివినయెడల కుమార వీరచోడుడు కళింగ యుద్ధములందు నొందిన పరాభవమునకు ప్రతిక్రియ చేయుటకు హుటాహుటి కళింగనగరమునకుపోయి అనంతవర్మ చోడగంగదేవుని రాజ్యాభిషేకమును నిర్విఘ్నముగా సాగించెనని తోచును. ఆ ఘనకార్యనిర్వహణమునందు మహావీరుడగు వెలనాటి వెదురభూపతి వీరచోడునకు విశేషముగ తోడ్పడి యుండును. వీరచోడుని పిఠాపుర తామ్రశాసనమందొక వాక్యము3 భీతార్తుడును ఆశ్రితుడును అగువానికి ఆశ్రయమిచ్చి వీరచోడుడు సమస్తభువనాశ్రయనామమును సార్థకము చేసికొనెనని తెలుపుటవలన వీరచోడుడు కుమార అనంతవర్మ చోడగంగని "భీతానుపాశ్రితుని భయాపన్నుని" తన భుజపరాక్రమము చేతరక్షించి అభిషిక్తునింజేసెనని యూహింపవీలగుచున్నది. అనంతవర్మను కళింగాధీశునిగా నభిషేకించి శత్రుసమూహమునెల్ల చీకాకుపఱచి పాఱద్రోలి వేంగికి మరలివచ్చినపిదప వీరచోడుడు జననాథపురమందు తన రాజ్యాభిషేకమును జరుపుకొనెను. అనంతవర్మ పట్టాభిషేకము జరిగినవెనుక ఆరునెలలకు శ. ౧౦౦౦ యగు సిద్ధార్థి సంవత్సర శ్రావణ శుద్ధ త్రయోదశి గురువారమునాడు (క్రీ. శ. ౧౦౭౮ ఆగస్టు ౨౩ వ తేది) జననాథపురమున వీరచోడుని పట్టాభిషేకము నడచెను.4

వీరచోడుడు ఆంధ్రదేశమును తొల్లిటి చాళుక్య వేంగీ చక్రేశ్వరులమాడ్కి సర్వలోకాశ్రయ విష్ణువర్ధన మహారాజాధిరాజ పరమేశ్వరాది రాజబిరుదములతో రాజలాంఛనములను ధరించి రెండేండ్లు పాలించెను. ఆతనిపాలనమున ఆంధ్రదేశము మరల నొకసారి కొంతకాలము స్వర్గతుల్యమై శత్రుభీతి యావంతయు లేక సుఖము ననుభవించెను.5 వీరచోడుని కాలమునాటి దాన తామ్రశాసనములు రెండు గలవు. అవి రెండును, ఆతడు రెండవసారి వేంగీశ్వరుడై వచ్చియున్న కాలమునాటివి. మొదటిసారి వేంగీశుడై పరిపాలించిన కాలమున, శ. ౧౦౦౦ మొదలుకొని ౧౦౦౨ (క్రీ. శ. ౧౦౭౮-౧౦౮౦) వఱకు వీరచోడుని శాసనములు గానరాలేదు. ఆకాలమున జరిగిన వృత్తాంతములు కారణమున ఎఱుగరావు. కాని ఆ రెండేండ్లును నిరంతరము యుద్ధములతో గడచిపోయెనని మాత్రము ఊహించుటకు అవకాశమున్నది. అనేక సమరములందు తోడ్పడుచు విశ్వాసము గల భృత్యుడై చరించిన వెలినాంటి వెదురభూపతి ఆంధ్రకళింగభూములందు శత్రువుల బరిమార్చియుండెను. కళింగ రాజేంద్రవర్మవలన నెట్టి యాపదయు గలుగకుండ వీరచోడుడు వెదురభూపతి సహాయమున అనంతవర్మను సంరక్షించెనని యూహింపవచ్చును. ఇంచుమించుగా ఆ రెండు సంవత్సరములును వీరచోడుడు వేంగి కళింగరాజ్యముల రెండింటిని కలిపి పరిపాలించి యుండెను.6

---

1. ఇండియను అంటిక్వెరి సం. ౧౮-పుట (౧౬౧) ౧౬౨.

శ్లో. 2. శత్రుధ్వాంత మపాస్య
రాజనికరాన్నాచ్ఛాద్య ధామ్నాపరాన్
దుర్భిక్షాన్వినివర్త్య భూ
కమలినీం కృత్వా తథానందినీమ్
ఆర్యాథో జననాథ నామ నగరీ
హర్మ్యాగ్రానోదయాద్రింవిభుం
వేంగీభూతిల భూషణం
నృపసుతో బాలార్క బింబద్యుతిః॥

శ్లో. 3. యోదీనకోటి మభివాంఛిత వస్తుదానై
ర్భీతాను పాశ్రిత భయాపను దాభయేన
రక్షన్నను స్త్రిభువనాశ్రయనామసార్థం
ధత్తే ప్రజాశ్చ నిజధర్మ పరిగ్రహేణ॥
E. P. Vol. V. P.

4. శెల్లూరు తామ్రశాసనము *SII. Vol. I. NO 39.* పుట. శ్లోకము ౨౧. ఫ్లీటుపండితుడు డీ శాకీఖును గుణించినాడు. మూడును ఇండియన్ ఆంటిక్వెరి సం. ౧౯. పు. ౪౩౬.

5. పృథ్వీశ్వరుని పిఠాపుర శిలాశాసనము కుంతీమాధవుని గుడియందున్నది. *E. I. Vol. IV, P. 34.*

శ్లో. 30. అథమథిత వైరియూథే
ప్రథితగుణే వీరచోడ నరనాథే।
శాసతిరాజ్యం వేంగీమండల
మాఖండలోపమే శకే॥

6. పృథ్వీశ్వరుని పిఠాపుర శాసనములోని యీ శ్లోకము ఈ యూహకు గారణము. శ్లో ౩౧.
తస్యాఖిలారి నరపాలసమూహ
రాజలక్ష్మీకచగ్రహణలంపటదక్షహస్తః।
శ్రీవీరచోడనృపతేర్వేదురక్షితీశస్సా
చివ్యమాచరదయం చతురప్రతాపః॥

కళింగయందు ఆనాడు దురాక్రమణముజేసిన అపహర్త దేవేంద్రవర్మవలన అనంతవర్మచోడగంగని పక్షము బూనినవారికి శాంతి లేకుండెను. అనంతవర్మ శాసనములు శ. ౧౦౦౩ వఱకు (క్రీ. ౧౦౭౧-౭౨) కానరావు. తన కత్యంతము చేరువుగానుండిన వెలనాటివెదురభూపతిని వీరచోడుడు సముచితరీతి సత్కరించి సంభావించెను. అతని తన సింహాసనమునం దర్ధాసనమిచ్చి కూర్చుండబెట్టుకొనెను.1 రెండేరుల నడిమివిషయము లేక సింధు యుగ్మాంతరవిషయము అను పేరు గల దేశమునకు—అది గోదావరి కృష్ణ గౌతమీనదులనడుమనున్న సీమకు—పాలకునిగా నియమించెను. శకవర్షములు ౧౦౦౬ (క్రీ. శ. ౧౦౭౪) వ సంవత్సరమునందు చక్రవర్తి కులోత్తుంగునికి పాండ్య భూధవునితోడ పోరు సంభవించెను. వివరములు తెలియరావుగాని పాండ్యభూపతి రాజేంద్రచోడదేవుడయిన కులోత్తుంగచోడుని యెదిరి దర్పముతో రాజిగ చోళ(రాజేంద్రచోళ) మనోభంగయని బిరుదము ధరించెను.2 ఎదిరించిన పాండ్యరాజును శిక్షించుటకు చతురప్రతాపుడును ధీరుడును నగు వీరచోడుని చోళమండలమునకు రావలసినదని యాజ్ఞాపించెను. కుమారమూర్తియై యవ్వన ప్రారంభ వేళనున్న కుమార వీరచోడుని లావణ్యమును దిలకించి యానందమనుభవించదలచి చక్రవర్తి కుమారుని బిలువనంపెనని యానాటిశాసనమొకటి తెలుపుచున్నది.3 కాని యది నిజమయిన కారణముగాదు. వీరచోడుడు వేంగీశ్వరత్వమును వదిలిపెట్టి శ. ౧౦౦౬కు సరియైన క్రీ. శ. ౧౦౭౪ సంవత్సరమున మార్చి, ఏప్రిలు నెలల ప్రాంతమునందు వెలనాటి వెదురభూపతిని వెంట బెట్టుకొని చోళమండలమునకు బోయెను. వెదుర భూపతి పాండ్యరాజును అతని సమస్త సామంత గణమును కలిపి ఆహవరంగమున బరిమార్చి చిరయశమును సంపాదించెను.4

కుమారవీరచోడుని స్థానమున చక్రవర్తి తన పెద్దకుమారుని రాజరాజైన చోడగంగని వేంగీశుని చేసి ఆంధ్రభూమికి బంపెను.5 రాజరాజ చోడగంగని పట్టాభిషేకము రాజధానియైన జననాథపురమున శ. ౧౦౦౬ కు సరియైన క్రోధన సంవత్సర జ్యేష్ఠ శుక్ల పూర్ణిమ గురువారమునాడు (క్రీ. శ. ౧౦౭౪ మేయి ౨౨ జరిగెను.6 రాజరాజ చోళగంగదేవుడు

1. పృథ్వీశ్వరుని పిఠాపుర శాసనము. శ్లో. 33.

తస్మై శ్రీవీర చోడక్షితిపతి
        రఖిలక్ష్మాభృతాం విస్మితానా
మగ్రే సింహాసనార్థం సకల
        నృపజన ప్రార్థితం సందిదేశ।
దేశంచాశ్లేషసస్యప్రచుర
        ఫలయుతం సింధు యుగ్మాంతరాఖ్యం।
ప్రాదాత్ప్రీత స్స భూయో
        వెదుర నృపతయే పాతితరాతిరాజే॥

2. ఇండియన్ అంటిక్వేరి. సం. ౨౦. పుట ౨౭౬, నోటు ౨౯.

3. వీరచోడుని పిఠాపుర తామ్రశాసనము: *E.I. Vol. V. p. 70.* శ్లోకం ౨౫.

అకుతంమో మహీరక్షు
స్సుకరాశా చక్రవర్తినా।
అహూతో యువనో ద్రామ
దేహలక్ష్మీదిదృక్షయా॥

4. పృథ్వీశ్వరుని పిఠాపురశిలాశాసనము *E. I. Vol. IV p. 34.* ౩౭వ శ్లోకము:—

వేదురో వీరచోడస్య
శాసనానుశ్చరం చిరం
పాండ్యదేవం జిగాయాజౌ
సామంత గణ సంయుతమ్.

5. రాజరాజ - చోడగంగని చేల్లూరి తామ్రశాసనము. *E. I. Vol. VI* పుటలు 334-346. శ్లోకములు ౩౦-౩౧.

30. సర్వా ముర్వీ మక్షతం రక్షితుం తే
        వేంగీదేశే సింహపీఠాసనస్య।
నానాభూపాలి రత్నాలి దత్నైః
        పాదాబ్జ శ్రీ ర్భ్రాజితం రాజరాజః॥
పాతాలం పాతియావత్వ మివ
        ఫణిపతిర్నాగ గయాథైక నాథో।
యావత్స్వం సేవ్య మాజ్యా విబుధగణ
        శతైర్నాక నాథో పినాకం।
తావత్త్వం రక్షధాత్రీం నిశిజ
        నిజ భుజస్ఫార కాంతేయధారా।
వారి ప్రక్షాలితారి చ్ఛలముల
        విమలీభూత దిక్చక్రవాలః॥

6. పూర్వోక్తశాసనము. ౩౪ వ శ్లోకము.

కులక్రమాగతములయిన సర్వలోకాశ్రయ, సమస్త భువనాశ్రయ బిరుదములను రెండింటి ధరించి వేంగి నేలెను. అతని కాలమునాటివి శిలా తామ్రశాసనములు గలవు. వాటిలో ముఖ్యమైన, రెండు వాటిలో చేకి తామ్రశాసనము. రెండవది దాక్షారామ శిలా శాసనము. తామ్రశాసనము గోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా చేకిగ్రామమున లభించెను.1 దానిని రాజరాజ చోడగంగదేవుఁడు తెలికి వేయి కులమువారికి పూర్వమునుండియు చెల్లుచువచ్చిన కులమర్యాదలను ఆచంద్రార్కము రాజాజ్ఞగా నడచునట్లు సుస్థిరముచేయుచు నిచ్చిన ధర్మశాసనము. బెజవాడ (విజయవాడ) వాస్తవ్యులైనవారు తెలికి వేయి గోత్రములవారు, వెలుమనూళ్లు, పత్తిపాలు, నరియూట్లు, కుముడాట్లు, మల్లూట్లు, పోవండ్లు, సావకులు, ఉంద్రూట్లు, అనుమగొండ్లు, అడ్డనూట్లు, మొదలయినవారు గలరు. ఆ వేయి గోత్రముల తెలికివారును రాజచాళుక్య భూపాల పాదపద్మోపజీవులు. కులభృత్యులు, అట్టి తెలికి వేయివారికిని కులక్రమాగతములైన మర్యాదలు ఆచారములు కొన్ని గలవు. వివాహానంతరము నూత్న దంపతులు వీధులందు తురగారోహణముజేసి ఊరేగుటయు వివాహకాలమున వేంగీశ్వరుని శ్రీపాదమూలముందు అమితమైన విలువగల వస్త్రద్వయమునుంచి బంగరుపళ్లెమునందు తాంబూలముతో సమర్పించి, శ్రీపాదములకు సాష్టాంగ నమస్కారము లాచరించుటయు మొదలైన మర్యాదలు గలవు. వాటిని రాజరాజ చోడగంగ దేవుడు పరితుష్టుడగుచు తెలికి వేవురు కోర్కెపై ఆచంద్రార్కము నడునునట్లు శాసించి ధర్మశాసనము వ్రాయించి యిచ్చెను. ఈ చేకి తామ్రశాసనము శ. ౧౦౦౯ యగు క్రీ. శ. ౧౦౮౭ వ సంవత్సరము నాటిది. అది చక్రవర్తి కులోత్తుంగుని ౧౭ వ విజయ రాజ్య వర్షమగుచున్నది.

రాజరాజ-చోడగంగని కాలపు దాక్షారామ శిలాశాసనము చారిత్రాత్మకముగా వింతగొలుపు విషయములను కొన్నింటిని దెలుపుచున్నది.2 ఆ శాసనము భీమేశ్వర మహాదేవుని గుడియందున్నది: చాల భాగము చెడినది అక్షరములు సరిగా కానరావు. అయినను అందు స్పష్టముగా, దాని తిథి వారములు తెలియవచ్చుచున్నవి. చక్రవర్తి విజయరాజ్య వర్షములు ౧౫ అగు మీనమాసమున శుక్లపంచమినాడు, భీమేశ్వరమహాదేవుని సన్నిధిని రాజరాజ చోడగంగని సమక్షమున వెలనాంటిగొంకయ ఆనతిచొప్పున మహామండలేశ్వరులు కొందరు తాము వేంగీశ్వరునకు విశ్వాసముతో భృత్యులమై యుందుమని ఘోరమైన ప్రతిన బూనిరి. ఆ శాసనము ఇట్లున్నది.

౧. స్వస్తి! కులోత్తుంగ్గ చోడదేవర విజయ రాజ్య సంవత్స ౧౫ శ్రాహి మీనమాస శుద్ధ పంచమి— —

౨. ముహాణ్ణు చోడగంగ్గదేవని..............
[3, 4, 5, 6 పంక్తులు పోయెను.] మధ్యాహ్న సంధి.

౭. గా నిచ్చితిమి. దీనికి మా..............

౮.......మాగళాము దప్పితిమేని గొంకరాజు వాన. దివ్య తప్పిన శ్రీ భీమేశ్వర మహాదేవుని యాన దీనికి సాక్షి [—ఇక్కడ సాక్షుల పేర్లవ్రాస్లి గలవు.]

ఈ శాసనమందు కులోత్తుంగుని విజయరాజ్య వర్షము, చోడగంగని పేరు, వెలనాంటి గొంకరాజు పేరును ఉదాహరింపబడుట చారిత్రరచనకు మిక్కిలి తోడ్పడుచున్నవి.

అట్టి ప్రతిన యేల బూనవలసి వచ్చెనో ఎఱుగుటకు సాధనములు లేవు. అయినను కొన్ని ముఖ్యవిషయములు మాత్రము స్పష్టమగుచున్నవి. వీరచోడదేవుని నిర్గమనానంతరము రాజరాజ చోడగంగ దేవుడు వేంగీశ్వరుడై వచ్చునంతలోపల కొంత కాలము అరాచకమై గడచినట్లు గన్పట్టుచున్నది. ఆ నడిమికాలమున చక్రవర్తి యాదేశానుసారము ఆంధ్రభూమిని వెలనాంటి గొంకయ సంరక్షించెను.3

1. *E. I. Vol. VI*, పు. ౩౩౮ మొదలుకొని.
“ తెలికి కులలబ్ధజన్మానః స్వధర్మ కర్మ నిష్ఠితమనసస్తేషాం విజయవాట ప్రముఖనిఖిల పుర నగర గ్రామ పట్టన ప్రభృతిషు స్థానేషు సర్వేషు వివాహోత్సవేషు ప్రవర్తమానేషు మిథునస్య వీథీషు తురగారోహణ పర్యటన మథ వివాహోత్సవావసానే రాజశ్రీపాదమూలే మహార్ఘ వాసోయుగలం నిధాయ ప్రణతానామేషాం కనకపాత్రేణ తాంబూల ప్రదానంచ పూర్వమర్యాదా సమాగత మధునా పరమ భక్తి పరితోషితై రస్మాభి రాచంద్రార్కం శాసనీకృత్య దత్తమితి విదితమస్తు వః॥ ”

2. *S. I. I. Vol. IV*. ౧౦.

3. పృథ్వీశ్వరుని పిఠాపురం శిలాశాసనము ౨౭ వ శ్లోకము.

తేషాం గొంక మహీపాలః
పాలయన్నంధ్రమండలం ।
శ్రీ కులోత్తుంగ చోడాజ్ఞాం
దధానోప్యధికం బభౌ॥.

చోళచాళుక్యుల సామ్రాజ్యాధికారము పారమేష్ఠిత్వము ఆంధ్రదేశమున స్థిరముగా వర్థిల్లుటకు సమస్త సేనాపతి వెలనాంటి గొంకరాజు మూలాధారము. ఏతత్కారణమున నాతడు చాళుక్యరాజ్యభవన మూల స్తంభాయమానుడని ప్రఖ్యాతిగాంచెను. ఆ విధముగా నాతనితో పాటు మహామాండలికుల సేవలు తిరువాల కొలయున వెలనాంటి గొంకరాజు ఆవలి క్రమమున చాళుక్యరాజ్యభవన మూలస్తంభాయమానులై నిలచిరి. కాని వీరచోడుని నిర్గమనానంతరము మహామాండలికులు కొందరు రాజచాళుక్య వంశముపై భక్తిని విసవాడి రాజద్రోహులగుట సంభవించియుండును. అట్టిపరిస్థితి యేర్పడుటకు గారణములు పెక్కుగలవు. ఆరీతిగా మాండలిక శిఖామణులు స్వామిద్రోహులై చరించకుండ గొంకరాజు వారినెల్ల కూడగట్టి రాజరాజ చోడగంగునికి, వేంగీశ్వరునికి మూలభృత్యులై నిలిచి విశ్వాసముతో భక్తితో చెప్పటియట్లు రాజభక్తితో వేంగీసని గొలుచుటకు వెలనాంటి గొంకయ మాండలిక ప్రభువులచేత శ్రీభీమేశ్వర మహాదేవుని సన్నిధియందు మిట్టమధ్యాహ్నపువేళ ప్రతిజ్ఞలు చేయించి ఆజ్ఞ బెట్టి భీమేశ్వర మహాదేవునియాన పెట్టియుండునని యూహింపవచ్చును. అనాడు, కుమార వీరచోడుడు వేంగిని విడిచి చనినది మొదలు ఆంధ్ర కళింగ భూములందు యుద్ధభయము నానాటికి విపరీతముగా హెచ్చుచుండెను. కళింగభూమియందు ఏడెనిమిదేండ్ల వయసుగల అనంతవర్మకు ఉభయ పార్శ్వములందు శత్రువు లవతరించి ఆకలితోనున్న సింహముల మధ్యనుండిరి. అనంతవర్మ, వేంగీసు పంపిన దండనాయకుల సహాయముతో, ఆప్తభృత్యులయినవారి యండతో రాజభక్తిపరాయణులైనవారి తోడుతో రాజ్యసంరక్షణము చేయుచుండెను. కళింగమందు కొంతభాగము నాక్రమించుకొని బలదర్పితుడై అపహర్త దేవేంద్రవర్మ మిగిలిన భాగమును కూడ గబళించుటకు సన్నద్ధుడైయుండెను. అతనికి తోడు చక్రకూటాధీశ్వరుడు సోమేశ్వరుడు. అతడు దేవేంద్రవర్మతో గలిసి, కళింగమును ముప్పు జేనుండెను. అట్టి విపత్సమయమున నే క్షణమందయినను కళింగ వేంగీశ్వరులకు దేవేంద్రవర్మ సోమేశ్వరులతో యుద్ధము సంభవించవచ్చును. గొంకభూపతి యీ పరిస్థితులనన్నింటిని చక్కగా గ్రహింపగలిగిన రాజనీతిధురంధరుడు గావున ఉత్తరాంధ్ర ప్రాంతపు మాండలిక ప్రభువులను రావించి వారిచే రాజభక్తి వెల్లడించు బాసలుగైకొనజేసి భీమేశ్వర దేవుని యాన బెట్టెను. దాక్షారామ శిలాశాసనము దెలుపు, విజయరాజ్యవర్షము, మాసము, తిథి మొదలయినవాటిని గుణించినపుడు అది శ. ౧౦౦౭ చైత్ర శుక్ల పంచమి (క్రీ. శ. ౧౦౮౫ మార్చి ౨౬ వ తేది) యగుచున్నది. దాక్షారామ శాసనానంతరము జరిగిన వృత్తాంతములనుబట్టి, వెలనాంటి గొంకయ పెట్టిన ఆనలకు కారణమూహింప వీలగుచున్నది.

అనంత వర్మకు ప్రత్యర్థియైన (సప్తమ) దేవేంద్రవర్మ కాలమునాటివి యింతవరకు రెండు శాసనములు మాత్రము లభించెను. అందు మొదటిది కంబకాయ తామ్రశాసనము.1 రెండవది గారశిలా శాసనము.2 కంబకాయ శాసనము దేవేంద్రవర్మకు సామంతుడైన మహామాండలిక కదంబ ఉదయఖేడి, చేసిన దానమును తెలుపుచున్నది. ఆ దానమునాటికి, దేవేంద్రవర్మ కళింగములోని కొంతభాగమును ఆక్రమించుకొని దంతిపురమును రాజధానిని జేసుకొని పాలించుచుండెను. కంబకాయ శాసనపు దానము. శ. ౧౦౦౩ సంవత్సరమున (శకాబ్ద సహస్రమేకం త్రయాధికం) అనగా క్రీ. శ. ౧౦౮౧-౮౨ నాటిది. ధర్మఖేడితనయుడైన ఉదయాదిత్యుడు (ఉదయఖేడి) కేవిలిగ్రామమును ఉదకపూర్వకముగా యిద్దరికి, నారాయణనాయకునికిని అయితయ సోమయాజికిని, రెండు భాగములుచేసి ధారవోసెను. గారశిలాశాసనము శ. ౧౦౦౫ సంవత్సరమున (శరసూర్యరశ్మి: శర = 5 సూర్యరశ్మి = 1000 — వెరశి ౧౦౦౫) ఉత్త

1. భారతి (౧౯౨౬) కార్తీకమాస సంచిక. సం. ౪, భా ౨, సం. ౫. పుటలు ౧౧౫ మొ. పరిష్కర్త శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు శాసనపు సంవత్సరమును సందేహముతో నిలిపినారు. ఈ శాసనము *C. P. No. 9 of 1925-26: A R S I E*, 1926 - నందు సమీక్షింపబడినది.

2. *A R. No. 391 of 1932-33 A R S I E.* 1933, పుట 56.

రాయణ పుణ్యకాలమునం (డిశెంబరు ౧౦౨౩) దు గారలగ్రామమునమున్న విష్ణుదేవకుడి శ్రీ నారాయణ దేవరకు నిత్యము అఖండదీపమునకై పెదఅల్లు గోకన (గోకర్ణ) నాయకుడు ఏబదియావులను దానమిచ్చిన విషయమును దెలుపుచున్నది. శాసనములోని సంవత్సరము జేవేంద్రవర్మయొక్క ఏడవ విజయరాజ్య వర్షమని తెలుపబడినది. దీనిని బట్టిచూడ శిశువు అనంతవర్మయు నాతని వైరి దేవేంద్రవర్మయు నొకరితరువాత నింకొకరు నించుమించుగా నొక కాలమున రాజ్యాభిషిక్తులైరని సూచించుచున్నది. ముందుగా రాజ్యమును హరించి, అభిషేకించుకొన్నవాడు దేవేంద్రవర్మ యని తోచును.

ఈనాటి బస్తరుసీమకు ప్రాచీనకాలమున చక్రకూట రాజ్యమని పేరుండెను.

చక్రకూట రాజ్యమునకు రాజధాని చక్రకూట నగరము. అది గోదావరి ఉపనదియైన ఇంద్రావతి దక్షిణపుటొడ్డున నున్నది. రమణీయమైన ఇంద్రావతి నది జలపాతము (ఎత్తిపోతలు) చక్రకూట నగరమునకు సమీపముగనున్నది. ఇంద్రావతినదికి ఉభయ పార్శ్వములందు ఉత్తర దక్షిణదిశలుగా వ్యాపించి యుండెను చక్రకూట రాజ్యము. ఆ మండలము గుణగ విజయాదిత్యుని కాలమునుండియు వేంగీ సామ్రాజ్యాంతర్గతమై యుండెను. వేంగీశ్వరులకు, చక్రకూటాధీశ్వరులు సామంతులై యుండి కొన్ని కప్పములు గట్టుచుండిరి. చక్రకూటమునకే త్రికలింగమని కూడ పేరుండినట్లూహింపవచ్చును. గుణగ విజయాదిత్య చక్రవర్తినాటినుండి (క్రీ. శ. ౮౪౮—౮౯౨.) వేంగీచాళుక్య చక్రేశ్వరులు త్రికలింగాటవీరాజ్యముతోపాటు వేంగీసామ్రాజ్యమును పాలించియుండిరి. రాజరాజనరేంద్రుని నాడు చక్రకూటమండలమును ఛిందకమని పేరుగల నాగవంశము పాలించుచుండెను. రాజరాజనరేంద్రునకు అదిని భృత్యుడై ఆ వేంగీశ్వరుని పాదపద్మోపజీవియైన ధారావర్షదేవుడు ప్రాయశః కుంతలేశ్వరుడైన ఆహవమల్ల సోమేశ్వరుని ప్రేరణము కారణముగా ఎదిరించి స్వతంత్రుడై పారమేష్ఠిత్వమును చాటించి వేంగీకునికి కప్పమును గట్టుటమానెను. ఆ వృత్తాంతము రాజరాజనరేంద్రుని రాజ్యావసాన కాలమున శ. ౯౮౧, ౯౮౨ సంవత్సరముల (క్రీ. శ. ౧౦౫౯—౬౦) నడుమ జరిగియుండెను. సరిగా, ఆవేళకు చోళమండలముమీదికి ఆహవమల్లుని సేనలు దండెత్తివచ్చెను. రాజరాజనరేంద్రుడు చోళభూపతికి సహాయమరిగి ధారావర్షదేవుని బంధించి యదిమి శిక్షించి కప్పము గొనిరావలసినదని యువరాజ రాజేంద్రచోడుని చక్రకూటము మీదికి బంపెను. బలవంతుడై యున్న ధారావర్షుని శిక్షించుటకు యువరాజునకు కొంతకాలము బట్టెను. ధారావర్షుని యోడించి యాతని సోదరుని జననాథదేవుని మిత్రుని ఆశ్రితుని చేసుకొని చక్రకూటమునుండి అమూల్యధనములతో ఏనుగుల సమూహములతో రాజేంద్ర చోడ వేంగికి మరలివచ్చెను. అది శ. ౯౮౪. కు సరియైన క్రీ. శ. ౧౦౬౨ సంవత్సరారంభము కావచ్చును. ధారావర్షుడు బోనులో నుంచబడిన సింహముమాడ్కి యయ్యెను. అతడు, అటుతరువాత, ఒకటి రెండు సంవత్సరములలోపల మరణించెను. ధారావర్షుని మరణము శ. ౯౮౫ కు సరియైన క్రీ. శ. ౧౦౬౩ సంవత్సరాంతమున జరిగినట్లూహింపవచ్చును. ధారావర్షుని కుమారుడు సోమేశ్వరుడింకను ఆనాటికి బాలుడు. ఆ తరుణము జూచుకొని దాయాదియైన మధురాంతకదేవుడు కోసలాధీశుడగు మొదటి జాజల్లదేవుని సహాయముబడసి చక్రకూటాధిపతి కాగలెను. శ. ౯౮౬ నాటిది మధురాంతకదేవుని తామ్రశాసనము గలదు. ఎ. ఇ., సం. ౯, పు, ౧౭౮. కోసలేంద్రులు హైహయవంశజులు వారి రాజధాని రత్నపురము. అది మధ్యప్రదేశమందు బిలాసపూరునకు ఉత్తరముగా ౧౬ మైళ్ళ దూరమునన్నది.

సోమేశ్వరుడు తండ్రి మరణించునాటికి బాల్యావస్థ దాటకుండెను. అతడు బాల్యావస్థ దాటినతరువాత జాజల్లదేవునితో నిగ్రహించి, పిమ్మట మధురాంతకదేవుని రణరంగమున నోడించి చంపెను.1 అది. శ. ౯౯౧ (క్రీ. శ. ౧౦౬౯) సంవ

(1) ఈ వృత్తాంతములు సోమేశ్వరుని కురుస్పాల్ శిలాశాసనమున దెలుపబడియున్నది. ఎ. ఇ. సం. ౧౦. పుట ౨౫.

శ్వర ప్రాంతమున జరిగియుండును. జాజల్లదేవుని వలన జరిగిన పరాజయపరాభవములకు ప్రతిక్రియ ఉన్నది. జాజల్లదేవుని యోడించి, అతడు జయించిన మండలముల నన్నింటిని వశపఱచుకొనెను. కలచురి జాజల్ల మొదటిదేవునివలన కొన్నికప్పములను గైకొనెను. అంత టమితబల పరాక్రమ సమన్వితుడై, ప్రాయశః కళింగ దేవేంద్రవర్మ సహాయమును ప్రేరణమునుగూడ కలిగి తన తండ్రిని యోడించి పరాభవించిన చాళుక్య రాజేంద్రచోడుడైన కులోత్తుంగునిపై పగ సాధించుకొనుటకు ప్రతిక్రియ చేయుటకు రాజరాజ-చోడగంగదేవుడు వేంగీశుడై యంధ్రభూమిని పాలించుచుండిన నాడు వేంగిపైకి దండెత్తివచ్చెను.[1] ఆవృత్తాంతము శ. ౧౦౧౧ సంవత్సరారంభమున (క్రీ. శ. ౧౦౮౯ మార్చి-ఏప్రిలు) జరిగియుండును. రాజరాజ – చోడగంగ దేవుడు సోమేశ్వరుని యెదిరించి నిలువజాలకపోయెను. ఆనాటి యుద్ధమునందు రాజరాజు తీవ్రముగ గాయపడి కొన్నిదినములకు మరణించియుండును.

చోడగంగదేవుని పరాజయాది వృత్తాంతములు వినవచ్చిన వెంటనే అభ్యుదయిగ కులోత్తుంగుడు కుమార వీరచోడుని వేంగికిబంపెను. అది వీరచోడుడు చోళదేశమునకు తిరిగివచ్చిన విదపయేటను (క్రీ. శ. ౧౦౮౯) జరిగెను. దీనిని బట్టిచూడ రాజరాజ-చోడగంగదేవుడు వేంగిని పూర్తిగా నైదుసంవత్సరములు పాలించియుండలేదని తెలియును. ఆతని రాజ్యకాలము శ. ౧౦౦౬-౧౦౧౦ సంవత్సరముల నడుమ (క్రీ. శ. ౧౦౮౪-౧౦౮౯) నడచెను. రెండవసారి వీరచోడుని వేంగికి బంపువేళ చక్రవర్తి కుమారుని "ప్రాప్తాపయత్వవరుదీచ్య జయాయ" అని బంపినట్లు పిఠాపుర తామ్రశాసనము దెలుపుచున్నది.[2] మరియు కొంతిచేత అనుదినమును నయనాభిరాముడైన వానిని యవ్వనమందున్న కుమారుని జూచుచు నిత్యము ఆనందము ననుభవించుచుండి యాతని విడువజాలకుండియు వేలుతెన్నుగానక చక్రవర్తి వీరచోడుని వేంగికిబంపెను. ఆ వాక్యమువలి యంతరార్థము రాజరాజ నామాంకితులైన పెద్దకుమారులు, చోడగంగ, ముమ్మడిచోడులు అప్పటికి మరణించిరని యూహింపవచ్చును. "తిరిగి యుత్తరదిశను జయించుటకు" అను మాటవలన, సోమేశ్వర, దేవేంద్రవర్మలు ఆంధ్ర కళింగములందు, ఉత్తరదిశయందు కొంతదేశమును ఆక్రమించినారని యూహింపవచ్చును.

వీరచోడు డంధ్రభూమి కేతెంచిన తరువాత, సోమేశ్వర, దేవేంద్రవర్మాదులు యుద్ధములుమాని స్వస్థానములకు బోయియుందురు. వీరచోడుడు క్రమముగా నపహృతరాజ్యభాగములను మరలజయించెను. వేంగీశ్వరుని కాశ్రితుడైన అనంతవర్మ చోడగంగని భయముదీర్చి, తిరిగి యాతని కళింగనగరమున పదస్థునిజేసెను. కళింగనగరమున మధుకేశ్వరుని గుడియందున్న వీరచోడుని శిలాశాసనము.[3] ఈ యూహకు గారణము. "శకవర్ష [ములు] ౧౦౧౪ నేట్టి శ్రీమదన న్తవర్మదేవర అపఘ్నమాన విజయరాజ్య సంవత్సరం ౧౭ నేట్టి విషుసంక్రాన్తినాండు శ్రీ మధుకేశ్వరదేవరకు వీరచోడదేవర నకరపువాడిపుర యేరివాకిలి ఉత్తరమునందాచంద్రార్కస్థాయిగాంబెట్టిన నైవేద్య భూమిపుట్లు ౭॥. ఇందలి విజయరాజ్యవర్షములు ౧౪ యగును. బంకొ గణిత పద్ధతిని ౧౭ యగును. ఏమయినను ఈ శాసనపు తేది, క్రీ. శ. ౧౦౯౨-౯౩ వ సెప్టెంబరు అగుచున్నది. ఆనాడు విషుసంక్రాంతి, అనగా తులాసంక్రాంతి యైనది. ఈ శాసనమునుబట్టియు, సోమేశ్వరుని కురుప్పాలు శిలాశకలశాసనమును బట్టియు నీ క్రిందివిధముగా నూహింపవచ్చును. వీరచోడుడు ఉత్తర వేంగీభాగమును, జయించి, దేవేంద్రవర్మ సోమేశ్వరులను కళింగమునుండి వెడలనడచి కళింగనగరమును ఆక్ర

---

1. సోమేశ్వరుని కురుప్పాలు (కృష్ణపురము) శిలాశాసనము (ఎ. ఇం. సం. ౧౦. పుట. ౨౫) నందీ వృత్తాంతములు వర్ణింపబడియున్నవి.

2. ఎ. ఇం. సం. ౫. పుట ౮౦. శ్లోకము. ౨౬. కాంతిన్నవామనుదినన్నయనాభిరామం పుష్టాంతమిందుమివ యం తరుణం నృపేంద్ర పశ్యన్నతృప్తనయనోప్యథ పంచమాష్టే ప్రాప్తాపయత్వనరుదీచ్య జయాయ సూనుమ్॥

3. S. I. I. Vol. V. NO 1005.

యించుకొని చక్రకూటాధీశుని శిక్షింపను సన్నాహముతో నుండెను. మధుకేశ్వరదేవరకు దానధర్మములు సమర్పించి అటుతరువాత శుభముహూర్తమున సోమేశ్వరునిమీదికి దండెత్తిపోయెను. ఇంచుమించుగా క్రీ. శ. ౧౦౯౩ వ సంవత్సరమున (శ. ౧౦౧౫) ప్రారంభమైన వీరచోడుని చక్రకూటదండయాత్ర అచిరకాలములో పరాజయముగా పరిణమించెను. బలదర్పముతో వచ్చిన వీరచోడుని సోమేశ్వరుడోడించి బరిమార్చెను.1 విజితద్విజయఫలితముగా ఆతడు "వీరచోళ సంహా(హో) ర కామః" అని బిరుదమును ధరించెను. ఉద్దండ ప్రతాపుడైన వీరచోడునితోపాటు ఒడ్డిరాయడైన అనంతవర్మకూడ జోడింపబడుటవలన ఎదిరించగల వీరుడు దురంధరుడు ఇంకొకడు లేనికతన సోమేశ్వరదేవుడు సాహసముతో విజయముగూర్చిన సేనతో వేంగిమీదికి నడిచి అర్జునుడు ఖాండవము దహించినట్లు వేంగీదేశమును, మహానదీ తటద్వయమధ్య రాజహంసవలెనున్న వేంగీదేశమును దగ్ధముజేసెను.2 దేశముతోపాటు, సోమేశ్వరదేవుడు ఆనాడు వేంగికి రాజధానియైన జననాథపురమును గూడ ధ్వంసముచేసియుండెనని యూహింపవచ్చును. వీరచోడుని మరణము శ. ౧౦౧౫ క్రీ. శ. ౧౦౯౩ నందు జరిగియుండును. ఆతల మరికొన్ని నెలలకు వేంగీదేశ దహనమును జరిగియుండును. కులోత్తుంగచోడదేవ చక్రవర్తికి ఆరీతిగా, ఆతని విజయరాజ్య వత్సరములు ౨౬ జరుగుచుండగా, సమర్థులు, ధీరులు, ధురంధరులైన కుమారులు ముగ్గురు, చోడగంగ, ముమ్మడి చోడ, వీరచోడులు, - వరుసగా, నిండు జవ్వనమందుండి, ఆహవరంగమున మడసిరి. చక్రవర్తికి ప్రతినిధియై వేంగీ సంరక్షణభారము బూనుటకు ఎదిగివచ్చిన తనయులు లేకుండిరి. మధురాంతకిదేవియందు చక్రవర్తికి వరుసగా నేడుగురు తనయులుదయించినను వీరచోడుని తరువాత వేంగీశ్వరత్వమును బూనుటకు, వేంగియందు తిరిగి రాజచాళుక్యవంశస్థాపిత యగుటకును దక్షుడైన తనయుడు ఆనాడు లేకపోయెను. ముప్పదిరెండేండ్లయిన నిండీ నిండని వీరచోడుని ఆకస్మికమరణముతో కులోత్తుంగుని ఆశలన్నియూ భగ్నములయ్యెను. వీరచోడుని యపజయమును, చావును, ఆంధ్రదేశపు చాళుక్యయుగ చరిత్రయందు ఒక ముఖ్యమైన ఘట్టము. ఆ విధముగా, కళింగమున రెండవటి యుద్ధము గడచెను. (సశేషం.)

1. *E. I. M. X. P.* 25. సోమేశ్వరదేవుని కురుస్పాల శిలాశాసనము.

2. [మహా] నదీ తటద్వయే
విభాతి రాజహంసవత్ ।
స వేంగిదేశ ఖాండవం
వ్యదీపయత్ కిరీటివత్ ॥.
కురుస్పాల శిలాశాసనము. శ్లో. ౭.



పరిణామగానం

శ్రీ పి. ఎస్. ఆర్. ఆంజనేయశాస్త్రి

★

శూన్య మానవుడను; శ్రమాశ్రు ప్రవాహ
వలయ మందున గుడిసుళ్లఁ బారి పడుదు
నో, పవిజ్వలత్కాఠిన్య తాపమగుచు
వెలుగుచున్ వేగి పోదునో విశ్వసృష్టి
ఏవైవిధ్యము నన్ను ముంచునో, లయాకృష్టమ్ముగా నేను గా
ఢా విశ్వాంతర వర్తి నౌదునో, ప్రమాదగ్రస్త తీవ్రాను భూ
తి వ్రాత మ్మొకటే విధాన నను క్రాంతి స్ఫులింగమ్ముగా
కావింపన్ బలిదానమే ఎదురుచుక్కై నిల్చి తీండ్రించునో.
ఈజగత్తున అడుగు పెట్టించి, దాని
క్రింద త్రవ్విన గోతులయందు పూడ్చి
యేడ్పు మనసుకు లేనని పించి నన్ను
మరల శూన్యమ్ములోనికే పంపగలరో
ఒత్తిడితోడ నాయెడద కూపిరి పేల్పులు చేతకాని ఆ
పత్తున త్రోసి, నిశ్చయము పల్చనచేసి, నికృష్ట దాస్యసం
పత్తికి పట్టభద్రుడన వత్తురొ; ఇష్టము వచ్చినట్లు పో
నిత్తురొ, చూచి చూచి పెకలింతురొ నాదు పురాతనాస్థికల్
వేదనలలోన శాంతిని విశ్వసించి
శాంతిలోపల వేదనా వీధి తెరచి
బ్రతుకు నొక తపనకు పాలుపరచి యెందు
కణువులను వ్రేల నిత్తురు?—
వెనుకటి చీము నెత్తురుల విచ్చిన పూవులు మాలగ్రుచ్చి యి
చ్చిన యెడ పుచ్చుకోను; నవజీవన మాశలు రేపి నన్ను లే
పినది సమాధి నిద్ర; కనిపించదొ క్రొత్తదనమ్ము నా
కనవసరమ్ము జీవనము: ఆ శిథిలాలకె ప్రాణ మిచ్చెదన్
శ్రమకయి దాచుకో నొడలు, చావునకైన తెగింతుగాని నా
శ్రమకు ఫలమ్ము జెంపక త్రోలంగను; యీ పరిణామ సామ్య గా
నము నెదిరించువారల మనస్సులు వ్రేల్చి విచిత్ర దాహశాం
తి మునిగి సృష్టికే యెసరు తెచ్చెద, శూన్యము మింగి త్రేన్చెదన్

చిన్న నవల:

అల్పజీవి



శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

"సుబ్బయ్య సుందరుడు కాడు"

అది సుబ్బయ్య అభిప్రాయం.

"సుబ్బయ్య ఒట్టి చచ్చు పెద్దమ్మ"

అదీ సుబ్బయ్య అభిప్రాయమే.

సుబ్బయ్యకి జమీందారీ లేదు.

అది అతని భార్య సావిత్రికి కోపకారణం.

"సుబ్బయ్య వంగిరిపింగిరి గాడు"

అని సావిత్రి అన్నగారయిన వెంకట్రావు అంటూవుంటాడు.

"నాన్న చాలా మంచివాడు"

సుబ్బయ్య ప్రథమ పుష్పం కమల అలా చెప్తుంది.

"నాన్నకి అమ్మనిచూస్తే భయం"

సుబ్బయ్యకొడుకు కృష్ణుడు కని పెట్టినవిషయం అది.

"సుబ్బయ్యా ఈజ్ వెరీ ఇనెఫిషియన్ట్"

సుబ్బయ్యగురించి ఆఫీసులో హెడ్ క్లార్కు 'పాస్' చేసే "రిమార్కు" అది.

"సుబ్బయ్య పాపం ఒట్టి భయస్తుడు"

అది అనేకమంది అనేమాట.

సుబ్బయ్యకి సుమారు ముప్ఫయ్యయిదు సంవత్సరాలవయసు ఉంటుంది. పొడవూ కాకుండా, పొట్టీ కాకుండా సన్నగా పల్చగా ఉంటాడు. అతని ముఖంలో ఏభాగమూ కూడా స్ఫుటంగా అవుపించదు. కాని, దేనికదిచూస్తే కళ్ళూ ముక్కూ నోరూ తీరుగానే ఉంటాయి. అతని జుత్తు చాలా నల్లగా పొడవుగా ఉంటుంది. కొద్దిగా అతన్లో స్త్రీలలో ఉండే కోమలత్వం కన్పిస్తుంది.

సుబ్బయ్యకి అన్నీ భయాలే.

పులుసులో "ఉప్పు జాస్తీగాఎందుకు వేసేవు?" అని ఇంట్లో సావిత్రిని అడగలేడతను. బైట బజార్లో కూరగాయల మనిషితో బేరం ఆడ్డానికి సందేహిస్తాడు. అవసరంవచ్చినా ఆఫీసులో సెలవు అడగడాని కతను అనుమానిస్తాడు. చేతిలో దమ్మిడీ లేకపోయినా అతను ఎవ్వర్నీ అప్పు అడగలేడు. వచ్చే నూటయాభై రూపాయిల జీతం ఎక్కడ నెల ముందుగా ఖర్చయిపోతుందో అని అతిజాగ్రత్తగా వాడుకుంటాడు.

సుబ్బయ్యకి "అధికారం" అంటే హడల్. పెద్దపెద్ద ఉద్యోగస్తులు, పోలీసులు, వగైరాలతో సంబంధం లేకుండా కాలక్షేపం చేద్దామని అతని ఉద్దేశం. పెద్ద ఆఫీసుల్లో డవాలా బంట్రోతుల్ని సమేతం అతను భయంతో చూస్తాడు.

చట్టాన్ని ఎన్నడూ అతిక్రమించిన పాపాన్న పోలేదు సుబ్బయ్య. ట్రెయిన్‌లో టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసేవార్ని చూసి సుబ్బయ్య చాలాఆశ్చర్యపడతాడు. ఒక్కసారయినా అతను చిన్నతనంలో క్లాసులు ఎగ్గొట్టలేదు. సెలవు లేకుండా ఆఫీసుకి వెళ్ళడం ఎప్పుడూ మానెయ్యలేదు. సుబ్బయ్య, అనవసరంగా ఎవ్వరిజోలికీ పోడు. ఎవరితో అయినాసరే తగువంటే అతనికి తెగభయం. అందరితో మంచిగా ఉంటేనేగాని ఈ జీవితం గడపటం కష్టమని అతని నమ్మకం. అందరితో మంచిగా ఉండాలనేది అతని ఆశయం. అందుచేత ఎవర్నయినా పలకరించేముందు అతను కొంచెం మందహాసం చేస్తాడు. అలా అతను చెయ్యడం పైవాళ్ళకి కొంచెం వెకిలిగా ఉన్నట్టు అవుపిస్తుంది.

సుబ్బయ్య తండ్రి పేరు సోమయ్య. అతనికి మొదటిభార్యవల్ల సుబ్బయ్య కలిగేడు. అతగాడికి

ఏ ఉద్యోగమూ ఉండేది కాదు. ఉన్న కొద్దిపాటి భూమిమీదా ఏదో వస్తే అతను దాన్తో కాలక్షేపం చేసేవాడు. ఆ భూములు అతను చనిపోకముందే పోయేయి. ఒక్కడే కొడుకు అవడంచేత సుబ్బయ్యని చాలా ముద్దుగా అతను పెంచేడు. తండ్రి నీడపట్టున పెరిగేడు సుబ్బయ్య.

సుబ్బయ్య తన తల్లిని ఎరగడు. ఆవిడ క్షయ వ్యాధివల్ల చనిపోయింది. తనతల్లి 'ఇలా ఉంటుంది' అని తెలుసుకుందికైనా వీలులేకపోయింది. సుబ్బయ్యకి ఆవిడఫోటోకూడా లేకపోడంచేత. ఆవిడ గురించి సోమయ్య ఏసంగతీ కొడుకుతో చెప్పలేదు. కాని, తనతల్లి దేవతలతో సమానమనీ, ఆవిడవంటి ఉత్తమురాలు ఎక్కడా ఉండబోదనీ, అకారణంగా ఆవిడ ఎన్నో కష్టాలు పడిందని ఊహించుకొంటూ ఉంటాడు సుబ్బయ్య. ఆవిడ తలపుకి వచ్చినప్పుడల్లా అతనికళ్లు చెమ్మగిల్లుతూ ఉంటాయి.

సుబ్బయ్య పదిహేనోయేట స్కూల్ ఫైనల్ పాసయేడు. పద్దెనిమిదేళ్లు నిండగానే ఉద్యోగంలో ప్రవేశించేడు. అతనికి పద్దెనిమిదేళ్లు నిండకుండానే సోమయ్య చనిపోయేడు. చిన్నప్పటినుంచీ ఒక్క తండ్రినే ఎరగడంచేతా, ఆ తండ్రి తన నెంతో గారాబంగా చూడ్డంచేతా, ఆ తండ్రిపడ్డ కష్టాల్ని తను కళ్లారా చూడ్డంచేతా, సుబ్బయ్యకి తండ్రియందు విపరీతమైన గౌరవం, అభిమానం. తండ్రిని తల్చుకున్నప్పుడల్లా సుబ్బయ్యకి సంతోషం, బాధాకూడా కలుగుతాయి. తండ్రిని సుఖపెట్టలేకపోయానే అని కించపడుతూ ఉంటాడు.

మానవుడికి భయం సహజం. కాని, భయం అనేది సుబ్బయ్యలో ఎక్కువ మోతాదులో ఉంది. దానికి కారణం ఇదమిత్థమని చెప్పడం కష్టం. సుబ్బయ్యకి అయిదోయేడు నడుస్తున్నప్పుడు సోమయ్య ద్వితీయ వివాహం చేసుకున్నాడు. అతని రెండవ భార్య చాలా వికృతంగా ఉండడమేకాకుండా చాలా క్రూరంగా ఉండేది. ఆవిణ్ణి మొదటిసారి చూడగానే సుబ్బయ్య జడుసుకొని తండ్రిచుట్టూ చేతులు వేసి గట్టిగా పట్టుకునిల్చుండిపోయేడు. వచ్చిన మర్నాడే ఆవిడ సుబ్బయ్యని కొట్టింది. అప్పటినుంచీ ప్రతిరోజూకూడా కొట్టేది. లేతవయసులో, ఆమె ఉన్నన్నాళ్లూ, సుబ్బయ్యపడ్డ మనోవేదన, యాతన ఇంతా అంతా అని చెప్ప వీలులేదు. ఆవిడ ఒక్క సంవత్సరంమాత్రం సోమయ్యతో కాపురం చేసింది. తరువాత ఆవిణ్ణి పక్కింటి పెద్దమనిషి లేవదీసుకుపోయేడు. అందుగురించి అటుపిమ్మట పక్కింటి పెద్దమనిషి తప్పించి ఇంకెవ్వరూ విచారించలేదు. ఆవిడ వెళిపోయినప్పటికీ సుబ్బయ్యలో ప్రవేశించిన భయంమాత్రం అలానే ఉండిపోయింది.

జీవితాన్ని చూస్తే సుబ్బయ్యకి భయం బాగా నాటిపోడానికి కారణం చెప్పలేం. కాని అతని జీవితంలో ఇంకొక సంఘటన జరిగింది.

అప్పుడు సుబ్బయ్యకి ఆరుసంవత్సరాలు.

ఒకరోజు సోమయ్య ఎక్కడికో వస్తున్నాడు. అతనిచెయ్యి పట్టుకొని సుబ్బయ్య నడుస్తున్నాడు. బాగా రాత్రయింది. బాగా చీకటిగా ఉంది. రోడ్డుమీద జనసంచారం లేదు. తనూ, తండ్రీ ఎందుకు ఎక్కడికి వెళ్తున్నారో సుబ్బయ్యకి తెలియదు. తండ్రిచెయ్యి పట్టుకొని బితుకూ బితుకూ నడుస్తున్నాడు. నాలుగు కుక్కలు గట్టిగా మొరుగుతున్నాయి. రెండు గాడిదలు తొందరతొందరగా పరిగెడుతున్నాయి. చిన్న చినుకుకూడా పడడం ప్రారంభించింది.

ఎవరో ముగ్గురు మనుష్యులు వచ్చేరు. ఎక్కడ నుంచి అంత అకస్మాత్తుగా వచ్చేరో తెలియదు. ముగ్గురూ మూడుదైత్యుల్లా నిల్చున్నారు.

తండ్రిచేతిని ఇంకా గట్టిగా పట్టుకున్నాడు సుబ్బయ్య.

తండ్రి చెయ్యి వణుకుతోంది!

ఒక్కసారిగా సుబ్బయ్యని ఎత్తుకున్నాడు సోమయ్య. ఎత్తుకొని పారిపోబోయేడు. వాళ్లు ముగ్గురూ ఎటకారంగా నవ్వేరు. వెళ్ళకుండా అడ్డగించేరు. సోమయ్యని బూతులు తిట్టేరు. సుబ్బయ్యని ఒకడు బలంగా మోటుగా లాగి పక్కకి తోసేశాడు. కేక వెయ్యడానికైనా సుబ్బయ్యలో శక్తిలేకపోయింది. రాళ్లకుప్పమీద పడ్డాడు. తలకి దెబ్బ తగిలింది. స్మృతిమాత్రం తప్పిపోలేదు.

“అమ్మో! నాయనో!” అని ఎవరో బాధతో భయంతో కేకలు వేస్తున్నారు.

మనిషిని కొడుతున్న చప్పుడు అవుతోంది.

సుబ్బయ్యకి చీకట్లో ఏమీ కనిపించడంలేదు. కాని, తండ్రిని వాళ్లెవరో కొడుతున్నారనీ, అతను నొప్పితో కేకలు వేస్తున్నాడనీ తెలుసుకున్నాడు.

సుబ్బయ్య గుండెలు నీరయిపోయేయి.

భయంతో, దుఃఖంతో లేచి కూర్చొని ఏడ్చేడు.

ఇంతలో ఏవో భూతాల్లా పరుగులుతీస్తూ వచ్చేయి.

మరికొంత గట్టిగా కేకలు. అరుపులు. గాడిద కూతలు. కుక్కల మొరుగులు.

ఈలలు!

ఇంతలో ఈలల చప్పుడు. ఈలలు వినిపిస్తున్నాయి. దగ్గరపడుతున్నాయి.

అంతే.

తరువాత ఏం జరిగిందో సుబ్బయ్యకి జ్ఞప్తిలేదు. ఈ సంఘటన సుబ్బయ్యజీవితంలో చాలా భయంకరమైనది. అలా ఎందుకు జరిగిందో అతనికి కారణం తెలియదు. సోమయ్య అతడితో చెప్పలేదు. ఆ దృశ్యం ఇంకా అతని కళ్ళకి కట్టినట్లుంటుంది. ఒక్కొక్కప్పుడు అర్ధరాత్రి అకస్మాత్తుగా నిద్రలేచి కూర్చుంటాడు.

"నాన్నని ఎవరో కొడుతున్నారు! చంపేస్తున్నారు!" అనిపిస్తుందతనికి.

చీకట్లో కన్నీరు కారుస్తాడతను.

రాత్రివేళ చీకట్లో ఎక్కడికైనా ఒంటరిగా వెళ్ళడానికి సాధారణంగా భయపడతాడుసుబ్బయ్య. కాని తన పిరికితనానికి కారణం తెలియదతనికి.

"పిరికిపంద" అనుకొంటూవుంటుంది సుబ్బయ్యగురించి సావిత్రి.

సావిత్రికి దగ్గరదగ్గర ముప్ఫై సంవత్సరాలుంటాయి. ఆవిడది అందమైన విగ్రహం. పొడవుగా నాజూగ్గా ఉంటుంది. ఆవిడ నేత్రాలు విశాలంగా ఉంటాయి. "మావాళ్ళందరివీ పెద్దకళ్లు" అని చెప్తూ ఉంటుందావిడ. "మా వంశంలో ఎక్కడా పిరికితనం లేదు" అనికూడా అంటూ వుంటుంది. ఆవిడ తండ్రి తాతలు జమీందార్లు. ఆమెతాత గణించినదంతా, ఎలక్షనులు, త్రాగుడు, జూదం, వ్యభిచారం ఇత్యాదులక్రింద ఆమెతండ్రి తగలెట్టేశాడు. ఆమెతండ్రి చనిపోయేప్పటికి వారికి అప్పుతప్ప ఆస్తేమీ మిగల్లేదు. సావిత్రి చాలా చిన్నపిల్లఅప్పుడు. ఆతరువాత ఒకసంవత్సరంలోనే ఆమెతల్లికూడా చనిపోయింది. సావిత్రిని పెంచి పోషించి పెళ్ళిచేసే పూచీ అంతా ఆమె అన్న వెంకట్రావుమీద పడింది. అప్పటికి అతనుకూడా చిన్నవయసులోవాడే. కాని ధైర్యం వహించి ముందుకి నడిచేడు.

ఆడపిల్లకి పెళ్లి ప్రధానం అనే ఆలోచనతోనే కాకుండా ఆలస్యం అయినకొద్దీ ఆడపిల్లకి పెళ్లవడం కష్టమని గుర్తించి సావిత్రికి ఇంకా యుక్తవయసు రాబోతూ ఉండగానే ఆమెని సుబ్బయ్యకి ఇచ్చి వివాహం చేసేడు వెంకట్రావు.

సుబ్బయ్యకంటె వెంకట్రావు వయసులో పెద్దయినప్పటికీ ఇద్దరూ ఒకే క్లాసు చదివేవారు. సుబ్బయ్య మెత్తనివాడనీ, జాగ్రత్తగా కాలక్షేపం చేసే మనిషనీ వెంకట్రావుకి తెలుసు. సుబ్బయ్యకి ఉద్యోగం అయిందని తెలియగానే "మా చెల్లెల్ని చేసుకుంటావా?" అని సుబ్బయ్యని అడిగేడు.

వెంకట్రావు అలా అడగ్గానే సుబ్బయ్యకి చాలా గాభరా కలిగింది. వెంకట్రావు అంతస్తు తన దానికంటె చాలా ఎక్కువని సుబ్బయ్య అభిప్రాయం. అటువంటి కుటుంబంలోని ఆడపిల్లని తను పెళ్లాడగలనని అతను ఎప్పుడూ ఊహించి ఉండలేదు. అందుచేత వెంకట్రావు అడిగిన ప్రశ్నకి సంభ్రమాశ్చర్యాలతో 'సరేసరే' అన్నాడు.

సావిత్రికి అప్పటికి పదమూడుసంవత్సరాలు దాటేయో లేదో. కాని అప్పటికే బాగా ఏపరిగా ఉండేది. వయసు తక్కువే అయినా బుద్ధిలో, ఊహల్లో ఆమెది పెద్దవయసు.

పెళ్లిలో తప్పించి అంతకుముందు ఆమె సుబ్బయ్యని చూడలేదు. సుబ్బయ్యకూడా అంతే. పెళ్లిలో పీటలమీద ఆమెనిచూసినప్పుడు అంతటి అపురూప సౌందర్యవతిని తనకి కూర్చినందుకు సుబ్బయ్య భగవంతుడికి నమస్కారం చేశాడు.

సుబ్బయ్యని చూడగానే సావిత్రి ఆరీతిగా ఎట్టి నమస్కారాలూ చెయ్యలేదు.

సుబ్బయ్యని చూడగానే "ఇతనా నాకు పెనిమిటి" అనుకొంది ఆమె.

అంతవరకూకూడా ఆమె ఏ రాజకుమారుడిలాంటివాడ్నో పెళ్ళాడుతానని అనుకొనేది. ఆమె కంటికి సుబ్బయ్యలో రాజచిహ్నాలేవీ కనిపించలేదు. ఆమెని చిన్నతనంలో షికారుకి తీసుకువెళ్ళడానికి ఓ 'ఆయా' ఉండేది. ఆయాకి ఒక కొడుకు ఉండేవాడు. సుబ్బయ్యని చూసినవెంటనే సావిత్రికి ఆయాకొడుకు స్ఫురణకి వచ్చేడు. ఆయాల పిల్లలుకూడా మనుష్యులే అనుకొనే వ్యక్తి కాదామె. అందుచేత ఆమెకి సుబ్బయ్యయందు ఎట్టి గౌరవమూకూడా లేకుండాపోయింది. తనలాంటి జమీందార్లపిల్లని

పెళ్ళాడ్డానికి సాహసించినందుకు సుబ్బయ్యని ఆమె క్షమించలేదు.

సుబ్బయ్యకూడా సావిత్రికి తను తగనని అభిప్రాయం అదిలోనే కలిగింది. అందుచేత సావిత్రి ఎడల చాలా భయభక్తుల్తో మసుల్తాడు.

సుబ్బయ్యకి ఉద్యోగం అంటూ ఒకటి ఉంది.

"ఈ ఉద్యోగమే లేకపోతే నేను చిల్లిగవ్వకి మారకపోయి వుండును" అనుకొంటూ వుంటాడు సుబ్బయ్య. డబ్బు సంపాదించేమార్గాలు అతనికి చాలా తక్కువ తెలుసు. అందుచేత, డబ్బు సంపాదించే వాళ్ళయందు అతనికి చాలా గౌరవం.

సుబ్బయ్య ఆఫీసులో పని జాగ్రత్తగానే చేస్తాడు; గాని చాలా నెమ్మదిగా చేస్తాడు. అందుచేత ఆఫీసులో అంతా అతనిమీద విసుక్కుంటూ వుంటారు. ఆఫీసర్లతో అతను భయంవల్ల సరిగ్గా మాట్లాడలేడు. వారడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పడానికి అతను తడబడతాడు.

కోపదారి ఆఫీసరు ఒకాతను సుబ్బయ్య వసుసుకొంగారుమాని "నువ్వు చాలా ఇనెఫిషియన్ట్‌గా కనిపిస్తున్నావు. రేపట్నించీ డెస్పేచ్ సెక్షన్కి ఫో" అని కసిరేసేడు. అప్పటినుంచీ కొన్ని సంవత్సరాలు సుబ్బయ్య డిస్పేచ్ సెక్షన్లో పనిచేసేడు. ఆ సెక్షన్లోది చాలా బండపని. కాని, మిగతా 'సెక్షన్స్'లో కంటె పూచీ కొంచెం తక్కువ. తెలివితేటలు ఉపయోగించవలసిన అవసరం లేదు.

ఆఫీసుకివచ్చే ఉత్తరాలన్నీ సుబ్బయ్య 'రిసీవ్' చేసుకుంటాడు. రోజూ వచ్చే ఉత్తరాలు చాలా ఉంటాయి. ఓ పుస్తకంలో వాటి తాలూకు నంబర్లు తారీకులు వగైరాలన్నీ 'ఎన్టర్' చేస్తాడు. తరువాత అవన్నీ హెడ్ క్లార్కుకి ఇస్తాడు. అతను వాటిమీద ఏది ఏ సెక్షన్కి ఇవ్వాలో 'నోట్' చేశాక అవి ఆయా సెక్షన్లకి పంపి దస్కత్తు పుచ్చుకోవడంతో అందుకు సంబంధించినపని పూర్తయిందన్నమాటే.

పైకి పంపవలసిన ఉత్తరాలుకూడా చాలా ఉంటాయి; ముఖ్యంగా నెల ప్రారంభంలోనూ, చివర్లోనూ. వాటినంబర్లు, తారీకులు, ఏయేఆఫీసుకి పంపవలసినదీ వగైరాలన్నీ మరొకపుస్తకంలో సుబ్బయ్య 'ఎన్టర్' చేస్తాడు. ఉత్తరాలన్నీ కవర్లలో పెట్టాలి, కవర్లమీద స్టాంపులు అంటించాలి, అడ్రస్లు రాయాలి, ఏ లెటర్కి ఎంత స్టాంపు అయిందో పుస్తకంలో నోట్ చేయాలి, నిలవ ఎన్ని రూపాయాల స్టాంపులు ఉన్నాయో లెక్క తేల్చాలి. ఉత్తరం రిజిస్ట్రీ చేసినట్లయితే, రశీదూ, తిరుగు రశీదూకూడా పుస్తకంలో అంటించాలి. ఒకప్పుడు ఏ ఉత్తరమైనా తప్పు చిరునామాకి పంపినట్లయితే అది తిరిగి వస్తుంది. అటువంటప్పుడు హెడ్ గుమాస్తా కేకలు వేస్తాడు.

మొత్తంమీద డిస్పేచ్ సెక్షన్ పని చాలా బండపని.

కాని 'ఇదే బావుంది' అనుకొనేవాడు సుబ్బయ్య.

తరువాత—

కొత్త 'హెడ్ క్లార్కు' వచ్చాక సుబ్బయ్య అక్కౌంట్సు సెక్షన్లోకి మారేడు.

కొత్త హెడ్ గుమాస్తా పేరు రామస్వామి. అతనిది ఫలానా వూరు, ఫలానా దేశం అని చెప్పడం చాలా కష్టం. అతను తెలుగు స్వచ్ఛంగా మాట్లాడుతాడు. అరవం మాట్లాడితే అరవ్వాడే అనుకోవచ్చు. అతనికి మళయాళీభాష బాగావచ్చు. కన్నడంలో అతనికి ప్రవేశం ఉంది. అతనికి సైత్వ హిందీ వచ్చు. అతను చాలా తెలివైనవాడని అంతా అంటారు. అతను అఫీసులో ఎవ్వర్నీ నమ్మడు. అందర్నీ భయంలో ఉంచాలని అతని 'పాలిసీ'. అనువైనవాళ్ళచేత అరవ చాకిరీ చేయిస్తూ ఉంటాడు. అనువైనవాళ్ళని కసరడం కూడా అతనికి అలవాటు.

రామస్వామి వచ్చిన కొద్దికాలంలోనే సుబ్బయ్యకి అక్కౌంట్సు సెక్షన్లోకి మార్పు వచ్చింది. మార్పుకి కారణం తెలిసినవాళ్ళెవరూ ఆశ్చర్యపడలేదు అందుగురించి. సుబ్బయ్యమాత్రం చాలా ఆశ్చర్యపడ్డాడు. ఆశ్చర్యపడ్డంకంటె హెచ్చుగా భయపడ్డాడు.

అక్కౌంట్సు సెక్షన్లో చిక్కులు చాలా ఉన్నాయి. కంట్రాక్టర్లబిల్సు చెక్ చెయ్యడం ముఖ్యమైనపని. అందులో చాలా జాగ్రత్తగా ఉండాలి. కంట్రాక్టర్లు ఒకవైపు పీకుతూ ఉంటారు. ఆశపెడుతూ ఉంటారు. బిల్సు సరిగా చెక్ చేయకపోతే ప్రమాదం ఉంటుంది. అందులోనూ ఆ పని సుబ్బయ్యకి కొత్త. కాని ఏదో తంటాలుపడుతూ వస్తున్నాడు.

సుబ్బయ్యచేసేపని, అంతకుముందు అవధాని చేస్తూ ఉండేవాడు.

వయస్సులో అవధాని ఆఫీసులో చాలామంది కంటె పెద్ద. అయినా, ఆఫీసులో కొత్తగా ప్రవేశించినవాళ్లకూడా అతనితో చిరపరిచయుల్లాగ వ్యవహా

రిస్తూ చనవుగా ఉంటారు. అతనికి దాదాపు యాభై సంవత్సరాలు ఉంటాయి. అతనితలమీద జుత్తు లేనే లేదు. అతన్ది పెల్లమూపు. అతని చెవలకి ఎర్రపాళ్ల తమ్మెట్లు ఉంటాయి. అతనినోరు చాలా పెద్దది. గొంతుకకూడా పెద్దదే. అతని ముఖమంతా గంట్లు గంట్లుగా ఎర్రగా ఉంటుంది. లావూ కాకుండా సన్నం కాకుండా ఉంటుంది అతని శరీరం. ఎత్తు సుమారుగా ఉంటుంది.

అవధానిదగ్గర డబ్బు మూలుగుతోందనే వాడుక ఒకటున్నాది. "పిల్లా పాపా లేరుకదా, ఏం చేసుకుంటావయ్యా, అంతడబ్బూ" అని అతణ్ణి చాలామంది అడుగుతూ ఉంటారు. "కట్టుకున్నదానికి లేకపోతే సరా" అంటాడు జవాబుగా అవధాని. వివాహం చేసుకోకముందునుంచీకూడా అతను వేరే ఓ మనిషిని ఉంచుకున్నాడు. ఆమెవల్ల అతనికి చాలా సంతానం ఉంది. వాళ్లంటే అతనికి చాలా అభిమానం. అతనేకాకుండా అతనిభార్యకూడా వాళ్లయందు మక్కువతో ఉంటుంది. అందుగురించి చాలామంది విడ్డూరంగా చెప్పుకుంటారు.

అవధాన్ని చూస్తే ఆఫీసులో పనిచెయ్యడానికే పుట్టేడా అనిపిస్తుంది. అతనికి ఆఫీసులో ఉంటేనే ఇంట్లో ఉన్నట్టు ఉంటుంది. ఆఫీసులో అన్నిశాఖల పనీకూడా అతనికి బాగా తెలుసు. అందుచేత ఆఫీసులో ప్రతివారికీ అతనియందు అదోక తరహా గౌరవం ఉంది.

"మామూళ్లు" పుచ్చుకోడంలో అవధాని నిర్మొహమాటంగా ఉంటాడు. అందుకే అతనికీ రామస్వామికీ పేచీ వచ్చింది. అతనికీ రామస్వామికీ మొదటినుంచీ సరిపడలేదు. ఇద్దరూ డబ్బుదగ్గర దొంగలే అన్న విషయం ఇద్దరికీ తెలుసు. అవధాని అక్కౌంట్సుసీట్లో ఉంటే మామూళ్లలో తనకి వంతు రానేరాదని రామస్వామి వచ్చినవెంటనే గ్రహించేడు. కాని అవధాన్ని కదల్చడం వెంటనే సాధ్యం కాలేదు. ఇంతలో రామస్వామి అదృష్ట వశాత్తూ అతనిబంధువే ఒకఅతను ఆక్టింగ్ గా ఆఫీసరయేడు. అతని హయాంలో అవధాని సీటు మారింది.

సీటు మారినందుకు అవధాని ఏమీ చింతించ లేదు. డిస్పేచ్ సెక్షన్లోకూడా డబ్బు చేసుకొనే నేర్పు అతనికి ఉంది. అదిగాక, త్వరలోనే తిరిగి మామూలు సెక్షన్కి రాలేకపోతానా .అనే ధైర్యం ఉందతనికి.

సుబ్బయ్యకి మామూళ్లు పుచ్చుకోడంలో నేర్పు లేదు. పుచ్చుకోడానికి ధైర్యంలేదు. అందుకే అతణ్ణి అక్కౌంట్సు సెక్షన్లోకి రామస్వామి లాగేడని ఆఫీసులో అందరికీ తెలుసు. సుబ్బయ్యకూడా త్వరలోనే తన 'సీటు' మార్పుకి కారణం తెలుసుకున్నాడు.

"సరే! నాకెందుకు ఆగొడవంతా? నాపనేదో నేను చూసుకొని వచ్చేస్తాను. నా జీతపురాళ్లు నాకు రాక మానవు"

అనుకున్నాడు సుబ్బయ్య.

2

వేసవికాలం.

ఉదయం.

వేసవికాలంలో ఒకరోజు ఉదయం ఏడు గంటల సమయంలో సుబ్బయ్యఇంటికి వెంకట్రావు వచ్చేడు.

ఇంట్లో ఉన్న ఒక్క కుర్చీలో కూర్చోకుండా వీధివరాండాలో నిల్చొని కాఫీనీళ్ళు తాగుతున్నాడు సుబ్బయ్య.

ఇంటిలోపలిభాగంలో ఉండడానికి సుబ్బయ్య సాధారణంగా ఇష్టపడడు. సావిత్రిని పెళ్ళిచేసికొని పదిహేనుసంవత్సరాలు దాటినా ఆమెకి ఇంకా అలవాటుపడలేదతను. ఆమెతో ఏం మాట్లాడ్డానికీ తోచదతనికి. అందుచేత తరచు వీధి వరాండాలో కూర్చుంటూ ఉంటాడు. అలా కూర్చొని వచ్చి పోయేవాళ్ళని చూస్తూ ఉండడం అతనికి అలవాటు.

వీధిలో అన్నివేళలా అనేకమంది వెళ్తూ ఉంటారు. నడుచుకుపోతూ ఉంటారు. వాహనారూఢులయి వెళ్తూ ఉంటారు. ఆడా మొగా, చిన్నా పెద్దా, గొప్పా బీదా అనేకతరహాల మనుష్యులు ప్రవాహంలా పోతూ ఉంటారు. వాళ్లందర్నీ చూస్తూంటే సుబ్బయ్యకి ఎంతో ఆనందంగా ఉత్సాహంగా ఉంటుంది.

సుబ్బయ్య ఆవూరు వచ్చి మూడుసంవత్సరాలయింది. ఈ మూడేళ్లలోనూ రోడ్డుమీద పోయేవారి ననేకమందిని అతను బాగా గుర్తెరుగును. వాళ్లెవరో, ఏంపనిచేస్తున్నారో, రోజూ ఎందుకు అలా వెళ్తారో అతనికి తెలియదు. వీధిలో పోయేవారిగురించి ఎవరికి మాత్రం ఏమంత తెలుస్తుంది? అయినా వాళ్ళల్లో

అనేకమందిగురించి అతనేదో ఊహించుకొంటూ ఉంటాడు. వాళ్లగురించి చిత్రమైన కథలు కల్పించుకొంటూ ఉంటాడు. వారిలో కొందరు అతనికి ఇష్టమైనవారున్నారు. కొందర్ని చూస్తే అతనికి చాలా అయిష్టం. వారిలో కొందరు ముఖ్యులున్నారు. కొంతమంది ఒక్క సాయంకాలమే సుబ్బయ్య ఇంటి ముందునుంచి వస్తారు. కొందరు పొద్దుటా సాయంత్రమూకూడా అవుపిస్తారు. ఎవరెవరు ఏయే వేళల వస్తారో సుబ్బయ్యకి బాగా గుర్తు. వాళ్ళందరి గురించీ ఆలోచిస్తూ, కథలు కల్పించుకొంటూ వీధి వరాండాలో సిగరెట్టు కాలుస్తూ కూర్చుంటే సుబ్బయ్యకి పొద్దుపోతుంది.

సుబ్బయ్యకి, ఆరీతిగా రోజూ కనిపించే వారిలో నలుగుర్ని చూస్తే ఎక్కువ ఇష్టం.

నలుగుర్లోనూ ఒకామె సరిగా ఏడుంపావుకి బజారువైపు వెళ్తుంది. ప్రతిరోజూ ఉదయం ఆ సమయానికే వెళ్తుంది. సుబ్బయ్యకి ఆమెని చూస్తే ఇష్టం. ఆమె ఎవరో అతనికి తెలియదు. ఆమెపేరు అంతకంటే తెలియదు. కాని తనే ఆవిడకి "ఎర్రచీర మనిషి" అని నామకరణం చేసేడు. అందువల్ల ఆమె ఎప్పుడూ ఎర్రచీరే కట్టుకుంటుందనుకోకూడదు. సుబ్బయ్య ఆవూరువచ్చిన కొత్తలో ఆమెని ఎరుపు రంగుచీరతో చూసేడు. ఆమె ఎందుకోగాని అతణ్ణి ఆకర్షించింది. తరువాత నాలుగైదు రోజులుకూడా ఆచీరే కట్టుకొని వెళ్ళింది, ఆమె. లెక్క పెడదామని అనుకోకుండానే సుబ్బయ్య లెక్క వేశాడు. ఆ ఒక్క చీరా ఆవిడ సరిగా ఇరవై రెండుదినాలు కట్టుకొంది. అప్పటినుంచీ ఆమెని ఎర్రచీరమనిషిగానే గుర్తించుకున్నాడు సుబ్బయ్య. ఆమె చాలా దరిద్రురాలిగా అవుపిస్తుంది. కొస్త సన్నగా పొడవుగా ఉంటుంది. పెద్దకొప్పు సన్నగా నీటుగా ఎప్పుడూ ముడుచుకొంటుంది. ఆమెవయసు పాతికేళ్ళపై చిలుకు ఉండవచ్చు. మనిషి చూడ్డానికి చాలా బావుంటుంది. ఆవయసుస్త్రీలలో ఉండవలసిన బిగి ఆమెలో లేకపోయినా బలంగానే ఉంటుంది. ఆమె ముఖంలో వికాసం అవుపించదు. రోడ్డుమీద ఎవ్వరితోకూడా ఆమె మాట్లాడ్డం సుబ్బయ్య చూడలేదు. ఆమె చేతిలో ప్రతిరోజూ ఓ మాసిన చిన్న సజ్జా ఉంటుంది. ఆ సజ్జా ఆమెఎప్పుడూ ఎడంచేత్తోనే పట్టుకొంటుంది. సుబ్బయ్యఅనుకోడం ఆమెఎక్కడో ఎవరింట్లోనో పనిమనిషిగా ఉందని. ఆమె భర్త 'మిలిటరీ'లో ఉన్నాడని అతను అనుకుంటాడు. భర్తదగ్గర్నుంచి ఉత్తరాల్లేవు. బతికి ఉన్నాడో లేదో తెలియదు. ఇంట్లో ఓ జబ్బు కొడుకు. చిన్నపిల్లడు, వాడు. వాడికోసం కష్టపడుతోంది. భర్తరాకకోసం నిరీక్షిస్తోంది. అతను ఎంతకీ రాకుండా ఉన్నాడు. ఆమె చాలా శ్రమకి పాలవుతోంది. ఆమె అందం అంతా అడవిగాచిన వెన్నెల అవుతోంది. అనేకమంది మొగవాళ్లు ఆమెని పొందడానికి రమ్మని ఆహ్వానిస్తున్నారు. అందర్నీ నిరాకరిస్తోందామె. జబ్బుతో ఉన్న కొడుకు పెద్దవాడయి గొప్పవాడవుతాడని ఆశిస్తోంది. నిజంగా వాడు చాలా గొప్పవాడవుతాడు. అప్పుడు ఆమెచుట్టూ అంతా చేరుతారు. గర్వం లేకుండా అందర్నీ ఆదరిస్తుంది ఆమె.

ఆమెని చూస్తే సుబ్బయ్యకి నిజంగా చాలా ఇష్టం. మిగతావారిలో ఒకతనుఅరవయ్యేళ్ళ వృద్ధుడు. అతను చాలా పొడవుగాఉండి చాలా నిటారుగా నడుస్తాడు. చాలాఆరోగ్యంగాఉన్నట్టు అగుపిస్తాడు. దట్టంగా పొడవుగా ఉండే నెరసిన గడ్డం అతన్ది. పండిన గరజాల జుత్తుపైన తెల్లటివంక తలపాగా చుట్టుకుంటాడు. అతను ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని చూసి మందహాసం చేస్తూనే ఉంటాడు. అతని చేతిలో ఎప్పుడూ పొడుగాటి చేపాటికర్ర కదలాడుతూ ఉంటుంది. అతనికళ్లు ప్రతివారిమీదా వెన్నెల వెలుగులు చిలుకుతాయి. ఏ పాడుకర్మచేతనో, ఏ క్రూర శాపవశం చేతనో ఓ మహాత్ముడు ఈ కలికాలంలో ఇలా మానవరూపంలో అవతరించేడని అతనిగురించి సుబ్బయ్య ఊహించుకొంటూ ఉంటాడు. అతని దివ్యసుందరవిగ్రహం చూసి ఏ దేవతాస్త్రీయో వలచి పిలచి ఉంటుంది. తిరస్కృతురాలై తిరుగులేని ఘోర శాపం ఇచ్చింది. ఘోరమైన ఈ లోకంలో పడ్డాడతను. అయినా, అతను విరాగి. అతనికి నాకలోకమందున్నా ఒకటే. నాగలోకానికిపోయినా ఒకటే. నరులమధ్యపడినా ఒకటే. శాంతంగా ప్రశాంతంగా ఉంటాడతను. అతణ్ణి చూసినప్పుడల్లా భగవంతుడనేవాడు ఉన్నాడని గుర్తుకొస్తుంది సుబ్బయ్యకి. అతనొక ఋషిలా ఉంటాడు. సుబ్బయ్య అతణ్ణి "మునీశ్వర్లవారు" అంటాడు. అతనియందు సుబ్బయ్యకి భక్తిగౌరవాలు ఉన్నాయి.

మిగతా ఇద్దరూ ఆడపిల్లలు.

"లేడి పిల్లలు" అంటాడు సుబ్బయ్య వాళ్ళని.

వాళ్ళిద్దరూ కవలపిల్లల్లాగ అగుపిస్తారు. వయసు పధ్నాలుగు సంవత్సరాలు ఉండవచ్చు. రూపుకి ఇద్దరూ ఒక్కలాగే ఉంటారు. రూపుకి వాళ్లు అందంగా ఉండరు. అయినా, చాలా ఆకర్షణీయంగా ఉంటారు. ఎప్పుడూ ఒకేరకం దుస్తులు ధరిస్తారు.

ఎప్పుడో కాని చీరలు కట్టరు. పరికిణీ, జుబ్బా వేసుకుంటారు. అప్పుడప్పుడు 'వాణీ'లు వేసుకుంటారు. వాళ్లెప్పుడూ నవ్వుతూ ఉంటారు. పొద్దుటా, సాయంకాలం చేతుల్లో పుస్తకాలతో, టిఫిన్ కేరియర్లతో స్కూలుకి వెళ్తూ వస్తారు. దార్లో అనేకమందిని పలకరిస్తారు. పలకరించి ఏవేవో కబుర్లు చెప్తారు. వాళ్ళవంటిమీద విలువ గల ఆభరణాలేవీ కనిపించవు. వాళ్లు నిరాడంబరంగా ఉన్నా విందుగా ఉంటారు.

వాళ్లు చాలా గొప్పవాళ్లు అవాలని సుబ్బయ్య కోరిక. వాళ్ళకొక సవితల్లి ఉన్నాదని అతని కెందుకో గాని తోచింది. ఆమె వాళ్లని కష్టాలు పెడుతుంది. ఇంటిదగ్గర అంత చాకిరీకూడా వాళ్ళచేతే చేయిస్తుంది. చదువుకొందికి వీలులేకుండా పని చేయిస్తుంది. అయినా వాళ్లు దేనికీ లక్ష్యపెట్టరు. ఎంత చాకిరీ అయినా చేసేస్తారు. అందుగురించి ఏమీ విచారించరు. ఎప్పుడూ సంతోషంగానే ఉంటారు. ఇంట్లో చదువు సాగకపోయినా, క్లాసులో తెలివైన వాళ్ళనే అనిపించుకొంటారు. వాళ్ళిద్దరికీ త్వరలోనే పెళ్లవుతుంది. మిక్కిలి బీదవాళ్లకిచ్చి పెళ్లి చేస్తుంది వాళ్ల సవితల్లి. కాని, అసదాని అదృష్టంవల్ల ఆ బీదవాళ్ళే ఎంతో గొప్పవాళ్ళవుతారు. అప్పుడీ రెండు లేడిపిల్లలూ బంగారపు లేళ్ళవుతాయి.

"చక్కటి లేడి పిల్లలు" అనుకుంటాడు సుబ్బయ్య.

ఇంకా అనేకమంది వస్తూ వెళ్తూ ఉంటారు.

కొత్తకారు నడుపుకొంటూ పోయే హార్బర్ ఇంజనీరూ, పాతకార్లో డ్రైవరుపక్కన కూర్చునే లేడీ డాక్టరూ, 'రలీ' సైకిలుమీద రోజూపోయే ఇటికల కంట్రాక్టరూ, కొబ్బరికాయలబుట్ట నెత్తిని పెట్టుకుపోయే వయ్యారిభామా, రోజూ కోడిమాంసం కొనుక్కువచ్చే కుంటికాలువాడూ, ఎప్పుడూ రాత్రి వేళే కనిపించే సిల్కు జాకెట్టుపిల్లా—ఇలా అనేకమంది ఉన్నారు. వాళ్లందరిగురించీకూడా సుబ్బయ్య ఏవో కథలు అల్లుతాడు. అల్లుతూ ఆలోచిస్తూ వీధి వరండాలో కర్ర స్తంభంచాటున కూర్చుంటాడు. అదొక సరదా అతనికి.

మామూలు ప్రకారం వరండాలోకి కాఫీ తాగుతూ వస్తున్నాడు సుబ్బయ్య. ఎర్రచీరమనిషి వచ్చేవేళ అవుతోంది.

ఇంతట్లో వెంకట్రావొచ్చాడు.

అతణ్ణిచూసి సుబ్బయ్య కంగారు పడ్డాడు.

వెంకట్రావు ఎప్పుడో గాని సుబ్బయ్యదగ్గరకి రాడు. మూడుసంవత్సరాల్లోనూ ఏ నాలుగైదుసార్లో సుబ్బయ్య ఇంటిని తన రాకతో పావనం చేశాడతను. అతను వచ్చినప్పుడల్లా సుబ్బయ్య కంగారు పడక మానడు. అతను వస్తే నిజంగా తనఇల్లు పావనమయినట్టే భావిస్తాడు.

సుబ్బయ్య ఇంటిని పావనంచేసే వెంకట్రావు పవిత్రుడు కాడు. కాడని సుబ్బయ్యకి తెలుసు. అయినా వెంకట్రావంటే అతని కెంతో గౌరవం.

వెంకట్రావు తండ్రి తాతలు జమీన్దార్లు. చాలా గొప్పగా బ్రతికేరు. కాని వెంకట్రావు తండ్రితోటే ఆరిపోయింది ఉన్న దమురంతా. అయితే నేం? వెంకట్రావు పెద్దవంశంలో పుట్టేడు. అతని స్టేటస్ తన దానికంటె హెచ్చు సుబ్బయ్యదృష్టిలో.

వెంకట్రావుది అగ్గినికుప్పే పెర్సనాలిటీ. సుమారు ఆరడుగుల పొడవుంటాడు. అతని కళ్లు చాలా అందంగా విశాలంగా ఉంటాయి. పొడవైన కనుబొమ్మలతో, బరువైన కంటిరెప్పలతో, ఎర్రజీరల కళ్ళతో ఎవర్నయినా కిందిచూపు చూడగలడతను. సాధారణంగా అందర్నీ అలాగే చూస్తాడు. మనిషి అట్టే బలంగా లేకపోయినా బలంగా ఉన్నట్టు కనిపిస్తాడు. అతని కాళ్ళూ చేతులూ చాలా పొడవు. చుట్టలు తెగకాల్చడంచేత అతని పెదవులు నల్లబారేయి. అతని ముక్కు కొంచెం వంకరగా పొడవుగా ఉంటుంది. పొడుగ్గా ఉండే జుత్తుని వెనక్కి దువ్వుకుంటాడు. అతనిమాట బొంగురుగా గంభీరంగా వస్తుంది. అవసరంకొద్దీ ఏరకంగా ఎలా మాట్లాడేమో అతనికి బాగా తెలుసు. డబ్బుకోసం కొంతమందిని 'సైటు' కొట్టి తిరిగినప్పటికీ, ఎవరిదగ్గరా "దాసోహం" అని అతను ప్రవర్తించడు. తరచు, చాలామందిలో "నువ్వెంత" అన్నట్టు బేఖాతిర్ గా, నిర్లక్ష్యంగా ఉంటాడు. పద్దెనిమిదేళ్ళ ప్రాయం వరకూ వెంకట్రావు విచ్చలవిడిగా తిరుగుతూ, చిత్తుగా డబ్బు ఖర్చుపెడుతూ, స్నేహితులతో షికార్లు కొడుతూ, ఆడపిల్లల్ని వెంబడిస్తూ కాలక్షేపం చేసేడు. ఇంతలో అతని తండ్రి చనిపోవడం తటస్థించింది. అతని తండ్రి జమీందారన్న మాట నిజమే. కాని, తండ్రి చనిపోయేసరికి వెంకట్రావుచేతిలో కానీ 'కేష్' లేదు. కేష్ లేకపోతే పోయింది. తంటాలేదు. కాని, నెత్తిమీద అప్పులవాళ్లు కూర్చున్నారు.

వెంకట్రావుకి, తండ్రి పోయాడన్న దుఃఖం అటుంచగా, ఆస్తి విషయమై ఉన్న పరిస్థితి అర్థం కాలేదు.

అతనికి ఏం చెయ్యడానికీ తోచ లేదు.

ఏమీ చెయ్యకుండా అప్పులవాళ్ళు ఊరుకో లేదు.

ఆస్తుల్ని ఒక్కటొక్కటి జప్తుచేయించి కబళించడం ప్రారంభించేరు.

జరుగుతూన్నదేమిటో వెంకట్రావుకి తెలియడమే లేదు.

ఇలా ఉండగా నరసయ్య వచ్చేడు సాయం చెయ్యడానికి.

వెంకట్రావుకి మేనమామ అవుతాడు నరసయ్య.

వెంకట్రావు తండ్రి ఉన్న రోజుల్లో నరసయ్య ఎప్పుడూ వారి ఇంటికి రాలేదు. బావమరదులిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. బావ చనిపోయాక తన అక్క పరిస్థితులు బాగులేవని తెలిసి చేతనైన సహాయం చేద్దామని వచ్చేడు నరసయ్య. అతనికి ఒక్కర్తే కూతురు. ఆ అమ్మాయి పేరు శాంతమ్మ. అప్పటి కామెకి పద్నాలుగేళ్ళు. వెంకట్రావుకి ఆపిల్లనిచ్చి పెళ్ళిచేద్దామనే ఆశతో కూడా వచ్చేడు నరసయ్య.

నరసయ్య వచ్చేసరికి వెంకట్రావు స్థితిగతులు ఏమీ బాగా లేవు. పరిస్థితి అంత చెడ్డగా ఉన్నాదని నరసయ్య అనుకో లేదు. తన బావ పెద్ద స్థితిపరుడు. కొంత తగలెట్టినా, కొంతయినా మిగిల్చి ఉంటా డనుకున్నాడు నరసయ్య.

తీరా వచ్చి చూస్తే అంతా అధోగతిలో ఉంది.

ఎస్టేటంతా కోర్టుజప్తులో ఉంది. ఇళ్ళమీద తనఖాలున్నాయి. శేరీభూములు కూడా చాలామట్టుకు రైతులస్వాధీనంలోనే ఉన్నాయి. మిగతా భూముల పంట పాలికాపులు హరించేస్తున్నారు. ఇంట్లో ఉండే వెండీ బంగారం ఇంట్లో కనిపించడం లేదు.

ఇంట్లో ఉండవలసిన వజ్రాల నగలన్నీ తాకట్టులో ఉన్నాయి. ఎవరిదగ్గర ఉన్నాయో ఇంట్లో ఎవరికీ తెలియదు. తాకట్టుపట్టినవాళ్ళు కిక్కురుమనకుండా ఊరుకున్నారు.

ఎస్టేటువకీలు ఎన్నిసార్లు వెళ్ళినా పొమ్మంటాడు.

పనికొచ్చే కాయితమేదీ ఇంట్లో కనిపించదు.

ఏం చేద్దామన్నా నరసయ్యకి కాలూ చెయ్యీ ఆడింది కాదు.

అన్ని వ్యవహారాలూ చాలా కాలంనుంచీ చూస్తోన్నవాడు కామేశం అనే గుమాస్తా. అతను చాలా ముసలివాడు. డెబ్భై సంవత్సరాల వయసయినా ఉంటుంది. అతను వెంకట్రావు తాతకాలంనుంచీ కూడా వ్యవహారాలన్నీ చూసుకువస్తున్నాడు. అతనికి వెంకట్రావు కుటుంబవిషయాల్లో తెలియనిదేదీ లేదు. చాలాకాలం అతను చాలా విశ్వాసంగా పనిచేసేడు. వెంకట్రావు తండ్రి కాలంలో కొన్నాళ్ళకి "ఇహ లాభం లే"దని అతనికి తెలిసింది. "ఈ ఆస్తి ఇహ నిలబడదు"ని ముందుగానే తెలుసుకున్నాడు. డబ్బంతా ముండలకీ, తాగుడుకీ, జూదానికీ ఖర్చవుతూ ఉంటే అతనికి చాలా కష్టం అనిపించింది. న్యాయంగా వచ్చే జీతపురాళ్ళు తప్ప ఇంక ఇతరానికి ఆశపడలే దతను చాలాకాలం. "సొమ్మంతా నిష్కారణంగా సానివాళ్ళకీ, బ్రాందీ సీసాలకీ అయిపోతోంది. ఆఖరికి మిగిలేది ఎవరికీ కూడా ఏమీ ఉండదు" అనుకున్నాడు కామేశం. "నేనింత కష్టపడుతూన్నా నాదగ్గర కాణీ లేదుకదా!" అని కూడా అనుకున్నాడు కామేశం. అతనికి చాలామంది పిల్లలు. అందులో ఆడపిల్లలు హెచ్చు. వారందరికీ పిల్లలున్నారు. చదువులు చెప్పించవలసిన మొగపిల్లలు ఇంకా ఉన్నారు. పెళ్ళిళ్ళు చేయవలసిన ఆడపిల్లలు ఇంకా ఉన్నారు. చదువులు చెప్పించాలి. పెళ్లిళ్లు చేయించాలి. ఇవన్నీ చేయడానికి సొమ్ము కావాలి.

జమీన్దార్ గారి డబ్బు సానులకి పోతోంది. జూదంలో పోతోంది.

"నాకుచూస్తే డబ్బు అవసరంగా ఉంది" అనుకున్నాడు కామేశం.

జమీన్దారీ ఎలాగా చెడిపోవడం తథ్యం. ఆయన డబ్బంతా ఆ సానులే తినడానికి బదులు తనవంటి సంసారి ఎందుకు తినకూడదనుకున్నాడు కామేశం. వాళ్ళల్లో ఎవరూ కూడా జమీన్దార్‌కి ఎన్నడూ ఎట్టి సహాయమూ చెయ్యలేదు. తనుచూస్తే, చిన్నతనం నించీ చెమటోడ్చి ఆ జమీందారీలో చాకిరీ చేస్తున్నాడాయను. అటువంటప్పుడు జమీన్దారీలో తినేది తిన్నప్పటికీ అది "అన్యాయపుసొమ్ము" అనిపించుకోదు.

ఆ నిశ్చయానికివచ్చేక కామేశం మెల్లమెల్లగా వెలుగు ఉండగానే చక్కబెట్టుకోడం మొదలు

పెట్టేడు. అతను ఎస్టేట్లో, ఇంట్లో, జమీందారు స్వంతవిషయాల్లో ఎరగని దేదీ లేదు. అతనికి మంచి తెలివితేటలుకూడా ఉన్నాయి. త్వరలోనే కొంత డబ్బు వెనక్కి వేసేడు. అంత తొందరగా అలా చేయగలిగినందుకు అతనే ఆశ్చర్యపోయేడు. దాంతో ఆశ హెచ్చింది.

వెంకట్రావు తండ్రి చనిపోయేసరికి కామేశ్ నలభైవేల రూపాయిల స్థితిపరుడయేడు.

వెంకట్రావు తండ్రి హఠాత్తుగా చనిపోయేడు. అతనలా పోయినందుకు కామేశ్ చాలా విచారించేడు. కబురు వినగానే అతనికళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగేయి. చనిపోయిన జమీందార్నీ, అతని తండ్రినీ తల్చుకొని చాలా ఏడ్చేడు.

అది అంతటితో అయిపోయింది.

ఆ మర్నాడు అన్ని పరిస్థితులూ పరీక్షించి చూసేడు. తెలివితేటలు ఉపయోగించి ఆట జాగ్రత్తగా ఆడినట్లయితే మరొక పాతిక వేలయినా చేతిలోకి వస్తాయని అంచనా వేసేడు. జమీందారీ ఎస్టేటూ, శేరీభూములు, ఇళ్ళూ వగైరాలన్నీ ఎలాగా అప్పులవాళ్ళ పాలవుతాయి.

బంగారం వెండీ ఇదివరకే అమ్మడయిపోయింది.

ఇహ మిగిలినవి వజ్రాల నగలు. అవి ఎవరిదగ్గర తాకట్లో ఉన్నాయో అతనికితప్ప ఇంకెవ్వరికీ తెలియదు. తెలియడానికి అవకాశం లేదు.

అవి అతనిదగ్గరే ఉన్నాయి.

ఇంకెవరెవరిదగ్గరో తాకట్టు ఉంచినట్టుగా జమీందార్తో చెప్పేడు. కాని, నిజానికి అవి తన దగ్గరే ఉన్నాయి. ఆ సంగతి పైకి తెలిస్తే అవికూడా అప్పులవాళ్లే అపహరిస్తారు. అందుచేత తెలియచేసి లాభం లేదనుకున్నాడు కామేశ్. వాటిని తను చేజిక్కించుకోకుండా, అప్పులవాళ్లకి తెలియకుండా వెంకట్రావుకి ఇవ్వవచ్చునని అతను ఎప్పుడూ అనుకోలేదు. అటువంటి ఆలోచనల్ని అతను దగ్గరికి రానివ్వలేదు.

అందుచేత కామేశ్ కిక్కురుమనకుండా ఊరుకున్నాడు.

ఈలోపున నరసయ్య వచ్చేడు.

నరసయ్య రాక కామేశ్కి సుతరామూ కిట్టలేదు.

నరసయ్యని చూడగానే "ఇతను న్యాయమైన మనిషి. ముక్కుకి సూటిగా పోతాడు" అనిపించదు ఎవరికైనా సరే. కామేశానిక్కూడా అలా తోచలేదు. నరసయ్యకూడా ఏదో తడుముకొందికే వచ్చేడని కామేశ్ అనుకున్నాడు.

అటువంటి దురాలోచనతో గాని దురాశతో గాని నరసయ్య రాలేదు, నిజంగా. అక్కనీ, మేనల్లుణ్ణీ ఏదో ఒకదారికి తీసుకువద్దామనే అతని ఉద్దేశం. ఆ ఉద్దేశాన్ని ఆచరణలో ఎలా పెట్టాలో తెలియలేదతనికి.

కామేశ్కి కుటుంబ పరిస్థితులన్నీ చక్కగా తెలుసుననీ, కాని పైకేమీ పెగలకుండా ఉన్నాడనీ నరసయ్య గ్రహించేడు. కామేశ్ని ఎలా కదల్చడమా అని ఆలోచించేడు.

కామేశా, నరసయ్యా, ఇద్దరూ గండుపిల్లుల్లాగ కొన్నాళ్లు ఒకర్నొకరు చూసుకున్నారు.

ఎక్కడా దొరకననే ధీమాలో ఉన్నాడు కామేశ్.

అతణ్ణి ఎలాగైనా పట్టుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు నరసయ్య.

జమీందారు కలకత్తాలో ఉండగా అతనికి కామేశ్ రాసిన ఉత్తరం ఒకటి నరసయ్యకి కాయితాలేవో వెతుకుతూ ఉండగా దొరికింది. కొన్ని వస్తువులేవో ఒకరిదగ్గర తాకట్టు పెట్టినట్టు కామేశ్ రాసిన దాన్నిబట్టి చూచాయగా తెలుస్తూంది.

ఆ "ఒకరు" తనదగ్గర ఏమీ లేవన్నారు. ఉన్నట్టుగా ఇంట్లో రశీదేమీ కనిపించదు.

ఉత్తరం పట్టుకొని కామేశ్దగ్గరికి వచ్చేడు నరసయ్య.

అది దొరికిపోయినందుకు కామేశ్ చాలా చింతపడ్డాడు. దానికోసం తను చాలా వెతికేడు కాని తనకి దొరకలేదు. ఎప్పుడూ అజాగ్రత్తగా ఉండే జమీందారది చించి పారేసి ఉంటాడనుకున్నాడు. చించకుండా ఉన్నందుకు చనిపోయిన మనిషిమీద చాలా విసుక్కొని, దాన్ని వెతి సంపాదించిన నరసయ్యని చాలా తిట్టుకున్నాడు.

ఏమంటావని అడిగేడు నరసయ్య.

వెంకట్రావుని దగా చేస్తున్నందుకు నీమీద క్రిమినల్ కేసు ఎందుకు పెట్టకూడదని అడిగి భయపెట్టేడు.

బెదరింపులకి భయపడడు కామేశ.

ఆ ఉత్తరం తనమీద నేరం మోపడానికి తగినంత ఆధారం కాదని కామేశకి తెలుసు.

అయినప్పటికీ తను కొంతయినా అల్లరిపడవలసి వస్తుంది.

ఎంత నిబ్బరంగా ఉన్నా కోర్టు ఎక్కిన తరువాత ఏది ఎలా జరుగుతుందో చెప్పడం కష్టం.

కామేశ కొంతగా ఆలోచించేడు.

ఆలోచించాక, లాభంలో కొంతభాగం వదులుకుందామనే నిశ్చయానికి వచ్చేడు.

నరసయ్యకి పరిస్థితులన్నీ బోధపర్చేడు.

"నగలన్నీ మిగుల్తాయనే విషయం పైకి తెచ్చినా వెంకట్రావుకి మిగిలే దేదీ ఉండదు. ఈ సొమ్ముకూడా అప్పుల తీర్మానంకింద తప్పక పోతుంది. అందుచేత ఈ విషయం ప్రకటించి ప్రయోజనం లేదు. సొమ్మంతా వెంకట్రావుకే ఇద్దామంటే మూర్ఖమిషాల్లో అంతా ఎగరగొట్టేస్తాడతను. ఇంగితజ్ఞానం అతనికేమీ లేదు. అందులో ఆ తండ్రికొడుకే అతను. మీరు ఇన్నాళ్ళూ దూరంగా ఉన్నారు కాబట్టి ఏ సంగతీ మీరెరగరు. అంతగా మీకు వెంకట్రావుని బాగు చేద్దామనే ఉంటే అతనికి మీ అమ్మాయిని ఇచ్చినప్పుడు అప్పుడే ఈ సొమ్ము అతనికి ముట్టజెప్పవచ్చును. అలాచేస్తే క్షేమంగా ఉంటుందని నా అభిప్రాయం"—అని ఈరీతిగా చెప్పేడు నరసయ్యతో కామేశ.

కామేశ చెప్పినదాంట్లో నిజం లేకపోలేదని తోచింది నరసయ్యకి.

నరసయ్యకి డబ్బంటే ఆశ లేకపోలేదని కామేశకి ఆదినుండీ తెలుసు.

దాంతో ఇద్దరూ బేరానికి దిగేరు.

అది వెంటనే కుదర్లేదు. ఇద్దరూ చాలా లజ్జుగుజులు పడ్డారు. కొన్నిదినాలు ఒకరితో ఒకరు మాట్లాడుకోడం మానేశారు కూడా. కాని, ఆలస్యం అయినట్లయితే ఎవరికీ మంచిది కాదని గ్రహించి చివరికొక సమాధానానికి వచ్చేరు.

చెరిసగం వాటాకి బేరం కుదిరింది.

పాతిక వేలలో చెరిసగం ఇద్దరూ చేజిక్కించుకున్నారు.

జరుగుతూన్న దేమిటో ఏమీ తెలియని వెంకట్రావు మరోలోకంలో ఉన్నాడు.

నరసయ్య రావడంతో వెంకట్రావుకి ఎక్కడ లేని ధైర్యమూ వచ్చింది. చాలా నిబ్బరంగా తిరిగేడు. చాలా సంతోషంగా ఉన్నాడు. మేనమామ అవడంచేతనే కాకుండా, ఆపదలో సహాయం చెయ్యడానికి వచ్చినందువల్ల నరసయ్యయం దతనికి విపరీతమైన అభిమానం కలిగింది. నరసయ్య తనతో కాంతమ్మనికూడా తీసుకువచ్చేడు. పన్నెండేళ్ళ వయసే అయినా కాంతమ్మకి వయసుకితగని ఊహలున్నాయి. ఆమె వెంకట్రావుని అంతివరకూ ఎప్పుడూ చూడలేదు. బావని చూద్దామనే ఉబలాటంతో పట్టుపట్టి తండ్రివెనకాతల వచ్చింది. ఆ వయసులో ఆడపిల్లలకుండేజ్ఞానంతో అజ్ఞానంతో "వెంకట్రావునితప్ప ఇంకెవర్నీ పెళ్ళిచేసుకోను" అనుకొన్నాదామె.

వెంకట్రావుకి పద్దెనిమిదేళ్లున్నాయి. ఆడదంటే ఏమిటో అతనెరుగును. మరదలు గట్టిదనీ, గడుసుదనీ, కొంత అమాయకత్వం లేకపోలేదనీ, మొత్తానికి మంచిపిల్లే అనీ ఆమెని చూడగానే గ్రహించేడు. ఈడొచ్చేసరికి చాలా అందంగా ఉండే సూచనలన్నీ ఆమెలో ఉన్నాయి. ఆమెకి తనయందున్న అభిమానం తెలుస్తూనే ఉంది. తనకి స్వయం మేనమామకూతురు.

ఇంకేం కావాలనుకున్నాడు వెంకట్రావు. ఈపిల్లని తప్పక పెళ్లాడుతాననుకున్నాడు. ఆ పిల్లని రోజూ తనవెనక తిప్పుకొనేవాడు. ఆమె అతనికి ఎంత చాకిరీ అయినా చేసేది. చాకిరీ చేస్తూ కబుర్లు చెప్పేది. కబుర్లు చెప్తూ నవ్వేది. నవ్వుతూ అతణ్ణి నవ్వించేది.

వెంకట్రావు పాట బాగా పాడతాడు. కాంతమ్మ అతణ్ణి పాడమని బలవంతపెట్టేది. "నాటకాల్లో వాళ్ళలాగ ఎంతో బాగా పాడతావు నువ్వు" అంటూ ఉండేది. అలా పొగుడుతూ ఉంటే వెంకట్రావుకి చెప్పలేనంత గర్వంగా ఆనందంగా ఉండేది. ఒకప్పుడు ఉత్సాహంపట్టలేక ఆమెని ఎత్తుకొని గిర్రున తిప్పేవాడు. ఒంటరిగా ఉన్నప్పుడల్లా ఆమెని ముద్దులాడేవాడు. అందుకోసం ఆమె అతను ఒంటరిగా ఉన్నప్పుడల్లా వచ్చేది. అతను ముద్దుపెట్టుకున్నప్పుడు ఏదో తెలియని ఆవేశంతో ఆమె వళ్ళంతా వణికేది. అతనివళ్ళో కూర్చున్నప్పుడల్లా తమ ఇంట్లో పడగ్గదిలో ఉండే రాధాకృష్ణుల పటం ఆమె కళ్ళముందు మెరిసేది. బొమ్మలో కృష్ణుడిచుట్టూ రాధ చేతులు వేసినట్టు వేద్దామనుకుంటే చేతులు అందేవి కావు ఆమెకి. బొమ్మసంగతి ఓనాడు వెంకట్రావుతో చెప్తే అతను తెగనవ్వి, "నువ్వెన్నటికీ రాధవు కాలేవు" అని వెక్కిరించేడు. వెక్కిరించి ఆమె

చుట్టూ చేతులు వేసేడు. అతని చేతుల్లో నలిగిపోతూ ఉంటే కలిగిన సుఖంతో ఆమె వివశురాలయిపోయేది. అలా అతనివళ్ళో కూర్చోడం తప్పనుకో లేదామె. తనలో యౌవ్వనం అప్పుడే మొగ్గతొడుగుతోందని ఎరగదామె. అర్థంకాని ఆనందంతో అతణ్ణి కౌగలించుకో లేదామె.

ఒకనాడు చీకటిపడ్డాక వెంకట్రావు మామూలుగా ఇంటికివచ్చి "కాంతా, కాంతా" అని పిల్చేడు.

దీపాల్లేని చీకట్లో అతని పిలుపుకి ఆ విశాలభవనం మూల్గింది.

చీకట్లో సావిత్రి మరోగదిలోంచి రావడం అతను చూడనే లేదు.

"మరేమోఒచ్చీ, కాంతా, మామయ్యా వెళిపోయేరన్నయ్యా" అన్నాది సావిత్రి వెక్కుతూ వెక్కుతూ.

"ఎక్కడికి వెళ్ళేరు?"

"వాళ్ళింటికి వెళ్లిపోయేరన్నయ్యా!"

"మళ్లీ ఎప్పుడొస్తామన్నారు?"

"మరేమోఒచ్చీ, సామానంతా పట్టుకుపోయేరన్నయ్యా! కామేశం తాత, మరేమో ఒచ్చీ, మీ మామయ్య మళ్ళీ రాడుట అన్నాడన్నయ్యా!"

ఆరోజు ఆకాశాన్ని నల్లటి మేఘం అలుముకొంది. ఇల్లంతా అంధకారంలో మునిగి ఉంది. కిటికీల్లోంచీ సందుల్లోంచీ ఈదురుగాలి హోరుమని వీస్తోంది. తలుపులన్నీ గాలికి టకటక కొట్టుకొంటున్నాయి. మబ్బు కమ్మిన చీకట్లో, గాలి జోరుగా ఉన్న సమయంలో, ఆరినదీపాలతో ఒంటరిగా ఉన్న ఆ సౌధం భయంకరంగా ఉంది. పెనుభూతంలా ఉంది.

వెంకట్రావుని అర్థంకాని ఆవేదన అంధకారంలా కప్పేసింది. ఎంత ఆపుదామనుకున్నా అతని పెదవులు కంపించేయి. విప్పారిన అతని ఎఱ్ఱటి కళ్ళని కన్నీరు నింపేసింది. ద్వారబంధం పట్టుకొని కొంతసేపు అలానే నిల్చుండి పోయేడు.

'నాతో చెప్పకుండా వెళిపోయిన మామయ్య, కాంతమ్మ నాకు మరి కనిపించరు' అనిపించిందతనికి.

మరింక రారు వాళ్లు,

మరింక చూసేవాళ్లు లేరు వన్న,

అని ఎందుకోగాని తోచింది వెంకట్రావుకి.

అకస్మాత్తుగా అగాధంలో పడినట్టయింది.

అండగా నిల్చున్న కొండ ఎందుకోగాని అకస్మాత్తుగా బుద్ధిమార్చుకొని ఆశ్చర్యంగా, నడుచుకొంటూ పోయింది, ఎక్కడికో.

కొండతోటే వచ్చి కొండవారని పుష్పిస్తూన్న లేతమామిడిమొక్క కొండతోటే మాయమయింది.

అగాధంలో అకస్మాత్తుగా పడిన వెంకట్రావు ఆ రాత్రంతా అతిబాధతో కొట్టుకున్నాడు.

ఆ రాత్రి తెల్లవారింది.

అలాగే తెల్లవారడం, రాత్రి రావడం జరిగింది.

అలాగే తొమ్మిది నెలలు జరిగేయి.

తొమ్మిదో నెల జరగకుండానే వెంకట్రావు తల్లి అతనితండ్రికోసం పోయింది.

పదో నెలరాగానే వెంకట్రావు ఫకీరయి నడిరోడ్డుమీద నిల్చోవలసి వచ్చింది.

ఈలోపున అనేకమంది అనేకభోగట్టాలు వెంకట్రావు చెవిని వేశారు.

"కామేశం నరసయ్యా కలిసి నీకు చాలా ద్రోహం చేశారుసామ్మీ" అని అనేకమంది అతన్తో అన్నారు. ఆమాట మొదటిసారి విన్నప్పుడు చాలా "షాక్" అయేడు వెంకట్రావు. నమ్మలేకే ఆమాట మొదట్లో. కాని అన్ని తార్కాణాలు అంతమంది చూపించి చెప్తున్నప్పుడు నమ్మలేకుండా ఉండలేకపోయాడు.

దుఃఖం, భయం, దారిద్ర్యం.

దారిద్ర్యంవల్ల ఆకలి, ఆకలితో ఉండిపోవాలేమోనన్న భయం, తలిదండ్రులు పోయారన్న దుఃఖం, 'నా దుఃఖంలో, నాక్కావలసినవాళ్లే నాకు ద్రోహం చేశారే' అన్న పరమకోపం, ఎదురుగా వికృతంగా నిల్చున్న ఘోరమైన దారిద్ర్యం, భయం, కోపం, దుఃఖం, దారిద్ర్యం.

అన్నీ కలిసి వెంకట్రావులో విపరీతమైన మార్పు తెచ్చేయి.

పద్దెనిమిది సంవత్సరాలు నిండినప్రాయం అతన్ది. నిండు యౌవ్వనంలో ఉన్నాడు.

కాని ఒక్కసారిగా ఒక్కరోజున, ఒక్కక్షణంలో, నిండు యవ్వనంలో ఉండే ఆశలు, నిరాశలు, ఊహలు, కలలు, కోర్కెలు అన్నీ అతన్లో అణగారిపోయేయి. అణగార్చుకున్నాడతను.

లోకానికి దయలేదు; దాక్షిణ్యంలేదు; విశ్వాసం లేదు; స్నేహంలేదు; ప్రేమలేదు; అభిమానంలేదు; కనికరంలేదు; కారుణ్యంలేదు; ఇవన్నీ ఉన్నాయని నమ్మి ప్రయోజనంలేదు; మానవలోకం అనే ఈ మార్కెట్టులో ఎవడిజాగ్రత్తమీద వాడుండాలి; ఎవడి లాభం వాడు చూసుకోవాలి; అవతలవాడి లాభనష్టాల్లో కష్టసుఖాల్లో ఇవతలవాడికి సంబంధం లేదు; ఎవడికష్టం వాడు మాన్పుకోవాలి; ఎవడిసుఖం వాడు చూసుకోవాలి; "బహుపరాగ్గా" ఉండాలి; ప్రపంచంలో, ఈ అడివిలో ఏది తాడో ఏది పామో తెలుసుకోడం కష్టం; తరచుగా తాడే పామవుతుంది; పామయి కరుస్తుంది. కరవకుండా కాపాడుకోవాలి; అవసరమొస్తే మనమే ముందు కరవాలి;

అనుకొని వెంకట్రావు గుండె రాయి చేసుకున్నాడు.

సిగ్గూ లజ్జా విడిచి పెట్టేశాడు. మొండి కవచం తొడిగేడు. స్వలాభం అనే జండా ఎత్తేడు. జీవితం అనే యుద్ధంలో దిగేడు.

పద్దెనిమిదేళ్ళక్రితం ఎండవేడిలో నడివీధిలో నిల్చొన్న వెంకట్రా విప్పుడొక కంట్రాక్టరు.

వెంకట్రావు మసిపూసి మారేడుకాయ చెయ్యడం నేర్చుకున్నాడు.

అతనంటే అనేకమందికి భయం. అనేకమందికి ద్వేషం.

వెంకట్రావు అలాగే పడిపోయి లేచేడు.

లేస్తూ పడుతూ లేస్తూ వస్తున్నాడు.

పడినా లేచినా మనసుకి పట్టించుకోడం లేదు.

వేసవికాలంలో ఒకరోజు ఉదయం సరిగా ఏడుగంటలకే సుబ్బయ్య ఇంటికి వచ్చేడు వెంకట్రావు.

3

ఆ ఉదయం ఏడుగంటలకి వెంకట్రావుగారాగానే సుబ్బయ్య చాలా కంగారుపడ్డాడు.

అతణ్ణి లోనికి తీసుకువెళ్లి ఉన్న కుర్చీలో అతణ్ణి కూర్చోబెట్టి తను కిటికీలో కూర్చున్నాడు సుబ్బయ్య.

సావిత్రి తెచ్చిన కాఫీ తాగుతున్నాడు వెంకట్రావు, ఏదో ఆలోచిస్తూ.

"ఏమిటోయ్, ఇలా వచ్చేవు?" అడిగేడు సుబ్బయ్య.

"అర్జంటుగా ఓ అయిదువందలు కావాలోయ్" అన్నాడు వెంకట్రావు ఒక్కసారిగా.

"ఆహాఁ!?"

తన వ్యాపారవిషయం గాని మరేవిషయం గాని వెంకట్రావు సుబ్బయ్యతో ఎన్నడూ ప్రస్తావించ లేదు. ఆరోజున డబ్బుగురించి ప్రస్తావన తనతో తెచ్చినందుకు సుబ్బయ్య చాలా మురిసిపోయేడు.

ఎందుకొచ్చాలో అనుకుదామనుకొని, వెంకట్రావుకి కోపం వస్తుందేమోనని అడగడం మానేశాడు.

పాపం! ఎందుకోఒకందుకు కావలసివుంటుంది.

"అందుగురించి నువ్వు నాకొకంచెం సాయం చెయ్యాలి" అన్నాడు వెంకట్రావు.

నన్నుకాని ఇమ్మంటాడా ఏమిటి?

నాదగ్గర పదిహేనురూపాయలుతప్ప ఇంకేమీ లేదే!

లేదని ఇప్పుడు ఇతన్తో ఎలా చెప్పడం?

సుబ్బయ్య ఏమంటాడో అని ఎదురుచూడ లేదు వెంకట్రావు.

"నీదగ్గిర అయిదువంద లుంటాయని రాలేదుస్మా" అన్నాడు కాఫీ గ్లాసు మేజామీద పెడుతూ.

"బతికేన్రా బాబూ" అనుకున్నాడు సుబ్బయ్య.

డబ్బు లేదన్న భోగట్టా బావమరిదికి తెలిసి పోయిందని బాధపడ లేదు.

"అవునవును! నీకుమాత్రం తెలీదూ? అంత సొమ్ము నాదిగ్గ రెక్కడుంటుంది చెప్పూ"

"అవును నీదగ్గర లేదు. కాని నాకొకవాలి" అన్నాడు వెంకట్రావు, మేజామీద గుడ్డ సవరిస్తూ.

"అయితే ఏంచేద్దాం అంటావు?"

"ఇదిగో చెప్తా"

వెంకట్రావు చుట్టతీసి ముట్టించేడు. ముట్టించక "గవరయ్యని ఎరుగుదువుకదా?" అన్నాడు.

"ఎరక్కేమి! ఆయన 'బిల్సు'న్నీ నాదగ్గిరే ఉన్నాయిగా" అన్నాడు సుబ్బయ్య.

"వాణ్ణే అయిదువందలడుగు"

అంత సులభంగా అనేశాడు వెంకట్రావు.

"చేచే! ఆయన్ని అయిదువంద లడగడమే!"

సుబ్బయ్య నిర్ఘాంతపోయేడు.

"ఎందుకల్లా బెదురుతావ్? వాణ్ణేం ఖూనీ చెయ్యమనడం లేదే — చేసినా పాపం లేదనుకో — వాణ్ణి అయిదువందలు అడగమన్నాను. అంతేనా?"

సుబ్బయ్య కొంచెం తెప్పరిల్లేడు.

"నే నడుగుతే ఆయనిస్తాడా? వట్టిమాట!"

"నాకోసం అని తెలిస్తే అసలే ఇవ్వడు. అందుచేత నువ్వే నీకోసమని అడగాలి" అన్నాడు వెంకట్రావు చుట్టపొగ వదుల్తూ.

"కూరలమనిషి ఉల్లిపాయలైనా అరువివ్వదు కదా నాకు! అటువంటిది అయిదువందలు నాకిస్తాడా ఆయన!"

"అబ్బ! నువ్వెప్పుడూ ఇంతేనోయ్! 'నే నొట్టి దద్దమ్మనండోయ్' అని నువ్వే అంటూఉంటే లేదు. నువ్వు దేవేంద్రుడివని పైవాళ్లు నువ్వడిగిందల్లా ఇస్తారా? కొంచెం ఓరుగ్గా మాట్లాడ్డం నేర్చుకో బావా"

"పోనీ నన్నేదో ఇలా ఉండనిద్దూ"

"ఉండనిచ్చేదేమిటి, ఉంటూనే ఉన్నావు... అయినా ఇప్పుడు నాకు అవసరం వచ్చింది. డబ్బు జరూరుగా ఉంది ... అందుచేత నీ వంగిరి పింగిరి మాటలు మాని నే చెప్పినట్టు చెయ్యి ... ఏం, ఏమంటావ్?"

'ఏమంటావ్' అని వెంకట్రావు అడుగుతూండగానే కాఫీ గ్లాసులు పట్టుకుపోడానికి సావిత్రి వచ్చింది.

గ్లాసులు మెల్లిగా తీస్తూ అన్న వేసిన ప్రశ్నకి సుబ్బయ్య ఏమంటాడో అని ఎదురుచూస్తోంది.

ఆమె తన జవాబుకోసం అక్కడ నిల్చున్నాదని సుబ్బయ్య గమనించేడు.

"ఏమంటావోయ్" అని అడిగేడు వెంకట్రావు మళ్ళీ.

సావిత్రి ఇంకా గదిలోనే ఉంది.

"నన్నేం చెయ్యమంటావో ఏమిటో? మరంతా నువ్వే చెప్పాలి" అన్నాడు సుబ్బయ్య సావిత్రివైపు చూడకుండా.

గ్లాసులు పట్టుకొని గదిలోంచి వెళిపోయింది సావిత్రి.

"ధైర్యంగా నువ్వుంటే నేనేమీ చెప్పనక్కర్లేదు. అంతా నువ్వే చెయ్యగలవ్" అన్నాడు వెంకట్రావు.

సుబ్బయ్య మనసంతా భారంగా ఉన్నాది.

"నన్నేం చెయ్యమంటావో చెప్పు"

"నిన్నేం బ్రహ్మాండం బద్దలుకొట్టమన్లేదోయ్, భగవంతుడా! ఎందుకలా అప్పుడే సుడికెళ్ళే మేకపోతులా భయపడుతున్నావ్"

"నే నేం భయపడ్డంలేదోయ్. కాని, ముందు ఏం చెయ్యాల్లో చెప్పు"

నిజంగా సుబ్బయ్య మనసు కలతగా ఉంది.

"ఏమీలేదు!...గవరయ్య ఈమధ్య నీదగ్గిరకి వస్తున్నాడు కదా!"

"ప్రతిరోజూ వస్తున్నాడు"

"అవునా మరి...ఈసారి వచ్చినప్పుడు వాణ్ణి కొంచెం ఎడంగా తీసుకువెళ్ళి 'ఓయ్ గవరయ్యా! నాకో అయిదు వందలు అర్జంటుగా కావాలి. సాయంకాలంలోపున నువ్వెలాగయినా పదుపాయం చెయ్యాలి' అని సరిగ్గా ఈమాటలే వాడితో అను. సాయంత్రం ఆరోగంటకల్లా సొమ్ము నీచేతుల్లో ఉండకపోతే చెవి కోయించుకుపోతాను"

"అలా అడుగుతే ఇస్తాడంటావా ఆయన?"

వెంకట్రావుకి అమాంతంగా కోపం వచ్చింది.

"ఆయన! ఆయన! ఆయన! ఎందుకలా అవెధవని "ఆయ"న్ని చేస్తావ్! ఒట్టి బంట్రోతు వెధవ్వాడు! నాముందెప్పుడూ వాణ్ణలా 'రిఫర్' చెయ్యకు."

గవరయ్య బంట్రోతు వెధవ కాడే!

పెద్ద కంట్రాక్టరు.

"ఆయన" అంటే తప్పేముంది?

బంట్రోతే అనుకోండి.

"ఆయన" అంటే తప్పా?

ఎవరిగొప్ప వారిదే.

అయినా, నేనో నౌఖరీ వెధవని కాబట్టి అలా అంటాన్నేను.

వెంకట్రావు జమీన్దారు! నాకూ ఇతనికీ హస్తిమశకాంతరం తేడా ఉంది.

నేనైతే "గవరయ్యగారూ" అంటానుగాని, వెంకట్రావలా అంటాడా?!

వెంకట్రావుకి కోపం రావడం సహజమే.

"పోనీలేవోయ్! అలాగే అడుగుతాలే అతిగాణ్ణి" అన్నాడు సుబ్బయ్య.

కోపం చల్లార్చుకొందికి, ఆరిపోయిన చుట్టని అంటించేడు వెంకట్రావు.

కొంతసేపు అతను మాట్లాడకపోడం చూసి సుబ్బయ్య ఓ చిన్న ప్రశ్న వేసేడు.

"సొమ్మెందుకని అత నడుగుతే?"

ప్రతి అక్షరం త్రుంచి చెప్పేడు వెంకట్రావు.

"అ, డ, గ, డు."

సుబ్బయ్య కొంచెంసేపు ఊరుకొని మళ్ళీ అడిగేడు.

"సొమ్ము మళ్ళీ ఎప్పుడిస్తావని అడుగుతే?"

"అలాకూడా అడగడు"

వెంకట్రావులో కోపచిహ్నాలు మళ్ళీ కనిపించేయి.

"సరే సరే" అన్నాడు సుబ్బయ్య.

"నే చెప్పినట్టూ చెయ్. చేస్తే డబ్బు వాడు తప్పకుండా ఇస్తాడు... నే వస్తామరి" అంటూ వెంకట్రావు లేచేడు.

కిటికీలోంచి సుబ్బయ్య కిందకి దిగేడు.

సావిత్రి గదిలోనికి వచ్చింది.

"ఏం చెల్లీ, పిల్లలూ వాళ్ళూ కులాసాగా ఉన్నారా?" అని సావిత్రినడిగి, ఆమె జవాబుకోసం ఆగకుండా సుబ్బయ్యవైపుతిరిగి అన్నాడు వెంకట్రావు.

"నే చెప్పింది జ్ఞాపకం ఉంచుకో! డబ్బు నీకే కావాలని అడుగు. నా పేరయినా ఎత్తకు. ఏం?"

"సరే" అన్నాడు సుబ్బయ్య.

"అయితే, సాయంత్రం మళ్లీ వస్తా" అంటూ తొందరగా వెళిపోయేడు వెంకట్రావు.

అతను వెళ్ళేక సుబ్బయ్యా సావిత్రీ ఓ రెండు నిమిషాలు అలానే నిల్చున్నారు.

"రాక రాక వచ్చేడు మా అన్నయ్య" అన్నాది సావిత్రి ఎవరితోనో అన్నట్టుగా.

రాక రాక మా అన్నయ్యలాంటి ఘనమైనవ్యక్తి వస్తే అతను చెప్పినదేదో చెయ్యక అన్నీ ప్రశ్నలు వేసి అతణ్ణి చిరాకుపెడతారా, అని ఆమె అభిప్రాయం.

ఆమె ఉద్దేశం సుబ్బయ్య గ్రహింపకపోలేదు.

"అవును. పాపం, అతనికి ఊపిరి తిరక్కుండా పన్లు"

అనేశాడు పైకి.

సావిత్రి మరోగదిలోకి పోయింది.

వెంకట్రావు వీధివైపుకి వచ్చేడు.

వెంకట్రావువచ్చి "ఇలా చెయ్యి, అలా అడుగు" అంటే తల ఊపేశాడేగాని ఆ ఉదయం అంతా సుబ్బయ్య గాభరాగా ఉన్నాడు.

చేతిలో సొమ్ము లేకపోయినా ఎలాగో ఓలాగ కాలక్షేపం చెయ్యడమేగాని ఎవర్నయినా నోరు విడిచి అడగడం సుబ్బయ్యకి అలవాటు లేదు.

నిజంగా తనకే అవసరం ఉన్నట్లయితే గవరయ్యని అడుగుదామనే ఆలోచనైనా అతనికి తట్టక పోను. తట్టినా, గవరయ్యని అడుగుదామనే నిశ్చయానికి రాలేకపోను.

వెంకట్రావుకోసం అడగదల్చుకున్నాడు.

అడుగుతానని మాట అనేశాడు.

మాట అనేశాడేగాని ఆ గవరయ్యని అడగ్గలనా?

వెంకట్రావుకోసం అని చెప్తే గవరయ్య అసలే ఇవ్వడు!

సొమ్ము నాకే కావాలని అబద్ధం ఆడాలి!

ఎలాగ?

ఆందోళనతో సుబ్బయ్య కాలేజీ ఆఫీసుకి వెళ్ళేముందు ఆకలి వెయ్యలేదు. కొంచెం మజ్జిగా అన్నంమాత్రం తిన్నాడు.

ఆఫీసుకి నడుస్తూ ఆలోచిస్తూనే ఉన్నాడు.

పాపం! వెంకట్రావుకి సొమ్ము ఎంత జరురుగా ఉందో ఏమిటో!

లేకపోతే అంత పొద్దుటే అలా వస్తాడా?

దేహీ అని అడుగుతాడా?

ఎంతటివాడికి ఎంత గతి పట్టింది!

వాళ్ళనాయనా, తాతా ఎంత గొప్పగా, ఎంత దర్జాగా బ్రతికేరు!

ఏ కాలానికి ఏ వేళా జరుగుతుందో ఎవరూ చెప్పగలడు!

ఈరోజు నేను అయిదువందలడగబోతానని నిన్న అనుకున్నానా?

నేను అడగబోతున్నానని గవరయ్య అనుకుంటాడా?

గవరయ్య ఇవాళ వచ్చినప్పుడు...

వస్తాడని నిర్ధారణ ఏముంది?

గవరయ్య ఈరోజు రాకపోవచ్చు.

అయ్యో! గవరయ్య ఇవాళ రాకపోతే ఎలా?

వెంకట్రావు సాయంకాలం గంపెడాశతో వస్తాడే!

గవరయ్య రావాలి, దేవా, రావాలి!

అనుకొంటూ, తొందరగా, మెల్లగా, తొందరగా నడుస్తూ ఆఫీసుకి వెళ్ళేడు సుబ్బయ్య.

ఆఫీసులో కూర్చున్నాడేగాని, ఆఫీసుపనిమీద అతని దృష్టి లేదు.

మాటిమాటికి గేటువైపు చూస్తున్నాడు.

రోజూ సరిగ్గా పన్నెండుగంట లయేసరికల్లా గవరయ్య తన ఎర్రకార్లో కూర్చొని రావడం, ఆఫీసులో అందర్నీ పలకరించడం, హెడ్ గుమాస్తాతో లోకాభిరామాయణం చెప్పడం, తన 'బిల్స్' గురించి ముచ్చటించడం, తరువాత అందరితో చెప్పి వెళ్లిపోవడం మామూలు.

ఆఫీసులో కూర్చొని గేటువైపూ, గడియారం వైపూ చూస్తున్నాడు సుబ్బయ్య.

పదకొండు గంట లయింది.

పావయింది. అర్ధయింది.

ముప్పావయింది.

ఒకటీ, రెండు, మూడూ...

వరసగా పదిహేను నిమిషాలు పరుగున పోయేయి.

టంగ్. టంగ్. టంగ్...

వరసగా పన్నెండు గంటలు.

వచ్చేసమయం, గవరయ్య వచ్చేసమయం వస్తోంది

సుబ్బయ్య వళ్లు వేడెక్కుతోంది.

పన్నెండు దాటి అయిదునిమిషాలయింది.

ఆఫీసుగేటువగ్గిర జర్రుమని చప్పుడు అయి ఆగింది.

ఆగిన కొన్ని సెకెండ్లలో, కారు తలుపు టక్కున వేసిన కొన్ని సెకెండ్లలో,

"నమస్కారాలండోయ్"

అంటూ ఆఫీసు గదిలోకి వచ్చేరు.

గవరయ్య!!

"రాజా వేడాలి వాచ్చే సభకూ"

అన్నట్టుగా ఆఫీసుకి వచ్చేడు గవరయ్య.

గవరయ్య చాలా గంభీరంగా ఉంటాడు. అతని వయసు నలభై దాటింది. మనిషి చాలా ఎర్రగా ఉంటాడు. అతని తలకి చుట్టూ జుత్తు ఉంటుంది. మధ్యది నున్నటి బట్టతల. నల్లగా చాలా నల్లగా దట్టంగా ఉండే మీసం అతన్ది. తళతళలాడే బంగారపు "ఫ్రేం" కళ్ళద్దాలు పెట్టుకుంటాడు. రాగి చెంబుకి మీసాలూ, కళ్లజోడూ పెట్టినట్టుంటుంది అతని ముఖం. చాలా వెడల్పయిన మని షతను. ఎద్దు మూపుల్లాంటి మూపులు అతనివి. అతను చాలా పొడవుగా ఉంటాడు. చాలా బలంగా ఉంటాడు. అతను చాలా హెచ్చుగా నవ్వుతూ ఉంటాడు. ఆ నవ్వు ఒకప్పుడు మేఘం గర్జించినట్టుంటుంది. మరొకప్పుడు గాడిద ఓండ్ర పెట్టినట్టుంటుంది. ఇంకొకప్పుడు కోతి కిచకిచలాడినట్టు అనిపిస్తుంది. ఏరీతిగా నవ్వినా కూడా, రాగిచెంబులా ఉండే అతని ముఖం బాగా తోమిన రాగిచెంబులా ఇంకా ఎర్రబడుతుంది. అతను అందరితోనూ చనవుగా మాట్లాడగలడు. చాలా సరదాగా ఉండగలడు. అవసరం వస్తే అతి భయంకరుడవగలడు.

మొత్తానికి, గవరయ్య చాలా గంభీరంగా ఉంటాడు. చిన్నతనంలో చాలా బీదగా ఉండే వాడు గవరయ్య. అతని తండ్రి రంగూన్ పోయి మరి తిరిగి రాలేదు. తల్లి గంగమ్మ అతణ్ణి పోషించుకొంటూ వచ్చింది. ఆమె వ్యభిచరించి డబ్బు గణించిందని అనేవారు. ఏరీతిగా గడించినా, గడన మాత్రం చాలా తక్కువ. తక్కువయినా, కొడుక్కి ఏలోటూ రానివ్వకూడదని గంగమ్మ అనుకొనేది. ఆమె చాలా కష్టపడి కొడుకుని చదివించింది. కాని గవరయ్యకి చదువు సరిగా అబ్బలేదు. పదిహేనో యేట అతను 'ఫస్టుఫారం'లో ప్రవేశించేడు. ఆయేడే రామయ్యమ్మ నే పదేళ్ళపిల్లని తెచ్చి కొడుక్కి ఇచ్చి ముచ్చటగా పెళ్ళిచేసింది గంగమ్మ. పదేళ్ళప్పుడు కూడా రామయ్యమ్మ ముత్యంలా మెరిసిపోయేది. "ఎవరమ్మా ఆపిల్ల?" అని ఎంతోమంది ఆమెని చూడగానే అడిగేవారు. కోడల్ని చూసి గంగమ్మ ఎంత మురిసిపోయేదో గవరయ్యకూడా అంత మురిసిపోయే వాడు. పెళ్ళయినవెంటనే తన ఇంటికి కోడల్ని తీసుకు వచ్చింది గంగమ్మ.

గవరయ్య మెల్లిగా నాలుగో ఫారంలోకి వచ్చే సరికి అతనికి పంధొమ్మిదో సంవత్సరం వచ్చింది. రామయ్యమ్మకి ఈడువచ్చింది. ఇద్దరికీ పునస్సంధానం

జరిగింది. పెళ్లాం అనే మనిషి అంత సుఖం ఇవ్వగల దని గవరయ్య అంతకుముందు అనుకోలేదు. భార్యతో గదిలో ఉన్నప్పుడు స్వర్గంలో ఉన్నట్టే అనిపించే దతనికి. ఆమెయందు అనురాగం, అదివరకన్నా వెయిరెట్లు హెచ్చయిం దతనికి. వీలయినప్పుడల్లా ఆమెతో గదిలోనే ఉండేవాడతను. ఆరోజుల్లో కూడా అతను చాలా మోటుగా ఉండేవాడు. రామయ్యమ్మని గాఢంగా ప్రేమించి, మోటుగాలాలించి, అమితమైన ఆనందాన్ని పొందేవాడతను.

అంతా బాగానే ఉంటూ ఉండగా, ఆమెకి ఇంకా బతికాలనే ఉంటూ ఉండగా గంగమ్మ చనిపోయింది. గవరయ్య చాలా దుఃఖించేడు. ఆపవాళ్లా ఏడ్చేడు తల్లికోసం.

గంగమ్మ చనిపోయింది.

గవరయ్య గంగలో పడ్డట్టు అయేడు.

అంతవరకూ సాఫీగా వెళ్తూన్న అతని జీవితం ఒడిదుడుకుల్లో పడ్డాది.

ఇంట్లో చూస్తే కాణీ లేదు. చేతిలో చూస్తే అంతకన్న హెచ్చు లేదు. చదువు చూస్తే అబ్బ లేదు.

నౌఖరీ చూసుకోడమో, కిల్లీ దుకాణం పెట్టుకోడమో చెయ్యాలనుకున్నాడు గవరయ్య.

గవరయ్యకి నూకరాజనే పేరు గల ప్రాణ స్నేహితుడు ఉండేవాడు.

నూకరాజు మూడో ఫారంవరకూ చదివేక, చదువుకి స్వస్తి చెప్పి తాలూకా ఆఫీసులో బంట్రోతుగా ప్రవేశించేడు. నూకరాజూ గవరయ్యా చిన్నప్పటి నుంచీ స్నేహితులు. వాళ్లఇళ్లుకూడా అట్టే దూరంలో లేవు. వయసులో గవరయ్యకన్న నూకరాజు పెద్ద. గవరయ్యకంటె గడుసువాడూ, లోకజ్ఞానం ఉన్న వాడూ కూడా. గవరయ్య ఎద్దు మొద్దులా ఉండే వాడు. ప్రపంచంలో దేనిగురించీకూడా ఆరోజుల్లో అతనికి బాగా తెలియదు. "నూకరాజు చాలా క్కాడు. తెలివైనవాడు, బతక నేర్చినవాడు" అనుకొనేవాడు గవరయ్య.

నూకరాజు ఒకరోజు గవరయ్యఇంటికి వచ్చి "ఒరే అబ్బాయ్! మా ఆఫీసులో అటెండరు పని ఖాళీగా ఉంది. నువ్వొస్తావా?" అని గవరయ్యని అడిగేడు.

"ఖాళీగా ఉండొచ్చుగాని ఆ ఉద్యోగం నా కవడిస్తార్రా!" అన్నాడు గవరయ్య.

"నేనున్నానుగదట్రా ముందు నువ్వు కాయితిం పెట్టు మిగతాదంతా నే చూస్తా" అని అభయా ఇచ్చేడు నూకరాజు.

గవరయ్య దరఖాస్తు పెట్టేడు.

అటెండరు ఉద్యోగం అనుకోకుండా దావచ్చింది.

వచ్చినరోజున గవరయ్య బ్రహ్మానందభరితు డయ్యేడు.

నూకరాజుని కౌగలించుకున్నాడు.

తనవల్లనే కార్యం జరిగినందుకు నూకరాజు గర్వంతో పొంగేడు.

గవరయ్య ఉద్యోగంలో ప్రవేశించేడు.

బంట్రోతుపని అట్టే కష్టమనిపించలేదు గవరయ్యకి.

అందులోనూ తాశీల్దారుఆఫీసులో అందరికన్న మంచివాడవడంచేత గవరయ్యకి ఇబ్బందేమీ లేకపోయింది.

అప్పటి తాశీల్దారు నలభైయేళ్ళ వయసువాడు. అయినా, కుర్రవాళ్లా అపుపించేవాడు. చలాకీగా, హుషార్ గా ఉంటూ, సరదాగా మాట్లాడేవాడు. నౌకర్లయందూ, గుమాస్తాలయందూ దయగలిగి ఉండే వాడు. లంచాలు పుచ్చుకోడం అంటే అతనికి కిట్టేది కాదు. అతనియందు గవరయ్యకి చాలా గౌరవం ఉండేది.

ఒకరోజు తాశీల్దారు వెనకాతల కాయితాలు పట్టుకొని మరొక ఆఫీసుకి గవరయ్య వెళ్ళవలసి వచ్చింది. ఆ దార్లోనే ఉంది గవరయ్య ఇల్లు.

"అదే బాబు మా ఇల్లు" అని తాశీల్దార్ కి గవరయ్య గొప్పగా తన ఇల్లు చూపించేడు.

"ఏది! అదేనా?" అనడిగేడు తాశీల్దారు అటువైపు చూసి.

"చిత్తం" అన్నాడు గవరయ్య ముసిముసిగా నవ్వుతూ.

గవరయ్య ముసిముసిగా నవ్వడానికి కారణం, ఆ సమయానికి తల దువ్వుకొంటూ రామయ్యమ్మ కిటికీదగ్గరకి రావడం.

"బావుందిరా! పెంకుటిల్లే నే!" అన్నాడు తాశీల్దారు.

అతనలా అన్నందుకు చాలా గొప్పపడిపోయేడు గవరయ్య.

"ఏదో బాబు. మా అమ్మ కష్టపడి కట్టించింది" అన్నాడు

"ఆహా!" అన్నాడు తాశిల్దారు.

"అవునండి. మా అమ్మే కట్టించిందండి" అన్నాడు గవరయ్య మళ్లీను.

"అయితే ఆ కిటికీదగ్గర పిల్ల నీ చెల్లెలంట్రా?" అని అడిగేడు తాశిల్దారు.

"కాదండి, నా ఆడమనిషండి అది" అన్నాడు గవరయ్య సిగ్గుతో.

"చక్కటి చుక్కని సంపాదించేవురా" అన్నాడు తాశిల్దారు.

తాశిల్దారలా అన్నందుకు గవరయ్య చాలా మురిసిపోయేడు.

ఆరోజు రాత్రి రామయ్యమ్మకి మల్లెపువ్వులు కొని తెచ్చేడు.

ఆరోజునే అందిన జీతం ఆమె చేతిలో పోసేడు.

సరదాలో ఉద్యోగం చేసేడు గవరయ్య.

సాధారణంగా తాశిల్దారు ఎక్కడకో అక్కడకి తిరుగుతూ ఉండేవాడు. అతన్తో నూకరాజు సాధారణంగా వెళ్ళేవాడు. తాశిల్దారు లేనప్పుడు గుమాస్తాలు పడుక్కునేవారు. అటువంటప్పుడు నూకరాజుకి అట్టే పని ఉండేది కాదు.

తాశిల్దారు ఓరోజు మధ్యాహ్నం ఆఫీసులో లేరు. గవరయ్యకి ఆరోజు మధ్యాహ్నం ఎందుకో గాని బాగా ఆకలిగా ఉంది. "బాబూ ఇంటికిపోయి భోంచేసివస్తా" అని హెడ్ క్లార్కుని అడుగుతే అతను "పొద్దు టెందుకు చెయ్యలేద"ని విసుక్కొని చివరకి "సరే పోయిరా వేగిరం" అన్నాడు.

తొందరగా నడుచుకొంటూ ఇంటికి వచ్చేడు గవరయ్య.

ఇంటికి వచ్చిన గవరయ్య ఇంటికి రాగానే చాలా ఘోరమైన దృశ్యం చూసేడు.

రామయ్యమ్మ అతిణ్ణి చూసి కెవ్వున కేక వేసింది.

భయంతో వికృతంగా మారిన ముఖంతో తాశిల్దారుకూడా మంచంమీంచి లేచేడు.

గవరయ్య ఒళ్లు ఆ దృశ్యం చూడగానే నీరయిపోయింది; గడ్డకట్టి రాయిగా మారిపోయింది; అగ్నిలో దగ్ధమైపోయింది; ఊపిరాడక కొట్టుకుపోయింది.

గవరయ్యకి ఒంటిమీద తెలివిలేదు.

వెర్రిగా ఎక్కడకో నడుచుకొంటూ పోయేడు.

స్మారకం వచ్చేక సముద్రతీరాన్ని కూర్చొన్నానని తెలుసుకున్నాడు.

అప్పటికే రాత్రి ఏడుగంటలు దాటింది. నల్లగా ఉన్న ఆకాశంలోకి తెల్లగా ఉండే చంద్రుడు రాలేదు. నీలిసముద్రం నీలిరాత్రిలో నీడనీడగా కనిపిస్తూ ఏకరోదన చేస్తోంది భయంకరంగా. మధ్య మధ్య పెద్దపెద్ద కెరటాలు ఫెడేల్ మని విరిగి, దభేల్ గుభేల్ మని పడుతున్నాయి.

తీరాన్న కూర్చొన్న వారంతా ఇళ్ళకి పోతున్నారు.

కెరటాలు ముందుకి వస్తున్నాయి. విరిగిపడి ముందుకివచ్చి వెనక్కి పోతున్నాయి.

"చంపేస్తాను. చంపేస్తాను. చంపేస్తాను"

అని తనలో తను గొణుక్కుంటున్నాడు గవరయ్య.

"బాకుతో పొడిచేస్తాను. పొడుస్తాను. పొడుస్తాను"

గవరయ్య భుజంమీద ఎవరో చెయ్యి వేసేరు.

తుళ్ళిపడ్డాడు గవరయ్య.

"ఎందు కలా భయపడతావ్? నేనూ నూకరాజుని" అన్నాడు నూకరాజు ఇసుకలో చతికిల బడుతూ.

గవరయ్య మాట్లాడలేదు.

"కాని, ఇదేమిట్రా గవరయ్యా! ఆఫీసుకి రాలేదు. ఇంటిదగ్గిర లేవు. ఇక్కడొచ్చి ఇలా కూర్చున్నావేమిటి? ఏమిటొచ్చింది? ఏమిటి కథ? నీవాటం చూస్తే నౌఖరీ అక్కర్లేనట్టుంది!" అన్నాడు నూకరాజు.

నవ్వాలా, ఏడవాలా, కోపం తెచ్చుకోవాలా?

గవరయ్య జవాబు చెప్పదల్చుకోలేదు.

కోపం తెచ్చుకోవాలా? ఏడవాలా? నవ్వాలా?

గవరయ్య అసలు మాట్లాడదల్చుకోలేదు.

కాని, మరో పావుగంటకల్లా, జరిగినదేమిటో అతనిచేతనే చెప్పించి తెలుసుకున్నాడు నూకరాజు.

"వెస్తానే దాన్ని నరికేస్తాను" అన్నాడు గవరయ్య.

నూకరాజు నవ్వేడు.

"నవ్వేవంటే చూసుకో" అంటూ పిడికిళ్ళు బిగించేడు గవరయ్య.

"ఆగరా, బాబూ, ఆగు! ఒక్క క్షణం ఆలోచించు. ఆ లంజకోసం మన బ్రతుకులు పాడుచేసుకుంటామా? ఇదిపోతే దీని బాబులాంటిది మరొకర్తె వస్తుంది. నే చెప్పినట్టూ చెయ్" అన్నాడు నూకరాజు గవరయ్య కోపాన్ని లక్ష్యపెట్టకుండా.

అన్నాక మరో అరగంటకల్లా తన సలహో గవరయ్యని ఒప్పించేసేడు నూకరాజు.

రాత్రి తొమ్మిదిగంటలకి గవరయ్య తిన్నగా తాశిల్దార్ ఇంటికి వెళ్ళేడు.

తాశిల్దారు ఇంట్లోనే ఉన్నాడు.

పెద్దగొంతుకతో అతణ్ణి బండ బూతులు తిట్టడం ప్రారంభించేడు గవరయ్య వీధిలో నిల్చొని.

కేకలు విని వీధిలోకి వచ్చేడు తాశిల్దారు.

వీధిలో చాలామంది మనుష్యులున్నారు.

తాశిల్దార్ రాగానే గభీమని అతని చొక్కా పట్టుకున్నాడు గవరయ్య.

"ఇప్పు డెక్కడికి పోతావ్రా! లంజకొడకా" అంటూ సాగించేడు.

తాశిల్దార్‌కి అయోమయంగానూ భయంగానూ ఉంది. చుట్టూ ఉన్న జనం ఇద్దర్నీ విడదీయబోయేరు. కాని గవరయ్య పట్టు విడవలేదు. తాశిల్దారు పెనుగులాడుతున్నాడు.

"ఎందు కెందుకు?" అని కొంతమంది గాభరాతో కేకలువేసి అడిగేరు.

"ఎందుకా? రేపొద్దున్న పేస్ట్రీటు కచేరీకి రండి. అక్కడ చెప్తాను" అంటూ గవరయ్య గట్టిగా అరిచేడు.

ఇంతలో ఎక్కణ్ణించో కాని తొందర తొందరగా వచ్చేడు నూకరాజు.

వస్తూనే గవరయ్యని ఓ పక్కకీ, తాశిల్దార్ని ఇంకోపక్కకీ విడదీసి తోసేసేడు.

మెరుపులాగ తొందరగా ఇంట్లోకి పోయేడు తాశిల్దారు.

"తాగుబోతు లంజకొడకా! పెద్దవాళ్ళింటి దగ్గిరా అల్లరి? పద పోలీస్టేషన్కి" అని కేకలువేసి గవరయ్యని గొరగొర ఈడ్చుకు పోయేడు నూకరాజు.

వీధిలో చుట్టూ చేరిన వాళ్ళలో చాలామంది "ఎవరో తాగుబోతు వెధవ!" అనుకున్నారు.

చాలామంది అలా అనుకో లేదుకూడా.

మరోక అరగంటకి నూకరాజు తిరిగివచ్చి తాశిల్దార్‌తో మంతనాలాడేడు రహస్యంగా.

"నే నుండగా తిరిగి మీ కాభయం ఎన్నటికీ రాదు" అని తాశిల్దార్‌కి హామీ ఇచ్చేడు.

అరీతిగా అతను హామీ ఇచ్చినతరువాత ఇద్దరూ కలిసి వల్లమంద షావుకారింటికి వెళ్ళి నాలుగు వందల రూపాయలు తెచ్చేరు.

ఆరాత్రే నూకరాజు వెళ్ళి గవరయ్యచేతిలో రెండువందలు పోసేడు.

"మానేవా మరి? అన్నట్టుగా చేశానా లేదా? ఇప్పు డేమంటావ్?" అన్నాడు నూకరాజు సగర్వంగా.

అన్ని సంవత్సరాలూ మందంగా మొద్దుగా ఉన్న గవరయ్య మెదడు ఒక్కసారిగా పదునెక్కింది.

"ఇంతేనా?" అని అడిగేడు.

"ఏమీ! ఎంతున్నాది?"

"రెండువందలు"

"అవును అంతే" అన్నాడు నూకరాజు.

"వాణ్ణి వెళ్ళి అడగనా?" అన్నాడు గవరయ్య నవ్వుతూ.

నవ్విన నవ్వు వెటకారంగా, వికృతంగా, అమానుషంగా ఉంది.

నూకరాజు నిర్ఘాంతపోయేడు.

"ఇదివరకటి వెర్రిగవరయ్య కాడు వీడు. వీడు కొత్త గవరయ్య" అన్నాడు గవరయ్య.

మిగతా రెండు వందలూకూడా అతని చేతిలోకి వచ్చేయి.

తరువాత—

నూకరాజు ఆరాత్రి తలవంచుకొని ఇంటికి పోయేడు.

ఆరాత్రే తల మొత్తుకొంటూ రామయ్యమ్మ పుట్టింటికి పోయింది.

నాల్గవనాటి ఉదయం తాశిల్దార్ చేతుల్లోంచి మరోక నాల్గు వందలు గవరయ్య ఇంట్లోకి వచ్చేయి.

నాల్గవనాటి రాత్రే తాశిల్దారు ఉరిపోసుకొని పరలోకానికి పోయేడు.

అది.!

లక్షలమీద వ్యాపారం చేస్తూన్న గవరయ్యకి ఆదిలో మదుపుకి సొమ్ము అరీతిగా వచ్చింది.

మొద్దుగా ఉండి వుండి ఒక్కసారిగా పదు నెక్కిన అతని మెదడు కత్తి పదునుతో పనిచేస్తోంది అప్పటినుంచీ.

సాధారణంగా కత్తికి కనికరం తక్కువ!

ఆ దినం మధ్యాహ్నం పన్నెండు గంటల అయిదు నిమిషాలసమయంలో హెడ్ క్లార్కుతో చిరునవ్వు నవ్వుతూ మాట్లాడుతూన్న గవరయ్యని చూస్తోంటే సుబ్బయ్యకి భయం కలిగింది. కొంచెం చలిత్రో వణికేడు.

ఈయన్ని సామెల్లా అడగడం?

మరోక పదినిమిషాలుపోయాక గవరయ్య కుర్చీ లోంచి లేచేడు.

వెళిపోతాడా ఏమిటి చెప్మా?

లేదు. లేదు. ఇలా వస్తున్నాడు.

"ఏమండోయ్, సుబ్బయ్యగారూ! ఎంతవరకూ తీసుకొచ్చేరు మమ్మల్ని?"

"ఇదిగో, ఇదిగో, కూర్చోండి"

"క్షమించాలి. ఇవాళ ఓ అర్జంటు పని వుంది ......మళ్ళీ వస్తా...కాని మా 'బిల్స్' కొంచెం వేగిరం తెములుద్దురూ!"

"దానికేముందండీ...నాలుగైదురోజుల్లో..."

"అయిపోతుందికదా?"

"ఓ!"

"మరయితే నే సెలవు తీసుకొని వస్తా. మళ్ళీ కలుద్దాం"

అని తన వల్లటి మీసాల్లోంచి ఎర్రగా నవ్వుతూ వెళ్ళేడు గవరయ్య.

వెళ్తున్నాడు! వెళిపోతున్నాడు!

ఒక్కసారి కళ్ళు మూసుకొని, ఊపిరి బాగా పీల్చి కుర్చీలోంచి లేచి వరండాలోకి త్వరగా వెళ్ళేడు సుబ్బయ్య.

"గవరయ్యగారూ! గవరయ్యగారూ!"

మెట్లు దిగుతూన్న గవరయ్య టక్కుమని ఆగేడు.

"ఏం సుబ్బయ్యగారూ?"అన్నాడు గవరయ్య. ఏమిటి రాబోతోందో తెలిసినవాడిలాగ ముఖం పెట్టేడు. వెంకట్రావుని దృష్టిలో ఉంచుకున్నాడు. సుబ్బయ్య. వెంకట్రావు చెప్పినమాటలు జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. అతని నుదుటిమీద దట్టంగా పట్టిన చెమట అతనికి ఎంత గాభరాగా ఉన్నదీ తెలియ చేస్తోంది.

"నాకో అయిదువందలు అర్జంటుగా కావాలి గవరయ్యగారూ? మీ రెలాగైనా సరే సాయం కాలంలోపున సదుపాయంచేసి సహాయంచెయ్యాలి."

హమ్మయ్య! అడిగేశాను! పాపని పూర్తయింది! ఇంక అతి నేమన్నా సరే.

ఒక్కక్షణమే చూసేడు గవరయ్య తీక్షంగా. కొంచెం నవ్వేడు.

సుబ్బయ్య గుండెలు దడదడ దడాదడా కొట్టు కున్నాయి.

గవరయ్య నవ్వేడు.

"దానికేముందండీ. సాయంకాలం ఇంటికి పంపించనా?"

సుబ్బయ్య గుండెలుఆగి తిరిగి కొట్టుకున్నాయి.

"సరే సరే...చాలా...నేను...చాలా థాంక్స్ గవరయ్యగారూ!"

"మరి నే వస్తా."

"చిత్తం" అన్నాడు సుబ్బయ్య.

గవరయ్య మెట్లు దిగేడు. డ్రైవరు కారు తలుపు తెరిచేడు.

గవరయ్య కార్లో కూర్చొని మెత్తటి దిండ్లకి చేర్లబడ్డాడు.

కారు కదిలింది.

నిజంగా జరిగింది! నిజంగా జరిగిందా?

జరిగినది నిజం! జరిగినది నిజమేనా?

సుబ్బయ్య సంతోషానికి మేరలేదు.

సుబ్బయ్య ఆశ్చర్యానికి మేరలేదు.

ఎలా జరిగింది?

వెంకట్రావు చెప్పినట్టుగా జరిగింది.

వెంకట్రావు చాలా తెలివైనవాడు.

నిజంగా చాలా తెలివైనవాడు.

సుబ్బయ్య చుట్టూ చూసేడు, ఎవర్నయినా కాఫీకి తీసుకు వెళ్దామని.

ఎవరూ లేరు, కొంచెం దూరంలో ఆఫీసు ప్యూన్ వెంకన్న తప్ప.

సుబ్బయ్య ఒంటరిగా కాఫీకోసం "కేంటీన్"కి పోయేడు.

సాయంకాలం ఎంత వేగిరం ఇంటికి వెళ్దామా అనే ఆత్రతతో జోరుగా, తొందరగా నడిచేడు సుబ్బయ్య.

..తోడివాళ్లకంటె ముందుగా నడిచేడు.

ఇంటికీ ఆఫీసుకీ ఉన్న దూరం దగ్గరవుతూన్న కొద్దీ అతని ఆత్రత జాస్తీ అవుతోంది.

వడివడిగా వెళ్ళేడు.

గుమ్మంలో కమల నిల్చొనుంది.

"ఏమే కమలా! నాకోసం ఎవరైనా వచ్చేరా?????"

"లేదు, నాన్నా!"

"ఎవరూ రాలేదా?—!

"లేదు. నాన్నా"

"మావయ్య రాలేదా"

"లేదు నాన్నా......అన్నట్టు మర్చిపోయేను. ఇందాట్లా ఎవడో వచ్చేడు నాన్నా!!"

"ఎవరే, ఎవరు?????!!

"అదుగో, అతనే నాన్నా" అంటూ చూపించింది కమల.

లావుగా, పొట్టిగా, బుగ్గమీసాల్తో, కారు నలుపుతో, సూది ముక్కుతో యాభయ్యేళ్ళ మనిషి వచ్చి సుబ్బయ్యనిచూసి కొంత సందేహిస్తూ నిల్చున్నాడు.

"ఇదుగోనోయ్! మానాన్న!" అన్నది కమల అతన్తో.

"మీరేనాండి, సుబ్బయ్యగారు?" అని అడిగేడతను.

"ఆ. ఆ! నేనే! నేనే! ఏంకావాలి మీకు??!!!

"గవరయ్య పంపించేడండి"

"ఆహా! ఆహా! లోనికి రా! రా!" అంటూ ఇంట్లోకి దారి తీసేడు సుబ్బయ్య.

గవరయ్య పంపిన మనిషి నడవలోకి వచ్చేక జేబులోంచి కరెన్సీ నోట్లు తీసేడు.

"ఇవి తమరికి ఇమ్మన్నాడండి గవరయ్య"

కంగారు పడుతూ నోట్లు పుచ్చుకున్నాడు సుబ్బయ్య.

"ఆహాఁ! ఆహాఁ! సరే! సరే!"

కంగారుపడుతూనే నోట్లు లెక్క పెట్టబోయేడు సుబ్బయ్య.

"లెక్క సరిగ్గానే ఉందండి. అయిదువందలు" అన్నాడు నోట్లు తెచ్చిన మనిషి.

అతనిముందే లెక్క పెట్టడం తప్పా! ఏమనుకుంటున్నాడో ఏమిటో!

సుబ్బయ్య భయపడ్డాడు.

"ఏం బావా! నే చెప్పలేదూ వాడివ్వకపోడని" అని నవ్వుతూ నడవలోకి వచ్చేడు వెంకట్రావు, సమయానికి.

వెంకట్రావు రాగానే పట్టరాని గర్వంతో అతని చేతికి సొమ్మిచ్చేడు సుబ్బయ్య.

"బాబూ, దండాలండి" అన్నాడు గవరయ్య పంపిన మనిషి వెంకట్రావునిచూసి.

"ఏంరా పోతన్నా! కులాసాగా ఉన్నావా?" అని అతణ్ణి పలకరించేడు వెంకట్రావు.

"మీ దయవల్ల నింపాదిగానే ఉన్నాను" అన్నాడతను.

"ఏమంటాడు మీ యజమాని?" నోట్లు లెక్కపెడుతూ అడిగేడు వెంకట్రావు.

"సొమ్ము ఈ బాబుకిమ్మని పంపేడండి"

"నువ్వేనా తెచ్చింది?"

"చిత్తం"

"సరేకాని, ఆ వెధవదగ్గిర పని మా నేయమంటే మానవేంరా, పోతన్నా?"

పోతన్న సమాధానం పైకిరాకుండానే "ఈమనిషిని నీకెలా తెలుసునోయ్" అని సుబ్బయ్య అడిగేడు.

"ఇదివరకు నా నౌఖరు వీడు" అన్నాడు వెంకట్రావు పోతన్నకి ఒకరూపాయిస్తూ.

"ఒస్తాను బాబూ! దండాలు!" అని రూపాయ పుచ్చుకొన్న పోతన్న వెళిపోయేడు.

అంతసేపూ అక్కడే నిల్చొన్న కమల ఇచ్చుట రూపాయిమాడగానే "మామయ్యా! నాకో కాణీ ఇయ్యవూ" అంటూ చెయ్యి జాచింది.

"జమీందార్ల మనవరాలివి, అకౌంట్సు ఆఫీసర్ కూతురివి. ఒక్క కాణీనా అడుగుతావు? తీసుకో అయిదురూపాయలు!" అంటూ అయిదురూపాయల నోటు కమలచేతికి ఇచ్చేడు వెంకట్రావు.

"హాయిదు రూపాయలే!!!" అన్నది కమల సంతోషాశ్చర్యాలతో.

కమల ఎంత సంతోషించిందో సుబ్బయ్య కూడా అంతా సంతోషించేడు.

"అమ్మకిచ్చి దాచమను! ఏం?" అన్నాడు.

"అమ్మా! అమ్మా!" అంటూ కమల ఇంట్లోకి పరిగెత్తింది.

"చాలా థాంక్స్ బావా!" అన్నాడు వెంకట్రావు.

"దానికేం లేవోయ్" అన్నాడు సుబ్బయ్య.

తనవంటి ఎందుకూ కొరగాని మనిషి అంతటి ఘనకార్యం చేయగలిగినందుకు అతనికి చెప్పలేనంత సంతోషం కలిగింది.

అతని కళ్ళు ఆనందబాష్పాలతో నిండేయి.

నడవలో ఇద్దరూ నిల్చొని ఉండగా లోన సావిత్రి కమలని అడుగుతోంది గట్టిగా.

"అడుగుతే ఇచ్చేడా? అడక్కుండా ఇచ్చేడా? చెప్పు!!"

కమల చెప్పిన జవాబు వినిపించలేదు.

"ఎందుకలా అడిగేవో చెప్పు!"

కమల ఏడుపు వినవచ్చింది.

సుబ్బయ్య లోనికి పరుగుతీసేడు.

అయిదువందల రూపాయలనోట్లు చేత్తో పట్టుకొని వెంకట్రావు నడవలో నిల్చున్నాడు.

ఆ సమయంలో అతను ఏమాలోచిస్తున్నాడో చెప్పడం కష్టం. (సశేషం)

పుష్పవిలాసము ★

శ్రీ యామిజాల పద్మనాభస్వామి

[అదొక్క పూఁదోఁట. పలురకాల పూలజాతులు నవయౌవనముతో మిసమిసలాడుతున్నై. ఒక్కొక్క తీఁగనే పరిశీలిస్తూపోయి నే నొకతిన్నెపై కూర్చున్నాను. అంతలో మలయమారుత కుమారుని చక్కిలిగింతలతో చెలరేగింది పుష్పాడి దుమారం. చివాలున లేచింది మల్లె.]

మల్లె

ఏమే గులాబీ! నిన్న కాక మొన్న వచ్చి నువ్వు తోడి వారినందర్నీ ఆక్షేపిస్తున్నావట? ఎందుకా మిడిసిపాటు?

తావుల్ చల్లుదువా సుదూరముగ?
సంతాలాట సైరింతువా?
తీవిన్ నిల్తువ తెప్పపాటున?
చూడ్కిన్ సైతువా గట్టిగా?
క్రేవన్ బాలసమీరణుండు నిలువన్
ప్రేమించి లాలింతువా?
పోవే; నెత్తురుకోతలే కదవె
నీ పుట్టింటి సౌభాగ్యముల్.

* * *

గులాబి

సరిలే. వారవ్వ మాటలు వినవు చూడు!

వలపులు గుమ్మరించి
సుమభామల చిక్కని కౌగిలింతలం
దలరెడు తేఁటిరాజునకు
హాయిగ స్వాగతగీతి పాడునా?
చెలువము కర్కశంబు కద;
చెల్మియొనుంగమ పావజాతితో;
తల విలువన్ గణింపవలదా
మతి సంపగికన్నె; మల్లికా!

కేతకి

అది అల్లా ఉండనీగాని అక్కా! మల్లికా! ఈ మందారవల్లి నన్నేమని నిందించిందో విన్నావా?

సీ కే చల్లని కేతకీ! కనులలో
నిండార దుమ్మోయఁగా;
తాకన్ నెత్తురు చిందవేళ్లు
కోటుకన్; దర్పంబుగా నిల్వగా;
ఆ కంఠంబుగ పాపజాతికి
శరణ్యంబై మహారణ్యమం

దేశాంతంబుగ రాణివై మెలఁగ;
పరీసాటి నీకీయిలన్.

చేమంతి

ఓహో! దాని అందానికి అదే మురిసిపోవాలి:

పరువంబా! ఎదలోన మెత్తఁదనమా?
భావోల్బణ ప్రక్రియఁ
గరువంబా? మకరంద గంధ విలస
త్కల్యాణ సౌందర్యమా?
బిరుసై నిప్పులముద్దమోముకద; యీ
పేలాపనంబేల? సం
బరమా? వచ్చినదాని నోర్చుకొనునా
పై పెచ్చు? మందారమా?

మందారము

ఔనాను; నీ సౌభాగ్యానికి నన్నాక్షేపించ వద్దూ?

పంతములాడఁబోకె పయివారలు
విన్నను నవ్వుకొందురే;
ఇంతులు దండలల్లకొని
యెంతయు ముచ్చటతో ధరింతురం
చెంతువు నీ విలాసము 'లిల్లీ' యగు
మాలతికన్న ముందు చే
మంతిరో! ఊక రేకుల సుమంబను
పేరది నీది కాదటే;

[అంతలో చేరువనున్న సరోజిని పక్కున నవ్వి]

సరోజిని

దానికేమిలే.—కాని మాలతికో గర్వముంది.

అది రేరాణినటంచు త్రుల్లిపడునమ్మా!
దాని లేనవ్వులో
పదముల్ పాడునటమ్మ! తుమ్మెదలు;
శుభ్రజోత్స్నపై పూతతో
పెదవుల్ నొక్కునటమ్మ! చందురుఁడు;
సస్వీకరించి బల్ టెక్కుతో
ఏదో ఆలాపము సేయు మాలతిని
నే నిన్నాళ్లు సైరింతునే?

మాలతి

సైరింపక యేమి చేయఁగలవే? నీ వాడిన మాటలో?

బంగరుకొండపై పసిమివన్నెల
చిన్నెల బాలభాను రే
ఖంగనవో యటంచును ఎగాదిగ
చూచెదు నన్ను; నీవు రే
లం గమనీయహాస సువిలాస
వికాసము లొప్పవాని చం
ద్రుం గని మూతిమూసికొని
క్రుంగవొ? నీ బ్రతుకే రెఱుంగరో?

* * *

చతురత మీఱ నిట్టి సరసాలిక
చాలును కట్టిపెట్టు నీ
బ్రతుకు భవిష్యమున్ కడిగిపై చెద;
నాచునఁబుట్టి, పీతలన్
కుతుకను దాల్చి, నీచు కనుగొల్కల
చిమ్ముదు; నీటిపుర్వవై
అతుకులబొంతవై; కనటువా తెర
విప్పకుమా సరోజినీ!

ఇల్లా ఒకరినొకరు ఆక్షేపించుకొంటూఉండగా శ్రుతిమించిందని మావికొమ్మపైనున్న

కోకిల

బళిరా! పువ్వులకన్నెలార!
మన సంబంధంబుతో లోకముల్
తెలవారుఁ, కయిసేయు, నవ్వుకొను,
ప్రీతింజెందు; మీలోన మీ
రలయింపఁ దగవా? యటంచు
పగలఁ న్యాయంబుగా తీర్చు రే
ఖల పో పొందనఁ గూసె కో యని
కుహూకారంబు తోరంబుగన్.



"ఇది నిజము...

... మీరు లక్స్ టాయిలెట్ సబ్బుతో

ఇంకా మనోహరముగానుండవచ్చును"

అని సుశీల

చెప్పుచున్నది



నిజముగా ఫలకరమైన నియమము తప్పని సౌందర్య పద్ధతి ఇదిగో: "సువాసనతోగూడుకొన్న మీగడవంటి లక్స్ టాయిలెట్ సబ్బు నురగను నేను నా చర్మము మీద బాగా రుద్దుతాను. తరువాత నేను కడుగుకొని ఒక మెత్తటి తువ్వాలుతో అద్దుకొనగానే నా చర్మము ఒక క్రొత్త అందమును తెచ్చుకొనును," అని సుశీల చెప్పుచున్నది.

లక్స్ టాయిలెట్ సబ్బు

సినీమా తారలకు
సౌందర్యమునిచ్చు సబ్బు

LTS. 367-50 TL

పాల్కురికి సోమనాథునికాలము

★

శ్రీ శిష్టా రామకృష్ణశాస్త్రి

పాల్కురికి సోమనాథకవి యాంధ్రకర్ణాట భాషలలో కావ్యరచనము చేయుటచే నాతని కాలనిర్ణయము చేయుట యుభయవాఙ్మయములకు నుపయోగించును. ఈతని కాలనిర్ణయ విషయ మాంధ్రకర్ణాట దేశములలో నొక సమస్యగా పరిణమించినది. ఈతడు తన యాంధ్రకర్ణాట కావ్యములను చారిత్రిక పురుషుల కెవ్వరికి నంకిత మీయకుండుటచే నీతని కాలనిర్ణయము చేయుటకు సాయపడు నంతఃసాక్ష్యము లీతని గ్రంథములందు గానరావు. తన గ్రంథములందు సమకాలికభక్తుల పేరులను పేర్కొనెను గాని, వారు మతసంబంధవ్యక్తులు మాత్రమెయై, చారిత్రికవ్యక్తులు గాకుండుటచే నతని కాలనిర్ణయ విషయమున పూర్తిగా బహిఃప్రమాణముల మీదనే యాధారపడియుండవలసి వచ్చుచున్నది.

పాల్కురికి సోమనాథుని బసవపురాణమును చంపువుగా రచించిన పిడపర్తి సోమనాథుడా గ్రంథపీఠికలో పాల్కురికి సోమనాథునిగూర్చి కొన్ని విషయము లీ క్రిందివిధమున దెల్పినాడు:— ఒకనాడు ప్రతాపు డోరుగల్లునందలి స్వయంభూ దేవాలయమును సందర్శింపబోగా నచట నొండొరులు పురాణపఠనము గావించుచుండగా చూచి, యది యే గ్రంథమని విచారించెనట. అంత నక్కడనున్న వారిలో నొక దుష్టయుక్తికుడు, 'ఈమన్య పాల్కురికి సోమనాథుడను పతితుడు ద్విపదకావ్యము నొక దానిని మన్యప్రాసయతులను గూర్చి రచించిన యప్రమాణ గ్రంథమని చెప్పగనే, రాజు మరలి పోయెను. ఈ సమాచారమును వెంటనే సోమనాథుని శిష్యులు పాల్కురికి గ్రామమునందున్న సోమనాథుని యొద్దకుపోయి తెల్పిరట. అంత వెంటనే పాల్కురికి సోమనాథు డోరుగల్లునకు వచ్చి యతివుల నోడించి, కొంతకాల మక్కడనున్న పిమ్మట, దూరదృష్టిచే నా ప్రదేశము త్వరలో తురుష్కాక్రాంతముగా గలదని తెల్పి, తన శిష్యునును, ప్రతాపుని మంత్రియు నగు ఇందులూరి అన్నయచేత పిడపర్తి శివరాత్రి కొప్పయకు దోకిపఱ్ఱు అగ్రహారము నిప్పించి తాను కన్నడభూమి కేగెను. కొంతకాలము తర్వాత దోకిపఱ్ఱు గ్రామమునకు గొన్ని యడ్డుపాట్లు గలుగగా శివరాత్రి కొప్పయమనుమడగు పెదసోమయ తిరిగి యా యగ్రహారమును ప్రౌఢరాయ మహీపాలుని యనుగ్రహముచే సంపాదించెనట. (పద్య బసవ పురాణము ఆ 1. పద్య. 28-46.)

పిడపర్తి వంశీయులకు పాల్కురికి సోమనాథుడు గురుపీఠము మాత్రమే కాక మహోపకారపరుడు గూడ నగుటచే వారి మాటలు విశ్వసనీయము గాక తప్పవు. పైన దెల్పిన పిడపర్తి సోమనాథుని వాక్యములను ప్రమాణముగా గ్రహించి కందుకూరి వీరేశలింగము గారు తమ యాంధ్రకవుల చరిత్ర ప్రథమ ముద్రణమున (పుట. 92-ముద్రణ-1885) పాల్కురికి సోమనాథుడు క్రీ. శ 1295-1323 వరకు కాకతీయ రాజ్యమేలిన ద్వితీయ ప్రతాపరుద్రుని కాలమువాడని వ్రాసిరి. కాని తర్వాత ఆర్. నరసింహాచార్యులవారు తమ 'కన్నడ కవుల చరిత్రలో' పాల్కురికి సోమనాథుని కాలమును, కన్నడకవియగు సోమరాజు రచించిన యుద్భటచరిత్రమీద నాధారముచేసి నిర్ణయించినారు. ఉద్భటచరిత్రమందు వృషభ స్తవ మొనర్చిన సోమనాథుడు స్తుతింపబడుట చేతను, వృషభ స్తవమును ధారాళముగ తన కావ్యములలో చేసిన మరియొక సోమనాథుడను కవి లేకుండుట చేతను, పాల్కురికి సోమనాథునే సోమరాజు స్తుతించియుండునని భావించి, సోమరాజుకంటె పూర్వుడు పాల్కురికి సోమనాథుడని నిర్ణయించిరి. సోమరాజు 'ఉద్భట చరిత్ర'ను శక సం. 1144 తో సరియగు క్రీ. శ. 1222, చిత్రభాను సం. ఆశ్వయుజ శుద్ధయేకాదశి బుధవారమునాడు రచించితినని యందె వ్రాసికొనెను. ఆ కన్నడ పద్యము లివి:—

"ప్రమథానీక కథార్ణవేందు
హరిదేవా చార్య నం ధైర్యనం
విమలజ్ఞాన సుదీపికా స్ఫురిత
చేత స్సద్మనం పద్మనం

సముదంచద్వృషభ స్తవా మర
మహీజారామ వం సోమనం
క్రమదిందం బలగొందు పేశ్వే
నొసెదా నీ కావ్యమం సేవ్యమం"
"జననాథో త్తమ సోమరాజను
నిర్దిక్కావ్యం బలం శాలివా
హన శాకాబ్దము దద్దొ సాసిరద
నూజింపింద సాల్వత్తునా
ల్కనెయారంజిత చిత్రభాను
వవరార్శ్వ జ్యోత్స్నై కాదశీ
వనజాతారి తినాజ వాసర
దొళాద త్తిల్ల మంగర్పితం"

దీనిని బట్టి పాల్కురికి సోమనాథుడు క్రీ. శ. 1195 సం, నకు పూర్వుడుండెనని నిర్ణయించిరి.

పై ప్రమాణమును బట్టి తెలుగు విమర్శకులందరు పాల్కురికి సోమనాథుని కాలమునుగూర్చి తమ యభిప్రాయమును వెనుకాడక మార్చుకొని, యాప్రాంతమున క్రీ. శ. 1132-1198 వరకు కాకతీయ రాజ్యమేలిన రుద్రదేవుడను రాజే యోరుగల్లున స్వయంభూదేవాలయమును జూడబోయిన వాడనియు, నాతడు (ప్రథమ) ప్రతాపరుద్రుడని గూడ పిలువబడెనని యనుగుణముగ వాదించిరి. అట్టివారిలో మిత్రులు శ్రీ బండారు తమ్మయగారు మొదటివారు. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు బసవపురాణ పీఠికలో గూడ నిట్లే ప్రతిపాదించిరి. కందుకూరి వీరేశలింగం గారు తమ ఆంధ్రకవులచరిత్ర ద్వితీయ ముద్రణమున పూర్వాభిప్రాయమును మార్చుకొని నూతన మతమునే గ్రహించిరి.

కాని పాల్కురికి సోమనాథుడు క్రీ. శ. 1195 సం॥ నకు పూర్వమే యుండెనని మన మంగీకరించినచో, నాతడు బసవారాధకుడుగాన, 1168 సం॥ న లింగైక్యమొందిన బసవన నతడు ప్రత్యక్షముగా నెరిగియుండునని నమ్మవలసియుండును. కాని బసవచరిత్రమును సోమనాథుడు భక్తులవలన మాత్రమె తెలిసికొనెనని యాతని యీక్రింది ద్విపదలను బట్టి తెలియుచున్నది.

"అసదృశంబై యొప్పు బసవపురాణ
మెసకంబుతో జెప్ప నిష్టమయ్యెడిని
వరకథామాత్రంబు విరవిజేగించి
చరితార్థు జేయరే కరుణతోనంచు"

అని బసవనను గూర్చి తన యజ్ఞానమును వెలిబుచ్చుడు గదా. మఱియు సోమనాథుని ప్రథమ కృతియైన 'అనుభవసార' ప్రారంభమున మల్లికార్జున పండితుని స్తుతించినాడు గాని, బసవనను స్మరింపనైన లేదు. మిగిలిన కావ్యములందు పండితునికంటె బసవనను విశేష గౌరవ ప్రపత్తులతో స్తుతించినాడు. కాన అనుభవసార రచనాకాలమునకు బసవన పేరైన నాతడు వినియుండడు. అందుచే బసవపురాణమున నట్లు వ్రాసియుండును. తర్వాత సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రమున, తాను చెలిదేవి వేమనారాధ్యుని మనుమని శిష్యుడని యిట్లు వ్రాసికొనెను.

"పేరెక్కదగిన శ్రీ చెలిదేవి వేమ
నారాధ్యులను పరమారాధ్య దేవు
మనుమని శిష్యుడ."

చెలిదేవి వేమనారాధ్యుడు పండితారాధ్యుల వారిచే పూజింపబడెనని సోమనాథుడే పండితారాధ్య చరిత్రమున రచించెనుగాన వారిద్దరు సమకాలికు లనుట స్పష్టము. క్రీ. శ. 1168 సం॥న బసవన లింగైక్యమొందిన స్వల్పకాలమునకే 1170 ప్రాంతమున పరమపదించిన పండితారాధ్యులకు సమకాలికుడైన వేమనారాధ్యుని మనమని శిష్యుడైన సోమనాథుడు క్రీ. శ. 1195 పూర్వముననే లబ్ధప్రతిష్ఠుడై యుండజాలడు. అట్లే యనుచో నతడు వేమనారాధ్యులకే ప్రత్యక్ష శిష్యుడగును గాని, యతని మనుమని శిష్యుడేల యగును. సామాన్యముగా నతని మనుమని శిష్యుడు గావలయునన్న మూడు తరములకు 25 సం॥ చొ॥ రెండుతరములకు 1170 + 50 = 1220 సం॥ నాటికి సోమనాథుడు శిష్యప్రాయమున నుండును. పోనీ, 1170 సం॥నకు వేమనారాధ్యుల మనుమడు 15 సం॥ వయసు వాడనుచో, నతడు గురువగునప్పటికి హీన పక్షము 35 సం॥ వయస్సు వాడగునని తలంచినను, 1190 సం॥ నకు పాల్కురికి సోమనాథుడు శిష్యప్రాయముననే యుండును గదా. 1195 సం॥ న నెట్లు ప్రసిద్ధుడు కాగలడు. మరియు పండితారాధ్య చరిత్రాంతమున, పండితుని కుమారుడైన కేదారయ్య పుత్రచతుష్టయము నొక్క —

"గురు చతుష్కమూర్తి సంతాన
తనయ పరం పరోత్తర పరంపరలు
పరిచితగురు పరం పరలు తేజరిల్ల"

అనియు సోమనాథుడు రచించుటచే, పండితారాధ్య పాల్కురికి సోమనాథుల మధ్య కొన్ని తరములు గడిచినట్లు గనబడుచున్నది. ఈ యసందర్భముచే సోమనాథుడు 1195 సం॥ నకు పూర్వుడు

గాజాలదు. శ్రీ బండారు తమ్మయ్యగారు తలచినట్లు పాల్కురికి సోమనాథుడు క్రీ. శ. 1160 సం॥ లో పుట్టెనని యంగీకరించినను, వేమనారాధ్యుల వారి సమకాలికుడైన పండితారాధ్యులవారి నిర్యాణ కాలము 1170 సం॥ నకు, వేమనారాధ్యుల మనుమనికి 10 లేక 15 సం॥ కంటె నధికముండుటకు వీలులేదు. అప్పటికి పాల్కురికి సోమనాథుడు 10 సం॥ ల ప్రాయమువాడగును గదా. కావ్యములో చెప్పఁబోదగిన గురువు శిష్యునికంటే 15 లేక 20 సం॥ లు పెద్దవాడు గానిదే గురుభావము సిద్ధింపదు. ఈ పట్టున నా వ్యాఖ్యానము లేకుండుటచే నీ తలపు సమంజసముగా నుండదు. మరియు 1195 సం॥ నకు పాల్కురికి సోమనాథుడు 35 సం॥ ల వయసువాడగును. అప్పటికే కన్నడ దేశమునకు వ్యాపించు ప్రసిద్ధకీర్తిని గణించెననుటయు విశ్వసనీయముగాదు. క్రీ. శ. 1222 సం॥ లో ఉద్భట చరిత్రమును రచించిన సోమరాజు తన సమకాలికుడును, పరదేశీయుడు నగు పాల్కురికి సోమనాథుని స్తుతించుటకు పాత్రునిగా పరిగణించినపుడు, క్రీ శ. 1369 సం॥ భీమకవి యతని బసవపురాణమును కన్నడ భాషలో రచించుటకును, శ్రీనాథుడు 1395 లో పండితారాధ్యచరిత్రమును ఛందపువుగా వ్రాయుటకును, పాల్కురికి సోమనాథుడు, ద్వితీయ ప్రతాపరుద్రుని కాలము 1293—1323 సం॥ ల కంటె ప్రాచీనకము కాకపోయినచో "నా కావ్యములు విశేషవ్యాప్తిని చెందిన యంత సమీప కాలములో పైని చెప్పిన కవులచే ననువదింపబడుటకు తగిన యవకాశ ముండ నేరద"ని వాదించుట సమంజసముగా నుండదు గదా. పై ఇద్దరు కవులు సోమనాథుడు చనిపోయిన 70 సం॥ తర్వాత నాతని గ్రంథముల ననువదించిరి. కాని సోమరాజు, తమ్మయ్య, నరసింహాచార్యుల వార్ల వాదము ప్రకారము. 18 సం॥ తర్వాతదనిపో నున్న సోమనాథకవిని స్తుతించుటకు 'అతని పేరు విశేష వ్యాప్తినొందుట కవకాశ ముండునంత ప్రాచీన కాలములో నుండె'నని యేమి భావించుచున్నారా? సాక్షికాభియాన పూరితమైన దీ వాదము కాదా? కావన పాల్కురికి సోమనాథుని కాలమును కన్నడ కవియగు సోమరాజు రచించిన ఉద్భటచరిత్రపై నాధారపడి నిర్ణయింపరాదనుట స్పష్టము.

మఱియు కన్నడ కవియైన సోమరాజు ఉద్భట చరిత్రను రచించిన కాలమును దెల్పు పద్యపాఠము నందు వ్యాకరణదోష ముండుటచే నరసింహాచార్యుల వారు దిద్దిరని డా. వెంకటసుబ్బయ్యగారు తెల్పిరి. కొన్ని లిఖితప్రతుల ప్రకార మా కాలము 300 సం॥ తర్వాత నగుచున్నది. ఆ పాఠమిది—'నాసిరద నానూర్నంద నాల్వత్తు నాల్కనె.'—అనగా, శక సం—1444 (క్రీ. శ. 1522.) ఇంతేకాక, శక సం॥ 1444 శ్లోకమున దెల్పిన చిత్రభాను సం॥ ఆశ్వీజ శుద్ధ ఏకాదశీ బుధవారముతో సరిగా సరిపోవుచున్నది. కాని శ. క. సం॥ 1144 ఆ సంవత్సర వార నామములతో సరిపోవుటలేదు.

దీనికి సమాధానముగా ఆర్. నరసింహాచార్యుల వారేమన్నారనగా—తానా పాఠమును దిద్దినట్లుగాని, తానే లిఖితప్రతిని చూచిన జ్ఞాపకముగాని లేదనియు, పండితకవియైన సోమరాజు మాత్రము 'నానూరు సంద' యను వ్యాకరణ దుష్టమైన ప్రయోగమును చేయునని విశ్వసింపననియు, తానా పాఠమును దిద్దుట కప్పటికి సోమరాజును గూర్చి యే యభిప్రాయమునుగాని యుండుటకు వీలులేదయు వాదించిరి. నరసింహాచార్యులుగారు మొట్టమొదట నేదో మతమును పురస్కరించుకొని సోమరాజు పాఠమును దిద్దిరని యెవరనగలరు. వ్యాకరణ విరుద్ధమైన 'నానూరు సంద'యను పాఠమును చూడగనే లేఖక ప్రమాదమైయుండునని భావించి, సోమరాజ కవికి నింద కలుగకుండుటకై యథాయుక్తముగ నా దుష్టప్రయోగమును ఆచార్యులవారు దిద్దియుందురు. అది వ్యాకరణవిరుద్ధ ప్రయోగమగుటచేతనే వారు దానిని దిద్దిరని చెప్పవలసివచ్చినదిగాని, దుష్ట ప్రయోగము గానిచో నా రకారణముగ మొట్టమొదట దిద్దుటకే యవకాశ ముండెడిది కాదు. అందుచే దాని పర్యవసానమును గూర్చి గూడ వారికి దూరాలోచన లేకపోయియుండును. ఈవిధముగ సకల భాషలలోను పండితులందరు ప్రారంభమున చేసియే యుండిరి. ప్రతిభాషలోను ప్రారంభమున గ్రంథ సంస్కర్త లనేకులు గ్రంథములందు వ్యాకరణ దోషములు లేకుండ దిద్దుటయందు వహించినంత శ్రద్ధను గ్రంథవిషయమునుగూర్చి వహింపక, తొందరపడి పాఠములను దిద్దిరి. తర్వాత తత్పర్యవసానము ప్రమాదకరమైనట్లుగ గుర్తించుటచేతనే యిటీవల నవీన పీఠికలలో పాఠాంతరముల నిచ్చు నాచార ముల్పడినది. ఈ కాలమున విమర్శకులు విషయముకంటె శుద్ధవ్యాకరణ ప్రయోగమున కెక్కువ ప్రాధాన్యమునిచ్చుటలేదు. సోమరాజకవి గూడ సంవత్సర మాసతిథి వాసర నామములను గణబద్ధముగ పద్యములో నిముడ్చ కొంతక్లేశము పొంది, విషయత్యాగముకంటె వ్యాకరణ రూపత్యాగమే కొంత మేలని

యొంచి దుష్ప్రయోగము నే చేసియుండవచ్చును. కాళిదాసుని రచనలందు కూడ నిట్టివి అరుదుగా కలవుగదా, ఇట్టివి 'నిరంకుశాః కవయః' మాత్రమే తెల్పునుగాని, వ్యాకరణజ్ఞాన శూన్యత్వమును చాటవు. కాన, డా. వెంకటసుబ్బయ్యగారు మరియొక పాఠము నింకొక ప్రతియందు చూపినపుడు, అది కొంత వ్యాకరణదోషముగ నున్నప్పటికి, నది యా పద్యమందలి సంవత్సరమాస తిథి వాసర నామములతో సరిగా సరిపోయినపుడది గ్రహింప తగినదే కదా. ఒకవేళ వారి పాఠముకూడ సంవత్సరమాస తిథి వాసర నామములతో సరిగా సరిపోకపోయినచో నున్న మా పాఠమును త్రోసివేయవచ్చును. కాన స్వల్పవ్యాకరణ దోషయుక్తమైనను 'వానారీ సంది' యను డా. వెంకటసుబ్బయ్యగారి పాఠము గ్రహించుటలో ప్రమాదముండదు.

నరసింహాచార్యులవారి రెండవ వాదమేదనగా, సోమరాజు క్రీ. శ. 1522 సం॥ న ఉద్భట చరిత్రవ్రాసినచో క్రీ. శ. 1369 సం॥ లో కన్నడ బసవపురాణమును రచించిన భీమకవిని పేర్కొనకుండునా యని శంకించిరి. ఇక వారి మూడవ వాదము—క్రీ. శ. 1550 సం॥ న 'రసరత్నాకర' మను నలంకార గ్రంథమును రచించిన 'సాల్వ' కవి, సోమరాజు కావ్యమునుండి పద్యముల నుదాహరించియుండుటచే, సోమరాజప్పటికి బహుప్రాచీనుడై యుండవలెనట.

సామాన్యముగా కవులు తమ కావ్యములందు తమ కిష్టమైన పూర్వకవులనే పొగడుచుందురుగాని, కేవలము బహుప్రాచీనతను బట్టిగాని, బహుప్రాశస్త్యమును బట్టిగాని స్తుతింపరు. అట్లుగానిచో క్రీ. శ. 1222 సం॥న నున్న సోమరాజకవి తన యుద్భట చరిత్రమున క్రీ. శ. 1195-1200 ప్రాంతమందున్న తన సమకాలికుడైన పాల్కురికి సోమనాథుని స్తుతించెనని వాదించుట యెట్లు పొసగును? భీమకవిమీద సోమరాజునకు గౌరవాభిమానములు లేకపోవచ్చును. మరియు క్రీ. శ. 1550 సం॥న రచించిన రసరత్నాకరమునందు సాల్వకవి, 1522 సం॥పు సోమరాజ యుద్భట చరిత్రమునుండి పద్యముల నుదాహరించుట కతడు బహుప్రాచీనుడు గానక్కరలేదు! కొంత పూర్వుడే కదా. అతనిపై సాల్వకవికి గౌరవాభిమానములు కుదిరియుండవచ్చును. వివాదగ్రస్త కాలమున్న మను క్రీ. శ. 1222-1522 సం॥న నెవరైన సోమరాజునుగాని, యతని కావ్యములనుగాని స్మరించినవానిని తెలిపినచో, నరసింహాచార్యులవారి వాదమునకు బలమెక్కువ యుండెడిది. అట్టిది లేనప్పుడు ఆచార్యులవారి వాదము దుర్బలమైనదే యగును.

ఇక ఆచార్యులవారి నాల్గవవాద మేదనగా క్రీ. శ. 1222 సం॥—చిత్రభాను సంవత్సరములో గాకున్నను, క్రీ. శ. 1221 సం—వృషభ సంవత్సరములో ఆశ్వయుజ శుద్ధ కౌదశి బుధవారమే యగుననియు, నిట్టి స్వల్పభేదము గణనీయము గాదట—ఇది చెరిమాడు వాదమే కాని సరసమైన వాదము గాదు. క్రీ. శ. 1222 సం॥ పద్యమున తెల్పబడిన సంవత్సరమాస తిథివాసర నామములతో సరిపోవుచున్నదా యనిగాని, యితర సంవత్సరములేవైనను సరిపోవుచున్నవా లేదా యని కాదు గదా. 1122 వ సం॥ న వాసరనామభేద మేర్పడెగా, 1121 సం॥ న సంవత్సర నామభేదము—అనగా చిత్రభానువునకు మారు వృషభ—సంఘటించుచున్నది కదా! ఇట్టి స్వల్పభేదము లనవసరముగ నేల సహింపవలయును. దీనిని సహించినపుడు డా. వెంకట సుబ్బయ్యగారి పాఠమందలి స్వల్పవ్యాకరణభేదము నేల సహింపరాదు? వారి మాస సంవత్సరనామములతో సరిగా సరిపోవుచున్నదే! వ్యాకరణదోష మెక్కువప్రమాదమా? ముఖ్యవిషయమైన కాలదోష మెక్కువ ప్రమాదమా? కాన నరసింహాచార్యులవారి పాఠమును, వారి వాదములుగూడ పూర్వపక్షిని సంతృప్తిపరచజాలవు. కాన పాల్కురికి సోమనాథుని కాల నిర్ణయమునకై సోమరాజు ఉద్భట చరిత్రపై నాధారపడరాదు.

పాల్కురికి సోమనాథునిగూర్చి పిడుపర్తి సోమనాథుడు చెప్పిన యనేక ముఖ్యవిషయములతో ప్రతాప చరిత్ర గూడ నేకీభవించుటయే కాక, స్వయంభూ దేవాలయమును దర్శింపబోయినది కాకతీయ ప్రతాపరుద్రుడని స్పష్టపరుచుచున్నది; కాన పాల్కురికి సోమనాథుని కాలనిర్ణయ విషయమున పిడుపర్తి సోమనాథుడు చెప్పిన వాక్యములే యెక్కువ యుపయోగకరములుగ నున్నవి. కాని యోరుగల్లున స్వయంభూ దేవాలయమును దర్శింపబోయిన ప్రతాపరుద్రుని విషయమై క్రీ. శ. 1182-1198 వరకు పాలించిన ప్రథమ ప్రతాపరుద్రుడని కూడ వ్యవహరింపబడు రుద్రదేవ మహారాజని కొందరును, 1293-1323 వరకు పాలించిన ద్వితీయ ప్రతాపరుద్రుడని కొందరును అభిప్రాయభేదములు గల్గియుండిరి. ఈవిషయమును నిశ్చయించుటకు ప్రతాపరుద్రునిచే శివరాత్రి కొప్పయ్యకు డోకి పట్టిగ్రహారమును దానముచేయించిన యుంగుటూరి అన్నయ మంత్రికాలము సాయ

పడును. పిడుపర్తి సోమన తెల్పినట్లు శివరాత్రి కొప్పయ మనుమడైన పెద సోమయ డోకిపఱ్ఱు అగ్రహార మంకిలి పడగా ప్రౌఢదేవ రాయలసాయమున తిరిగి సంపాదించెనను విషయము క్రీ. శ. 1385 సం॥ ప్రాంతీయ ప్రౌఢదేవరాయ లుదయగిరికి యువరాజుగా నుండి, తర్వాత 1404 సం॥ న, విజయనగర సింహాసన మధిరోహించుటచేత, తరమునకు 25 సం॥ చొ॥ చూచినను పెద సోమయ కాలమునకు సరిపోవు చున్నది.

మరియు కోలని గణపతిదేవుడు తన శివయోగ సారపీఠిక పద్యములలో ఇందులూరి వారి వంశమును వర్ణించుచు, ఇందులూరి అన్నయ మంత్రి పెద తండ్రియగు సోముడు 'కోలను' ప్రదేశ జనులను జయించి, యాస్థలము నాక్రమించుటచే, నాతడు నాతని వంశీయులును 'కోలనువార'ని పిలువ బడిరని తెల్పెను. కోలను సోముడు కాకతి గణపతి దేవ మహారాజునకు సైన్యాధ్యక్షుడుగ నుండెను. ఆ గ్రంథమందే యిందులూరి అన్నయ మంత్రి ప్రతాపరుద్రుని సైన్యాధ్యక్షుడై, మహమ్మదీయులను జయించెననియు వర్ణింపబడెను. ద్వితీయ ప్రతాపరుద్రుని కాలమునకు ముందు మహమ్మదీయు లెప్పుడును దక్షిణదేశముపై దండెత్తిరాలేదు. అన్నయమంత్రి కాకతీయుల పక్షమున పోరాడి మహమ్మదీయుల నోడించెనని చెప్పబడెనుగాన నతడు ద్వితీయ ప్రతాపరుద్రుని కాలమున నుండెననుట స్పష్టము. ఇంతేకాక, ఇందులూరి అన్నయమంత్రి తన బ్రాహ్మణకులమునందలి అబ్బిజ, లక్కమాంబ లను కన్యలను వివాహమాడుటయే కాక, కాకతీయ చక్రవర్తినియైన రుద్రాంబకు కుమార్తెయగు రుయ్యాంబను, అనగా, ద్వితీయ ప్రతాపరుద్రుని పినతల్లిని వివాహమాడెనని గూడ శివయోగసారమున కోలని గణపతిదేవుడు తెల్పినాడు. ఈ వైవాహిక సంబంధముచే నిందులూరి అన్నయమంత్రి ద్వితీయ ప్రతాప రుద్రునికి పినతల్లి భర్తయై, యా రాజునకు సైన్యాధ్యక్షుడై, మహమ్మదీయులతో యుద్ధములు చేసి వారిని జయించుటచే ద్వితీయ ప్రతాపరుద్రుని కాలమున నుండెననుట స్పష్టముగదా.

ఈ వాదము నింకను బలపర్చుటకై అన్నయ మంత్రి చేసిన దానములను తెల్పు శాసనములను కొన్నింటిని సుప్రసిద్ధశాసనపరిశోధకులగు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు చూపిరి. త్రిపురాంతక మందలి త్రిపురాంతకేశ్వరాలయములోని చీకటిమిద్దె యుత్తరపు గోడమీది శాసనము శక 1213, అనగా క్రీ. శ. 1291 నాటి, ఖర సం॥న మహాప్రధానియైన ఇందులూరి గన్నయ పెగ్గడకుమారుడు అన్నయ దేవుడు త్రిపురాంతకేశ్వరుని కభంగ దీపారాధన నిమిత్తము 50 గోవులను దానము చేసినట్లు తెలుపు చున్నది. (*Ep. Coll.* 238 *of* 1905) మరియు దాక్షారామ భీమేశ్వరునకు క్రీ. శ. 1293 సం॥న ఇందులూరి అన్నయమంత్రి 500 నిష్కములను దానము చేసినట్లు శాసనము గలదు. (*S. I. I. Vol IV*, 1307). ఈ శాసనములు ప్రతిపక్షవాదులను సంతృప్తిపరచుటకు చాలును. పిడుపర్తి యగ్రహారమును శివరాత్రి కొప్పయకు ద్వితీయ ప్రతాప రుద్రుడు దానము చేసిన శాసనముగూడ నచిరకాలములో బయలుపడునని నా యాశయము. అందు వలన ప్రతిపక్షులకు గూడ సందేహము తీరును. పై విషయములచే పిడుపర్తి సోమనాథుడు తెల్పిన వన్నియు యథార్థములని ఋజువుకాబడినవి. అట్టియెడ నితనికి చారిత్రిక దృష్టి లేదని వాదించుట సమంజసము గాదు. ఇందుచే ద్వితీయ ప్రతాప రుద్రుడు, నతని మంత్రియగు ఇందులూరి అన్నయ్యయు, శివరాత్రి కొప్పయ్యయు, పాల్కురికి సోమనాథుడును సమకాలికులని స్పష్టముగదా.

పై ప్రమాణముల నందరు నంగీకరించి సంతృప్తి చెంది, మన్న జయులుదేరిన ప్రథమ ప్రతాపరుద్రుని కాలమువాడను నభిప్రాయమును మార్చుకొనిరి. కాని యీ వాదమును మొట్టమొదట నాంధ్రమునకు దెచ్చి పెట్టిన శ్రీ బండారు తిమ్మయ్యగారు మాత్రము దీని కంగీకరింపరైరి. ఇక వారి వాదముగూడ కొంచెము పరామర్శించెదము—(1) "కొండపేట దండకవిలెలో శక సంవత్సరము లేని మొదటి ప్రతాపరుద్రుని శాసన మొకటి యుదాహరింపబడినది." దానిలో సోమనారాధ్యునకు ప్రతాపరుద్రుని చేత పిడుపర్తి యగ్రహారము దానము చేయబడినట్లు తిమ్మయ్యగారు చూపిరి. మంచిది. 'శక సంవత్సరము లేని యీ శాసనము' మొదటి ప్రతాప రుద్రుని దేయని వారెట్లు నిర్ణయింపగల్గిరో తెలియకున్నది. ఇది ద్వితీయ ప్రతాపరుద్రునిదే యేల కాగూడదు? నిశ్చితమైన కాలప్రమాణ మీ శాసనమునకు లేదుగదా. కాలప్రామాణ్యము లేక సందిగ్ధమైన యొక శాసనముపై నాధారపడి తమవాదమును సమర్థింప బూనినచో, తమ వాదము దుర్బలమై, ప్రమాణరహితమగును గదా. తమ ప్రామాణ్యమునకు స్థిరత్వము సిద్ధించినచేగాని, తద్వాదమునకు ప్రామాణ్యముండదని మనవి చేయుచున్నాను. వీరిరెండవ వాదమును విశ్వారాధ్యులవారిని గూర్చినది గూడ,

ప్రామాణికత్వము సిద్ధింపని యొకానొకరి వాక్యములపై నాధారపరచి వాదింపజూచుటచే వారి వాదము గూడ నప్రామాణికమైనది. వీరి మూడవవాదమగు బెలిదేవ వేమనారాధ్యులవారి మనుమని శిష్యుడు పాల్కురికి సోమనాథుడనుటనుగూర్చి పైననే విమర్శించితిని. ఇచట మనుమని శబ్దమునకు కేవలము పుత్రుని పుత్రుడని కాక 4,5 తరముల తర్వాతివాడని యౌపచారికార్థమును, లోకసామాన్యవ్యవహారమున నున్నట్లే చెప్పికొనవలయును. సోమనాథుని గురువు తాతయగు వేమనారాధ్యుడు, పండితారాధ్య చరిత్రమున పేర్కొనబడినవాడు గాడని డా. చి. నారాయణరావుగారివలె వాదించుచో (చూ. పం. చ. పీఠిక, పుట 17) "పేర్కొనదగిన శ్రీ బెలిదేవి వేమనారాధ్యుడ"ని సోమన తెల్పుటచే నతడు పండితునకు సమకాలికుడైన వేమనారాధ్యుడనియే కాని, తత్పూర్వుడుగాని, తత్పరమందున్నవాడు గాని గాదగడు. అట్లే యాగుచో నప్రఖ్యాతుని మనుమని శిష్యుడని చెప్పికొనుటకంటె, గురువు పేరుమాత్రమే చెప్పికొనును గదా. వీరి ఆరవ వాదమగు "యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వరశతకమందు, అనుభవసార పండితారాధ్య చరిత్రలందలి భావపదజాలముండుటచే, అన్నమయ్యకంటె సోమనాథుడు ప్రాచీనుడ" నుట సమంజసము గాదు. సోమనాథుడే అన్నమయ్య భావపదజాలములను గ్రహించెనని యేల భావింపరాదు? చతుర్వేదసారమునందలి యీ క్రిందిపద్యమును చూడుడు—

"వైదికులిది శుద్ధవైదికంబని యెన్న,
శాస్త్రజ్ఞులిది ధర్మశాస్త్రమనగ,
తార్కికులిది మహాతర్కంబనంగ,
పౌరాణికులిదియె పురాణమనగ,
ఆగమవిదులు దివ్యాగమంబిది యన,
తంత్రజ్ఞులిది వీరతంత్రమనగ
భక్తవారంబిది భక్తిమార్గంబన,
ముక్త్యర్థులిది మహాముక్తిద మనగ,
కవులు భువిని నిదియె కావ్యంబనంగ
సజ్జనులకెల్ల మిగుల సంతసముగ
నిర్వికల్పరతి చతుర్వేద సారమన్
పద్యముల్ రచింతు బసవలింగ."

ఈ పద్యము నన్నయ భారతమందలి "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని" అను సీసపద్యమును బోలి లేదా? ఇంతమాత్రముచేత పాల్కురికి సోమనాథుడు నన్నయకంటెగూడ ప్రాచీనుడు గాదగునా? యథావాక్కుల అన్నమయ్య వ్రాసిన 'ఆరాధ్య సోమేశ్వరుని సూక్తుల గ్రహించి' అను వాక్యమునకు పాల్కురికి సోమనాథుని సూక్తులని కొందరు వ్యాఖ్యానించుదురు. కాని దీనికి 'వి ఇవటూరి సోమనాథయ్య, కరస్థలి సోమనాథయ్యల' వంటి భక్తులని యేల కాగూడదు? అందు పాల్కురికి సోమనాథుని సూక్తులని స్పష్టము కాదుగదా. వీరి తర్వాతవాదన 'జాను తెనుగు విశేషమునుగూర్చి సోమనాథుడు చెప్పుటచే, దేశీయపదజాలమును తన కవిత్వమున విశేషముగవాడిన తిక్కనకంటె నతడు పూర్వుడనుట. తిక్కన సోమనాథులకు పూర్వమె నన్నెచోడకవి దేశికవితకే ప్రాధాన్యమిచ్చి 'దేశిమార్గంబులు దేశీయములుగ' చేయవలెనని యుద్బోధించలేదా. అంతమాత్రమున నతనికంటె గూడ పాల్కురికి సోమనాథుడు పూర్వుడని వాదింపవచ్చునా? కాన ఆ వాదములు చెల్లవు.

ఇక శిలగంగవరము శాసనమున పేర్కొనబడిన రెంట్రేవుల మల్లినాథయ్యగారును, సోమనాథు డుదాహరించిన రెంటాల మల్లినాథుడు నొకరా, గారా, అనునది ప్రధాన విషయము. ఈ శాసనము శక 1212, అనగా, క్రీ. శ. 1290 సం|| నాటిది. రెంటాల మల్లినాథుడు కుమారాద్రికి తూర్పున సోపానములు దీర్చినట్లుగా పాల్కురికి సోమనాథుడు బసవపురాణములో వ్రాసినాడు. ఈ సోపానములను గట్టించినది దోచమాంబయని పై శాసనమున దెల్పబడినది. బసవపురాణము దోచమాంబ యొక దినమున తన నియమముప్రకారము శివుని కర్పించు పంచకరవీరపుష్పములలో నొకటి తక్కువయగుటచే తన నేత్రము నర్పించి, తిరిగి శివుని కరుణవలన నేత్రమును పొందెనని వ్రాసెను. ఈ మాహాత్మ్యవిషయము రెంటాల మల్లినాథుని పరముగ తోంటదార్యుడు రచించిన సోమేశ్వర పురాణమున దెల్పబడినది. కాన (బసవ సోమేశ్వర) పురాణకథలలోని వ్యక్తుల పేర్లు కొంచెము తారుమారైనట్లు స్పష్టమగుచున్నది. శాసనకాలమైన క్రీ. శ. 1290 సం||న కుమారాద్రికి తూర్పువైపున సోపానములు మల్లినాథునిచే గాని, దోచమాంబచే గాని నిర్మింపబడెననుట స్పష్టము. 1290 సం||న నిర్మింపబడినచో దర్శిలా సోమనాథుడు బసవపురాణమున నుదాహరించెనని చెప్పవలయును కదా. లేక, బండారు తమ్మయగారు వ్యాఖ్యానించినట్లు తర్వాత నెవరో యీ శాసనమును వేయించిరని భావింపుదమన్న, నొకరు కట్టించిన సోపానములు మరియొకవారు కట్టించెననుట వ్యర్థము. చెడిపోయినచో బాగు చేయించెనని చెప్పవచ్చును. కాని ఆ మాటలేదు.

నూరు సంవత్సరముల పూర్వమెప్పుడో నిర్మించిన సోపానములను 1290 సం॥లో శాసనమున స్మరించెనని వ్యాఖ్యానించుట సరసముగా నుండదు. కాన కుమారగిరికి తూర్పుదిక్కున సోపానములు 1290 సం॥న, దోచనూంబగాని, మల్లినాథుడుగాని నిర్మింపజేసి యుండవచ్చును. తర్వాతనే సోమనాథుడు బసవపురాణమున దానినిగూర్చి రచించి యుండవచ్చును. బసవపురాణ విషయములను తారుమారు చేసి 100 సం॥ల తర్వాత శాసనముల కెక్కించిరనుట సమంజసముగా నుండదు గదా. దీనినిబట్టి చూచినను సోమనాథుడు క్రీ. శ. 1290 తర్వాతివాడని తేలుచున్నది. ఇక 1290 నాటి రెంద్రేవుల పదము 600 సం॥ల తర్వాత రెంటాలగా మారుననుట విచిత్రము కాదు. కాని ప్రాచీన లిఖిత ప్రతులలో నే రీతిగ నున్నదో కొంచెము పరిశీలింపదగినది. చిలుకూరి నారాయణరావుగారు వాదించినట్లు ఛందస్సునకు సరిపోవునట్లుగ, 'రెంద్రేవుల - రెంటాల' పదములలో రెండవదానినే సోమనాథునంతటి సమర్థుడైన కవి గ్రహించెనని యారోపించుట మాత్రము సాహసమే. క్రీ. శ. 1290 ప్రాంతమున సోమనాథుడు ద్విపదలో 'రెంద్రేవ్ల' అనురూపము నుపయోగించియుండవచ్చునని భావించినచో నుపద్రవమేమియు నుండదు. అది క్రమముగా రెంటాలయని మారియుండుటయు భాషాశాస్త్ర సంప్రదాయరీత్యా సంభావ్యమే. ఇది ఛందస్సునకును సరిపోయినది, పదరూపముగూడ స్పష్టముగ నున్నది.

ఇక శ్రీ తిమ్మయ్యగారి నాల్గవ వాదము "పండితారాధ్య కృపాసముద్భవుడు......కరస్థలి సోమనాథయ్యగారు" పాల్కురికి సోమనాథునకు బసవపురాణకథామాత్రములను తెలిగించెననుట. — పై వాదముల నన్నింటినిబట్టి, శాసనములనుబట్టి సోమనాథుడు ద్వితీయప్రతాపరుద్రుని కాలమువాడేయనియు, ప్రథమ ప్రతాపరుద్రుని కాలమువాడు గాదనియు తేలిపోయిన తర్వాత, కరస్థలి సోమనాథయ్యగారి తలిదండ్రులు మల్లికార్జునపండితుని శిష్యప్రశిష్యులై, పిడుపర్తి వంశీయులు పాల్కురికి సోమనాథుని శిష్యప్రశిష్యులైనట్లుగా, మల్లికార్జున పండితు నారాధించి సోమనాథయ్యగారిని కనిరని చెప్పవలయునే గాని, పండితునే యతడు ప్రత్యక్షముగా నెరిగెనని చెప్పరాదు.

వీరి యైదవ వాదము పండితారాధ్య చరిత్ర రచనావసాన కాలమునకు పాల్కురికి సోమనాథుడు, పండితుని పుత్రుడగు కేదారయ్యకు శిష్యుడైన ఇవటూరి సోమనాథుని కుమారులు, సూరీశ్వరాదులు, వారి పుత్రులు సూచింపబడిరి. కాన క్రీ. శ. 1170 సం॥ లో లింగైక్యమొందిన పండితునికి 4, 5 తరములు తర్వాత, ననగా ద్వితీయప్రతాపరుద్రుని కాలమగుచున్నది.

పాల్కురికి సోమనాథునికి 200 సం॥ల తర్వాతవాడైన పిడపర్తి సోమనాథుడు, తన వంశమువం దభిమానముగలవాడగుటచే జరిగిన ప్రతివిషయమును తద్వంశమువారు భద్రపరచి, వంశపరంపరగా నిలుపుకొనుటచేత నా సత్యవిషయములనే తన పద్య బసవపురాణమున భక్తితో జెప్పుకొనెను. అటువంటి వానిలో జోకిపట్టగ్రహార మంకిలి పడినపుడు ప్రౌఢరాయల సాయముతో తిరిగి పెదసోమన సంపాదించిన విషయముగూడ చారిత్రాత్మకముగను, కాలక్రమమును బట్టియుగూడ సరిపోయినపు డతనికి చారిత్రిక దృష్టి లేదనిగాని, వంశానుక్రమణికలో వ్యత్యయము లున్నవనిగాని తలంచుట అనుచితము. ఇక సోమనాథునివంటి మహానుభావుడు మహమ్మదీయుల దాడులకు వెఱచి జన్మభూమిని విడిచిపోయెననుట సత్యసమ్మతము గాజాలదని శ్రీ తిమ్మయ్యగారు వ్రాయుట గూడ విచిత్రముగా నున్నది. ఈశ్వరాజ్ఞచే దేశమునకంతకు రానున్న యుపద్రవమునకు మహాత్ము లెదురుగా బోయి శుభికులగుట మేలో రానున్న యుపద్రవమును దూరదృష్టితో గ్రహించి మెలకువగా తప్పించుకొని తిరుగుట మేలో సరసు లెరుగరా. పాల్కురికి సోమనాథునిమీద పిడపర్తి సోమనాథున కిప్పటివారికంటె తక్కువ గౌరవ ప్రపత్తులు లేవు గదా యట్లు వ్రాయుటకు. తనవంశ శ్రేయోభిలాషియగు పాల్కురికి సోమనాథుని గూర్చి, యతని శిష్యప్రశిష్యులై, వంశపరంపరాను శ్రుతివిషయములతో, పిడపర్తి సోమనాథుడు ప్రమత్తుడైగాని, అసత్య నిరతుడైకాని, యజ్ఞానముచేగాని రచించెనని భావింపలేము. ఆంధ్రుడై, శిష్యప్రశిష్య వంశీయుడైన పిడపర్తి సోమనాథుని వాక్యములకంటె, కర్ణాటుడై, కర్ణాకర్ణ విషయములను రచించి, బహుకాల దూరవర్తియు అప్రామాణికుడగు తోంటదార్యుని వాక్యములా పాల్కురికి సోమనాథుని గూర్చి విశ్వసనీయములైనవి. పాల్కురికి సోమనాథునికి 200 సం॥ల తర్వాతి నున్న పిడపర్తిసోమనాథునికే యాతని కాలపు చారిత్రిక విషయములు నిశ్చయముగా తెలియవని తలచుచో, 600 సం॥ల తర్వాత నున్న మనకా నిశ్చయముగా తెలియుట?

శాసనములందు ప్రామాణ్యములుగాఁబుట చరిత్రకర్తల ధర్మముకాదని తెలియగలము. పాల్కురికి సోమనాథుడు క్రీ. శ. 1293—1323 వరకు పాలించిన ద్వితీయ ప్రతాపరుద్రుని కాలమువాడని పలువురు విశ్వసించుచున్నారు.

కందుకూరి వీరేశలింగముగారు ఆంధ్రకవుల చరిత్ర ప్రథమ ముద్రణమున, పాల్కురికి సోమనాథుని కాలమునుగూర్చి రచించిన మతమును, కన్నడ కవుల చరిత్రమునుబట్టి యెల్లరు ఆంధ్ర పండితులు మార్చికొనిరో, ప్రస్తుతము శర్మగారి శాసన ప్రామాణ్యమునుబట్టి యట్లే అందరు తమ యభిప్రాయమును మార్చికొనిరి. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు కూడ తమ యభిప్రాయమును మార్చికొంటిమని నేనును వారును తిరుపతిలో సమావేశములో నున్న కాలమున లోనే ప్రత్యక్షముగా నాతో చెప్పిరి. వీరేశలింగము గారుగానీ, వీరభద్రరావుగారు గానీ ప్రస్తుతమున్నచో తప్పక తమ యభిప్రాయములను మరియొకమారు మార్చుకొనియుండెడివారు. సత్యాన్వేషణమే కదా కావలసినది. సరియైన ప్రమాణమును జూపి, సహేతుకముగ వాదించినపుడు సరసులెవ్వరైనను తమ పూర్వాభిప్రాయము దోషమైనచో మార్చుకొందురు. ఇంతకంటె బలమైన ప్రమాణము దొరికినపుడు శర్మగారి మతముగూడ మారిపోవచ్చును. ఇందు విచిత్రమేమియు నుండదు.

లేటగీతులు

★

శ్రీ సూరంపూడి భాస్కరరావు.

ఆటలందును పాడెడి పాటలందు
గట్లు తెగివచ్చు నా పిచ్చి కైతలందు
స్వాదిమల భావ చైత్రవనమ్ము నందు
ఎప్పుడును నన్నె నేను చిత్రించుకొందు.
నాదు అంతస్సు స్వర్గనందనము లందు
బాహ్య వర్తన పాతాళ పథములందు
క్లాంత దేహమ్ము మర్త్య లోకమ్మునందు
దేవ రాక్షస నరులయం దెవడనగుదు?
ఏల సదానంద చంద్రికా వీచులందు
దుస్తరతమో నిబద్ధ రాత్రులను గందు.
కాళరాత్రుల నాదుఃఖ గాథలందు
మధుర మందార మకరంద మానుచుందు.
మదిర సేవించి చందన మలదియొడల
మత్తులో సొక్కిసోలు పోమరిని నేను
బ్రతుకు బ్రతుకెల్ల నిండు యౌవన మెపొంగు
పగలు స్మృతిలేదు రాత్రి స్వాపమ్ము రాదు.
ఇదియె జీవన మార్గమియ్యదియె బ్రతుకు
పగలు స్మృతిలేక నిలువెల్ల బుగిలిపోవు,
నీలి కోకల పెనురేయి నిదుర రాదు.
ఎవరు గడపగలార లీపవలు రేలు?
వెనుక వైపున ధర్మచింతనలు రేగి
నివ్వె నాల్కలు ప్రాకు వెన్నముక వరకు.
ఏమి చేతకానితనమొ ఏమిచేవ
లేని తనమొ కాళ్ళేతులు లేవబోవు.
ఈ దరిద్రత వెలికి రానీయకుండ
చిరుగు ప్రాతకు మాటుగా చెరగుకప్పి
దాటుకొని పోదు లోకపు కాటునుండి.
పరుల సంపదలో కొంత పాలుగొనుచు

బ్రతికి పోదును దొంగ వైభవములంది.
దోచుకొనుచుంటి నీ మహత్పూర్ణ కుంభ
మీ జగతి భయభీతు లేమియును లేక
ఎన్ని జన్మాల ఋణమొ నాదీ జగతికి!

కాక నాకె యీ భువి ఋణ గ్రస్తమౌనొ,
జగతి ఋణపడెనాకు, నేజగతికైతి,
ఇట్టి ఋణ మనంతమొ, నేను గూడ
ఈజగతిగూడ నంతము లేని యవియొ!

ఈ ప్రపంచము నందు జన్మింపగోరి
ఎవ్వరినిగాని నేను ప్రార్థించి యెఱుగ.
ఇంతకోరని జననము నెవ్వడొసగ
బ్రతుకె తీరని యొక క్రూర బంధనముగ?

తలపనోపను బ్రతుకు సార్థకమటంచు
నాబలమ్ము దౌర్బల్యమ్ము నావి కావు.
నేనె లేనేమొ నాకీ యనిత్యమైన
బ్రతుకు నంటగట్టిన వాడెవండ నెంతు

వలదు నాకి కానట్టి యీ బ్రదుకునాకు,
వలదు పుట్టి బ్రదికి చచ్చు బాధనాకు
నేనె నానుండి పారిపో నిచ్చగింతు,
చావువలె జీవనమ్ము భయావహమ్ము

కోరి మరిమరినన్ ముద్దుగొన్న వారె
చేరి మరి మరి యుపకృతుల్ సేయుచుండ
వదలి సైచితిగాని యీపాటె కేను
ఎందఱినో చిత్రవధ జేసియుందు నుండి.

నే నొర్చిన తప్పులన్నింటి కిదియె
నతుడనై శిరు తలయొగ్గినాను బలిగ
ఓపగలనేని నరికి వేయుము శిరస్సు.
ఓపలేనేని క్షమియించి యూరుకొనుము,

ప్రతి నిమేషము గమన స్వభావమైన
జగము తప్పదారులనే పరుగులు వెట్టు.
ఒక ఝుంఝూ ప్రభంజన మొక్క ప్రలయ
కాల రుద్రహుంకృతి యీ జగమ్ము నెల్ల
నరిగ దిద్దంగ నపుడప్పుడరుగు దెంచు.

చందురుని లేత కాంతిలో సుందరాంగి
కందుక క్రీడ జూడ నానంద మౌను.
పిందె రాలిన శిశిరంపు సందె వేళ
కందిపోయిన మోము రాబందు నెలవు.

పూతనై నేను తెలిమొల్ల పూలు ముడిచి
కమ్మ పుప్పొళ్లు దాచిన కమలముకుళ
దళకమును గొని తాంబూల దళములూని
అభిసరించితి ప్రియుని దర్శనముకొఱకు.

తాను చెప్పిన గడువింత దాటకుండ
ఎదురు వచ్చిన ప్రియురాలి నుదుటి బొట్టు
దిద్దకయె, ఒక్క మొగ్గేని తీసుకొనక
అటులె చనినాడు తాంబూలమైన గొనక.

ఓ! పది కమలములును తాంబూలములును
నేనె యనుభవించెద గాని యీసుకమ్ము
పంచుకొనుటకు ప్రియుడె నాపంచ లేడు.
ఒంటిగా నేనె యిదియెల్ల నోడ్చుకొందు
గాని తీపి చచ్చిన తేనెగా, వినవెగ!

నేడు పెండ్లియైతి ప్రాణేశుతోడ.
ఈ మహోత్సవ కళ్యాణ వేళనిదియె
సర్వజనులకు జగతికి స్వాగతోక్తి.
శీఘ్ర మాతిథ్యమంది ఆశీస్సులిండు.
పేరు పేరున నార్యుల బిలువలేను.
పేదరాలను చాపలు వేయలేను.
మందిరము చెంతగల కుసుమమ్ముల గొని
శ్రీకరుణ దృష్టినింత సారించి చనుడు.

వారాల పిల్లాడు

★

శ్రీ మునిపల్లె రాజు

నా నాయనమ్మ ఒకరోజున నిద్రబోయి, తిరిగి ఎవరు పిలిచినా లేవలేదు. అమ్మా, నాన్నా వెళ్ళి—నాయనమ్మ భుజాలు పట్టుకొని ఊపి లేవమన్నారు. యింతలో నాన్నగారు ఆమె ముక్కు దగ్గర వేలు పెట్టి తీసి, అమ్మవంక చూశాడు. అమ్మ నారాయణను వెళ్ళిపొమ్మంది. నారాయణ గదినుండి వచ్చాడే గాని, ఏదో ఆశ్చర్యం వున్నదని తలుపు సందుసుండా చూస్తూ నుంచున్నాడు. జ్వరం వచ్చిన వాళ్ళను, చెయ్యిపట్టుకు చూస్తారుగాని, ఎక్కడైనా ముక్కుదగ్గర వేలు పెట్టి తీసి, నాన్న—అమ్మవంక చూసినట్లు ఎవరైనా చూస్తారా? నారాయణకు అర్థం కాలేదు. తలుపుసందులోంచి తిరిగి పరికించి చూశాడు. అమ్మా నాన్నా, నాయనమ్మను మంచం మీదినుంచి దింపి కింద పడుకోబెట్టారు. అన్యాయం! అన్యాయం!! జ్వరం వచ్చినవాళ్ళను యింత అన్యాయం చేస్తారా ఎవరైనా? తన కెన్నిసార్లు రాలేదు? వచ్చినప్పుడల్లా మెత్తటి పరుపూ, తెల్ల దుప్పటీ, నాన్నగారి ముఖమల్ దిండూ—అమర్చేవాళ్ళ!!

ఆ సాయంత్రానికి కక్కయ్యలూ, అత్తయ్యలూ నారాయణ ఎరగని కొందరూ ఎవరెవరో వచ్చారు. పెళ్ళిలో తన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకొని, పల్లకిలో తల వంచుకొని వూరంతా వూరేగిన చిన్నత్తయ్య—ఏడుస్తూ వచ్చింది. ఆమెతోపాటు పెద్దత్తయ్య కొడుకులూ, కూతుళ్ళూ బావురుమన్నారు. అమ్మో, ఎందుకర్రా అట్లా ఏడుస్తారు? నారాయణకు అర్థం కాలేదు. కాక తనుగూడా ఏడవటం మొదలు పెట్టాడు. నాన్న వచ్చి బిస్కట్లు, చాక్లేట్లూ పెట్టాడు. జవాను—రామలింగం నారాయణను మేడ మీదికి తీసుకెళ్ళాడు. తను తప్పించుకొని, పిట్టగోడ కంతల్లో కళ్లూ ముక్కూ యిరికించి చూశాడు. వాళ్ళందరూ ఏడుస్తూండగా తనుమాత్రం వాళ్ళతో పాటు గొంతు కలిపితేనే తప్పు వచ్చిందా? అదు గదుగో! నాయనమ్మను—చిన్న వాహనంమీద—పుట్టిలమ్మ గుడిమీదుగా మోసుకొని తీసికెళ్తున్నారు—నాన్నా చుట్టాలుగావచ్చిన వాళ్ళూ కలిసి. పైన, ఆగుడ్డ దేనికి? నెత్తిమీద బట్టగూడా ఎప్పుడూ పరి తీసుకోని నాయనమ్మను వీళ్ళంతా ఏదో అన్యాయం చేస్తున్నారు!!! అయ్యొయ్యొ!

* * *

ఆరాత్రి నారాయణ ఎంగిలి చెయ్యలేదు.

"నాకు నాయనమ్మ కావాలి" అన్నాడు.

"నాయనమ్మ కాశీయాత్ర పోయింది. ఎట్లా వస్తుంది యిప్పుడే రమ్మంటే?" అన్నది అమ్మ.

"అయితే నేనూ పోతా"

"ఛా! వీల్లేదు. మనం వెళ్ళగూడదు"

"అయితే నాకు కథ లెవరు చెబుతారు?"

"నేను"

"థూ! నువ్వు చెపితే ఏం బాగుండవ్—థూ! నేను వినను"

"నాన్నగారూ—"

"కొడతారు—బెమ్మరాకసి—రాజు కూతుర్ని ఏడు మల్లెమొగ్గలు ఎట్లా చేసిందీ—చెప్పమంటే మొన్న కొట్టలా?"

2

సగం పాడుబడ్డ గ్రామదేవత మందిరమంతా కలియజుట్టాడు—నారాయణ. వెంకాయమ్మగారిల్లు గూడా వెతికాడు. మామయ్యగారి దేవుడి గదిలో చూశాడు. ఉహూఁ!! నాయనమ్మ రుద్రాక్షలు, విభూతిపండూ అట్లాగే వున్నాయి. ఆమె పాత చీరు కావిధోవతులు, కాషాయి ధోవతులు దణ్ణెంమీద

వెళ్లాడుతూనే వున్నాయ్. కాని ముసలమ్మే మాయమైంది.

ఎవరినడిగినా నిజం చెప్పటం లేదు. అమ్మ—కాశీ అన్నది. అత్తయ్య — దేవుడిలోకి అంది. మామయ్య—ఊరికి అంటున్నాడు. రామలింగం—లేదు అన్నాడు. ఎవర్ని నమ్మటం?

* * *

అదృష్టవశాత్తు ఆరోజున వారాల పిల్లాడు వచ్చాడు. ఆ అబ్బాయి పేరు నరసింహం. చిన్న పిలకా, విభూతి, అప్పుడే వుతుక్కున్న చొక్కా, చేతులో పుస్తకం. నరసింహం తనకన్నా చాలా పెద్దవాడు.

నారాయణ నరసింహాన్ని పట్టుకొన్నాడు.

"మా నాయనమ్మ కనిపించిందా?"

"ఎట్లా కనిపిస్తుంది? చచ్చిపోయినవాళ్ళు బూడిదై పోతారుగాని"

"ఎక్కడ?"

"స్మశానంలో"

నారాయణకు యీ మాటల్లో గట్టి నమ్మకం తోచింది. ఆరోజునుంచీ, వారాల పిల్లాడి పుస్తకంలో పిచ్చిగీతలు గియటం గానీ, దాన్ని పెట్టెలమధ్య దాచి పెట్టటంగాని — చెయ్యకూడ దన్న నిశ్చయానికి వచ్చాడు. కొంతసేపటివరకూ మౌనం వహించి—

"నన్ను తీసికెళ్తావా?" అని అడిగాడు.

"ఎక్కడికి—?"

"అక్కడికే! స్మశానంలోకి! నాయనమ్మ బూడిదై పోయినచోటికి"

"మీ అమ్మగారికి తెలిస్తే—అమ్మో!"

"ఇప్పుడు కాదులే...సాయంత్రం"

"ఊఁ!"

* * *

వారాల పిల్లాడితో అట్లా పరిచయమైంది. మామూలు పరిచయం కాదు. సన్నిహితమైనది. ఏ విషమూ, కుట్రా, ద్వేషమూ చొరబడని—నారాయణ చిన్నగుండెలోని కిటికీలు—పిరికిగా, నెమ్మదిగా వారానికోమాటువచ్చి తమ యింట్లో భోంచేసి పోయే సంస్కృత పాఠశాల కుర్రవాడిమీద సానుభూతితో సంపూర్తిగా తెరుచుకొన్నాయ్.

"మిగతారోజుల్లో ఎక్కడ తింటావ్?" అని అడిగాడు అమాయికంగా.

"రోజూ ఒకళ్ళయింట్లో"

"వాళ్లు పెట్టకపోతే—?"

వారాల పిల్లాడు కొంచెం తటస్థించి—

"పస్తు పడుకొంటాను—" అన్నాడు.

"పస్తంటే?"

"ఊరికే నే—అంటే...ఆకలితో"

నారాయణ ఆశ్చర్యంగా చూశాడు నరసింహం వంక!!

"పడుకొని నిద్రపొయ్యేది?"

"పాఠశాల అరుగులమీద"

"వానొస్తే ఎట్లా? చీకట్లోగూడా? భయం వెయ్యదూ?"

"వానొస్తే లోపల పడుకుంటా! భయం వేస్తే పండితులగారింట్లో"

"కొట్టరూ—?"

"వట్టి పుణ్యానికే కొడతారా? చదువుకొంటూ గదా పాఠాలన్నీ"

నారాయణ కిక ప్రశ్నలు తోచలేదు. అతనికంతా ఆశ్చర్యంగా వుంది. రోజుకొకచోట తినటం, ఇంకోచోట పడుకోటం, భయం లేకపోవటం—విచిత్రంగాదా? నాయనమ్మ చచ్చిపోయినతర్వాత మళ్ళీ వారాలపిల్లాడు కాశీమజీలల కథలు చెప్పినట్లుగా వుంది. నారాయణలేత మనస్సుమీద చేతితో తనకు తానే యీ విచిత్రచిత్రాన్ని అతికించుకున్నాడు. తూర్పున సూర్యుడితోపాటు లేచి, చంద్రుడితో ఆడుకొని మేడమీద వంటమనిషి తెచ్చిన నెయ్యితో అమ్మపెట్టిన గోరుముద్దలుతిని—నిద్రపోయే నారాయణ! ఆకలీ, కొరతా, అలసటా ఎరగని కుటుంబంలో పుట్టిన నారాయణ!!

నారాయణ — హఠాత్తుగా వారాల పిల్లాడిని వదిలిపెట్టి, యింట్లోకి పరిగెత్తాడు.

"అమ్మా...అమ్మా! నేనుగూడా వారాలు చేసుకుంటాను..." అని గంభీరంగా తన నిశ్చయాన్ని తెలియజేశాడు తల్లికి.

"ఛీ! ఛీ!! మనకేం ఖర్మరా?" అన్నది అమ్మ.

* * *

కాని నారాయణ చిన్నహృదయ ఫలకంమీద ఆ చిత్రం ఎవ్వరూ చెరిపి వెయ్యలేదు. బహుశః నాయనమ్మవుంటే ఏమయ్యేదో? పుట్టలమ్మ గుడిలో

శిలవలె, యింటివెనక రావిచెట్టువలె ఆ చిత్రం నిలిచి పోయింది. నారాయణకు లోకమూ, సమాజమూ ఏమి తెలుసు?...నాన్న కంపెనీనుండి తెచ్చే నోట్లలోని మహాత్మ్యం అతని కెవరు చెప్పారు?

ఈ నోట్లు లేని నిర్భాగ్యులు—యీ కర్మభూమిలో యీ వేదభూమిలో, బుద్ధుడూ, వర్ధమానుడూ పుట్టి మెట్టిన ఖండంలో—పడేపాట్లు అతని కెవరు చెప్పారు? అతను తెలుసుకొన్నదల్లా ఒక్కటే!

"వారాల పిల్లాడి జీవితం గమ్మత్తయినది. ఎప్పటి కైనా తను అట్లాంటి జీవితం గడపాలి"

* * *

3

నారాయణ-అందరిపిల్లల్లోనూ కలిసిఆడుకోవటం ఎప్పుడూ నేర్చుకోలేదు. అతని స్నేహితులు యిద్దరు ముగ్గురుమాత్రమే. వేణూ, వెంకూ, అవధాన్లు. వీళ్ళతో కలిసి — పాచి నీటితో, పురాతన గోడల్లో శిధిల రూపంలోవున్న లోతు కోనేరువైపు రోజూ వెళ్లే వాడు. నాయనమ్మ కథల్తో బుద్ధి వికసించి, నిశితంగా, విమర్శగా, విశదంగా, ఆలోచనలతో అతని—మనోక్షేత్రం పెద్దదవుతూండగా—నాయనమ్మ యీడైపోయింది. నాన్నగారికి ఓపికా, శాంతమూ లేవు. అమ్మ చెబితే కథల్లో సయ్యాటా సారమూ వుండవు. ఇంటికొచ్చే చుట్టాలు, పక్కాలు అమ్మ నాన్నగారితో మాట్లాడేవాళ్ళే గాని తనతో కూచొనే వాళ్ళే లేరు. వేణూ, వెంకూ ఆటలకే గాని యిక దేనికీ లేరు. అవధాన్లకు సిగ్గు, రాములింగం-జవానుకు తీరిక లేని పని. వారాలపిల్లాడు వారానికోసారే కన్పిస్తాడు.

నారాయణకు అంతా కొరతగా, అస్పష్టంగా కన్పించింది; అతని ఎనిమిదేళ్ళ వేదాంతానికి, వయసుకూ, బుద్ధికీ, మనసుకూ, నాగరికతకూ మించిన అసంతృప్తి యిది. వికసించి నేడో రేపో వసంత శోభలో తనూ పాల్గొనబోతోన్న గులాబి మొగ్గను తుంచివేసినట్లుగా, నాయనమ్మ చావు నారాయణ జీవితాన్ని సెంటిమెంటల్ లోతుల్లో దించిపోయింది. అందువల్ల నారాయణ చాలా మారిపోయాడు. నీలపు టాకాశంవలె విప్పారి అంచుల్లేకుండావున్న ఎనిమి దేళ్ళమనస్సు, ఇప్పుడు అర్థానికి అతీతమైనరంగుల్తో, కోర్కలతో, భావాలతో కప్పుకుపోయింది. అక్కడక్కడ వెలితి వున్నది. ఆ వెలుతుల్లో, తళుక్కున ఏదో మెరుపు అప్పుడప్పుడు మెరుస్తుంది.

ఒకరోజున కోనేటి మెట్లమీదకూచొని, పాచి నీటిలో నీడ చూసుకో ప్రయత్నిస్తూ అవధానితో అన్నాడు.

"చచ్చిపోయినవాళ్లు బూడిదైపోతారు?"

"ఎందుకవుతారు వూరికే నే? బతికున్న వాళ్లు కాల్చేస్తే అవుతారు"

"తంతే సరి విధవల్ని"

"ఎందుకు—?"

"మరి వాళ్ళను కాల్చటం దేనికి? గాడిదెలు!!" అవధానికిగూడా యీ ప్రశ్న అర్థం కాలేదు.

కొంచెంసేపటికి నారాయణ మళ్ళీ మాట్లాడాడు.

"మనిద్దరం వారాలు చేసుకొని చదువుకుందాం వస్తావా?"

"రాను..."

"ఎందుకని?"

"వారాలు నాకెందుకు? బీదవాళ్ళకు గాని"

"తంతా నిన్ను!"

"మళ్ళీ తంతా నిన్నే!"

నారాయణ లేచి అవధాన్లను రెండు వేశాడు.

"వారాలు చేసుకోవూ?" అని యింకోటి వేశాడు.

నాన్నగారు ఆరాత్రి కంపెనీనుండి తిరిగి వచ్చింతర్వాత అవధాన్లకు తను చేసిన అట్లన్నీ, తిరగ బడ్డాయ్ తనమీదనే.

"రేపట్నుంచీ మళ్ళీ బళ్ళోకిపో...వెధవాయ్!" అని నాన్నగారన్నాడు.

* * *

నారాయణ బడికి మొదటిసారి వెళ్ళాడు. గారాబంచేసి పెంచిన నాయనమ్మ లేని ఫలితాల్లో యిదొకటి. అందరికన్నా ముందే అక్షరాలూ, గుణింతమూ, మాటలూ నేర్చుకొన్నాడు. కాని వుత్సాహమేమీ లేని చదువు.

4

సిగ్గూ, దురభిమానమూ, ఆలోచనా ఎక్కువైన నారాయణకు తొమ్మిదో యేడు వచ్చింది. ఆ సంవత్సరమే అతనికి వడుగుకూడా చేశారు.

* * *

ఈమధ్య, నాన్నగారేమీ బాగుండలేదు. చాలా ఆలస్యంగా యింటికి చేరేవాడు రాత్రుళ్ళు.

ఆ తర్వాతగూడా చాలా రాత్రివరకూ అమ్మ నాన్న దిగులుగా ఏదో మెల్లిగా మాట్లాడుకొనేవాళ్ళు.

"రామమూర్తి చాలా ద్రోహం చేశాడు. అంతా తప్పుడు లెక్కలు చూపి యిరవై వేలు కాజేశాడు. మ్యునిసిపాలిటీ అంతా రెండో పార్టీ చేతుల్లోకి పోయింది. ఎటు చూసినా నష్టాలుగానే వున్నయ్"

"మీరు ధైర్యంగా వుండండి. శ్రీమన్నారాయణుడి దయవల్ల అన్నీ చక్కబడుతై. అట్లా గుండె చెడగొట్టుకుంటే ఎట్లా చెప్పండి?"

ఈ సంభాషణ జరిగిన మర్నాడే నాన్నగారి శవాన్ని కార్లో వేసుకు వచ్చారు. అప్పటికి అమ్మ, ఊళ్ళోకి వచ్చిన బెంగాలీ భక్తురాలిచేత హరనాథుడి భజన చేయిస్తున్నది, నారాయణను బళ్ళోనుంచి పిలుచుకువచ్చారు. అమ్మ గుండెలు బాదుకొన్నది. నారాయణ పలకా, పుస్తకాలూ అవతల పారేసి ఏడ్చాడు. మళ్ళీ చుట్టపక్కాలు చేరారు.

* * *

అయితే యీమాటు యింకొక సంగతి. తనను ఎవరూ వెళ్ళమనలేదు. నాన్నగారికి పాడెగట్టి తన్నుగూడా రమ్మన్నారు స్మశానానికి. అక్కడ తనచేత నిప్పుతో నాన్నగారిని బూడిద చెయ్యమన్నారు. కోపం వచ్చింది నారాయణకు. జాలితో కన్నీళ్ళు వచ్చినై. హృదయం మూగదై పోయింది. కాళ్ళు వణికినై. కాని తప్పలేదు. చాలాసేపున్న తర్వాత యింటికి తిరిగి వచ్చాడు అందరితోపాటు.

అందరూ తలా ఒకమాట అనుకొన్నారు తనకు వినబడినట్లే!

"ఏదో తిన్నాడు"

"వి...షం..."

"అప్పులు...ముంచేసినై"

"అందర్నీ నమ్మాడు......మెడకు తెచ్చుకున్నాడు"

పదిరోజుల్లో అమ్మరూపు మారిపోయింది. చుట్టాలంతా వెళ్ళిపోయారు. ఒకరోజున ఒక పెద్దమనిషి వచ్చి "ఆయనగారి యిన్స్యూరెన్సేమీ రాలేదు. ఆత్మహత్యకింద తేల్చారు" అన్నాడు తలుపుచాటున వున్న అమ్మతో.

"అయ్యో! మా ఆశలన్నీ దానిమీద వున్నవి అన్నగారూ!" అని అమ్మ వాపోయింది.

"కంపెనీ అంతా రామమూర్తి తీసుకుంటున్నాడు. అన్నీ పత్రాలు సృష్టించుకొన్నాడు వెధవ. బ్యాంకీవాళ్ళు యిల్లు వేలానికి తెస్తున్నారు" అని చెప్పి ఆ పెద్దమనిషి మాయమైపోయాడు. ఆయన అమ్మకు పెత్తల్లికొడుకు

* * *

అమ్మ—వాళ్ళకూ, వీళ్ళకూ కబుర్లు చేసింది. నారాయణ కక్కయ్యలు ముఖం తప్పించేశారు. నాన్న చుట్టూ తిరిగి ప్లీడరుపని సాగించిన సుబ్బారావు, కాళిదాసు పంతులూ, నరసింగరావుగూడా రాలేదు. నాన్నదగ్గర చేబదుళ్లు తీసుకొన్న కోవంగి గూడా (సబురిజిష్ట్రారు ఆఫీసుముందు కూర్చొని తప్పుడుపత్రాలు వ్రాసే చెట్టుకింద ప్లీడరు కోవంగి) నాన్న డబ్బుతో చైర్మన్ అయిన సీతారామశాస్త్రి అసలే రాలేదు. నారాయణకు యీ సంగతు లేమీ తెలియవు. అమ్మ యితర్లతో అని, కళ్ళనీళ్ళు పెట్టుకొంటుంటే విన్న విశేషాలు యివన్నీ.

అమ్మ తమ్ముడు మామయ్యమాత్రం వచ్చాడు.

"యిక వీడి చదువు సంగతి చూడాలిగాని పోయినఆయన తిరిగి రాడుగదా!"అని మామయ్య.

* * *

ఆరోజున అమ్మ తనతో అన్నది. "మనం కొత్త యింటికి పోవాలి"

"ఈయిల్లో?" అన్నాడు నారాయణ.

"అప్పులవాళ్ళకు పోయింది"

కొత్తయిల్లు చిన్నది, పూరిది. కోమట్ల యింటి పక్కనే వుంది. అయితే కోనేటికి చాలా దగ్గర.

"నువ్విక వారాలు చేసుకుతినాలి. నా సొమ్ములన్నీ అమ్మేసి మిగిలిన అప్పులన్నీ తీర్చేశాను"అని అమ్మ నారాయణను బుజ్జగిస్తూ అన్నది.

"ఎట్లా చేసుకోవటం?"

"మామయ్య కుదిరిస్తాడు. మామయ్యగూడా లేనివాడుగదా నాయనా!"

నారాయణకు సంతోషం వచ్చింది. ఎక్కడెక్కడో తినొచ్చు! ఎక్కడెక్కడో పడుకోటానికిమాత్రం వీల్లేదు. అమ్మను మామయ్యవాళ్లు తీసుకువెళ్ళింతర్వాత తనయిష్టం వచ్చినచోట పడుకోవచ్చుగా!!

కాని, అంతలోనే తన ఆశలూ అనుమానాలన్నీ పొరబాట్లు అయినవి!

అమ్మ ఏడ్చి మళ్ళీ యిట్లా అన్నది: "పూలమ్మిన వూళ్ళో కట్టెలమ్మ లేమురా నాయనా! నిన్ను

మామయ్య పొన్నూరు తీసుకెళ్తాడు. అక్కడినుంచి రైల్లో బెజవాడ వెళ్ళి అక్కడే చదువుకోవాలి. నీ జీతంలో కొంత మామయ్య కట్టేస్తారు. మిగతాది చందాలు వేయిస్తానని అంటున్నాడు. వారాలు గూడా కుదురుతై. చక్కగా చదువుకో నాబుజ్జీ! చదివి పెద్దవాడివై నీ తల్లి కష్టాలు తీరుస్తావుగా మా కన్నతండ్రీ"

అమ్మ కన్నీళ్ళాగలేదు. ఏడ్చిఏడ్చి నేలకేసి తల బాదుకొన్నది. నారాయణ అంతా చూశాడు. కాని హృదయం, నోరు మూగవై పోయినై యిదివరకే. కళ్ళలో చెమ్మ వచ్చింది.

"యివ్వాళే వెళ్ళనా?" అని మాత్రం తల్లిని ప్రశ్నించాడు.

"కాదు...వచ్చే ఆదివారంనాడు ప్రయాణం"

5

నాన్నగారు బతికివస్తే యీ సమస్యలన్నీ తీరిపోతాయని — నారాయణకు అమ్మవల్లనే, ఆమె శోకంలో, ఏడుపుల్లో తెలిసింది.

ఆపాయింత్రం అవధాన్లనే తిరిగి సలహా అడిగాడు నారాయణ!! ఎట్లా అయినా పెద్దవాడు!!!

"అవునోయ్! చచ్చినవాళ్ళనుగూడా తిరిగి బతికించొచ్చు! లక్ష్మణులవారిని హనుమంతులవారు సంజీవి తెచ్చి బతికించలేదా?"

"సంజీవి ఎక్కడ దొరుకుతుందంటావ్"

"దొరుకుతుందో లేదో చెప్పలేను. మాతాతయ్య అన్నాడుగదా — గరుత్మంతులవారి గూళ్ళో నీళ్ళకు ఎదురీదే ఒక పుల్ల వుంటుందట. దాన్ని తెచ్చి మీ నాన్నగారి బూడిదకు తాకిస్తే సరి"

"ఓస్సి! అదెంతపని? పది గరుత్మంతుల గూళ్లు తెస్తాను"

"యిదుగో యింకోమాట! ఎక్కడైనా కామధేనువు దొరుకుతుందేమో?"

"అదెందుకు?"

"అది నల్లటి ఆవు. దానిపాలు పితికి చల్లినా చాలు. చచ్చినవాళ్ళు వస్తారు"

* * *

నారాయణ పాడుగుళ్ళల్లోని పిట్టల గూళ్ళన్నీ పడగొట్టి, కోనేటిలో ప్రయోగాలు చేశాడు. అక్కడ కాదని కాలవలో చేశాడు. కాని ఎదురీదిన పుల్ల కన్పించలేదు, తర్వాత చెట్లూ, పుట్టలూ గాలించి చూశాడు. గరుత్మంతులవారిగూడు కనిపించనే లేదు. కామధేనువూ అంతే. అది స్వర్గలోకంలో వుంటుందిట. ఆసంగతి, ఆవెధవ అవధాన్లు చెప్పనే లేదుగదా! నారాయణ యిట్లా నిరాశలో మునిగి వుండగా, ఆదివారమూ మామయ్య కలిసి వచ్చారు.

రేపు ప్రయాణమనగా ఆరాత్రి అమ్మ భోజన సమయంలో, నారాయణ బంతినే కూర్చొన్న మామయ్యకు నెయ్యి వడ్డించి, తనకు వెయ్యకపోవటం గమనించాడు. ఒక క్షణం సందు యిచ్చి—"నెయ్యి—" అన్నాడు తల ఎత్తకుండానే.

"అక్కడ నీకు నెయ్యి వేసేవాళ్ళుంటారు నెయ్యనివాళ్లుంటారు. నెయ్యి అలవాటు తగ్గించుకోవాలి" అని తల్లి తల అటు తిప్పుకొని కళ్ళు తుడుచుకొన్నది.

"మన యింట్లో వారాల అబ్బాయికి నువ్వేసే దానివేకదా మరి?"

"ఆ పిల్లవాడు పెట్టి పుట్టాడు—"అని అమ్మ గద్గదికస్వరంనుండి జవాబు వచ్చింది.

మామయ్యకళ్ళనుండి రెండు దుఃఖబాష్పాలు జారి అన్నంలో కలిసినవి. ఆయన కళ్లెత్తిచూసి—

"ఒక గరిటె నెయ్యి...పరవాలేదు"అన్నాడు. నారాయణ చెయ్యి అడ్డంపెట్టి "వద్దు...వద్దు..." అని లేచి చెయ్యి కడుక్కొన్నాడు.

ఏమయింది యీయింటికి? ఎవరికీ అన్నపూర్ణను లేదన్న యీయిల్లు, లక్ష్మి నాలుగుచేతుల్తో హారతు లందుకొన్న యీయిల్లు, బీద విద్యార్థులూ, వారపు పిల్లలు తలదాచుకొని, త్రేన్చిన యీయిల్లు, నాన్న నీడనే భట్రాజు పొగడ్తలతో చుట్టు ముట్టిన బంధువుల సంరంభాలతో ప్రతిధ్వనించిన యీ యిల్లు, ఏమయింది? ఏమయింది??

"నాన్నతోనే లక్ష్మిగూడా పోయింది"అన్నది అమ్మ చెయ్యి కడుక్కొంటున్న నారాయణతో.

మామయ్య నడుంవాల్చగానే, నారాయణ చీకట్లోకిపోయి ఏడ్చాడు. ఎందుకో అర్థం కాలేదు. బహుశః అమ్మమాటలకా? నెయ్యికా?? నారాయణ చీకట్లో నడిచి అప్రయత్నంగా తమ పాతయింటివేపు వెళ్ళాడు. రేపేగదా యీ మేడ యింటిని వదిలి వెళ్ళేది!

చిన్న నారాయణకు మొదట భయం వేసింది. తన జీవితంలో జీవితమైన జామ చెట్టుగూడా చీకట్లో

జుట్టు విరియబోసుకొని శోకిస్తూన్న విధవలాగా వుంది. ఎన్నిసార్లు నాయనమ్మను ఏడిపించటానికి, ఆ చెట్టెక్కి దూకుతానని దడిపించాడు? జామకాయల్ని కార్తీక మాసంలో నోరికి తినేస్తూన్న ఉడతల్ని ఎంత సరిగా రాళ్ళతో కొట్టాడు తను? గోడప్రక్కనేవున్న సీతాఫలం చెట్టు? ఎవరికీ చెప్పకుండా, ఏవేళబడితే ఆవేళ, మగ్గి రాలటానికి తల పోస్తూన్న పళ్ళను—ఎన్ని తిన్నాడు? మళ్ళీ యిలాంటివి దొరుకుతాయా? తనను పిలుస్తున్నట్లుగా పిట్టగోడ, భయంతో చీకటినే కావలించుకొని క్రీపర్లూ, మస్యమస్య క్రోటన్‌తోట్లూ – అన్నీ విడిచి వెళ్ళుతున్నాడు? ఈ యిల్లును కొన్న శివార్చకుడు – నాన్న వుండగా తనను పలకరించేవాడు. ఇప్పుడు తనను చూడనట్లుగా తప్పి పోతున్నాడు. ఇక యీ యిల్లంతా వాళ్ళదేగా? నాయనమ్మ, అమ్మ వద్దన్న కొద్దీ—యింటివెనక దొడ్లో పాదులు—ముఖ్యంగా పొట్లకాయలు తను యిక కోయనక్కర్లేదుగదా! తన కిందయింట్లో ముచ్చటయిన స్తంభంమీద గీచిన బొమ్మలన్నీ యీ శివార్చకులు యింకా వుంచవచ్చురా? ఎవరూ లేకుండా చూచి తను భావిలోని తన నీడతో యింకా ఆడుకోనేదెట్లా?? అనసూయా, సరస్వతీ, అరుంధతీ, వేణూ, వెంకూ—తను వెళ్ళిపోయింతర్వాత గూడా పండుగలకని ఆయింట్లోకి వస్తారా? ఏమో! కక్కయ్యదగ్గిర అంత డబ్బు వుందిగదా! ఆయన కొనుక్కొని తనకు యివ్వలేకపోయినాడా — యీ యిల్లు?

ఇంతలోనే ఆ యింట్లోనించి శివార్చకులు లాంతరుతో బయటకు బయలుదేరటం గమనించి నారాయణ తన తపస్సునుండి మెదిలాడు. అంతా అగమ్యమై, అగోచరమై, అస్పష్టమై నారాయణకు తట్టింది. జవాన్లూ, సుబ్రిపుబగ్గీ, పరుపులూ పండగల లడ్లూ, సందడీ, ముట్టాల రకరకాల ముఖాలు గల యింటినుండి, కోమట్ల యింటిపక్క రెండు గదుల పాత పూరింటికి వచ్చేసరికి నారాయణ వయస్సు పెరిగినట్లయింది. చీకటిలాగా, వెనకటి సంగతుల దిగులు పట్టింది. చీకటిలాగానే రేపు వుదయం రైలు బండిగూడా తట్టింది. వెళ్ళేటప్పుడు అవధాన్లు నారాయణకు కలవనేలేరు. ఏమంటే—నా అమ్మ మీ ఇంటి వేపు వెళ్ళవద్దని చెప్పిందంటాడు. గరుత్మంతుడిగూడు సంగతి అబద్ధం చెప్పినందుకు వాడిని కోనేటి పసరునీళ్లలో మూడుసార్లు ముంచి లేపినా తప్పలేదు!!!

6

బెజవాడనించి వెళ్ళిపోయేరోజున మామయ్య అన్నాడు: "ఆరు వారాలు కుదిరినవి. ఏడోది కుదరటానికి హెడ్మాస్టరుగారు చాలా తొందర్లో వున్నారు. నాకు సెలవుగూడా అయిపోయింది. ఆయన చాలా మంచివాడు. మనశాఖవాళ్ళే. వెళ్లి, నమస్కారంచేసి వారం యిప్పించమని అడుగు. ఏం?"

ప్లాటుఫారంమీద మళ్ళీ మామయ్య — "మీ నాయన వెలిగిన వెలుగుకు యిప్పటికి మీకు కష్టకాలం వచ్చిందిరా" ఆయన కళ్లు ఎప్పుడూ తడిగానే వుంటై—"బాగా చదువుకో. మూడు నెలల జీతమైతే కట్టేశాను. ఆ తరవాత సంగతి చూడాలి. వెనక మీ పురోహితుడు—శేషయ్యగారికొమారుడు ఇక్కడే వున్నాడు. ఆయన చందాలు ఏర్పాటు చేస్తానన్నాడు. వెళ్లి మళ్ళీ కనబడు."

మామయ్య ఎప్పుడూ ముక్తసరిగా మాట్లాడేవాడు. యివ్వాళ రుద్ధమైనకంఠంతో వెనుకులాడుతూ యిన్ని మాటలు మాట్లాడాడు. నాన్ననుండి ఏలాభమూ ఎన్నడూ ఆశించని మామయ్య యివ్వాళ నారాయణ గార్డియన్ అయినాడు. ఎన్నాళ్ళో నాన్నను పొగడ్తల్తో, మన్ననలతో, మాటలతో మాయచేసి సొమ్ములూ, వస్తువులూ, పట్టుచీరెలూ కాజేసిన అత్తయ్యలూ, పిన్నమ్మలూ – నారాయణ సంగతి ఎందుకు పట్టించుకోటంలేదో, అమ్మ అతనికి వివరంగా చెప్పలేదు.

నారాయణకు పురోహితుడు బాగా తెలుసు. నాయనమ్మ చచ్చిపోతే ఆవు తీసుకొన్న దీయనే. తన పుట్టినరోజు పండగకు నాన్న పిలిపించి మంత్రాలు చదివించి, ఖద్దరు చాపులు పెట్టి పంపించేవాళ్లు.

నాన్న చనిపోయేముందేగదా ఏదో కాయితం రాసి యీయనకు యిస్తుంటే అమ్మ అది "భూదానం" అని చెప్పింది? ఆ పురోహితులగారింట్లోనే ఇప్పుడు నారాయణ మంగళవారం వారపు భోజనం తిని లేచాడు. పురోహితులగారింట్లో ఆడవాళ్ళందరూ నారాయణను దయగా చూశారు. ముఖ్యంగా ముసలావిడ, అతను అన్నం తింటున్నంతసేపూ భూదానం చేసిన, నాన్నగారినిగురించే చెప్పింది.

* * *

నారాయణ యిప్పుడు నారాయణ గాదు! ఆ నారాయణ ఎక్కడున్నాడు? వేణూ, వెంకూ అవధాన్లు భయపడే నారాయణ, బంట్రోతు రామ

లింగం భుజాలమీద ఎక్కి తిరిగిన నారాయణ, నాన్నగారి గుర్రపుబగ్గీలో షికార్లుచేసిన నారాయణ, మేడమీద నేతి గోరుముద్దల నారాయణ — ఎక్కడున్నాడు? నాన్న మెప్పుకోసం తనకు చొక్కా గుడ్డలు సిల్కువి కుట్టించిన అత్తయ్యల అల్లుడు కాదే యీ నారాయణ? పెద్దత్తయ్య రెండో కూతురు— అనసూయను చూపించి—నీ పెళ్ళాం—నారాయణా!—" అని ఒక్క గొంతుతో అన్న ముత్తాల బలగపు టొమాటోపండు గాదు యీ నారాయణ! నిజంగా పెళ్ళాంలాగానే, తనను చూడగానే గౌను సర్దుకొని, చిన్న పరికిణా కాళ్ళు కప్పుకుంటుంటే, చిరుగంటల కాలిపట్టాలూ, బొంబాయి గాజులూ మోగించుకుంటూ పరిగెత్తే అనసూయ కాబోయే మొగుడుగూడా కాదు యీ నారాయణ!!

ఈ నారాయణ — ఏడు వారాల్లో ఒకవారం తక్కువై, ఆకలి దిసికళ్ళకు గురియై బెజవాడ బాజార్లన్నీ మంచినీళ్ళు తాగి తిరుగుతున్న నారాయణ! ఎక్కడెక్కడో తిని, పూటకూళ్ళ రంగమ్మగారి వరండాలో చాలీచాలని దీపం ముందు పాఠాలు చదువుకుంటున్న నారాయణ యీ నారాయణ! చాపమీద చిన్న జంపకానా పరుచుకొని నిద్రపోయి పొద్దున్నే వంటిమీది దద్దుర్లు చూచుకొంటున్న నారాయణ యీ నారాయణ! సబురిజిస్ట్రారుగారింట్లో పూర్వవంటతిని, పాచిపోయిన అన్నమంతా వాంతిచేసుకొని బిక్కముఖంతో యింటికి వచ్చి అమ్మకుబదులు పూటకూళ్ళమ్మను దర్శించిన నారాయణ యీ నారాయణ! ఈ నారాయణకు ఇల్లులేదు. ఈ నారాయణకు వేస్టు సిల్కు చొక్కాలు లేవు. ఈ నారాయణకు అజీర్ణమూ లేదు. అత్తయ్యకూతురు అనసూయా లేదు. హైస్కూలు పుస్తకాలన్నీ లేవు. ఒకవారమూ లేదు. ఈ నారాయణ బికారి. ఈ నారాయణ—వారాల పిల్లాడు!!!

* * *

వారాల పిల్లాడికి ఆకలి వేసింది. ఆ రోజున స్కూలుకు పోలేదు. మేజస్ట్రీటుగారింటిదాకా మూడుసార్లు వెళ్లి తిరిగి వచ్చాడు. ఎట్లా? ఆయనకు నమస్కారం చెయ్యమని మామయ్య చెప్పాడు. తన జ్ఞాపకంలో మనుషుల కెవ్వరికీ నమస్కారం చెయ్యలేదు—తనకు తానై. విగ్రహాలు గాబట్టి, దేవుడికి, నాయనమ్మతోపాటు అమ్మతోపాటు నమస్కారాలు చేశాడు. ఏమని అడగటం? ఎట్లా అడగటం? నీకెందుకు వారం—? అని ఆ వల్లటి మీసముల్ల మేజస్ట్రీటు అడిగితేనో? మరి ఆకలి? మామయ్య పేరు చెబితే? తప్పదు. ఆకలి!!!

వెళ్ళి, బిళ్ళబంట్రోతు చూడకుండా యింట్లోకి పోయి మొదటిగదిలో నించొన్నాడు; ఆయన రాగానే చేతులెత్తి తికమకపడి నీళ్ళు నములుతూ కళ్ళు దించుకొని నమస్కరించాడు — "వారాల పిల్లాణ్ణి" అనగలిగాడు.

"ఏశాఖ?" అని గర్జనగా మేజస్ట్రీటుగారి ప్రశ్న. ఆకలికీ, శాఖలకూ యింత సన్నిహితమా?

మామయ్య చెప్పిన శాఖ తిరిగిచెప్పాడు.

సెటిల్మెంటు ఎఱుకలవాళ్ళనీ, దొంగ యీనాదుల్నీ పోలీసు సాక్ష్యంతోగూడా పనిలేకుండానే, నేరస్థులని తీసుకురాబడ్డ వాళ్ళ ముఖాలు మాత్రమే చూచి — శిక్షలు విధించటం ముఖ్య కర్తవ్యమైన మేజస్ట్రీటు హరిహరంగారు కళ్ళెత్తి, సమాజమంతా ఎత్తి, ' పారేసిన చిన్న ఖైదీ — ధనమూ, యిల్లూ తండ్రీ నీడాలేని పిల్లఖైదీ — నారాయణ వంకచూసి: "ఆ ముఖాన బొట్టేదీ? అంత విభూతి పెట్టుకొంటే మీ శాఖకు లోటువస్తుందా?" అని మరోమారు వారి సున్నితమైన గొంతును సరైన స్థాయికి కొనివచ్చారు.

వారాల పిల్లవాడికి కళ్ళవెంట నీళ్ళువచ్చినై. "మాయింట్లో యిలాంటి వేషాలు పనికిరావు. వడుగయిందా......? మరి ఆ క్రాపింగు ఏమిటెందుకు? సంధ్యావందనం వచ్చునా?......ఊహూఁ! ఎందుకు వస్తుంది? తడిగుడ్డ కట్టుకొని, స్నానంచేసి మరీని... బొట్టుపెట్టుకొని తిండికిరా! మా యింట్లో పెందలాడే కాదు. పదకొండు గంటలకు — ఎప్పుడైనా అంతే — ఒకపూట భోజనం. రాత్రికి ఉప్పుపిండి. అమావాస్యయితే నువ్వు రానక్కర్లేదు—హూఁ."

పదకొండు గంటలకు వెళ్ళాడు—న్యాయదర్శనుడు ప్రభుత్వాధికారి గారింటికి. మేజస్ట్రీటుగారి భార్య వారాల పిల్లవాడి సంగతి మరిచిపోయింది. "ఈవారం లేదు లేపో! వచ్చేవారం నుంచీ రెండు రోజులముందుగానే జ్ఞాపకం చెయ్యిపో—" అన్నది మేజస్ట్రీటుగారి నుండి న్యాయవిచారణ నేర్చుకొన్న ఆయన ధర్మపత్ని.

* * *

ఉసూరుమంటూ వారాల పిల్లాడు పాతిపట్టణం వేపు బయలుదేరాడు. అక్కడ అసిస్టెంటు కరణంగారినిగూడా వారంకోసం చూడమని గదా మామయ్య మాటలు. ఆకలితో పోరాటానికి తయారవుతోన్న నారాయణకు, కొత్తవ్యక్తుల్నీ, వింత ప్రకృతుల్నీ తన దురభిమానం చంపుకొంటూ —

చూడటం అలవాటయినట్లయింది. ఈ అసిస్టెంటు కరణం తమ్ముడు గూడా స్కూల్లో తన క్లాసే.

ఇంట్లో తన గౌరవ మెట్లావున్నా, అసిస్టెంటు కరణం గారు, బజార్లో, కొమ్ములు తిరిగిన తానే దారు లాగా వల్లెవాటు వుత్తరీయం వేసుకొని, ఆ రోజు ప్రయివేటులో వచ్చిన కిల్లీ నములుతూ, సిజర్ సిగరెట్టు చుట్టను కాల్చినట్లు కాలుస్తూ – "ఓ, అబ్బె దానికేముందీ? మీ నాయన గారుటోయ్ – నాకీ వుద్యోగం యిప్పించింది? మా బావమరిది మీ నాన్న గారి కంపెనీలో అక్కౌంటు పనులు కొన్నాళ్ళు చేశాడుగా – అహా!......ఊహూ!! గొప్ప దర్జాలే మీ నాన్న."

ఇంటికి వెళ్ళగానే అసిస్టెంటు కరణంగారి అమ్మ – కొమ్ములు తిరిగిన తానేదారూ, ప్రయివేటు యిచ్చిన కిల్లీ, సిగరెట్ల భోగపరాయణుడూ అయిన కొడుకుమీద చీపురుకట్ట తీసుకొని లేచింది. "రోజూ కొక తద్దినం తెచ్చిపెడ్తావా? నీకు చేతనయితే పూటకూలి పెట్టేంమా–" ఆ "మా"కు అంత పెద్ద దీర్ఘం వుందని వారాల పిల్లాడు ఆకలితో, ఆగ్రహంతో నిర్వీరపోయాడు. అంతేనా? అసిస్టెంటు కరణం గారి తమ్ముడు – రేపు తనతోపాటు స్కూలుకు వచ్చి, తోటిపిల్లలకు–తను వారాల పిల్లవాడని చెబితే! ఇంతవరకూ ఎవరికీ తెలియకుండా తను సంచరిస్తున్నాడు! ఇక నెట్లా??

* * *

వచ్చిందదారి బట్టేడు నారాయణ! అతినువ్వుంటే పూటకూళ్ళ రంగమ్మగారి యింటిపక్క బజార్లోనే కారుడ్రైవరు వీరరాఘవులున్నాడు. వీరరాఘవులు కొడుకు, కుమారస్వామి, నారాయణను చూసి తన యింటికి పిలుచుకు వెళ్ళాడు. అతనుగూడా తన క్లాసే.

"ఏమిట్లావున్నావ్? అన్నం తినలా?"

"ప్చ్"

"మా యింట్లో తింటావా?"

"ఊఁ — —"

భోగం వీరరాఘవులు భార్య కొంచెం మడి గానే, బ్రాహ్మల కుర్రవాడికి వడ్డించింది!! అమ్మను తలచుకొంటూ నారాయణ అన్నంతిన్నాడు. అంటే కుమారస్వామికి గూడా తన వారాల సంగతి తెలిసిం దన్న మాట.

* * *

మర్నాడు సబురిజిష్ట్రారు గారింట్లో వారం చెప్పటానికి వెళ్ళాడు.

"ఛీ...ఛీ...ఛీ...దూరంగా వుండు" అంది తూర్పున బుట్టిన పతివ్రత.

"నువ్వెక్కడి బ్రాహ్మడి వంట? నిన్న నీ తిండి బోర్లించుకున్న దెక్కడ? ఆ భోగం డ్రైవరు యింట్లోనా? అరి రామ రామ! నీ కింకేం వారం? ఏమింకా అట్లా చూస్తావ్? నిన్న మా బంట్రోతు చూడలా?"

* * *

కాంపౌండరు గారి భార్య—గడపలోనే అడిగింది—"నీకు విస్తళ్ళు కుట్టటం వచ్చునా?"

"రా...దు"

"మరి ఏమొచ్చు? రాకపోతే ఎలాగో? అదే వస్తుంది. నేర్చుకో మా ముసలమ్మ నేర్పుతుంది."

ఇన్ని బాదమాకులూ, చీల్చిన పూచిక పుల్లలూ ముందు వేసుకొని, కళ్ళజోడును దారాలతో చెవులకు కట్టుకొని కూర్చొన్న ముసలమ్మకింద, విస్తళ్ళు కుట్టే నైపుణ్యానికి తలపడ్డాడు ఆకలితో వచ్చిన విద్యార్థి నారాయణ! అది ఆయినతర్వాత ముసలమ్మ గారు మూర్ఛపోయే ఎత్తుకు వచ్చింది కాళ్ళనొప్పితో. "అబ్బాయ్, కాస్త కాళ్ళు నొక్కుదూ" అని మూలిగింది ఆ ముసలినక్క. చద్దెన్నం తినగానే, కాంపౌండరు గారు, ఆస్పత్రి మందుల్తో తన సొంత ప్రాక్టీసుకు వెళ్తూ—" ఇదిగో వోయ్, నీ పేరేమిటో... నారాయణేనా? మా పిల్లల్ని దర్శి పాపయ్య గారి బళ్ళోకి వదిలి నీదారిన పోదువుగాని." పాపయ్య గారి బడి యీవైపున, తన హైస్కూలు ఆవైపున!! నారాయణకు బడి ఆలస్యమయింది. ఆలోచన. పాపం! ఆయనమాత్రం ఏంచెయ్యగలడు? లోకల్ ఫండు బోర్డిచ్చే జీతాలు చాలక వేళకు అందక నానా తిప్పలూ పడుతున్నవాడు?

* * *

"మన వీధి పక్కనే సంస్కృత పాఠశాల వుపాధ్యాయులుగా రున్నాడు. ఆయనకు వారాలు చేసుకొని వృద్ధికివస్తూన్న పిల్లలంటే చాలా ప్రాణం. అక్కడికి వెళ్ళితే నీకు తప్పక ఒకవారం దొరుకు తుంది" – అని సలహా యిచ్చింది పురోహితుల గారింట్లో ముసలావిడ.

వారాల పిల్లలంటే ప్రాణాలు విడిచేవాళ్ళు నారాయణకు యింతలో ఎవరూ ప్రత్యక్షం కాక పోయినా సంస్కృత పాఠశాల వుపాధ్యాయులగారి

ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు; ఆయన ఎంతటి ముసలివాడోనని అనుకుంటూ వెళ్ళిన నారాయణ ఆకలి ప్రాణానికి గూడా ఆశ్చర్యం కలిగింది.

ఎవరు ఈ ఉపాధ్యాయులు? తన చిన్నతనంలో తన యింట్లో వారాలు చేసుకొన్న నరసింహం కాదూ?

"నా...రా...య...ణా?!" అని ఉభయ భాషా పండితుడు నరసింహంగారు మంచం మీద నుంచి దిగ్గున లేచి ఎగిరాడు.

"నారాయణా! నేను జ్ఞాపకం లేనూ? నా పుస్తకాల్లో పిచ్చిగీతలు గీచిన నారాయణవు గాదుటోయ్! రా...రా నాయనా? నిన్ను గురించే నా శేషమ్మగారు చెప్పింది? ఎంతటి కుటుంబం? ఎంత గతికి వచ్చింది?"

వారాల పిల్లవాడు కదలక నించొన్నాడు - రెండు కన్నులూ మూసుకొని. రెప్పల్ని తడుపుతూ జలజలమని వేడిగా కన్నీరు ఆ మూసుకొన్న కండ్లను లెక్క చెయ్యక ప్రవహిస్తోంది చిక్కి, జాలిగొలుపుతూన్న నునుబుగ్గలమీద. నారాయణకు నాయనమ్మ, చిన్నప్పుడు నరసింహం చూపిన స్మశానమూ తిరిగి స్మృతికివచ్చి కట్టెదుట నిలిచినై.

నారాయణ ఒక్క పలుకు పలకలేదు. పలకక ఆకలితోనే వెనుదిరిగాడు. చరచరా అడుగులు వేసుకొంటూ, దురభిమానపు హృదయపు, వత్తిడితో బరువెక్కిన అవ్యక్త భావాలతో—గడపదాటి పోయాడు. ఉభయభాషా ప్రవీణుడు నరసింహం బుర్రకు మించిన బరువు అది.

"నారాయణా" అని ఆయన కేక వేశాడు. బయటవున్న కొబ్బరిచెట్టు మాత్రం తలవూపింది.

7

నారాయణ యీలోపల ఒక్కసారే యింటికి వెళ్ళగలిగాడు అమ్మను చూచేందుకు. అమ్మతో గూడా తన ఆకలీ, అవమానమూ చెప్పటానికి అతని దురభిమానం అడ్డం వచ్చింది; ఎప్పుడూ లేనిది, ఎన్నడూ ఎరగనిది - యీనాడు ఆకలిని గురించి అమ్మతో ప్రస్తావించటం ఎట్లా? తను ఎందుకు వచ్చాడో ఆ విషయాన్ని రెండురోజుల తీవ్రవేదన తర్వాత నారాయణ అనగలిగాడు:

"అమ్మా! నువ్వొచ్చి నాకు వండిపెడితే చక్కగా చదువుకుంటాను."

"మన కక్కడ యిల్లేది నాయనా? ఆయింటికి అద్దె, మన తిండికి గింజలూ—నేను మగపుటక పుట్టలేదుగదా యింత సంపాదించి పడేయటానికి."

అభిమానంతో మామయ్యగారింటికి గూడా పోని అమ్మ, కోమట్ల యింట్లో, చాకిరిచేసి తనకు చొక్కా కుట్టించిందని నారాయణ గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు. తను వెళ్ళిన ఈ ఆరునెల్లలోనే ముసలిదైపోయినట్లుగా వున్న అమ్మ జవాబును శాంతంగా విన్నాడు. ఆ రాత్రే మళ్ళీ బెజవాడకు ప్రయాణం కట్టాడు.

* * *

బెజవాడలో బండిదిగి ఒక ప్లాట్ ఫారంనుండి మరోదానికి మారాడు నారాయణ. ఎందుకో అతనికే తెలియదు. ఈ బండి తప్పిపోతే జీవితమంతా భగ్నమై పోతుందన్నట్లుగా పెట్టెల్లో, పక్కచుట్టల్లో, పంచుల్లో పరుగులెత్తుతూన్న ప్రయాణీకుల్ని బెంచీమీద కూర్చొని చూచాడు. ఒంటరిగా దిగిన దిక్కులేని ఆడవాళ్ళను అపహరించి, వశ్యా గృహాలకై ఉత్తరదేశంలో అమ్మే దురహంతకులూ, స్టేషనులో పోలీసులు పెంచుకొంటూన్న జేబులు కత్తిరించే దొంగ కుర్రవాళ్ళూ అందరూ ప్రయాణీకులుగానే కన్పించారు నారాయణ కళ్ళకు. ఆ ఫలాని షావుకారు ఖమ్మం మెట్టులో కొన్న దొంగ బియ్యానికి యింకా పెద్ద దొంగ లాభం వచ్చిందన్న సంతోషంలో టిక్కెట్టు కొనకుండానే భోగీలో ఎక్కుతున్నాడని నారాయణ కేం తెలుసు?

విసుగుబుట్టి చివరకు యింకో రైలుబండిలో ఎక్కి తనూ కూర్చొన్నాడు కొంతసేపటికి నారాయణ. అందులో తోటి ప్రయాణీకుల సంగతిగూడా నారాయణ పట్టించుకోలేదు. ఇంట్లో భార్యచేత రోజూ చీపురుదెబ్బలూ, ఆవకాయ కారమూ తింటూగూడా, పద్దకుడి కొడుక్కు సికింద్రాబాదు నుంచి వచ్చిన పెళ్ళిసంబంధాన్ని ముక్కలుచెయ్యటానికై ప్రయాణమైన "స్టాంప్ వెండర్" (ఆయన కున్న బిరుదుల్లో యిదొకటి) రోణం రోమయ్య (యివి రెండూ వేర్వేరు బిరుదాలు) పంతులుగారు మూడవతరగతి పెట్టెలో ప్రజల సొమ్ముతో పెరిగిన పాపిష్టి దేహాన్ని బెంచీనిండా పరచగా, ఆయన కాళ్ళకట్టనే కూర్చొని, ఆనాటి పదేళ్ళ నిండిన నారాయణ, నిద్రపోయాడు. ఆకలిపెట్టిన ఆయా

సంతో బలహీనపు నిద్రపోయాడు బెజవాడను మరిచి పోయిన వారాల పిల్లాడు.

మర్నాడు కళ్ళు నలుముకుంటూ లేచి "హైద్రాబాద్" అని వున్న బోర్డుచూచాడు.

అక్కడి నుంచి నారాయణ జీవితం మరోక మారు మారిపోయింది.

టిక్కెట్టు కలెక్టరు నారాయణ దవడలు, ఎందుకు వాయించారో తెలియలేదు. తనుగాక, యింకో ముస్లిం కుర్రవాణ్ణికూడా టిక్కెటు కలెక్టర్లు పట్టుకున్నారు. కాని వాడిని పెద్దదెబ్బలు కొట్టలేదు. ఎవరో ఫెజ్ టోపీ పెట్టుకొని, తంబాకూ కిల్లీ గొర్రె వలె నములుతూన్న ముస్లిం అధికారివచ్చి టిక్కెట్టు లేకుండా ప్రయాణంచేసిన ఖాదర్ భక్షను విడుదల చేశాడు. తననూ 'విడుదల' చేశారు చివరకు—ఎందుకో తనకు తెలుసు. విన్నటిదో మొన్నటిదో రైల్లో రోమయ్యపంతులు పెట్టిన పులిహోర చద్దితిని, ప్లట్ బోర్డు మీదనే కక్కి అప్పటిదాకా మంచి నీళ్ళతో ఆకలిని చంపినవాడు రోషపోక యింకేమి చేస్తాడు? రోషపోయిం తర్వాత టిక్కెట్టు కలెక్టర్లకు యిక తన బొమికెలు విరగగొట్టవలసిన అవసరం తప్పింది.

* * *

నారాయణ హైద్రాబాదు జైల్లో పడటం కూడా అప్రయత్నంగానే జరిగింది. మార్వాడీల సత్రంలో యింత రొట్టె అన్నమూ తిని వుస్మాన్ గంజీవేపు నడిచివెళ్ళిన వాడికి, మరోక తురక పెద్ద మనిషి కనిపించాడు. (అక్కడ అందరూ వుర్దూ లోనే మాట్లాడుతున్నారు) ఒక చిన్న పెట్టె చేతి కిచ్చి – "నాతో రారా" అన్నాడు నైజాం పాలక జాతికి చెందిన పొడుగుకోటు మనిషి. ఆ మనుష్యుడు, రెక్కపట్టుకొని బురఖాలో వున్న స్త్రీ నొకతెను నడిపిస్తున్నాడు టాంగాలు నిల్చుండే స్థలం వేపు.

అనేక గల్లీలు తిరిగి తిరిగి, నవాబులు మసీదులకూ, మార్వాడీ వడ్డీ వ్యాపారులు వెండి దుకాణాల్లోకి వెళ్ళేందుకు అందంగా చేయబడ్డ విశాలమైన రోడ్లన్నీ వెనకనే విడిచి, నారాయణ కూర్చున్న టాంగా ఒక చీకటి మురికియింటి ముందు నిల్చింది. కాని అతనికో ఆశ్చర్యం వేసింది. బురఖా కింద వున్న ఆడమనిషి అంతసేపూ సన్నగా ఏడుస్తూనే వుంది. నారాయణ ఆయింట్లో చెడ్డ చాకిరీచేస్తూ నాలుగురోజు లున్నాడు. ఆరోజు సాయంత్రం అక్కడినుంచి తప్పించుకు పోదామని ఆలోచన చేస్తూండగా, పరదామాటునుండి—"అబ్బాయ్" అని అన్నిరోజుల కొక తెలుగు పిలుపు వినవచ్చింది. బురఖాలోవుండి ఆరోజున ఏడ్చిన మనిషి!

"నువ్వు తెలుగు పిల్లాడివా?"

"ఊఁ! నువ్వూ?"

"నేం గూడా. నన్ను లొల్లుపెట్టి యీ తురకోడు తోలుకొచ్చిండు. దొర్లింటో పనిప్పిస్తనని మాయజేసిండయ్యో"

"యిద్దరం పారిపోదాం"

ఆరాత్రి చీకటిపడ్డ తర్వాత చాలాసేపు ఆలోచించారు. ఫెజ్ టోపీ యింటికి రాలేదు. కొత్త గొందులు సందులు తిరిగి యిద్దరూ స్టేషన్‌వద్దకు చేరారు—బ్రహ్మాండమైన ప్రయత్నం చేసి. కరీంనగరు తెలుగు గొల్లపిల్ల నారాయణకు అణాయిచ్చి, బురఖా తీసి దూరంగా పారేసి—"నారాయణ గూడెంలో మా మాఁవ వుండాడు. నేను బోతా" అని పోయింది. నారాయణ తన తలమీది ఫెజ్ క్యాప్ నేలమీద విసిరేస్తుండగా మళ్ళీ ఖాదర్ భక్ష్ కన్పించాడు. టిక్కెట్టు లేని ప్రయాణీకులు ఈమాటు స్నేహితులైనారు. ఆ తర్వాత జేబుదొంగలైనారు.

8

ఇప్పుడు పోలీసులూ, మేజస్ట్రేటులూ నారాయణను ఏమాత్రమూ భయపెట్టలేక పోతున్నారు. పోలీసులు తనను బోర్‌స్టల్ స్కూల్లో వేసినప్పట్నించీ తప్పెట్లాగో తప్పించుకోగలననే ధైర్యంతోనే వెళ్ళాడు—మిడిగుడ్ల మేజస్ట్రేటు హరిహరంగారింట్లో వారం అడగటానికి అభిమానపడ్డ నారాయణ.

బోర్‌స్టల్ స్కూల్లోకి తనతోపాటు ఖాదర్ భక్ష్ గూడా వచ్చాడు. ఖాదర్, యీమాటు చిన్న బాకు బొడ్లో దాచినది అప్పుడప్పుడు తోటిపిల్లలకు చూపి వాళ్ళదగ్గ రేముంటే అది దోచుకుంటున్నాడు. ఈ సాధన నారాయణకుగూడా నచ్చింది. తనూ ఒకటి సంపాదించాడు. తనకన్నా బలహీను లందరికీ తనకు తెలియకుండానే సింహస్వప్నమైనాడు.

బోర్‌స్టల్ స్కూలు చదువు మూడునెలలే పట్టింది. ఆ తర్వాత ఒకరాత్రి బండిలో ఖాదరూ, తనూ బొంబాయి మెయిల్లో, బల్లలకింద దాగి మరోక దూరప్రయాణం సాగించారు.

బొంబాయి మిల్లు పొగలుపీల్చి, ప్రాణాన్ని వేధించే వూపిరాడని సముద్రపు వాతావరణంలో

పెరిగి, మూడవతరగతి హోటళ్ళలో, రౌడీ స్నేహితుల యిళ్ళల్లో కుళ్ళుతిండితిని పోరాన్ రోడ్డుమీది సగం ఫుట్పాతు రోగప్ర కులటల వరండాలేని రేకు యిళ్ళల్లో నిద్రించి—నారాయణ యువకుడైనాడు.

బొంబాయిలో – బెజవాడలో తను వదిలిన చదువుకొరకైన దిగులుపోయి—పూర్తి విజ్ఞానం సముపార్జించ గలిగాడు. బట్టలమిల్లుల్లో కూలీలు సమ్మెలు చేస్తున్నప్పుడు వాళ్ళ నడుములు విరగగొట్టి రహస్యంగా ఆకాశనుంచి రాలిపడ్డ పదిరూపాయిలనోట్లు సంపాదించాడు. పోర్చుగీసు డామన్ వెళ్ళి ఆకాశంలో చుక్కలూ, ప్రశాంతీ లేని రాత్రుళ్ళ సముద్రంమీద చిన్నదోనెల్లో విదేశీ పారాసీసాలు దొంగిలించుకువచ్చి, యింగ్లీషు హోటళ్ళలో పులెన్ సూట్ల పెద్దమనుషులకు అందించి చౌకగా డబ్బు సంపాదించాడు బొంబాయిలో అతన్నెరగని రౌడీలు లేరు (అక్కడ వీళ్ళను దాదాలంటారు.) గోవా వెళ్ళి బంగారపు అచ్చులు బొంబాయి మార్వాడీ షావుకార్లకు అందజేయ్యాలంటే ఏమి చెయ్యాలో నారాయణ ఆలోచించ నక్కర్లేదు. గోల్ పీఠా కుళ్ళుబజార్లలో కలహం రేపాలంటే సుక్క మంచినీళ్ళ ప్రాయం. మదన్‌పురా మురికి కొంపల్లో, భెండీ బజార్ స్లమ్స్‌లో, పరేల్ మిల్లుల్లో దాదర్ వత్తికిలో, బైకుల్లా కంపులో—యిక్కడా అక్కడా ఏమిటి?—బొంబాయి గుడ్డల మిల్లుల గుజరాతీ షావుకార్లు సృష్టించిన అన్ని నరకపుపేటల్లోనూ అతనికి స్నేహితులున్నారు. చీకట్లో నించొని, బొంబాయి రోడ్లమీద షికార్లు పోతున్న భార్యాభర్తల్ని దోచటం, ఆఫ్గన్ పఠాన్లతో కలిసి చిన్న బ్యాంకుల్లోకి జొరబడటం, విదేశాలనించి వచ్చే నావికుల దగ్గర తెలివిగా దొంగ పిస్తోళ్ళు చేరం చేయటం—ఒకనాటి వారాల పిల్లవాడికి, నాయనమ్మకోసం కాశీమజిలీ కథలకోసం, సంజీవి పుల్లకోసం వెతికిన నారాయణకు కూడువిద్య ఐపోయింది. కాని నారాయణ ఒక విషయంలోనే పొరబాటు చేశాడు. తనే తెలివిగలవాడిననీ, తన దొంగ పిస్తోలు ముందు, స్ప్రింగు పేష్ కత్తిముందు — లోకానికి మోక్షం యివ్వదలిచాడు. కాని తనకు మోక్షం యివ్వదలిచిన పోలీసుల సంగతి బొత్తిగా మరిచిపోయాడు.

9

నారాయణ ఆడపా దడపా నాలుగేళ్ళ ప్రభుత్వానికి అనేక జైళ్ళలో అతిథిగా వుండివచ్చాడు. కాని జీవితంలో యీమాటు మార్పులేమీ వచ్చేట్లుగా కన్పించలేదు. కాగాపోగా తనసీమలో యిన్నాళ్ళూ తిరిగిన ఖాదర్ ఖాఁ కామాటిపుర వల్లగొందుల్లోని ఒక అమ్మాయి విషయంలో తగాదా లాడి తన డొక్కలో, తన కత్తితోనే పొడిచాడు ఆనాడు "అమ్మా" అన్నాడు తల్లికష్టాలు నిర్మూలింపదలిచి వారాలు చేసుకొన్న నారాయణ. చివరకు ఎట్లా చచ్చాడో ఖాదరే చచ్చాడు.

* * *

దాదర్లో చిన్నదుకాణదార్లను బెదిరించి తెచ్చుకొంటున్న దోపిడీలో మిల్లు సమ్మెలను భగ్నం చెయ్యటానికై మిల్లు మేనేజర్లు సృష్టించిన "దాదా" లకు ఒకసారి భాగాల తగాదావచ్చి యుద్ధానికి తలపడ్డారు. మిల్లుల్లో సమ్మెలు లేక యీమధ్య వీళ్ళందరకూ—ముఖ్యంగా – నారాయణకు ఆదాయం తగ్గిపోయింది. అటు యిద్దరూ యిటు యిద్దరూ గాయపడ్డారు. నారాయణమీద సాక్ష్యం దొరకలేదు గాని, పరాయి రాష్ట్రం వాడని – అతన్ని పోలీసులు బొంబాయిలో తిరిగి అడుగుపెట్టకూడదని ఉత్తర్వులిచ్చి తరిమివేశారు. అట్లా తిరిగి వచ్చాడు స్వదేశానికి–నారాయణ.

వచ్చిన రెండు వారాల్లోనే హత్యకేసులో నారాయణ పోలీసులకు చిక్కాడు. నారాయణ జీవితంలో యిదొక మార్పుగానే వచ్చింది.

10

నారాయణను విచారించిన సెషన్సు జడ్జీ హరిహరంగారే. తను చేసుకోవలసిన పెద్దత్త కూతురు అనసు మొగుడు పబ్లిక్ ప్రాసిక్యూటరు. కోణం రామయ్య—(భార్య చనిపోయింది) పోలీసు పంచనామాల్లో ఒకడు.

కోర్టుకు సంకెళ్ళతో పోలీసు కార్లో వస్తూన్న నారాయణకు ఒక రోజున హఠాత్తుగా – మామయ్య కన్పించాడు. ఆయనతో యింకో ముసలమ్మ కూడా వుంది. మామయ్య వల్లబడ్డాడు. జుట్టు తెల్లబడ్డది.

"నా...రా...య...ణా?" మామయ్య కళ్ళనీళ్ళతో కోర్టు మెట్లమీద నిల్చొని వున్నాడు.

"మా...అ...మ్మ..."

అప్పటిదాకా నవ్వుతున్న నారాయణ దిగాలుపడిచూచాడు.

"అ...మ్మ?!"

పోలీసులు యిక మాట్లాడ నివ్వలేదు.

* * *

నిన్నటిదాకా నిర్దోషినని బోనులో చెప్పిన నారాయణ, ఆరోజు కొత్త వాఙ్మూలం యిస్తానని నిలబడ్డాడు. చెప్పమన్న జడ్జి ఆశ్చర్యపోయాడు.

"ఒక కండిషను మీద నిజం చెప్తాను" అన్నాడు. పోలీసుల్ని సైతం గజగజ లాడించిన ఖైదీ.

"ఏమిటేది ?" అన్నాడు జడ్జీ.

"మీ యింట్లో యికముం దెప్పుడూ వారాల పిల్లలకు తిండి పెట్టవద్దు. వాళ్ళు నావలె, హంతకు లవుతారు."

11

నారాయణను రేపు వురితీస్తారనగా రామయ్యాశ్రి, అమ్మ జైలులో తన సెల్‌లోకి వచ్చారు. ఇంకెవరో వచ్చి భగవద్గీత చదివాడు. నారాయణ జడ్జీనించి తెలుసుకొన్న విశేషం అమ్మకు చెప్పాడు. "అమ్మా! నా డబ్బూ, వస్తువులూ నీకు యిస్తారని జడ్జీ చెప్పాడు. నేను చచ్చిపోయిం తర్వాత ఒక వారాల పిల్లవాణ్ణి నువ్వు చదివిస్తావంటే నేను సంతోషిస్తా."

12

రామమంటపం మీద తీర్థులవారు మరో మారు పురాణ శ్రవణం ఆపించి అన్నారు, పెద్దగొంతుతో: "శాయమ్మ తల్లీ! విన్నావా ? ఆ చంపిన పిల్లవాడు వెనక మన వూళ్ళో వారాలు చేసుకొన్న పిల్లవాడట." శిష్యకోటి మేల్కొని వంత పలికింది "కలి కాలం! కలికాలం!! కలికాలం స్వామీ !!!"

అయోమయం

శ్రీ వేముగంటి నరసింహాచార్యులు


పూలకన్నెల కమ్మని మోవిమీద
చిందెడు మధుర మధు కణమందహాస
మిళిత ధారలపాడు తుమ్మెదల రేడు
దోచుకొనిపోవు నిద్దుర లేచి వచ్చి
లలిత సంధ్యా వధూ కపోలముల యందు
కమల మిత్రుండు రక్త రక్తిమ లిఖింప
శ్యామలాంగుడై ఒక్క నిశాంధకార
రాక్షసుడు వచ్చి గుటుకున త్రాగిపోవు
బాలపల్లవా లంకారలీల తోడ
అంద మొలికించు వాసంత యౌవనమ్ము
బగ్గుమను గ్రీష్మకాలంపుటగ్గిలోన
మగ్గిపోవును మోడు వారంగ బ్రతుకు
ప్రకృతి కంఠస్థ వజ్రహారముల వోలె
వెలయు హిమ బిందువుల కళా విలసనమును
నలిపి నశియింప జేయుచండ కిరణుండు
నాలి వెచ్చని వేయి పాదాలు విచ్చి
శ్రావణపయోద గళిత నీరమ్ములందు
మున్ను జలకమ్ము లాడిన కన్నె వాగు
దివ్య జీవన సూత్రముఁ ద్రెంపివేయు
మండుకొని వచ్చు ఎండల దుండగీడు
చెమట రూపాన మేని రక్తమును వడపి
నేల పెదవుల తీపిని గ్రోలుహాలము
తోడ హాలికుండు పండించు దొడ్డఫలము
పరులుగొనిపోదు రిండ్లకు బండ్లమీద
ఏమిటో? అయోమయమైన దీజగత్తు
అన్య సౌఖ్యమ్ములను గన స్వార్థమునకు
బలిని గొనుచున్న సృష్టి తత్వమును చూచి
నరనరమ్మున ఉడుకు నెత్తురులు పొంగు

మైసూరు చెన్నపట్టణనిర్మాత ఇమ్మడి జగదేవరాయడు

★

శ్రీ నిడుదవోలు వెంకటరావు

మైసూరి రాజ్యమున విజయనగర సామ్రాజ్యాధీశులవలన నాయంకర వృత్తులను బడిసి యా వెనుక స్వతంత్రులైనవారిలో రాజావంశీయు లొకరు. వీరు తెలుగువారు. చతుర్థకులజులు—విష్ణువర్ధనగోత్రులు. ఆ రాజ్యమున చెన్నపట్టణసీమను పాలించుచుండెడివారు. సంస్కృతాంధ్రభాషలను పోషించి రణరంగమునకూడ ప్రఖ్యాతి వహించినవారు. వీరిలో ప్రసిద్ధుడగు నిమ్మడి జగదేవరాయడు 1 చెన్నపట్టణమున కోటను గట్టించినాడు. ఇతనికే పొన్నతోట బొబ్బిలికవి 2 'వామనపురాణము' అను గ్రంథమును కృతి నొసగియున్నాడు. అందీతని వంశక్రమ మిట్లు వర్ణితము.



1. చెన్నపట్టణము - ఇది మన (మద్రాసు) చెన్నపట్టణము కాదు. ఈ చెన్నపట్టణము మైసూరి రాష్ట్రములోని బెంగుళూరునకు 37 మైళ్ళ దూరమున నున్నది - ఆ పేరి తాలూకా ముఖ్యపట్టణము - ఇమ్మడి జగదేవరాయడీ పట్టణమున కోటగట్టి, దానిని విస్తరింపజేసి, రాజధానిగా చేసికొనెను. *"The fort appears to have been built abont 1580 by Jagadevaraya, who made Chennapatna the Capital of the territory, bestcwed upon him for his gallant defence of Penugonda"* *Mysore. Lewis Rice vol. 2. Bangalore Dist. Page 62.*

Immadi jagadevaraya	*15 years*
Mummadi	*8 years*
Kumara jagadeva	*7 years*
Ankusa	*16 years*

In 1630, It was Captured by chamaraja Vodayar of Mysore.

2. అముద్రితము. ప్రాచ్యలిఖిత పుస్తకభాండార త్రైవార్షిక సూచికా సంపుటము. 1919-22. నాల్గవసంపుటము సంఖ్య 607. పుట 1584-89.

ఇమ్మడి జగదేవరాయని—
3 అసమసాహాశక్తి నలరారి మృత్యుజా
ఖాను చిత్తఖాను కఠినఖాన
ఖనినూరు ఖానుని ఖండించి నెసదదీ
యూను చరావళి నాక్రమించి
చెండాడె బలసముచితముగ విక్రమక్రమ
లీలనెంతయు గ్రసుమమీరాల.

ఇట్లు మహమ్మదీయ సేనానాయకులను జయించుటయే గాక, వీరవేంకటపతిరాయలు పట్టాభిషిక్తుడగుటకు తోడ్పడెను. ఈ మహావీరునివలననే రాణావంశము కీర్తి విస్తరిల్లినది. ఈతని శాసనములు రెండింటి నిం దుదాహరించుచున్నాను. ఒకటి కన్నడము. ఒకటి తెలుగు.

1

'1 మైసూరిరాజ్యమున చన్న'పటణము తాలూకా యందలి దశవార గ్రామమున నున్న శాసనము.

శుభమస్తు. స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవరుషంగళు 1545 అఁగనినెయ రుధిరోద్గారి సంవత్సరద వైశాఖ బహుళ 12 శేరు శ్రీమద్రాజాధిరాజ మహరసరాజన పరమేశ్వర శ్రీ వీరప్రతాప శ్రీ వీరరామదేవరాయలయ్య నవరు పెనుగొండెరిమ్మ సెయ్యా నేన శ్రీమతు పృథ్వీ సామ్రాజ్యము చేయుచుండి యుండంగయు వింగ్గ జిగారుచలరు. ప్ర...రుగ బసేవ నిగద స్వామికిచ్చి ధారాదానసహద్యలు అంగరంగ వైభోగలు మొదలు గాగల అన్నిన్ని సంగంగాను......విష్ణువర్ధన గోత్రపవిత్ర రాజా పెద జగదేవరాయనింగారికి అమాత్యులైన జగదేవరాయనింగారి పుత్రులు రాజశ్రీ కుమార యిమ్మడి జగదేవరాయనింగారు సమర్పించిన భూదాన ఆయ ధర్మ శాసనక్రమ మెట్లన్నను...అమరనాయక తనకు నడిచే చెన్నపట్నం సముతు చెల్లముం మాగి కిలశలైన దసరం గ్రామానకు చెల్లే కుప్పికిలకలి సహాగాను చెల్లే చతుస్సీమ తండ్రి జగదేవ రా య ని ం గారికి పుణ్యంగాను స హిరణ్యోదక ధారా పూర్వకంగాను సమర్పించిన రంగను అగ్రామానకు చెల్లే అ చతుస్సీమలో నిధి నిక్షేపజల పాషాణ అక్షీణ ఆగామి సిద్ధసాధ్యంబులు అనియెడు అష్ట భోగతేజస్వామ్యములునూ్న దిరాకై షడం గంగాను, త్రివాచకంగాను ఆచంద్రార్క స్థాయిగాను నడచేలాగున సమర్పించిన దానశాసనం.

దానపాలనయోర్మధ్యే
దానాచ్ఛ్రేయోను పాలనం,
దానాత్ స్వర్గమవాప్నోతి
పాలనాదచ్యుతం పదం.

2

2 కంకణహల్లి తాలూకా అల్లాల సంద్ర గ్రామమున నున్న శాసనము. శ్రీదుర్ముఖి సంవత్సరద జ్యేష్ఠ బహుళ 2 రాజశ్రీ కొమరయిమ్మడి జగదేవరాయ అయనవరు 1 బసవన పళి అళాజవానరు ప్రతిష్ఠమాడిదీ కాశీ విశ్వనాథస్వామిగె కనుక నలిసీమాలొగిన ఆళాళ సముద్ర గ్రామవన్ను సర్వమాన్య అగ్రహార వగికొట్టి త్రయాగ్రమక్కె సల్లువ......అలిగ దానవాగి కొట్టివు యుందు బరసికొట్టె శిలాశాసన శ్రీ విశ్వేశ్వర దేవరు.

(ఈ ఎపీగ్రాఫికా కర్ణాటికా సంపుటముల లోను, మైసూరి అర్కశాఖాని వేదికలలోను తెలుగుశాసనములు చాలగలవు. 10 వ సంపుటములోనే 211 శాసనములున్నవి. ఇవి ఇంతమంది! కవుల కాలనిర్ణయము చేయుట కనుకూలింపును. వీని లిపి కన్నడము.) .

ఇందు మొదటిది క్రీ. శ. 1623 నాటిది. రెండవది. క్రీ. శ. 1621 నాటిది. దీనిని బట్టి యీతడు, 17 వ శతాబ్ది ప్రథమదశకములలోనివాడని చెప్పవచ్చును. ఈతనికి కృతినిచ్చిన పొన్నతోట బొబ్బళ కవియు క్రీ. శ. 1620 ప్రాంతమువాడని చెప్పవలెను.

ఇమ్మడి జగదేవరాయఁడు సంగీత సాహిత్య విద్యాచతురుడు. ఈతడు ప్రత్యేకముగా వీణవాయించుటయందు నేర్పరియని కృత్యాది నున్న యీ క్రింది పద్యములవలన తెలియుచున్నది.

---

3. *Further sources of Vijayanagar History. Dr. N. Venkata Ramanayya.*

Vol.. II. Page 205. Also Vol. I. Page 311-315.

"Headed by famous Jagadevaraya the ruler of Chennapattana, they chose Venkata II As their emperor" Jagadevarow Appears to have made a sally from the fort and attacked the Kutubshahi Army.

1. *Epigraphica Carnatica Vol IX. Channapatna Taluq.*

No 182, Page 349.

2. ,, *Kaukanahalli Taluq. No. 103 Page 296.*

"ప్రోదియు ఘనతేని వీణా
వాదన మప్రతిము, మతుల వైభవము శుభా
పాదకము వితరణం
బతి మోదకరం బౌర ; మతియు మెరాఘుం బెంచున్.

మఱియు నీతడు తెనుగున స్వయముగా కవి. కవిరాజని కీర్తి గాంచినవాడు. డొబళకవియే యిట్లు చెప్పుచున్నాడు.

"అమిత మధ్యాత్మరామాయణము తెనుంగు
కబ్బముగ గూర్చినట్టి యక్కచ్చి జేడు
పరులకవితా ప్రవీణత బరయ నేర్చు
వని వచింపగవలయు నే యద్భుతముగ

కాని జగదేవరాయని కృతి యధ్యాత్మరామాయణము నేడు లభ్యము కాలేదు. "కచ్చి జేడు" అనునది 'కవిరాజ' శబ్దమునకు, తెనుగుసేత.

ఈతడు సంస్కృతమున చండికాదేవీ నవరత్నములను రచియించెననియు, వానిని వీణపై వాయించుచుండెడి వాడనియు, అష్టమాశ్వాసాద్యంతములలోని పద్యములబట్టి తెలియుచున్నది.

"విరత ప్రచండదేవీ
విరచిత నవరత్న ఖచిత వీణావాద
స్ఫురణార్ద్రిత మణిగృహసంచరణా"...
"దివిభవ ఘనప్రచండ దేవీభరత
ప్రావీణ్య..................

మఱియు నీతడు పెక్కు గీతప్రబంధములు రచించి యవి వీణపై వాయించుచుండినట్లు పంచమాశ్వాసాంతమున నిట్లు చెప్పబడియున్నది.

"వరనైణేకౌద్భుతావహ
నిరుపమగీత ప్రబంధ నిర్మాణకళా
దరణీయ చాతురీకృత
పరభాగ విశాల సుకృత భరణ సుశీలా!"

ఈ గీతములకొఱకు కింకను పరిశోధన జేయవలసి యున్నది. వామనపురాణమున పది యాశ్వాసములు గలవు. కాని వానిలో సప్తమాష్టమాశ్వాసములు మాత్రము ఈవని వేంకటేశకవి ప్రణీతమైనట్లుగా నా యాశ్వాసాంత గద్యలు తెలుపుచున్నవి.

డొబళకవిగద్య :

ఇది శ్రీమద్వేంకటరమణ పరిచరణ ధురంధర హృదయ నిఖిల కవిరాజ వర్ణనీయ వరాంధ్ర కవితా విశేష పర్యంకష భాషానిరాఘాట భావన్నతోటకుల పాథోనిధి రాకానిశాకర రాజరాజ డొబళార్యతనూభవ డొబళకవి ప్రణీతంబైన వామనపురాణంబునందు సర్వంబును దశమాశ్వాసము.

వెంకటేశకవి గద్య.

ఇది శ్రీవిభావతీ కటాక్షవీక్షణామృత సంప ర్ధిత చతుర్విధ కవిత్వవైభవ యావని రౌజ్ఞానార్య తనూభవ సరససంస్కృతాంధ్ర భాషావిశేష బోధాకర, కౌండిల్యగోత్ర సుధాకర విరంచిరాధిత సోమ సౌందర్యేశ వేంకటేశ కవి ప్రణీతంబైన వామనపురాణమున డొబళకవివిరచిత శేషంబున సప్తమాశ్వాసము—ఇట్లే అష్టమాశ్వాసము. కాని, నవమ దశమాశ్వాసములలో డొబళకవిగద్య యుండుటచేత డొబళకవియే యిది పెద్దగ్రంథమని, శేషభాగమును వేంకటేశకవిని పూరింపుమని నియమించియుండును. తిరిగి తనకు తీరిక గలుగుటచే చివర రెండింటిని రచియించి యుండును. వీ రిరువురును సమకాలికులే గదా! జగదేవరాయనిగూర్చి యీ క్రింది చాటుపద్యము చాటుపద్య రత్నాకరము 148 పుటలో నుదాహరింపబడి యున్నది.

జగలోభుల్ మఱి భాండవిగ్రహులు గం
జాతిండి లండీలు పెం
డి సులాముల్ మగలంజ లాగడిపు లై
దైల్ ఘోర క్రూరాత్ముల్
ధగిడీలుండగ నేమి యర్థుల కృతా
ర్థత్వంబు నొందింతురే
జగదేవక్షితి పాలరాచకుల నే
జాడిన కల్పద్రుమా.

పైవంశవృక్షములోని జగదేవరాయని తమ్ముడగు అంకుశేంద్రుని కుమారుడు యిమ్మడి అంకుశభూపతికి ఏకామ్రు వాసుదేవకవి సంస్కృతమున "జాంబవతీకల్యాణము" సత్యాపరిణయము, అను రెండు కావ్యములను రచియించి యంకిత మొనర్చియున్నాడు. ఈ రెంటింటి యవతారికలయందును రాజవంశవృత్తాంతము వివరింపబడినది. ఇందలి చారిత్రికాంశము లన్నియు, వామనపురాణావతారికతో సంవాదము నందుచున్నవి. వామనపురాణమునకు దరువాతి రచితములగుటచే, నీకావ్యములలో అంకుశభూపతి భార్యలు సంతానము కొంత వివ

1. *Descriptive Catalogue of Sanskrit Manuscripts. Vol. XX No. 11535, 11816.* (*P. 7732-42, 7889-97*)

2. *Sources of Vijiayanagar History 70-71. P. 227-230.*

రణగా దలంపబడినది. జగదేవరాయని విజయములను గూర్చి సత్యాపరిణయములో—

"యోఽరక్షీ ద్దుర్గవర్యే ఘనగిరిమహితా
మారాత్రిజాంభాన మారూ
ఢ్యాచే జితత్వద శూరో మహితవలయుతం
చిత్రభానం దయుద్ధే
జీవగ్రాహం త్వ గృహ్ణా ద్బహుబలమపి
నిర్భిద్య బాజాతిఖానం
సోఽరక్షీ చ్ఛ్రేలమల్కాం పజయతి
జగదేకావనీనాథ కౌతః"

వామనపురాణములో నీవలి కుదాహృతమైన దాని నిది దృఢపఱచుచున్నది.

ఔబళకవిని గూర్చిన యితరవిషయములు తెలియరాలేదు. అతడు కందాళ భావనాచార్యుని తనయుడైన శ్రీరంగాచార్యుని శిష్యుడైనట్లు చెప్పుకొనియున్నాడు. క్రీ. శ. 1614-30 వఱకు పాలించిన రామదేవరాయల కాలమున కృతిభర్తకర్త లిరువురు నున్నట్లు 'అసమానోదయ రామరాయ ఘనకార్యా యోగ నిర్వాహ' అను పంచమాశ్వాసాంతపద్య పాదము తెలుపుచున్నది.

వామనపురాణమునకు వేఱొకచోట ప్రత్యంతరమున్నట్లు కన్పట్టదు. ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున గల యీ ప్రతిమూలమును సంపాదించినది శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారే!

చందమామ ★

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

ఎక్కడికి పొయ్యేవు చందమామా నీ
వెందాక పయనాలు చందమామా
....

మబ్బంచుల గుఱ్ఱమెక్కి
సుహాసనందు రాజకేవి
మంచు తెరల వల్లెవాటు
మాటికి సవరించుకొంట
ఎక్కడికి......

నీలి మబ్బు కొండలపై
నిక్కి నిక్కి చూచేవు.
అలిగిన మామయ్య జాడ
లంతు దొరుకునేమో కను
మెక్కడికి......

చిగిరించిన తోటంతా
చిన్నబోయెనని చెప్పె
వెచ్చని వెన్నెల కాలము
నొచ్చిందనరా చెవిలో
ఎక్కడికి......

ఏటిగట్టు యిసకలలో
ఎన్నెల దుప్పటి పఱచీ
రమ్మనిపిలు నారాజును
రావీ గడియలు రేపని
ఎక్కడికి ......

ఎండో ఎన్నెలో నీమన
సేదో రుజువీ రాతిరి.
చల్లని దొరవయితే మము
జంట కలిపిపో చూతము
ఎక్కడికి......

నీ తెచ్చిన పూలవాన
నీలిమ లోడే నావల
కమ్మని మా కవుగిటనే
కడిగిన ముత్యాల రాశి
ఎక్కడికి......

లజ్ కార్నర్

★

శ్రీమతి మాలతీ చందూర్

రాత్రి పదిగంటలు కొట్టారు. శేఖరం అప్పుడే నడుం వాల్చాడు. కొత్త కునుకు పట్టిందో లేదో హాల్లోని టెలిఫోన్ గణగణ మోగింది. శేఖరానికి చిర్రెత్తుకొచ్చింది. విననట్టు వూరుకున్నాడు. కాని ఆ ఫోను చేసే మహానుభావుడు—యివతలవారి అంతూ పంతూ తేల్చుకునేట్టు వున్నాడు.

ఫోనుదగ్గిరకెళ్లి రిసీవర్ చేతబుచ్చుకున్నాడు శేఖరం. 'హల్లో' అని అవతలవైపునుంచి స్త్రీ కంఠం వినపడటంతో—అతని నిద్రమత్తు వదిలింది. కాని, యింత రాత్రివేళ తనకు ఫోనుచేసే స్త్రీ ఎవరా అని ఆశ్చర్యపడ్డాడు. 'హల్లో' అన్నాడు సమాధానంగా.

'మీ ఉత్తరం నిన్ననే అందింది. ఎక్స్‌ప్రెస్ లేటయింది. అంచేత చిక్కుపడిపోయాను.' అంటోంది స్త్రీకంఠం.

తనేమిటి, వుత్తరం రాయడమేమిటి, ఎక్స్‌ప్రెస్ ఏమిటి? పైగా చిక్కుపడిపోవడం ఏమిటి? ఇందులో ఏదో పొరబాటు వుండివుండాలి, అనుకుంటూ 'ప్లీజ్ - మీ పేరు?' అన్నాడు శేఖరం.

'శ్యామల. మీ అడ్రసు పారేసుకున్నాను, కాని ఫోన్ నెంబరుమటుకు జ్ఞాపకంవుంది. నేనిక్కడ చాలా ఆక్వర్డ్ సిట్యుయేషన్‌లో చిక్కుకున్నాను.'

'మీరు ఒక నెంబరుకు మరో నెంబరు ఫోన్ చేసివుంటారు. నేను మీకు వుత్తరం ఏమీ రాయలేదు. మీకు కావలసిన నెంబరేమిటి?'

'మీ నెంబరు 2017 కాదా? అది మీరిచ్చిన నెంబరే. శ్రమ అనుకోకుండా తక్షణంవచ్చి నన్ను తీసుకెళ్ళండి. అసహాయ స్థితిలో వున్నాను,' అంది అవతల కంఠం.

'మీరేదో పొరబడుతున్నారు. మీరు డయల్ చేసింది 2017 కాదు, 2007. రాంగ్ నెంబరు' ఫోను కిందపెట్టబోతున్నాడు శేఖరం.

'దయచేసి—నే చెప్పేది వినండి. ఫోను కింద పెట్టెయ్యకండి. మీరు డైరెక్టర్ ఆనందన్ కదూ? ఆయన నన్ను రమ్మనమని వుత్తరం రాశారు. అది చూసుకుని పొద్దుటే బయలుదేరాను బెజవాడనుంచి. చూడండి నాదగ్గిర చిల్లరలేదు, నోట్లున్నాయి. పబ్లిక్ టెలిఫోన్‌నుంచి మీకు ఫోన్ చేస్తున్నాను,' అంది శ్యామల.

'అయితే?' అన్నాడు శేఖరం కొంటెగా.

'మిమ్మల్ని శ్రమపెడుతున్నందుకు క్షమించండి. దయచేసి, 2007 నెంబరుకి ఫోన్‌చేసి, శ్యామల ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిందనీ లజ్ కార్నర్‌లో చిక్కుపడిందనీ ఆనందన్ గారికి ఫోన్ చేసి పెట్టరూ?'

'మీరే ఫోన్ చేసుకోండి. మధ్య నేనెందుకు?' అంటూ రిసీవరు కిందపెట్టబోతుంటే...

'నామాట నమ్మరూ—దగ్గిర నోట్లున్నాయి గాని—పర్సులో చిల్లరలేదు. రెండు అణాబిళ్ళలుంటేగాని టెలిఫోన్ పలకదుగా—దయచేసి... నాకు చాలా భయంగావుంది. వీధంతా నిర్మానుష్యంగా వుంది. నేను ఈ బాక్సులో వున్నాను. బయట ఎవరో అతను నాకేసి ఎలాగో చూస్తున్నాడు. నాకు ఏమిటో భయంగావుంది—నే నిక్కణ్ణించి కదలటానికి భయంగా వుంది. మీరన్నా వచ్చి నన్నిక్కడినుంచి రక్షించండి.'

డైరెక్టర్ ఆనంద్ గారికి ఫోన్‌చేశాడు శేఖరం.

'చూడండి శ్యామలాదేవిట మీరు వుత్తరం రాశారుట. బెజవాడనుంచి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిందట. లజ్ కార్నర్‌లోని పబ్లిక్ టెలిఫోన్‌నించి

ఫోనుచేసింది. ఆవిడదగ్గిర—మీకు ఫోనుచేసిందుకు అణాలు లేవట. ఆవిడకు చాలా భయంగా వుందిట. మిమ్మల్ని వెంటనే వచ్చి తీసుకెళ్ళమంటోంది. మీరొచ్చేదాకా అక్కడే వుంటుందిట," అన్నాడు. నక్క తప్పుకోకుండా శేఖరం.

'డైరెక్టరుగారు నిద్దరపోతున్నారు. ఇప్పుడు లేపకూడదు.'

శేఖరం ఆశ్చర్యపోయి "మరి మీ రెవరు?" అని అడిగాడు.

'మేనేజర్ని—'

'ఆ శ్యామలాదేవి సంగతేమిటి?'


'మాకేమి తెలుసును, సార్? ఎందరో వస్తూ వుంటారు పోతూవుంటారు.'

'ఓరి దౌర్భాగ్యుడా!' అని మేనేజర్ని మనసులో తిట్టుకుంటూ శేఖరం గరాజ్ లో నుంచి కారుతీసి లజ్ కార్నరు వైపుకి బయలుదేరాడు.

ఆ వచ్చినఅమ్మాయికి కొత్త యింగితం వుండదా? రాత్రి పదిగంటలవేళ, వొక్కతే ఆడపిల్ల, ఎరగని పరాయివూళ్లో చిక్కుపడిపోతేనా? బయలుదేరేముందు కొంత మంచీచెడ్డా ఆలోచించటం ఆ పేదిఆడవాళ్లకి బొత్తిగావుండదు కాబోలు. ఇప్పుడు ఏకంపులూ, మొత్తుగోడాలూ. యీ సినిమా వేలంవెర్రి ఆడపిల్లల్ని భూతంలా పట్టుకుని పీడిస్తోంది.

ఆ అమ్మాయికి శాస్తి జరగాల్సిందే! పాపం, ఆడపిల్ల ఆశ్రయం లేకుండా తెల్లవార్లూ గడపగలదా? ఏహోటల్ కైనా పోగూడదూ పర్సులో నోట్లువున్న అమ్మాయి? లోకజ్ఞానం తెలియని మూఢురాలిలా వుంది ఈ శ్యామల. లేకపోతే అర్ధరాత్రి వేళ...... ఛెట్, జారిపడగూడదు. యిలాటి పిల్లలకి శాస్తిజరగవలసిందే—అనుకుంటూ లజ్ కార్నర్ లో కారు ఆపాడు శేఖరం. కారు దిగి రెండడుగులు ముందుకి వేశాడు శేఖరం. అచ్చు ఆ అమ్మాయిచెప్పినట్టే, ఆ బాక్సుదగ్గిర ఒక మనిషి నుల్చుని లోపలికి చూస్తున్నాడు. పెట్టెలోపల శ్యామలాదేవి వుంది.

శేఖరం తలుపు తెరవబోయే టప్పటికి, ఆ అమ్మాయి పిచ్చికేక వేసి అరవడం మొదలుపెట్టింది. శేఖరం కొత్త గాభరాపడ్డాడు. ఏదో పుణ్యానికి పోతే పాపంచుట్టుకున్నట్టుం దనుకున్నాడు. ఏదో ఆడపిల్లగదా సాయంజేద్దామనివస్తే, అలా గావుకేక



లెందుకు? అవును, తనతో ఫోనులో మాట్లాడింది గాని తనెవరో ఆ అమ్మాయికి ఏం తెలుసు?

'నేను శేఖరాన్ని' అన్నాడు.

ఆ అమ్మాయి మరీ గట్టిగా యింకో కేక వేసింది.

దారినిపోయే కానిస్టేబులూ, పక్కనున్న రిక్షావాళ్లూ, టాక్సీడ్రయివర్లూ, టెలిఫోన్ బాక్సుకి దగ్గిరగా నుంచుని యిందాకటినుంచి శ్యామలని భయపెడుతున్న ఆ పెద్దమనిషీ, అంతా గుమిగూడి రొద చెయ్యడం మొదలెట్టారు.

కానిస్టేబులు ముందుకొచ్చి 'ఏమ్మా సార్ గలాటా?' అన్నాడు, శేఖరంవంక అనుమానంగా చూస్తూ.

శేఖరానికి వొళ్ళుమండిపోతోంది. హాయిగా నిద్దరపోతున్న తనకి నిద్రాభంగం చేసి, బతిమిలాడిన యీ మనిషి—యింత హడావుడి చేస్తుందా? ఎవరి ఖర్మంవాళ్ళది అనుకుని వెనక్కి తిరగబోయే వేళకి శ్యామలబాక్సులోంచి బయటకివస్తూ 'మీరు 2007?' అంది.

'సమాచారం ఏమ్మా?' అన్నాడు కానిస్టేబులు యీ భాషని అర్థంచేసుకోలేక.

'అవును—2007 వి—' అన్నాడు శేఖరం శ్యామలతో.

'మీరా—మీరనుకోలేదు. బయట నుల్చున్న పోకిరీ ఆలూకు మనిషేమో ననుకున్నాను. అందుకే భయంవేసి అరిచాను,' అంది శ్యామల కాస్త తెప్పరిల్లి.

'నేను—శేఖరాన్ని అని చెప్తున్నా వినిపించుకోకుండా అరుపులు మొదలెట్టేరి!' అన్నాడు శేఖరం.

'నా పేరు మీరు అడిగారు గాని—మీ పేరు నేను అడగలేదు. అంచేత ఎవరో అనుకున్నా,' అంది శ్యామల.

'మీరేనా—యీ అమ్మాయిని వెంటాడుతున్నది. పాపం! భయపడిపోయింది,' అన్నాడు శేఖరం యిందాకటినుంచి 'బాక్సు'ని అనుకు నుల్చున్న మనిషితో.

ఆయన ఆశ్చర్యంతో బిగ్గరగా నవ్వి 'బాగుంది. యిది చాలా బాగుంది. మా ఆవిడకి నెప్పులు వచ్చేట్టున్నాయంటే, డాక్టరుకి ఫోను చేద్దామని వచ్చాను. యీ అమ్మాయి ఆ పెట్టెలో దూరి, ఎంతసేపటికీ రాదాయెను. పావుగంటయింది, అరగంటయింది బయటికి రాదు. నేనసలే ఖంగారుతో సతమతమౌతుంటే, యీ అమ్మాయిని అల్లరి పెట్టడమా! బాగుందండోయ్ బాగుంది. మా పెద్దమ్మాయి యీ పిల్ల యీడుదే,' అన్నాడు ఆ పెద్దమనిషి.

అందరితోపాటు కష్టంలోవున్న శ్యామలకి కూడా నవ్వు వచ్చింది.

'డైరెక్టరుగారికి నిర్బాధింగం గామించకూడదని వారి మేనేజరుగారు మనవి చేశారు—మన్నించండి—మీరు ఏం చెయ్యదల్చుకున్నారు?'

'ఏహోటల్లోనన్నా యీ రాత్రి గడిపి, పొద్దుట డైరెక్టరుని కలుసుకుంటా,' అంది శ్యామల.

'ఏ హోటలులోనైనా మీకు తెలిసినవాళ్లున్నారా? అదికాక పదిన్నర అయింది. మిమ్మల్ని ఎక్కడో అక్కడ దించి యింటికి పోతాను. సామాను ఏమీ లేదా?'

'వెనకనుంచి వస్తుంది.'

'అలాగా?' అని వెటకారం చేశాడు శేఖరం. ఆడవాళ్ళు హోటలుకెళ్లు యీ వేళప్పుడు తెరిచి వుంచుతారా? ఆమె చేతిలో చిన్నతోలుసంచి ఒకటి వున్నది. అందులో ఒక చీర, జాకెట్టూ వున్నాయి కాబోలు.

కారు కదలబోయేముందు కానిస్టేబులు శేఖరానికి విష్ చేసి 'నీకేం భయం లేదమ్మా,' అన్నాడు, శ్యామలకి ధైర్యం చెబుతూ.

'భయమెందుకు? ఆవిడ కేకవేస్తే రెండు మైళ్ళ దాకా వినిపిస్తుంది,' అన్నాడు శేఖరం. ఆ మాటలతో శ్యామలకి వుడుకుమోత్తనం వచ్చింది.

కారు పరుగెత్తోంది. వెన్నెల్లో శేఖరం శ్యామలని కనుకొలకుల్లోంచి పరిశీలిస్తున్నాడు. పచ్చగా పొడుగ్గావుంది శ్యామల. కట్టూ బొట్టూ తీరులో నాగరికతా, మర్యాదలక్షణాలు వుట్టిపడుతున్నాయి. జరీఅంచు పట్టుచీర కట్టుకుంది. ఒకచేతికి నాలుగు బంగారుగాజులూ, మరో చేతికి రిస్టువాచీ, మెళ్లో నూకుపేటల గొలుసూ వున్నాయి. పమిట నిండుగా రెండు భుజాలు కప్పేటట్లు వేసుకుంది. చేతికి ఒక ఆకుపచ్చరాయి వుంగరం, చెవులకి ముత్యాల దుద్దులు. మనిషి పసిమి కాకపోయినా చామంచాయకంటే, ఒక చాయ ఎక్కువ అని చెప్పవచ్చు. కళ్ళు మటుకు సోగకలి, చెదిరిన లేడికళ్లలా, వున్నాయి. ఆ రాత్రి సంఘటనవల్లనో, లేక ప్రకృతిసిద్ధంగా ఆ కళ్ళు అలా వుంటాయో అంతుపట్టలేదు శేఖరానికి. గడ్డం కోసుగా గర్వంగా వున్నట్టుంది మొహటానికి. నుదురు విశాలమైనది కాకపోయినా తీర్చిదిద్దినట్లుగా వుంది. వేషభాషల్ని బట్టి శ్యామల వున్నతమైన కుటుంబంలోంచి వచ్చినట్లు గ్రహించుకున్నాడు శేఖరం.

రోడ్డు మలుపు తిరిగింది. శేఖరం కారు కాస్త స్లో చేశాడు. ఇంతవరకూ ఆకాశంలోకి చూస్తున్న శ్యామల భయంగా అతనివైపు తలతిప్పింది. 'భయపడకు. నేను రాక్షసుణ్ణి కాదులే. మాకు యీ అర్ధరాత్రివేళ నిన్ను ఏం చెయ్యాలో నాకు తోచకుండా వుంది. అప్పుడే పదకొండు దాటిందా! యీ వూళ్లో నీకు తెలిసినవారు గాని చుట్టాలు గాని లేరా?' అన్నాడు శేఖరం.

'ఉన్నారు. కాని వాళ్లదగ్గరకు వెళ్లడం యిష్టం లేదు. శ్రమ అనుకోకపోతే యీ రాత్రికి, ఏ హోటల్లోనన్నా, నన్ను వుంచండి, రూమ్ తీసుకుని వుంటాను. పొద్దుటే డైరెక్టరుగార్ని కలుసుకుని, ఆపైన నా తిప్పలు నేను పడతాను,' అంది శ్యామల.

'ఇదుగో చూడు. నువ్వు కాస్తో కూస్తో చదువుకున్నట్టున్నావు. యీ రాత్రివేళ నిన్ను ఒక్కర్తెనూ ఏ హోటల్లో దిగనిస్తారు? నువ్వు ఒంటిగా హోటల్లో ఎప్పుడైనా వున్నావా? పోనీ, మా యింటికి రారాదూ?' అన్నాడు శేఖరం.

శ్యామల భయంభయంగా చూసింది అతని వంక. అతనికి నిజంగా కోపం వచ్చింది ఈసారి. యీ అమ్మాయి ప్రతి మొగాణ్ణీ అనుమానంతో ఎందుకు చూడాలి?

'ఇదుగో అమ్మాయి, నేనేదో మనసులో పెట్టుకుని నిన్ను మా యింటికి పట్టుకెళ్తున్నాననుకోకు. నేను ఒంటిగాణ్ణి కాదు. యింట్లో మా అమ్మ వుంది. నువ్వు యిక్కడా అక్కడా యీ రాత్రి గడపడం బదులు మా యింట్లో వుండటం మంచిదని చెప్పాను. నా మాట అబద్ధం అయితే, నీ ఆయుధం నీకుందిగా. మా పేటంతా హడలిపోయి లేస్తారు నువ్వు కేక పెట్టావంటే!' అన్నాడు శేఖరం.

'మీ అమ్మగారు యీ అర్ధరాత్రి నన్ను చూసి ఏమన్నా అనుకుంటారేమో?' అంది శ్యామల.

'నిన్ను గురించి ఏమన్నా అనుకుంటారేమో గాని నన్ను గురించి ఏమీ అనుకోరు. అదీగాక తెల్లారేదాకా నిన్ను యిల్లా కార్లో తిప్పేటంత స్పోర్ట్సుని కాను నేను. అయినా సినిమాల్లో చేరదల్చుకున్న మనిషివి, యిలాంటి అనుమానాలు పెట్టుకుంటే పెద్ద స్టారువి కావడం కష్టం,' అన్నాడు శేఖరం వెక్కిరింపుగా.

శ్యామల ముఖం తిప్పుకు కూచుంది. కాని శేఖరానికి ఆవిడ కన్నీరు కారుస్తోందని తెలుసు.

'ఏమిటి మా యింటికొస్తావా? లేదా?' అన్నాడు.

'వూ'—అంది శ్యామల ముఖం తిప్పుకొని.

'అయితే నేను అడిగే ప్రశ్నలు కొన్నింటికి సమాధానాలు చెప్పు,' అన్నాడు శేఖర్ కటువుగా.

శ్యామల మొఖం తిప్పుకుని రుమాలుతో కళ్లు తుడుచుకుంది.

'ఏం చదువుకున్నావ్?'

'ఇంటరు పరీక్షకు వెళ్ళాను.'

'రిజల్ట్సు తెలియకుండానే కళాసేవకి ప్రారంభించావన్నమాట, బాగుంది! మీదే వూరు, మీ నాన్నగారు—యీ సంగతులు కాస్త చెప్పు.'

'మా వూరు బెజవాడ. చీకట్లో మెయిలు ఎక్కేందుకు భయం వేసి, పొద్దుట బయలుదేరి, వెలుతురు వుండగా నాలుగు అయిదింటికల్లా యీ వూరు వస్తుంది గదా అని ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. నా దురదృష్టం కొద్దీ అది లేటు అయింది. మిమ్మల్ని యిబ్బంది పెట్టాల్సి వచ్చింది,' అంది శ్యామల.

'మీ నాన్నగారిమాట చెప్పావు కాదు.'

'ఆయన గవర్నమెంటు ఆఫీసరు. నేను పెద్దమ్మాయిని. యింకా చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ వున్నారు.'

'పేరు? వుద్యోగం?'

'ఇప్పుడు చెప్పను. తర్వాత చెప్తాను.'

'అయితే, యింట్లో చెప్పకుండా కళాసేవకి వచ్చావన్నమాట. అసలు యిక్కడి కష్టసుఖాలు తెలుసుకోకుండా తొందరబడి రావడం తెలివిగలవాళ్ళ లక్షణం కాదు. అయినా నాకెందుకు కానీ? రేపటినుంచీ కళాసేవ ప్రారంభిస్తావన్నమాట?'

'ఇదుగో చూడండి. నా బుద్ధి పొరబాటుకొద్దీ తప్పు నెంబరు డయిల్ చేశాను. అది నా గ్రహచారం కాకపోతే, ఆ తప్పు నెంబరు మీదే కావాలీ? నేను రాత్రిపూట నిస్సహాయపరిస్థితుల్లో చిక్కుకోడం తప్పని, మీరు కనీసం ఒక వందసార్లన్నా మాటల్లో భావాల్లో వ్యక్తంచేశారు. మీ లెక్చర్లు వినడం కంటె, యిలా యీ రాత్రి చెట్టుకింద గడపడం నయం. కారు ఆపండి. నాదారి నేను పోతాను. మీదారిన మీరు పోదురుగాని,' అంది శ్యామల వుడుకుమోతనం భరించలేక.

కారు పోర్టికోలో ఆగాక, శేఖరం తల్లి తలుపు తీసింది. శేఖరం శ్యామలని తల్లికి పరిచయంచేసి, కారు గరాజ్‌లో పెట్టేందుకు వెళ్ళాడు.

* * * *

శేఖరం తల్లికి యాభైఏళ్ళుంటాయి. కాని చూపులకి అరవైఏళ్ళ మనిషిలా కనపడుతుంది. మనిషి పీలగా, తెల్లగా వుంటుంది. ఆవిడ ముఖంచూస్తే వయసులో చాలా అందంగా వుండేవుంటుం దనిపిస్తుంది. కొడుకంటె ఆమెకు అమితమైన ప్రేమ. ఆ ప్రేమని ఆవిడ దాచుకోదు కూడాను.

'మొఖమూ, కాళ్ళూ, చేతులూ కడుక్కుని బట్టలు మార్చుకో అమ్మాయ్, తెల్లారాక తలంటి పోసుకుందువుగాని. కొత్త హార్లిక్సు కలుపుతాను.

రెండుపళ్ళు తిను, పాపం ఎప్పుడు అన్నం తిన్నావో!' అంది ఆప్యాయంగా శ్యామలతో.

శ్యామల వద్దన్నా వినక, హార్లిక్సు కలిపి, పళ్లు వొలిచి పెట్టింది. శ్యామల పక్క, తన పక్క పక్కన వేసింది. శ్యామలని ఆవిడ ప్రశ్నలు ఏమీ వెయ్యలేదు. అర్ధరాత్రి తీసుకొచ్చిన పిల్లనుగురించి కొడుకుని కూడా ఏమీ అడగలేదు. శ్యామల పక్కమీద వరిగిందో లేదో వొళ్లు తెలియకుండా నిద్దరపోయింది. శేఖరం శ్యామలనుగురించి ఆలోచించి, అలా ఆలోచించకూడదని, తనని తను సందలించుకుని నిద్రపోయాడు. కొడుకు ఏ పరిస్థితుల్లో ఆ అమ్మాయిని తీసుకొచ్చినా, వచ్చినపిల్ల మర్యాదస్తుల అమ్మాయి, కాస్త చదువు సంధ్యా కలదీ—అని గ్రహించుకుంది తల్లి.

* * * *

శేఖరం బి. ఎ. చదువుతూండగా వాళ్ళనాన్నగారు పోయారు. ఆయనకు లేక లేక కలిగిన సంతానం శేఖరం. తండ్రిపోయాక చదువూ సంధ్యా అక్కడితో కట్టిపెట్టి, తండ్రికి వున్న బట్టలకొట్టూ, ఆయిల్ మిల్లూ చూసుకుంటున్నాడు వాలుగైదేళ్ళబట్టీ. తండ్రి చనిపోక ముందు రెండుమూడు పెళ్లి సంబంధాలువచ్చాయి. అవి స్థిరపడక పూర్వమే ఆయన పోవడం జరిగింది.

మొదటినుంచీ శేఖరానికి తల్లి అంటే ఎంతో ప్రేమ. తనకి అలాటితల్లి పూర్వజన్మసుకృతంవల్ల లభించిందని అనుకునేవాడు. తల్లిని విపరీతంగా ఆరాధించే శేఖరం, ఏ స్త్రీనీ ప్రేమించలేక పోయాడు. ఏ అమ్మాయి అయినా తటస్థపడ్డా, ఆమెలో తన తల్లిలో వున్న గుణగణాదులు లేవని నిరుత్సాహపడి, తనికి పెళ్ళివద్దని పట్టుబడుతూ వచ్చాడు.

మొదట్లో కొడుకుకు తనమీద వున్న గౌరవానికి ఆమె పొంగిపోయినా, రానురాను తనకొడుకు జీవితంలో ఏదోలోపం ఏర్పడుతోందని బాధపట్టుకుంది. పోనీ, కాలేజీలో నైనా చదువుతూంటే ఏ క్లాసుమేట్‌నో పెండ్లాడివుండును. చదువు అయిపోడంతో, బట్టలకొట్టుకి అకౌంట్ చూసుకునేందుకు వెళ్ళడం; వెలితే మిల్‌కీ, లేకపోతే యిల్లూ రేడియో. సాయంత్రంవేళ సినిమాకో, లేక తల్లిని తీసుకుని బీచికో—ఇదీ అతని కార్యక్రమం.

అతనికి ఆడవాళ్లతో అట్టే పరిచయం లేదు. అసలు ఆడవాళ్లంటేనే కాస్త జంకు. అది బయటికి కనపడకుండా, ఏదో వాళ్లని లెక్క చెయ్యనట్లు మాట్లాడటం అలవరచుకున్నాడు. తల్లికి యీ విషయం బాగా ఆకళింపుకు వచ్చింది. అందువల్లనే మామూలుగా వచ్చే సంబంధాలకి కొడుకు లొంగడనీ, అతనికన్న రెండాకులు ఎక్కువ చదివిన పిల్ల అయితే, పెళ్ళికి వప్పుకుంటాడనీ ఆమె వుద్దేశం. ఉన్న సిరిసంపదలు అనుభవించేందుకు ఒక చక్కని కోడలు కావాలని ఆమె కోర్కె. శ్యామలని చూస్తే ఆవిడ కెందుకో చాలా అభిమానం, జాలీ కలిగాయి.

* * * *

తెల్లవారి శేఖరం నిద్దర లేవడానికి ముందే శ్యామల తను వచ్చిన పనేమిటో కథ యావత్తూ తల్లికి చెప్పింది. తను వెళ్లి తనపాట్లు పడతాననీ, అతను లేవకముందే వెళ్ళిపోవడం మంచిదనీ చెప్పింది.

శ్యామల సినిమాల్లో చేరేందుకు వచ్చిందని విన్న శేఖరంతల్లి కొంతకాలంపాటు నిర్ఘాంతపోయింది. కాని తనను తాను సంబాళించుకుని అంది.

'దానికేం—అబ్బాయి వెంట వస్తాడు. వెళ్లి మాట్లాడిరండి. నువ్వు దీనికోసం యింట్లోంచి వెళ్లిపోవాలా ఏమిటి? నీకు ఒక వేషం, యింత డబ్బు, అని స్థిరపడేదాకా యిక్కడే వుండు. అప్పైన యీ చుట్టుపక్కలే మరో యిల్లు వెతుకుదాం,' అంది నవ్వుతూ.

'అయ్యో బాబోయ్. మీ అబ్బాయి వెంట వొద్దు బాబూ! ఆయన కేవి గిట్టవనుకుంటాను. నేనొక్కదాన్నే వెళ్లివస్తాను,' అంది శ్యామల.

'చూడు, నువ్వు చిన్నదానివి. నే చెప్పినట్టు విను. వాడు మిల్లుకి వెళ్లేముందు నిన్ను తీసుకెళ్తాడు. పని అయిపోతే వెంటనే యిక్కడికి తెచ్చి దిగవిడుస్తాడు. లేకపోతే భోజనానికి వచ్చేటప్పుడు తీసుకొస్తాడు. వేడినీళ్లు చల్లారిపోతాయి. తొందరగా స్నానంచేసి రా' అంది శేఖరం తల్లి.

శ్యామల మారు మాటాడకుండా బాత్‌రూమ్‌లోకి వెళ్లిపోయింది.

తల్లి ఏం చెప్పిందో ఏమో కాని, శేఖరం శ్యామలకి లెక్చర్లు యివ్వకుండా, వేళాకోళం చెయ్యకుండా తీసుకెళ్ళాడు. పదిగంటలకి, అంటే వారు వెళ్ళిన అరగంటకి, డైరెక్టరుగారు దర్శనం యిచ్చారు. ఈమాటా ఆమాటా అయాక, 'నీ కెందుకమ్మాయీ సినిమాలు—హాయిగా చదువుకున్నదానివి మరొక వుద్యోగం చేసుకోక!' అన్నారా డైరెక్టరు గారు.

'ఈ సలహాకోసం నేను మూడొందల మైళ్ళు రాలేదు. క్రిందటిసారి మీరే చెప్పారుగా నాలో నటికి కావలసిన లక్షణాలు వున్నాయని. మళ్ళీ మీరే వద్దంటా రేమిటి?' అంది శ్యామల.

శేఖరం సోఫాలో కూచుని అన్నీ వింటున్నాడు. ఆఫీసు మహా హడావుడిగా వుంది. వాళ్లకి కాఫీలు తెప్పించారు. వచ్చేజనం, పోయేజనం. ఎవరు ఎవరికోసం వస్తున్నారో, అంతుపట్టడం లేదు. పక్క గదిలోంచి నవ్వులూ, మేడమీంచి పాటలూ, తాళాల చప్పుడూ. రిహార్సల్సు కాబోలు అనుకున్నాడు శేఖరం.

'ఇప్పుడుమటుకు నీలో ఆ లక్షణాలు లేవని అంటున్నానా? ఎటొచ్చీ యీ వాతావరణం నీకు సరిపడదేమోనని అనుమానం. అయినా ఈరాత్రి, రేపురాత్రి షూటింగ్ వుంది, వచ్చి చూడు. వర్క్ ఎలావుంటేదీ తెలుస్తుంది. మేకప్ టెస్టూ, వాయిస్ ఏమీ యిబ్బంది లేదు. పెద్ద పోర్షను కాదు. చాలా చిన్నది మాత్రమే యివ్వగలను. ఐనా అది తర్వాత చూసుకుందాం. మీరు కూడా ఆమె వెంట రండి,' అన్నారు డైరెక్టరు శేఖరంతో.

శ్యామలకి యీ పరిస్థితులూ, యీ మనిషి మాటలూ వినగానే సగం వుత్సాహం హరించి పోయింది అతని ధర్మమా అంటూ ఎగతాళి చెయ్యకుండా నిశ్శబ్దంగా వున్నాడు శేఖరం దారి పొడుగునా.

ఇంటికొచ్చి భోజనాలు చేశారు. శేఖరంతల్లి ఏమయిందని ప్రశ్నించలేదు. శ్యామల ఏం జరిగిందో చెప్పలేదు. ఆరాత్రి భోజనాల దగ్గిర శేఖరం తల్లితో అన్నాడు: 'ఈరాత్రి షూటింగ్ చూపటానికి రమ్మన్నాడు. శ్యామలని వెంటబెట్టుకు తీసుకువెళ్లి, తీసుకొస్తాను,' అన్నాడు.

'అల్లాగే! వొంటిగా రాత్రిపూట పంపడం మంచిదికాదు.' అంది తల్లి.

పదిగంటల వేళ యిద్దరూ కార్లో బయలు దేరారు. క్రిందటిరోజు రాత్రికీ, యీ రాత్రికి ఎంత తేడా!—అనుకుంది శ్యామల. గడిచినరాత్రి తనకి ముందు వెనకలు అయోమయం. కాని యీరాత్రి శేఖరం తనకి అండగావున్నాడు.

'ఈ డైరెక్టరు నీకెలా తెలుసు?'

'పోయిన ఏడు నా స్నేహితురాలింట్లో దిగాడు. మూడురోజులున్నాడు వాళ్లింట్లో. అప్పుడు పరిచయం అయింది. తను తియ్యబోయే పిక్చరుకి నన్ను హీరోయిన్‌గా తీసుకుంటా నన్నాడు,' అంది శ్యామల.

'అతని మాటలు నమ్మి వచ్చావా?'

'పూర్తిగా అతని మాటలే కాదు. పరిస్థితుల వత్తిడి కూడాను...' అని ఆగిపోయింది.

అవి ఎలాంటి పరిస్థితులో అతను అడగ లేదు; ఆమె చెప్పలేదు.

కాసేపు అయాక, 'మీ నాన్నగారికి నీ క్షేమం తెలియబరుస్తే మంచిది కాదూ! మీవాళ్లు పోలీసు రిపోర్టు గాని యిస్తారేమో...తర్వాత చిక్కులు...'

'ఈ సినిమా వ్యవహారం తేలితేగాని ఏ సంగతీ నిశ్చయం చేసుకోను. దయచేసి ఆ విషయాలు ఎత్తకండి,' అంది శ్యామల.

ఇద్దరూ స్టుడియోస్‌లోకి వెళ్లారు. డైరెక్టరు గారు వీరికి రెండు కుర్చీలు వేయించారు. అదేదో జానపదచిత్రం సెట్టింగ్. ఏ యింద్రసభో, రావణ సభో—అని అనుకున్నాడు శేఖరం. ఈ రెంటిలోని భేదాల్ని తెలుసుకునే అంత సినిమా పరిజ్ఞానం అతనికి లేదు.

సెట్ మీద ఒక వందమంది ఆడపిల్లలూ, ఒక యాభైమంది మొగవాళ్లూ వున్నారు. అందరి ముఖాలకీ రంగులు పులిమారు. చెమ్కీ బట్టలూ, కిరీటాలూ అన్నీ వున్నాయి. మొత్తంమీద దీపాల వెలుతురులో స్టుడియో కళకళల్లాడుతూ వుంది.

శ్యామల వుత్సాహంగా చూస్తోంది చుట్టూ. ఇంతలో హీరోయిన్ వచ్చిందంటే వచ్చిందన్నారు. ఎక్కడి దక్కడ వదిలేసి అటువైపు పరుగెత్తారు కొందరు.

పక్కా గంట కూచున్నాక, హీరోయిన్ మేకప్ చేసుకు, సెట్ మీదకొచ్చింది. ఈ లోపల రెండుసార్లు అందరికీ టీ వచ్చింది.

డైలాగ్ మొదలెట్టారు. మనుషులు, కేకలు, అరుపులు, హీరోయిన్ నవ్వులు. ఇంతలోకే ఎవరో ఎక్‌స్ట్రా అమ్మాయి కాబోలు, సరిగా చెయ్యలేదని డైరెక్టరు గారు కాస్త గదమాయించారు. ఆ అమ్మాయి అక్కడే పెద్దపెట్టున రాగాలు మొదలెట్టింది.

పన్నెండు దాటాక శ్యామల తలనెప్పిగా వుందని లేచింది. ఇద్దరూ డైరెక్టరుగారివద్ద శెలవు తీసుకు యింటికి బయలుదేరారు. దారిలో ఒక్కరూ మాట్లాడలేదు.

రెండోరోజు రాత్రి కూడా యథాప్రకారం శ్యామలని వెంటబెట్టుకెళ్లాడు శేఖరం.

క్రిందటిరోజుకున్నట్లే కాక ఆనాడు సెట్ ఎంతో నిశ్శబ్దంగావుంది. నలుగురు ఆర్టిస్టులుమాత్రం వున్నారు. సెట్‌మీద వర్క్ మొదలెట్టారు. చెప్పినమాటే పదిసార్లు చెప్పించడం, చేసిన యాక్షనే డజనుసార్లు చేయించడం, యీలోపల క్లాప్, కట్, యిలాటివాటితో తెల్లారి నాలుగింటికి, నాలుగు డైలాగ్సు అయాయి. కాఫులు అవుతున్నాయి కనక కాల్‌షీట్ అయిపోయిందన్నారు. హీరోయిన్ తన కారులో వెళ్లిపోయింది. అందరూ తలో కార్లో వెళ్ళిపోయారు.

శేఖరం డైరెక్టరుగారిక్కి లిఫ్టియిచ్చాడు.

'మామూలుగా అమ్మాయి, యిదీ వరస! వేలు ఖర్చుపెడితేగాని పెద్ద తారలురారు. వాళ్ళని పెట్టుకుంటేగాని డిస్ట్రిబ్యూటర్లు డబ్బులు యివ్వరు. ఇంత అయి, ఒక యేడాదిదాకా నానా తిప్పలూ పడి పిక్చరుతీస్తే, అది బాగాలేదని పత్రికలవాళ్లు గిలికేస్తారు. ప్రజలు నిప్పురిస్తారు. సినిమా లోకం అంతే యింతే. ఇదొక పద్మవ్యూహం. లోపలికి రావడమేకాని బయటికిపోవడం లేదు. నువ్వు చదువుకున్నదానివి, మంచి కుటుంబంలోనుంచివచ్చిన దానివి కాబట్టి, యిన్ని విధాల చెప్తున్నాను. సామ్యం తెచ్చావనుకోకు. నిన్న కనపడ్డ పిల్లలందరూ నీలాటి ఆశలతో పట్నం వచ్చినవారే! కాని వాళ్ళకి చదువు లేదు, నీకు చదువువుంది. కాదు కూడదంటే ఏదో చిన్న వేషం యిప్పిస్తాను. కాని, నీకెందుకమ్మా యిది! మీరుకూడా ఆలోచించి ఆమెకి సలహా చెప్పండి, మేస్టారూ!' అంటూ తనయింటిగుమ్మందగ్గిర దిగిపోయాడు డైరెక్టరు.

శ్యామల గానీ శేఖరం గానీ ఏమీ మాట్లాడలేదు. శ్యామలని చూస్తే శేఖరానికి జాలివేసింది. పాపం! ఆమె ఆశాసౌధాలు యింత లేతవయసులో కూలిపోయాయి కదా!

మాటలకన్నా నిశ్శబ్దమే ఎక్కువగా బాధించింది శ్యామలని. ఆ రాత్రి శ్యామల ఏమీ ఆలోచించదలచుకోలేదు. తెల్లవారి చూసుకోవచ్చు ననుకుంది. ఎందుకో శేఖరంతల్లి పక్కన కూచోవాలనీ, మనసులో మాటలన్నీ తెల్లవారి చెప్పెయ్యాలనీ అనుకుంది.

* * * *

తెల్లవారి శేఖరం మిల్లుకి వెళ్లాడు. ఆ మధ్యాహ్నం శ్యామల తను డైరెక్టరుగారింటికి వెళ్ళే అవసరం లేదని చెప్పగానే, తల్లీ కొడుకుల కళ్లలో ఏదో తృప్తి, ఆనందం మెరిశాయి.

'స్కూల్ ఫైనలు పాసయ్యాను. యింటరు పరీక్షకు కూడా వెళ్ళానాయను. ఏ క్లర్కు వుద్యోగం అన్నా దొరకదూ—మీరు చెప్పండి, మీ అబ్బాయి వెతికి పెడతారు,' అంది శ్యామల శేఖరం తల్లితో, అతను యింట్లో లేకుండా చూసి.

'అయితే సినిమా ప్రయత్నం విరమించుకున్నావన్నమాట?'

'ఆ'

'వుద్యోగం ఎందుకమ్మా నీకు?'

'మళ్లీ మావాళ్లకి నా ముఖం చూపించాలని లేదు. యిక్కడే వుద్యోగం చేసి సంపాయించుకుందామని,' అంది శ్యామల, శేఖరం తల్లి చూపుని తప్పించుకుంటూ.

'చెప్పకుండా రావడమేనా నువ్వు చేసిన పొరబాటు?'

'మీకు తెలుసా?'

'గ్రహించుకున్నాను. మీ నాన్నగారికి నేను వుత్తరం రాసి తెప్పిస్తాను. లక్షణంగా యింటికెళ్లి చదువుకో. యింత చిన్నప్పుడే నీకు వుద్యోగం సద్యోగం ఎందుకు చెప్పు?' అంది శేఖరం తల్లి.

'నేను తిరిగి వెళ్ళను గాక వెళ్ళను.'

'ఏం?'

శ్యామల మాట్లాడలేదు.

'మీ నాన్న నిన్ను పల్లెత్తుమాట అనకుండా నేను చూస్తాను. యిరవైఏళ్ళన్నా నిండలేదు, నీకు వుద్యోగం ఏమిటి! చక్కగా పెళ్లి పేరంటం చేసుకుని కాపరం చెయ్యాలిగాని!' అంది శేఖరం తల్లి చిరునవ్వుతో.

'నడిచే, అదే చేస్తారు మావాళ్ళు.'

'ఏం?'

'నాకు ఆ అబ్బాయి యిష్టంలేదు. బి. ఏ. నాలుగుసార్లు పట్టికొట్టాడు. బుద్ధి మొద్దావతారం. కలెక్టరుగారి కొడుకని ముడిపెడ్తామంటున్నారు నాన్న. అందుకే చెప్పకుండా వచ్చాను,' అంది అసలు రహస్యం వెళ్లగక్కుతూ శ్యామల.

శేఖరం తల్లి కళ్లు తళుక్కున మెరిశాయి.

'పోనీ. దానికేనా యీ బంగారు? పోనీ ఆ సంబంధం కాకపోతే, మరో సంబంధం — అంతే గాని వుద్యోగం ఏమిటి? బంగారుబొమ్మలా వున్నావు, కళ్ళకద్దుకు చేసుకుంటారు ఎవరన్నా నిన్ను. మీ నాన్నగారి ఎడ్రసూ అదీ యిస్తే, నేను యిస్తాను వైర్, రమ్మని. నువ్వు లేకుండా అన్ని విషయాలు మాట్లాడి, చక్కబరిచి మరీ, నిన్ను వెంటబంపుతాను. సరేనా? నీ తర్వాత చెల్లెళ్ళా, తమ్ముళ్లా వున్నారంటున్నావు. నీమూలాన వాళ్లు అల్లరిబడితే ఎల్లా చెప్పు? అసలు యీపాటికి పోలీసు రిపోర్టు యివ్వకుండా వుంటారా — నలుగురు నోట్లో పడకుండా గప్ చిప్ గా వెళుదువు గాని మీవూరు. వినుంటావు?' అంది శేఖరం తల్లి.

'మీ యిష్టం' అంది శ్యామల తల వంచుకుని.

ఆ సాయంత్రం శేఖరం శ్యామలా డాబాలో కూచున్నారు. తల్లి కిందనుండి ఏదో పని చూసుకుంటోంది.

'మీ అమ్మగారు — మా నాన్నకి వుత్తరం రాస్తానంటున్నారు,' అంది శ్యామల.

'ఇప్పటికన్నా నీకు కళ్ళు తెరువులకి వచ్చినందుకు సంతోషం. అది మొన్న పొద్దుట చెయ్యాల్సిన పని. అసలు నాకు యిన్నాళ్ళు ఆగటం యిష్టం లేదు. అమ్మ నీ కస్టోడియన్ కాబట్టి వూరుకున్నాను. లేకపోతే యీపాటికి అడ్రసు రాబట్టకుండా వుండే వాడినా?'

'అక్కడ మా నాన్న లెక్చర్లు తప్పించుకుందుకు నేనిక్కడికొస్తే, యిక్కడ మీ లెక్చర్లా? బాగుంది. లెక్చర్లు ఈ జన్మకి తప్పేటట్టు లేవు నాకు. సరే, ఆ మాట అల్లా వుంచండి. మా వూరు తిరిగి వెళ్తాను — ఒక షరతుమీద...'

'అది మీ నాన్నకు చెప్పు. నాకెందుకు?'

'మీరు మా నాన్నకి లెక్చరిస్తారని'

'బాగుంది వరస. ఏమిటా షరతు?'

'ఆ నిశ్చయమైన సంబంధం చేసుకోమని నిర్బంధించకుండా వుండేపక్షంలో, వెనక్కి వెడతాను. లేకపోతే...'

'ఆ — లేకపోతే?'

'అదంతా మీ కనవసరం'

* * * *

మర్నాటి మెయిల్లో దిగాడు స్కూళ్ళ యిన స్పెక్టరు, శ్యామలతండ్రి. కూతురు వెళ్లిపోయినప్పటి నుంచీ తల్లి మంచం దిగటం లేదుట. కూతురికోసం అహర్నిశలూ ఏడుస్తోందిట.

ఆయన వచ్చీ రాగానే కూతుర్ని చూసి కన్నీళ్లు పెట్టుకున్నాడు. యాభైఏళ్ళవాడు, ఇంకా అయిదేళ్ళ సర్వీసు మాత్రమే వుంది ఆయనకి.

శేఖరం, శ్యామలా లోపలికి తప్పుకున్న తర్వాత, శేఖరం తల్లి అందుకుంది. 'మీ అమ్మాయి వుద్యోగం చేస్తానని పట్టుబడితే, నేను బతిమిలాడి వప్పించాను, మీ వెంట పంపేందుకు'

'మీ మేలు జన్మలో మర్చిపోలేను. అది చాలా తెలివిగలది. బుద్ధిమంతురాలూను. యిలా తొందరబడి ఎందుకు చేసిందో తెలియకుండా వుంది.'

'అయిపోయినది తవ్వటం ఎందుకు. యింక ఆ పెళ్ళిమాట ఎత్తనని మీరు మాట యిస్తే, వెంట పంపుతాను. లేకపోతే యిక్కడే వుంటుంది. నాకు కూతురు లేని కొరత వుండదు.'

శ్యామల తండ్రి ఆమె వంక నిర్ఘాంతపోయి చూశాడు.

'సరే. యింక ఆ పెళ్లిమాట వదిలేస్తాను. మరి, మీ అబ్బాయికి యింకా పెళ్ళికాలేదేమండీ!'

'వాడికి నచ్చిన అమ్మాయి దొరక్క!'

'అల్లాగా...' అన్నాడు స్కూళ్ళ యిన స్పెక్టరు.

ఆరాత్రి శ్యామల తండ్రివెంట మెయిలులో బయలుదేరింది. బయలుదేరేముందు మేడమీద నిల్చుని వుండగా, శేఖరం తల్లి శ్యామల గడ్డంకింద చెయ్యేసి, మొహం పైకెత్తి 'మీ నాన్న ఆడినమాట యింక తప్పరు. ఏవా తొందరలోనే మాయింటికొచ్చేస్తున్నావుగా —' అంది.

ఆపక్కనే తచ్చాడుతున్న శేఖరం — 'వస్తే వచ్చావుగాని, రాత్రి పదిగంటలవేళ మటుకు టెలిఫోన్ చెయ్యకు. లక్షణంగా మెయిలుఎక్కి సూర్యోదయంతోపాటు నువ్వు రావచ్చును. చిల్లరయిబ్బంది కూడా వుండదు,' అన్నాడు శేఖరం వేళాకోళం చేస్తూ.

నెల తిరక్కుండా అత్తవారింట్లో పాదం పెట్టింది శ్యామల.

* * * *

శ్యామల పెళ్ళిఅయి అయిదేళ్ళయింది. వారికి మా జెల్లిపాప—బేబీని ఆడిస్తూ శేఖరం 'పాపం—మా అమ్మ పెద్దతార అవవలసింది, వెంట్రుకవాసిలో తప్పిపోయింది. నువ్వన్నా మా అమ్మ ఆశయం నెరవేర్చాలి' అని ఎగరేసి ఎత్తుతుంటాడు.

శ్యామల యింకా పుడుక్కుంటూనే వుంటుంది. తల్లిమటుకు శేఖరాన్ని తిట్టి, కోడల్ని వెనకేసుకొస్తుంది.

సుహృద్గీత ★

శ్రీ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

హిమ సస్యంది విభాత పూత సుమనో హేలాత్త మందార మే
ల మనీషీ! వికసింప - నీ కనులలో? ప్రాభాత వేళా కులా
య మనోజ్ఞాంక వినిస్రుత ద్విజ వితానాపత్య రావమ్ము లే
ల మనీషీ! వినవింప నీగళములో - రమ్యార్ద్ర వేశంతముల్?
జీవన నీరవాధ్వగ సుశీతల తక్ర సమర్పక ప్రపా
శ్రీవిల సత్కుటీర మిది ప్రేమ యవంగ మనీషి! త్వద్దృగం
తావిల బాష్ప బిందువున, త్వద్గళ గాద్గదికమ్ములోన ప్రే
మావృతి నేడు నాహృదయ మంతయు నించె గులాబి తావితో
వల దళినీల వార్షుక నిశాంత పయోద మనోజ్ఞ మాలికా
గళితసుధా ప్రవేణికల గాంచి, లతా త్రుటిత ప్రసూన మా
లల గని, నిత్య యాత్రిక విరామ విహీన సదాస్రవన్నదీ
జలముల గాంచి జాలిపడు సౌహృదశాలి! నిను న్నుతించెదన్
ప్రేమ విచిత్ర భావము; మిళింద పదాహతి మాత్ర జాత మ
ల్లీ మకరంద పేశలము; ప్రీత చకోర గళామృతాయ మా
నామల చంద్రికా మధుర; మద్భుత రూప; మలౌకికమ్ము; నీ
వై మలినీకరింప దగునా మన ప్రేమను బాష్ప దిగ్ధతన్?
హృదయ విదారకమ్ము నిజమే! సుహృదావళితో వియోగ మ
న్నది, తటిదంగనా క్షణ సమాగమ లబ్ధ వియోగ మెంచి అం
బుద బుధు డంతలో కరగిపోవు - నిజమ్మె, మనీషి! కాని, ఈ
హృదయ వియోగ యోగ దశలేక నదీ తటయుగ్మమే సఖా!

కదంబం

సింహళమును జయించిన తెలుగురాజు

అరువన్నిబ్బరగండ (డెబ్బదిరెండు పాళెములు జయించినవాడు) బిరుదరాజితుడును, మధుర నాయకరాజ్య స్థాపనాచార్యుడును నైన విశ్వనాథ నాయనయ్య క్రీ. శ. 1564 సం॥న మరణించెను. అతని మరణానంతరము కుమారుడగు పెద కృష్ణప్ప నాయనయ్య సింహాసనమునకు వచ్చెను. ఇతనిని మొదటి కృష్ణప్పనాయకుడని చరిత్రకారులు వ్యవహరింతురు. కృష్ణప్పనాయనయ్య తండ్రివలె పరమదైవభక్తుడు; ప్రజారంజక పరిపాలకుడును. తండ్రి కాలముననే యితడు చాల గొప్పవాడని పేరుపెంపులు గడించెను. పూర్వపు పాండ్యరాజుల సంతతివారితో నితడు సన్నిహిత సంబంధమును గూర్చుకొని సఖ్యభావముతో సంచరించుచుండిన హేతువుచే పెద కృష్ణప్పనాయనయ్య పాండ్యమండలమున శాంతిభద్రతలు నెలకొల్పుటయే కాక 'పాండ్యకుల స్థాపనాచార్య' యను బిరుదము గూడ నందెను. 'శ్రీమత్కాంచీపుర వరాధీశ్వర, మోకాలి పట్టవర్ధన, సముద్రోహరగండ, విలావళీ పురవరాధీశ్వర, తిరువడిత్యప, దక్షిణ మహాసముద్రాధీశ్వర'— మున్నగు బిరుదములనుగూడ నితడు కలిగియుండెనని తెలియుచున్నది 1

పెద కృష్ణప్పనాయనింవారు సింహాసనమునకు వచ్చినతోడనే ఒక తిరుగుబాటు జరిగినది. దానికి నాయకత్వము వహించినవాడు తుంబిచ్చి నాయకుడను నొక పాళెగారు. ఇతడు మహాసాహసుడగు యుద్ధవీరుడు. కొందఱు పాళెగార్లను2 కూడగట్టుకొని విశ్వనాథ నాయనయ్య ప్రవేశపెట్టిన పాళెపు విధానమును నిరసించుచు నితడు పాండ్యమండలాధీశ్వరుని ప్రతిఘటించెను. కనుక విశ్వనాథనాయకుని కాలమున పాళెపువిధానము శాంతిభద్రతలు ప్రసాదించినను, కృష్ణప్పనాయకుని కాలమున ఆ విధానమే అనర్థదాయకముగ పరిణమించెననియు నుడువవలసి యున్నది. తుంబిచ్చినాయకుని తిరుగుబాటును పురస్కరించుకొని విశ్వనాథనాయనయ్య దూరదర్శిత్వముగల పరిపాలకుడు కాడని యొక చరిత్రకారుని యభిప్రాయము.3

పెద కృష్ణప్పనాయకుని పరిపాలనా కాలమందు గూడ మహామేధావియు, నాయకరాజ్య స్థాపనా వసరమున ప్రముఖ పాత్రవహించిన అరియనాథ మొదలి అమాత్యపదవి యందుండెను. అతని యభిమతానుసారము స్వామిభక్తుడును, సైన్యాధ్యక్షుడును నైన దళవాయి పెద కేశవప్పనాయని తుంబిచ్చినాయకునితో యుద్ధముచేయుటకు నియోగించిరి. పెద కేశవప్ప నాయుడు మఱికొందఱు పాళెగార్ల4 సహాయమును సముపార్జించి, తన యావచ్ఛక్తిని వినియోగించి

1. *Krishnapuram Plates of Sadasiva Saka 1489, E. I. Vol. 9. P. 328.*

2. తుంబిచ్చినాయకుని పక్షము వహించిన సరదార్లు:—చిన వీరతుంబిచ్చినాయడు, (తుంబిచ్చినాయకుని తమ్ముడు) రఘునాథరాయడు, రంగసింగమ్మ నాయడు, పాలముద్దినాయడు, దొడ్డ చక్కమ్మనాయడు, వీరపాండ్యనాయడు, జక్కమ నాయడు, లక్ష్మమ్మనాయడు మున్నగువారు.

3. *Satyanathaiyer, ‹History of the Nayaks of Madura.›*

4. దళవాయి పెద కేశవప్పనాయనిపక్షము వహించిన సరదార్లు:—బంగారు నాగులనాయడు, తోరయూరు నరసింహనాయడు, మిట్టపాళెం (శేం) అయ్యప్పనాయడు, గొజ్జంగి కోసలనాయడు, అమరగంటి ముద్దులనాయడు, సుబ్బనాయడు, కుమారకుల రామకృష్ణనాయడు, వీరబాణం కస్తూరి రంగరాజు, లింగమరాజు, కొరవి కృష్ణమరాజు, మందపాటి

తుంబుచ్చి నాయకునితో యుద్ధముచేసెను. తుంబుచ్చి నాయకునికి విజయము లభ్యమయ్యెను. దళవాయి పెద కేశవప్ప నాయడు వీరస్వర్గము నలంకరించెను.

దళవాయి పెద కేశవప్ప నాయని మరణానంతరము అతని కుమారుడగు చిన కేశవప్ప నాయడు దళవాయిగ నియమింపబడెను. ఇతడు మహాసైన్యమును వెంటనిడికొని తుంబుచ్చి నాయకుని ప్రతిఘటించెను. పరమకుడి యనుచోట వారిరువురికి భయంకరమగు యుద్ధము జరిగెను. ఆ యుద్ధములో తుంబుచ్చి నాయకుడు చిన కేశవప్ప నాయని చేతికి చిక్కెను. పిమ్మట తుంబుచ్చి నాయకుని శిరచ్ఛేదము గావించి యాతని తలను పెద కృష్ణప్ప నాయనింగారి సముఖమున నుంచిరి. ఈ విధముగ విద్రోహచర్యలు తలపెట్టిన తుంబుచ్చి నాయకుని జీవితము విషాదాంతముగ సమాప్తమగుటచే మిగిలిన పాళెగాండ్లు కృష్ణప్ప నాయనయ్యగారియెడ వినయవిధేయతలతో సంచరింపసాగిరి.

స్వామిద్రోహముచేసిన హేతువుచే తుంబుచ్చి నాయకుని శిరచ్ఛేదము గావించెనే కాని వస్తుతః కృష్ణప్ప నాయనయ్య దయార్ద్రహృదయుడనియే నుడువవలసియున్నది. తుంబుచ్చి నాయకుని జయించినను, అతని కుమారు లిద్దరిని మన్నించివారిని పరమకుడి, పరంబూరు పాళెముల కధికారులుగ నియమించి పాండ్యకులస్థాపనాచార్యుడు తన సహృదయతను జాటెను.

తుంబుచ్చి నాయకుని మరణానంతరము పెద కృష్ణప్ప నాయనయ్య మరొక ప్రతిఘటనమును నెదుర్కొనవలసివచ్చెను. సింహళద్వీపమునకు ముఖ్యపట్టణమగు కండిని పరిపాలించురాజు తుంబుచ్చి నాయకుని ముఖ్యమిత్రుడు. మిత్రుని దుర్మరణము కండిరాజుహృదయమును కలచివైచెను. పాండ్యమండలాధీశ్వరునితో యుద్ధముచేయ సంకల్పించెను. తోడనె సమర సన్నాహములందు నిమగ్నుడయ్యెను. నలుబది వేల సైనికులను సమకూర్చుకొని కండి పరిపాలకుడు యుద్ధము ప్రకటించెను. ఈ విషయాదికము తెలిసికొని పెద కృష్ణప్ప నాయనయ్య అరియనాథ మొదలి, దళవాయి చిన కేశవప్ప నాయడు మున్నగు వారితో సమాలోచనము జరపి కండిరాజుతో సమరము సాగించుటకు నిశ్చయమనస్కుడయ్యెను. దళవాయి చిన కేశవప్ప నాయని నాయకత్వముక్రింద మధుర వీరభటంసులు కండిరాజు సైన్యమును పుత్తళం అనుచోట ఎదుర్కొనిరి. యుద్ధము జరిగెను. అందు చిన కేశవప్ప నాయకుడు జయించెను. కండి సైనికులు చాలమంది మరణించిరి. మంత్రులు, సైనికోద్యోగులు - పలువురు ధైర్యము గోల్పోయి యిక సైనిక యుద్ధమును విరమింపవలసినదిగా తమ రాజును (కండి రాజు) కోరిరి. కాని యతడుమాత్రము వారి మాటలను పెడచెవిని బెట్టి మరల 60,000 సైనికులను కూడగట్టుకొని చిన కేశవప్ప నాయనితో యుద్ధము చేయ సన్నద్ధుడయ్యెను. బుడతకీచులుకూడ కండి రాజునకు సహాయముచేసిరని తెలియుచున్నది. ఈ యుద్ధమునందును దళవాయి చిన కేశవప్ప నాయడే జయించెను; కండి సైనికవర్గముతో బాటు కండి రాజుకూడ వీరస్వర్గమునకు జనెను. అప్పటికి యుద్ధము సమాప్తమయ్యెను. ఈ విజయ వృత్తాంతము మధుర నాయక రాజుల చరిత్రయందే కాక ఆంధ్రుల చరిత్రలోగూడ మధురాధ్యాయము; సువర్ణాక్షరములతో లిఖింపదగువీర గాథ. కారణమేమనగ నాటినుండి తెలుగువారు సింహళద్వీపమునుగూడ పరిపాలింపగడగిరి. [illegible] పిమ్మట పెద కృష్ణప్ప నాయనయ్య తన బావమఱదియగు విజయగోపాల నాయకుని పాండ్యమండలాధీశ్వరుని ప్రతినిధిగ సింహళద్వీపమున నియమించెను. విజయగోపాల నాయకుడు సచ్ఛీలుడనియు, చాల గొప్పవాడనియు తెలియుచున్నది.[1] నాటి

రాఘవరాజు, ఆవులమంద కృష్ణరాజు, వీరవల్లి రామరాజు, మల్లీపురం రంగపతిరాజు, పూసపాటి కొండ్రాజు, రావిళ్ళ రమణప్ప నాయడు, పచ్చా కస్తూరినాయడు, పెమ్మసాని రుద్రప్ప నాయడు, నాదెళ్ళ నార(గ)ప్ప నాయడు, వారిగంటి నరసానాయడు, నరావుల వెంకట్రామానాయుడు—మున్నగువారు.

(సింహళద్వీపచరిత్ర. చెన్నపురి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారము.)

1. బంధువు లందరిని సముఖానకు రప్పించి చూచి అందులో యోగ్యుడున్ను, బుద్ధిమంతుడున్ను, మహాపరాక్రమశాలిన్ని, ఆకార రేఖా మహారాజ లక్షణవంతుడైన బావమరిది విజయగోపాల నాయనివారిని పిలిచి నీవు సింగళద్వీపానికి రాజుగావుండేమని పురోహితుల రప్పించి మంచి దినమ్మును, లగ్నమున్ను, ముహూర్తమున్ను చూచి ఆ దినమందు అచ్చటి గంగాజలమున్ను, ఆ దేశమందుగల పుణ్యనదుల తీర్థములున్ను తెమ్మని అతనికి అభిషేకంచేసి స్వర్ణపట్టంమీద వ్రాయించి లలాటమున ధరియించ్చి సకలాభరణభూషితునిగా చేసి...... ......అంబారిలో విజయగోపాలరాజును సవారి గమ్మని సింహళరాజుకు కలిగిన బిరుదులున్ను, పాండ్యదేశాధిపతికి కలిగిన బిరుదులున్ను యిచ్చి...' సింగళద్వీపచరిత్ర. చెన్నపురి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము.

నుండి విజయగోపాల నాయకుని మూలమున పాండ్య మండలాధీశ్వరుడు సింహళద్వీపమునుండి కప్పమును గొనుచుండెను. ఇది సత్యదూరముగ నుండనోపు నని కొందఱి యభిప్రాయము. కాని ఒక్క విష యముమాత్రము సుస్పష్టము. సింహళద్వీపమును పెద కృష్ణప్ప నాయనయ్య జయించుట, అందు మీఁదట సక్రమముగ కప్పమును వసూలుచేసి మధురకు పంపుటకు గాను తన ప్రతినిధిని నియమించుట– సత్య సంఘటనములని నుడువదగును.

విశ్వనాథ నాయనయ్యవలె విశేషముగ దాన ధర్మము లొనర్చియు, ఉన్నత గోపురములు కట్టించియు, చిట్టడవులను నిర్మూలించి గ్రామములు నిర్మించియు, చెరువులు త్రవ్వించియు విశేషవిఖ్యాతి గడింప కున్నను, పెద కృష్ణప్ప నాయనయ్య సింహళద్వీప మును జయించిన తెలుగురాజుగా చిరయశస్సు నను పార్జించినాడు! అతఁడొక్కడే కాదు. ఆనాటి ఆంధ్రవీరులుకూడ ‘మేరుసమానధైర్యయశస్తిలకు’ లుగా చరిత్ర వినువీధిలో ధ్రువతారలై వెలుఁగొందు చున్నారు. !! వారికి జేజేలు!

—శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ.

షష్ఠ్యంతాదులు

1. షష్ఠ్యంతములు.

నన్నయభట్టు, తన భారతములో షష్ఠ్యంతము లను వ్రాసలేదు. ఆ కారణమున, షష్ఠ్యంత రచన ఏకవిచేఁ బ్రారంభింపఁబడెనను విచికిత్స యేర్పడినది. ఆ సందర్భమున, షష్ఠ్యంత రచన ఏ కవిచేఁ బ్రారం భింపఁబడెనో, దాని నాధారముగా, కొని కవుల పౌర్వాపర్య నిర్ణయమును విమర్శకులు చేయు చున్నారు. ఈ విషయములో కీ. శే. శ్రీపాద లక్ష్మీ పతిశాస్త్రిగారి, నన్నెచోడకుమార సంభవ విమ ర్శలో ఈ క్రింది వాక్యము లున్నవి.

తిక్కనసంప్రదాయమునసే, కావ్యారంభమున, షష్ఠ్యంతములస్తుతి, యితఁడు (నన్నెచోడుఁడు) న లంబించినాఁడు.

కావునఁ దిక్కనయే, కావ్యారంభమున షష్ఠ్యంతముల నుపయోగించుటకు మూలపురుషుఁడు గాని, నన్నెచోడుఁడు గాఁడని తోఁచుచున్నది.

141—పుట.

ఈ వాక్యము పరిశీలింపఁదగియున్నది—

అత్యంత ప్రాచీనుఁడగు కాళిదాస మహాకవి, రఘువంశమును వ్రాయుటకుఁ బూని, అందు రఘు వంశరాజుల గుణములను, "సోహమాజన్మ శుద్ధానాం—" అని ప్రారంభించి, నాలుగు శ్లోక ములు షష్ఠ్యంతములుగా వర్ణించి, "రఘూణామన్వ యం వక్ష్యే." అనెడి విశేష్యముతో అన్వయము కలి పెను.

[రఘు. 1 స. 5-9 శ్లోకములు.]

అనఁగా ఇత్యాది గుణములుగల రఘురాజుల యొక్క చరిత్రమును వ్రాయుచున్నాను అని వ్రాసెను. ఆ షష్ఠ్యంతములు రఘువంశ రాజుల వ్యక్తివర్ణనపరములే. ఈ షష్ఠ్యంతములను జూచి, అట్టివర్ణనా పద్ధతి అందముగా నున్నదని గమనించి, కొలఁది సంస్కారములతో, తన కుమారసంభవమున, నన్నెచోడుఁడు, కృతిపతిని షష్ఠ్యంతములలో వర్ణించినాఁడని తలంపవచ్చును. ఆంధ్రకవులు, తమకు వలసిన పద్ధతులను, కర్ణాటభాషనుండియే గాక, సంస్కృతభాషనుండియుఁ జాలవఱకు, గ్రహించి రని, చెప్పుటకుఁ జాల నిదర్శనములు కలవు. ఈ షష్ఠ్యంత రచనను, కన్నడ కవులగు పంప, రన్న పొన్న, మొదలగు వారు చేయలేదు. సంపూర్ణముగా కర్ణాటక సంప్రదాయమునే ఆంధ్రకవులు గ్రహించి రని నిశ్చయింప వీలులేదు. ఈ షష్ఠ్యంతరచన సంస్కృతమునుండియే గ్రహింపఁబడినదని భావింపవచ్చును.

నన్నెచోడ రాజకవి, క్రీ. శ. 1028-1058 ప్రాంతములో నున్నాఁడని అతని గ్రంథాధార పద్యకాలమువలన నిశ్చితమగుచున్నది. అందువల్ల షష్ఠ్యంత రచన తిక్కనోపజ్ఞము కాక, నన్నెచోడో పజ్ఞ మనియే చెప్పనోపును.

ఇట్టి షష్ఠ్యంత రచన ప్రాచీన శాసనములలో నెక్కడనైని యున్నదా? అని పరిశీలింపఁగా క్రీ. శ. 9 శతాబ్దిలోని కొరవి గద్యశాసనము ఉదాహరణ ముగాఁ గనఁబడుచున్నది. ఆ శాసనభాగము నీక్రిందఁ జూపుచున్నాఁడ.

"శ్రీ విక్రమాదిత్య నృపాగ్రతనయుణ్డయ్న
చాళుక్య భీమునకు	కౌచకర్దప్పునకు
నేగీశ్వరునకు	రసముద్రాన్వయకుల
తిలకుణ్డయ్న కుసుమాయుధుణ్డు గన్నర బల్లహానికి (హా) స్త్రప్రతాపస్తంబయ్న .... నేలయెల్లం గావంబూని....................."— తెలంగాణా శాసనాలు 163, 164 పుటలు.

పై శాసనములోని షష్ఠ్యంత పదములకును క్రింది యుద్ధచరిత్రకును సంబంధములేదు కనుక, ఈ షష్ఠ్యంత గద్యము, కృత్యాది షష్ఠ్యంత రచనయనియే తలంపవలయు. ఈ షష్ఠ్యంత విశేషణ రచన తరువాతి కాలమందలి, కావ్యములలోని షష్ఠ్యంతరచనకు బీజములాయెనఁ దగియున్నవి. దీనింబట్టి, 9 శతాబ్ది నాఁటికే షష్ఠ్యంత విశేషణములు వాడెడి యలవాటు కలదని తెలియుచున్నది. కావున, కాళిదాసు షష్ఠ్యంత రచన, శాసన షష్ఠ్యంత రచన,—ఈ రెంటును, తరువాతి కాలమందలి, కావ్యములలోని షష్ఠ్యంత రచనకు, బీజములని చెప్పుటలో సందేహము లేదు.

పోతన, భాగవతములో ద్వితీయా విభక్తి పద్యమొకటి తక్క, తిక్కన గ్రంథ దేవతాదిస్తుతి, షష్ఠీవిభక్తులతో, కాళిదాసువలెనే స్తుతించెను. షష్ఠ్యంతములుకూడఁ గలవు. దీనిలో కుకవి నింద లేదు. సుకవిస్తుతిమాత్రమే కలదు. తిక్కనను స్మరించియు,

"కుకవుల్ ధర దుర్విటులట్లు చూడఁగాఁ" అనునట్టి నిందను పోతన చేయలేదు.

2. స్వప్నము—

స్వప్నవృత్తాంతమును తిక్కన తన భారతములో వ్రాసెను. నిర్వచనోత్తర రామాయణములో వ్రాయలేదు. తత్పూర్వ గ్రంథములయందును, సంస్కృత కావ్యములందును స్వప్నవృత్తాంత రచనా పద్ధతి కాన్పింపదు. ఎవరేని, సంస్కృత కావ్యములలోఁ జూచియుందురేని తెలుపుదురని మనవి. అంతమాత్రముచే నితర దేశ వాఙ్మయములలోఁ గూడ అట్టి పద్ధతి లేదన వీలులేదు. విచారింపఁగా - *A. D.* 449 - 1066 వఱకు నుండు ఆంగ్లో - శాక్సన వాఙ్మయకాలములో కేడ్మన్ (*Caedmon*) అనునొక పామరుఁడు స్వప్నములో కనఁబడిన వ్యక్తియొక్క అనుగ్రహమువలన, ఆంగ్లో-శాక్సన్‌భాషలో పద్యము వ్రాసినట్లు గలదు. ఆ విషయము నీ క్రిందఁ జూపుచున్నాను.

Anglo-Saxon Period A. D. 449-1066 Caedmon.

He had been sleeping sometime when he was aware of a man in a vision standing near him who, after salutation spoke to him, calling him by his name· "Caedmon," he said, "sing me some thing." "Me!" said Caedmon atonce, but very humble; 'there's nothing that I can sing· that was why I left the company and came here · Just because I could not sing." Presently the vision spoke again. : 'But will you not try if I ask you!" Caedmon pondered a moment, and then asked in a low tone "What shall I sing?" "Sing the glory of creation," promptly returned the voice· On receiving the answer he at once began to sing in praise of the creator words and verses he had never before heard.

*   *   *   *   *

The above song belongs to the A. D. 670.

(A History of English Literature by J· Logie Robertson M. A, Edinburgh—October, 1894.)

పై విషయమువల్ల ఖండాంతరములలోఁ గూడ స్వప్నము మూలమున కవిత్వము వ్రాయుశక్తి వచ్చినట్లు చరిత్ర తెలుపుచున్నది. తిక్కన మహాకవి ఆవృత్తాంతము నెట్లెఱింగి వ్రాసినాఁడని చెప్పుటకు వీలులేక పోయినను, అట్టి స్థితి, అన్యదేశములలోఁ గూడ నున్నట్లు గోచరించుచున్నది. అజ్ఞుఁడగు కాళిదాస మహాకవికి కాళికావరప్రసాదమువలన కవితావేశము కలిగినట్లు చెప్పెడి జనశ్రుతి కేడ్‌మెన్ స్వప్నవృత్తాంతమును స్మృతికిఁ దెచ్చుచున్నది. మఱియు, కాళిదాస కవితావేశమునకు, కారణమగు కాళికానుగ్రహము, తిక్కన స్వప్నవృత్తాంతమునకుఁ బ్రాతిపదిక గలదు. ఇట్టి స్వప్నవృత్తాంతముగల కావ్యములు, తెలుఁగులోఁ బుట్టి నశించినవేమో చెప్పలేము కాని, ఇప్పటివఱకు స్వప్నవృత్తాంతమును వ్రాసిన తెలుఁగు కవులలోఁ దిక్కన మొదటివాఁడుగ నున్నాఁడు.

3. కుకవి నింద—

నన్నెచోడుఁడు కుకవినింద చేసెను. తిక్కన్న, తొలుత, నిర్వచనోత్తర రామాయణములో కుకవినింద చేసెను. తరువాత, భారతములో చేయలేదు. కుకవి నింద సంస్కృత కావ్యములలోఁ గలదు. బాణ మహాకవి, కాదంబరీహర్షచరిత్రలలో కుకవినింద - అని వ్రాయకపోయినను, దుర్జననింద అని వ్రాసెను. కుకవి దుర్జనవర్ణ్యాదియములు, సమానప్రతిపత్తిలోనే యుండును. "మూఢః పరప్రత్యయనేయ బుద్ధిః" అను కాళిదాసు మాళవికాగ్నిమిత్ర శ్లోకములోని నిందకూడ, కుకవినిందకు మార్గదర్శకమే.

"ఘన దురితానుబంధకలికాలజనోపహతుపార సంహతిం,

"దనయదయాప్రభావమున దర్పగజోపి—"
అనెడి నన్నయ పద్యములో "గలమోరభేదః" అనెడి నియమప్రకారము, "కరికాలజనోష" అని మార్చి చదివినయెడల, ఆయన తన సమకాలికుఁడగు 'కరికాల వంశజు' డయిన నన్నెచోడుని దోషములను విమర్శించినట్లు ధ్వనించుచున్నది. దీనంజేసి, నన్నయ కూడ ఏదో యొక విధముగా, సమకాలిక కవినింద చేసినాఁడని తెలంపవలసియున్నది. కాన, ఇది తిక్కనోపజ్ఞమని చెప్పుటకును అవకాశము కాన్పింపదు.

కుకవినింద లేదు కాబట్టి, తిక్కన, భారతమును ముందు వ్రాసి, తరువాత, రామాయణము వ్రాసినాఁడా ? అని యనవచ్చును. కాని, ఇది కాలక్రమవిరుద్ధము; కవితా పరిణామమునకును విరుద్ధము.

4. కృత్యాది—

నన్నయ తన భారతప్రారంభమున, సంస్కృత భాషలో ధ్యానశ్లోకము వ్రాసెను. నన్నెచోడుఁడు తెలుఁగులోనే వ్రాసెను. తిక్కనకవి, నిర్వచనోత్తర రామాయణములో సంస్కృతమున ధ్యానశ్లోకము వ్రాసెను. భారతములో సంస్కృతములో వ్రాయక తెలుఁగులోనే వ్రాసెను. కాని, స్వప్నవృత్తాంతములో సంస్కృతశ్లోకము నుపనిబంధించెను. తిక్కనాదులకు తరువాతివాఁడగు విన్నకోట పెద్దన తన కావ్యాలంకారచూడామణిలో గ్రంథాదిని సంస్కృతములో ధ్యానశ్లోకము వ్రాసెను. నన్నయ, నాఁటి షష్ఠ్యంతములను, నన్నెచోడ, తిక్కన, కేతనాదులు వ్రాసిరి. కేతనదశకుమారచరిత్రలో స్వప్నవృత్తాంతము లేదు. కుకవినింద లేదు. షష్ఠ్యంతములు మాత్రము గలవు. నాచనసోముఁడు, ఏ కవులు పోని, మారిన ఫక్కిలో ఉత్తరహరివంశమును ప్రారంభించెను. ఒక్క తెలుఁగుపద్యములో 'హరిహరనాథా' అని స్తుతించి— 'దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె'.— అని వెంటనే కథావస్తువును ప్రారంభించెను. ఇందలి స్తోత్రభాగమును వదలితిమేని, కాళిదాసు, కుమారసంభవములో వస్తునిర్దేశముతో కావ్యారంభము కావించిన పద్ధతి గోచరమగుచున్నది. దానివల్ల నాచన సోముఁడు కాళిదాసును అనుకరించినాఁడని చెప్పవలయు.

సీతా విజయము (శతకంఠ రామాయణము) లో నాచన సోమునివలెనే మర్దనకవియు, కథా వస్తువుతో కావ్యాది ప్రారంభించినాఁడు. దీనిలో గ్రంథాది స్తుతికూడ లేదు.

అర్వాచీనుఁడుగామన్న నాచనసోముఁడు, నన్నయ నన్నెచోడ తిక్కనాదుల మార్గము నాశ్రయించిన వాఁడయ్యు, స్వతంత్రుఁడై, క్రొత్తపోకడలతో, కావ్యమును నిర్మించెను. నాచన సోముని కాలము క్రీ. శ. 1344 అని, శాసనకాలముతో నిశ్చితమై యుండకపోయినచో, అతఁడు వ్రాసిన కృత్యాదినిబట్టి, ప్రథమాంధ్ర కవి కావలసివచ్చును.

పరిశీలింపఁగా కుకవినింద, షష్ఠ్యంతస్తుతి, స్వప్నవృత్తాంతము సంస్కృత శ్లోకముతో కావ్యారంభము మొదలగు ప్రత్యేక విషయముల నూఁతగాఁ గొని, కాలము తెలియని కవుల కాలనిర్ణయము చేయ దొరకొనుట చాలపొరపాటు. కాన, ఇట్టి నిదర్శనములు, కాలనిర్ణయ సమర్థకములు కావని స్పష్టమగుచున్నది.

6. స్రగ్ధర.

నన్నెచోడుఁడు, స్రగ్ధరతో తన కావ్యము నారంభించినందున ఆ టెంకణాదిత్యుఁడు, యుద్ధములో మరణించెనని - దీనినే అథర్వణాదులు దోషముగాఁ జేర్కొని యున్నారు. సత్యమున కియ్యది దోషము కాదు. కాళిదాసు తన అభిజ్ఞానశాకుంతలములో మొదట, నాంది శ్లోకమును స్రగ్ధరలోనే వ్రాసెను. అట్లే నన్నెచోడుఁడుకూడ, తన కుమారసంభవమును, స్రగ్ధరతోఁ బ్రారంభించెను.

నన్నెచోడుని గ్రంథాది స్రగ్ధరావృత్త రచనకును ఆతని షష్ఠ్యంత రచనకును, మార్గదర్శకుఁడు కాళిదాస మహాకవియే యయియుండునని చెప్పఁదగును.

నిష్పాక్షిక బుద్ధితోఁ బరిశీలించితిమేని, ఆయా కవులు, తమ చిత్తమునకు వచ్చిన రీతిలోనే గ్రంథరచన కుపక్రమించిరని వ్యక్తమగుచున్నది. కొన్ని విషయములలో కవులకుఁ బరస్పరసాదృశ్యము కన్పట్టెనను, అవియన్నియు, అన్యకవిసాపేక్షములని నిశ్చయింప వీలుకాదు. పక్షపాతరహితముగా విమర్శించిన సత్యము గోచరించును.

కుమారసంభవమును వ్రాయఁబూనిన నన్నెచోడుఁడు, కుమారసంభవమును వ్రాసిన కాళిదాసు గ్రంథములను ఆధారముగాఁ గొని, వానిలో తనకు నచ్చిన షష్ఠ్యంతాదులను, కొలఁది సంస్కరణములతో, తొలుత ప్రారంభించినాఁడనుట సహేతుకముగా నున్నది.

—శ్రీ పిన్నంరాజు వెంకటసుబ్రహ్మణ్యశర్మ

పూర్వపు విమానాలు

ఈనాడు ప్రపంచ నాగరిక రాజ్యాలుగా చెలామణీ అవుతున్న దేశాలన్నీ గాఢ అజ్ఞాన తిమి

రాంధకారంలో మ్రగ్గుతూన్న అతి పురాతన కాలంలోనే భారతీయులు పరిపూర్ణ నాగరికులై విజ్ఞానసారాన్ని దశదిశలా వెదజల్లినారని ఆశేష ప్రపంచం అంగీకరించేయుండి (సంశయ లవలేశమైనా లేకుండా, గణిత ఖగోళశాస్త్రాలలో హిందువుల విజ్ఞానం పారం ముట్టింది. అత్యంతవ్యయ ప్రయాసలతో అసంఖ్యాక మేధావుల బలిదానంతో శాస్త్రాల తెరబడి పరిశోధనలతో తాము మాత్రమే కనుగొనగలిగితిమని నవీయుగ శాస్త్రవేత్తలు చాటుకొంటూన్న సమస్త ప్రకృతి రహస్యాలు, సర్వలలిత కళామర్మాలు ప్రాచీన భారతీయులకు కరతలామలకంగా తెలిసివున్న వేనని పూర్వ సంస్కృతి శాస్త్రగ్రంథాల పరిచయమున్న వారికి చెప్పనక్కర్లేదు.

రామాయణం, మహాభారతం మొదలైన అనేక పురాతన భారతీయ గ్రంథాలలో "విమానం" ప్రసక్తి తరచుగా వినవస్తుంది. వ్యోమమార్గాన విహరించే యితర యంత్రాల వర్ణనలు కూడా కానవస్తాయి. పురాతన భారతీయ శాస్త్రీయ పరిజ్ఞానాన్ని కేవల ఊహాకల్పితములని నిరసించడమే తమ నవనాగరికతకొక ప్రత్యేకచిహ్నంగా పొరబడుతూన్న ఆత్మవంచకులు ఆధునికయుగంలో అక్కడక్కడ కానరాకపోవటంలేదు. నిదానించి పరికిస్తే, యోచించి గ్రహిస్తే ప్రాచీనకాలపు హిందువులు యంత్రవిమానాలనిర్మాణంలో కృతకృత్యులైనారనిస్పష్టమౌతుంది.

భరద్వాజమహర్షి "యంత్రసర్వస్వం" అనే ఉద్గ్రంథాన్ని రచించారు. అందులో "విమానాధికరణం" అనే పేరిట ఒక అధ్యాయం వుంది. గాలి ఓడల నిర్మాణం, వాటిని నడిపించేవిధానం. అందలి విశేషాల వివరణమే యీ అధ్యాయంలోని ప్రధానాంశం.

"ఆకాశతంత్రం" అనే మరొక మహాగ్రంథాన్ని కూడ భరద్వాజమునీంద్రులు రచించేరు. భూమిని పరివేష్టించియున్న గాలులు, వాటి ఒత్తిడులు, వివిధ వాతావరణపరిస్థితులు అందులో చక్కగా చిత్రింపబడ్డాయి. యంత్రసహాయంతో మానవులు ఆకాశంలో ఎంత ఎత్తువరకు ప్రయాణం సాగించగలరో, భూమ్యాకర్షణను అధిగమించుటకు యేయేపద్ధతులున్నవో, సూర్యమండలదారుణోష్ణంనుండి సంరక్షించుకొనుమార్గములేవేవో యితర విపరీత వాతావరణాలలో ఎట్లు ప్రవర్తించుకొనవలెనో విపులంగా వివరించబడినై.

అందులో మూడు రకాల విమానాలను వర్ణించినారు. మాంత్రిక విమానాలు, తాంత్రిక విమానాలు, కృతకవిమానాలు. మాంత్రిక తాంత్రిక విమానాలు మానవాతీత శక్తులను సాధించుకున్న వారికి మాత్రమే. మానవ బుద్ధికౌశలమాధారంగా భౌతికవస్తు పరికరాలతో నిర్మింపబడేవే కృతక విమానాలు.

కృతక విమానాల నిర్మాణం ఊహాస్థితిని దాటి సాధనలో పరిణతిపై ఆచరణలో ప్రయోజనకరంగా రూపొందింది. యంత్రవిమానాల నిర్మాణం యథేచ్ఛగా సాగింది.

శౌనక, నారాయణ, గర్గ మహర్షులు రచించిన విమానచంద్రిక, వ్యోమయానతంత్ర ఖేటవిలాస పరిశోధన గ్రంథాలను సమగ్రంగా అవగాహన చేసుకొని తన అనుభవ విజ్ఞానాలను జోడించి యంత్రసర్వస్వ ఉద్గ్రంథాన్ని రచించితినని భరద్వాజమహర్షి ముందుగానే వివరించేరు.

వివిధ విధానాలద్వారా నడుపబడే ఎనిమిది రకాల విమానాలను భరద్వాజఋషి విశదపర్చేరు. ఉదహరణకు, కేవలం విద్యుచ్ఛక్తిచే నడిపబడునది శక్త్యుద్గమువిమానం. వాయువిమానాలలో కొన్నికొన్ని ప్రత్యేకరకాల దర్పణాలను వాడుతూవుండేవారు. ఈ దర్పణాలలో సూర్యకిరణాలలోని కొన్ని శక్తులను పరిహరించేవి కొన్ని, ఇతర శక్తులను నిలువజేసేవి కొన్ని. ఈ రవికిరణశక్తులవలన విమానాలు గాలి ఒత్తిడిని దాటి ఆకాశమార్గాన సంచారం చేయుటకు అవకాశం కల్గేది. రవికిరణశక్తులచే నడిచే విమానాలకు అంశువాహవర్గం అని పేరు. విమానాలలో అనేకరకాలను నిర్మించేరు. ఒక్కొక్కరకానికి ఒక్కొక్క నామకరణం చేశారు. ఆ పేరులనుబట్టి వాటి నిర్మాణవిధానాలను, వాటి ఉపయోగపద్ధతులను గ్రహించడానికి అవకాశం కల్పించేరు. వస్తుసామగ్రిని మోసుకుపోయేవి కొన్ని, యుద్ధాలలో మాత్రమే ఉపకరించేవికొన్ని ......గాలికన్న తేలికయిన ఉదజనివాయువువలన బెలూన్‌లను యీనాడు నడుపుతూన్నట్లే విమానాలను ఆకాశమార్గాన నడుపగల వాయువుల నుత్పత్తింపజేసే రాసాయనికపదార్థాలను పూర్వగ్రంథాలలో వివరించేరు. నీటిఆవిరితో బొగ్గుతో నడుపబడేవిమానాలకు ధూమయానవర్గం అని పేరుపెట్టేరు.

ఉదహరణకు ఒక విమానవివరాలను పరిశీలిద్దాం: "భామిని విమానా"న్ని గూర్చి తెల్సుకుందాం. దీని నిర్మాణాన్ని గూర్చిన అన్ని వివరాలను (12) ద్వాదశ సూత్రములతో పూర్తి చేశారు.

విమాన నిర్మాణంలో ఖనిజశాస్త్రం, లోహోత్పత్తి ప్రధాన స్థానమాక్రమిస్తాయి. వీటి విషయంలో భారతీయులు సమగ్ర విజ్ఞానాన్ని ఆర్జించారు,

శాక్త్యాయన యోగీంద్రులు "లోహతంత్ర", అనే గ్రంథాన్ని వ్రాశారు. అందులో అయస్కాంతం, సూర్యకాంతం, వజ్రకాంతం అనే మూడు లోహాలను కరిగించి ఒక పలకగా పోసి దానిని విమాన అడుగుభాగంలో అమర్చాలని స్పష్టం చేసేరు. లోహాలను కలపడం, కరిగించడం విధానాలను విపులం చేసేరు. వజ్రకాంతం, అయస్కాంతం సూర్యకాంతం వరుసగా 3-5-9 భరణాలు (తూకములో ఒకరకం మానం) ఎనిమిదిరకాల లవణాలతో... కలపాలి. 1 భరణానికి 1 శేరు లవణం చొప్పున 136 శేర్ల లవణాలతో అందుకు తగిన లోహాలు కలిపి మహామూసలో 200 కక్ష్యల (ఉష్ణమానం) వేడిలో కరిగించాలి. ఆ ద్రవ్యాన్ని అచ్చులోపోసి పలకగా చేయాలి. భామని విమానానికి ఈ విధంగా తయారయిన పలకను అడుగుభాగంలో అమర్చాలి. ఇవి ఎంతెంతటి కష్టంతో కూడుకున్నవో ఇందులో ఎన్నెన్ని విధానాలు యిమిడివున్నవో. ఖనిజలోహ శాస్త్రాలలో పూర్వులు ఎంతటి విజ్ఞానాన్ని, అనుభవాన్ని సాధించేరో ఊహించుటకు యివి ఉపకరిస్తాయి. ఎంతటి బరువైనా ఆకాశ మార్గమునకు లేవనెత్తగలరు.

తర్వాత మణులవర్ణనలను పరిశీలిద్దాం. కొన్ని కొన్ని రకాల అద్దాలతో యీమణులను తయారు చేసేవారు. సూర్యకాంతినుండి కొన్ని కిరణాలను గ్రహించుటకు, త్రిప్పివేయుటకు యీ మణులు తయారు చేయబడేవి. ఒక్కొక్క రకం మణి ఒక్కొక్క రకం సూర్యకిరణాలను మాత్రం ఆకర్షిస్తుందని వివరించారు. విమానంలో ఏయే ప్రదేశాలలో ఏయేరకం మణులను యేయేవిధాలుగా అమర్చాలో నిర్దేశించేరు. వానివలన సూర్యకిరణాలను ఆకర్షించుకొని విమానం తేలికయై గాలిలో ఎగిరిపోయే ఏర్పాటు జరిగేది. భామిని విమానానికి పైభాగంలోను, అడుగు భాగంలోను మొత్తం ఆరు రకాల మణులుండేవి. విమాన మధ్యభాగంలో నాసెకొట్టంవద్ద ఒక రకం మణిని అమర్చేవారు.

ఆమణి సూర్యమండలంనుండి వేడిని ఆకర్షించిన వేడితో నాసెను వాయువుగా మారుస్తుంది. ఆవాయు శక్తిలో విమానం ఆకాశమార్గాలకు ఎగిరిపోతుంది.

భామిని విమానాన్ని గురించి బోధానందవృత్తి పండితులు ఏమన్నారో గమనించండి "భామిని విమానంలో ఊర్ధ్వభాగమందు ఏడు మణులుంటాయి. వాటి నిర్మాణం, లక్షణాలు కూడా సూర్యకిరణాల లక్షణాలతో సరిపడి వుంటాయి. అందుచేత సూర్య కిరణాలవలెనే వ్యవహరిస్తాయి. సూర్యకిరణాల తాకిడిలో ఊర్ధ్వప్రయాణం సాగిస్తాయి. కనుకనే విమానం సూర్యమండలంవరకైనా ప్రయాణం చేయ కల్గుతూంది."

నాసెను వాయువుగా మార్చే మణి పేరు "అగ్ని క్షేత్రం". నిర్దేశిత ప్రదేశాలలో అమర్చబడిన 13 మణులు సూర్యకిరణాలలోని ,13 రకాల కిరణాలను గ్రహించి విమానానికి చలనశక్తిని ప్రసాదిస్తాయి. ఈ శక్తులను వెనుకకు త్రిప్పినకొలదీ విమానం తిరిగి భూమిమీదకు వస్తుంది.

భామిని విమానంలో ఉపయోగించే 13 రకాల మణుల పేర్లివి. 1 ప్రభావతి మణి 2 బ్రహ్మముక్తి 3 తమోహరి 4 పార్వతి 5 మాధారిశ్వ 6 శేగిని 7 అగ్నిక్షేత్ర 8 కార్షిణి 9 రూచిక 10 ఘంట 11 రంజని 12 గోటిక 13 రురుక. మొదటి ఆరు పైభాగంలోను, ఏడవది నాసెకొట్టంవద్దను ఆఖరి ఆరు క్రిందిభాగంలోను అమర్చబడేవి.

ఈ మహాగ్రంథంలో ఈ పదమూడు రకాల మణులను తయారుచేసే విధానాలు కూడా వివరించబడ్డాయి. సూర్యకిరణాలలో అనేక మహత్తర శక్తులున్నాయి. అవసరమయిన శక్తులను గ్రహించుటకే యీ మణులు.

"భగణ" దర్పణం తయారుచేసే విధానాన్ని మీ ముందుంచుతాను. 5 వంతులు సవిర పాషాణం, 1 వంతు బంగారం, 7 వంతులు తెల్లవజ్రం, 9 వంతులు ముత్యాలు, 13 వంతులు సముద్ర నురగ, 7 వంతులు సువర్చల, 2 వంతులు ఉప్పు, 16 వంతులు హేమమక్షిక, ఖనిజం, 1 వంతు దూతణ, 36 వంతులు రాతి-చిప్పరజను, 11 వంతులు కాంతాత్రేయ, 27 వంతులు (ఒక రకపు) సముద్రపు చేప కంటిపొరలు. వీటన్నిటినీ తూర్ణంగా కలిపి ఒక మూసలో కరిగించి ప్రత్యేక రకపు అచ్చులో పోసి ఆరనిచ్చినచో కలకాలం చెడిపోని అద్దం తయారౌతుంది. దాని పేరే "భగణ" దర్పణం. రవి మండలంనుండి ఉష్ణశక్తిని ఎంత పరిమితిలోనైనా గ్రహించడమే ఈ భగణ దర్పణ ప్రత్యేకత.

పరిశోధకులు విజ్ఞానతృష్ణతో పై అంశాలను పరిశీలించి ప్రపంచంలో భారతావనికి ఉచితస్థానాన్ని సాధించుటలో శక్తివంచన లేకుండగా తోడ్పడగలరని ఆశిస్తున్నా.

విశ్వేశ్వర పఠాన్.

అనువాదం : శ్రీ ఆర్. రామకృష్ణారావు.

గ్రంథ విమర్శనము

పూలపాటలు.

[కవితా కదంబము.]

రాజశ్రీ సాహిత్య కళాపీఠము. సికింద్రాబాదు. వెల ముప్పావలా.

ఈ కవితాకదంబంలో శ్రీ దాశరథి, వి. రామరాజు, సి. నారాయణరెడ్డి, చిల్లర భావ నారాయణ, భాగి నారాయణమూర్తి, ఆకెళ్ళ సుబ్రహ్మణ్య కవి అనే ఆరుగురు యువకవుల రచనలున్నాయి. వీరందరు తెలంగాణా రచయితలు.

వీరందరి ఖండకృతులు చదువుతూంటే అటు తెలంగాణాలో తిరిగీ ఒక నూత్న కవితాతరంగం ఉవ్వెత్తుగా లేచి విజృంభింపగలదనే ఆశకలుగుతున్నది. ఈ కవులందరిలోను స్వచ్ఛమైన నిజాయతీ, లలితమైన కవితాభివ్యక్తి విస్పష్టంగా కనిపిస్తున్నాయి. వీరిలో చాలామంది కేవలం పాతరకం వృత్తరచనలతో తృప్తిపడక కొత్తకొత్త మాత్రాచ్ఛందస్సులు సృష్టించుకొని ఆ వినూత్న ఛందోరచనలో కృతకృత్యులైనారు. అయితే వీరి రచనలలో కొన్నిచోట్ల కొంతమంది నవ్యకవులచ్ఛాయలు, పోకడలుకూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. అవిక్రమంగా సమసిపోయి వీరు తమతమ ప్రత్యేక స్వతంత్ర మార్గంలో కాలూనగలరని ఆశిస్తున్నాను.

ఈ రచయితలందరిలోను దాశరథిరచనలలో కొంత ఎక్కువ పరిణతి, గాంభీర్యము కనిపిస్తున్నాయి.

ఈ క్రింది గీతికలనుబట్టి ఈకవితాకదంబంలో కవితా స్వభావం గ్రహించవచ్చును. ఇది దాశరథి రచించిన 'ఏ అమృతభావమో' అనే గీతిక.

"ఏ అమృతభావమో
ఈ చిన్ని తీవలో ఈ చిన్ని క్రోవిలో
పయట జారిన చిన్ని పడతి వక్షమువోలె
కనుపించకే పొంగి కనుపించును.

ఏ మధురరావమో
ఈ గాలి తరగలో ఈ వాగునడకలో
పసికన్నెగొంతులో కొసరు కోరికవోలె
వినిపించకే కొత్త వినిపించును.

ఏ మధురభావమో
ఈ చంద్రకాంతిలో మల్లె పూబంతిలో
అప్పుడే వికసించినట్టి యౌవనమట్లు
అందిరాకనె అందినట్టు లనిపించును.

ఏ అమృతరావమో
ఈ వీణతంత్రిలో ఈవాణిగొంతులో
ప్రణయినీ హృదయాంతపల్లవితభావమ్ము
తలెడాగి కొనసాగి
తుదకేగి చెవిపోకివటుల గుండెకు తాకు.

ఏ అమృతరావమో!"

వి. రామరాజుగారు రచించిన 'ఒకనాడు' అనే గీతికకూడా ఇక్కడ ప్రత్యేకంగా పేర్కొనదగినది.

'ఒకనాటి మధురనిశి
ఒలకబోసిన కలలో
కడసారి పలికి తేలి
కరిగిపోయింది
ఒండొరుల ప్రేమరీటు
లోరయు హృదయనదమ్ము
వానిచే విడబరచి
వైచెనవి కుమిలింది.
ఈ విరహసాగరం
ఎటుల ఈదుదమన్న
దుఃఖమే మనకింక
చుక్కవెలుగౌనంది
జాలిగా కన్నీటి
మాలికలు వేసింది
కన్నీటిలో హృదయ
కమల మందించింది.'

కేవలం ప్రత్యేక కవుల కావ్యాలు ప్రకటించడంకంటె ఇలాంటి కదంబాలు ప్రచురించడంలో కవులకు, ప్రకాశకులకు, పాఠకులకు చాలా సౌకర్యాలున్నాయి. కొంచెం ఖరీదు ఎక్కువయినా యీ కవితా సంపుటం ఇంకా చక్కని సంపుటంగా ప్రక

తీస్తే బాగుండేది. ప్రకాశకులింకా విస్తృతమైన కవితా కదంబాలు ప్రకటించగలరని ఆశిస్తున్నాను.

పూలపాటలు ఆధునిక కవితాభిమానులందరు చదువవలసిన కవితాకదంబం.

హంసావళి.

[పద్యకావ్యము.]

శ్రీ గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి, సాహితీసమితి, సాహితీ గ్రంథమాల, తెనాలి. వెల రూపాయి పావలా.

ఇది ఎనిమిది ఆశ్వాసాలుగల చిన్న పద్యకావ్యము. ఈ కావ్యకథానాయిక హంసావళి తన చెలికత్తె మాయానాగరలలోనించి తప్పించుకొని కష్టాలన్నీ గట్టెక్కి చివరికి తాను వలచిన కమలాకరుణ్ణి వివాహం చేసుకుంటుంది. సంగ్రహంగా ఇదే ఈ ఖండకావ్యంలోని ఇతివృత్తం.

ఈ కావ్యంలోని కథాకథనం అంతా 'అనగా అనగా ఒక రాజు' అన్న సాంప్రదాయిక ధోరణిలోనే వెళ్లిపోతుంది గాని కథనంలో అంత ప్రత్యేకత ఏమీ కనబడదు.

అయితే ఈ కావ్యంలోని వృత్తరచన, పదప్రయోగము సాంప్రదాయికమైన హుందాతనంతోను, స్వచ్ఛతతోను సాగిపోతాయి. ఆశ్వాస వ్యవధి అట్టె సుదీర్ఘంగా ఉండక సముచితంగా ఉండడంవల్ల పాఠకులీ కావ్యం అంతా సుఖంగా చదువుకుపోవడానికి వీలవుతున్నది. హంసావళి నాట్యమందిరానికి విచ్చేసే ఘట్టంలోని ఈ క్రింది వృత్తాలు రెండు వీరి పరిణతాకవితకు నిదర్శనంగా తీసుకోవచ్చును.

"కొమరుంబ్రాయపుఁ బైడిమైమిసిమి
పొంగుల్వారఁ బూవింటిబం
టు మెరుంగారిన చేతికోలయన,
మేనుంగొన్న శృంగారసార
మహాదేవియనంగ మంటపము
జేరన్ వచ్చు హంసావళీ
కమనీయాంఘ్రి సరోజ హంసకులముల్
గావించెఁ గ్రమధ్వనుల్
మణిమంజీర మనోజ్ఞశింజితము
రమ్యంబై కనద్రత్న కిం
కిణీకానం జితకాంచి నిక్వణన
భంగిం బెంప వేంచేయ రా
న్మణీ కన్యామణి యద్గునద్గున
ఘనతన్మ్రోదెడి లాస్యరసా
రుణకంజాలి పరంపరల్ దొడిగెఁ
జారుస్ఫూర్తి పెంపార గాన్"

హంసావళి చెలికత్తె కనకమంజరి యోగినిగా మారిన విధం అభివర్ణించే ఈ క్రింది సీసం వీరి వర్ణన నైపుణికొక చక్కని తార్కాణ.

నిడుపరాయని పెద్ద సెలవు పోలిక
గూట ఘన జటాజూటమ్ముగట్టి నిలిపి
తోరంపు కటి జింకతోలు దుప్పటముం
గుబ్బమిట్టయురమ్ము గుప్తపరిచి
ప్రోదిఁగూర్చిన క్రొత్త రుద్రాక్షమాలలు
సంధులదండల సవదరించి
నొసటగమ్మని చల్వపసిడి గంధపుబొట్టు
మెరుగారు బసుమమ్ము మేనవలది
పాముగాము మ్రింగిన చందమామపోలె
మలుపుపడి మోహనద్యుతి మండలముల
దావళములు ద్రిప్పుచు దక్షతత్త్వవిషయి
కనకమంజరి తిరుణయోగినిగ నయ్యె."

అనాకెరినినా.

టాల్‌స్టాయ్. అనువాదం, తాపీ ధర్మారావు. ప్రకాశకులు, ఇంటింటి విజ్ఞానమాల, 16జోన్సు వీధి. మదరాసు. వెల ఆరు రూపాయలు.

ప్రపంచ సాహిత్యంలోని ఉత్తమ గ్రంథాలు తెలుగులో చదువుకోవాలనే తహతహ ఇటీవలి పాఠకులలో బాగా ఎక్కువైనట్టు కనబడుతున్నది. ఈ విధంగా ఉత్తమ విదేశీయ సాహిత్యం తెలుగులోకి అనువదించడంవల్ల తెలుగు పాఠకుల సాహిత్యాభిరుచికి చక్కని దోహదం కలుగుతుంది.

అనాకెరినినా రష్య వాఙ్మయంలోనే కాక ప్రపంచ వాఙ్మయంలోకూడా ప్రఖ్యాతి కెక్కిన నవల. దీనికి తాపీ ధర్మారావుగారు వ్రాసిన అనువాదం, అనువాదంలాకనబడకుండా హాయిగా సాఫీగా నడిచి ముందుముందింకా చదవాలని కుతూహలం కలిగిస్తున్నది.

అయితే ఈ పుస్తకం అనువాదంలో కొన్నిచోట్ల మూలం సంగ్రహించడం జరిగిందని ప్రథాన సంపాదకులు వ్రాశారు. అనువాదాలు ఆంగ్లభాషా పరిచయంలేనివారి కుపయోగించేవిగా ఉండాలి. టాల్‌స్టాయివంటి మహారచయిత రచనలు తెలుగులో చదివే పాఠకులకు కథాదృష్టితోబాటు మూలరచయిత ప్రత్యేకతను తెలుగులోచదువుకోవాలని కుతూహలం

కలగడం సహజం. ఆ విధంగా చూచినప్పుడీ అనువాదం పాఠకులకు నిరుత్సాహం కలిగించవచ్చును.

అయితే ధర్మారావుగారు తమ అనువాదంలో కథాగమనము పాఠకుల ఔత్సుక్యము పెంపొందించడానికే ఈ విధంగా సంగ్రహించినట్లు కనబడుతున్నది.

పుస్తకముద్రణము, ఆకారము చాలా చక్కగా ఉన్నాయి. టాల్‌స్టాయి చరిత్ర మొదలయిన వివరాలతో ప్రధాన సంపాదకులు దీని కొక చక్కని పీఠిక రచించారు. ఇంతటి చక్కని గ్రంథం వెలువరించిన ఇంటింటి విజ్ఞానమాలా నిర్వాహకు లభినందనీయులు.

ఆశాజ్యోతి.

[కథల సంపుటి.]

'అమరేంద్ర'

ఇది అయిదు కథల సంపుటి. ఇందులో కథలన్నీ మొదలుపెడితే చివరదాకా చదివించివేస్తాయి. భాష సరళమూ స్వాదువుఅయిన వ్యావహారికం.

అయితే కథలలో కథకులు సామాన్యంగా తెలుగు సంసారాల్లో జరిగే సంఘటనలు తీసుకొని కథలుగా అల్లివేశారు. కథా రచనలో చాలా సునిశితమైన రచనా పాటవముగాని అత్యంతస్వభావోక్తులవలగాని కథాకథన శక్తిగాని కనబడవు.

ఈ కథలలో 'ఎవరిది?' 'కాలం నవ్వింది' అనేరచనలు రెండు కథలనడంకంటె చిత్రణా (*Sketches*) లనడమే న్యాయము. అయితే ఉన్న రచనలన్నిటిలోను ఈ రెండు బాగున్నాయి.

ప్రపంచ. చరిత్ర సంగ్రహం.

ఖండవల్లి బాలేందు శేఖరం ఎమ్. ఏ. ప్రకాశకులు వెంకటరామా - అండ్ కో సికిందరాబాద్. వెల రూ. 1-12-0.

ఇది సంగ్రహంగా ప్రపంచచరిత్ర వివరించే పుస్తకము. ఇది హెచ్. జి. వెల్స్ వ్రాసిన సంగ్రహ ప్రపంచ చరిత్ర పంథాలో రచించిన గ్రంథము. అందరికీ అందుబాటులో ఉన్నదిగదా అని హిందూదేశచరిత్రలను గురించి ఇందులో ఏమీ వ్రాయలేదని రచయిత పీఠికలో తెలియజేశారు గాని, నిజంగా అదే ఈ గ్రంథానికొక లోపంగా పరిణమించింది. ఇదిగాక గ్రంథకర్తగారే స్వయంగా పీఠికలో సూచించిన మరికొన్ని లోపాలు సర్దుకుంటే ఈ పుస్తకం ఇంకా బాగుండేది. రచయిత ముందు ప్రచురణలోనైనా ఈలోపాలు సవరించుకోగలరని ఆశిస్తున్నాను.

సహకార రాజ్యం.

[బుర్ర కథ.]

వారణాసి వెంకటనారాయణశాస్త్రి, ప్రచురణ జనపద ప్రచురణలు. నారాయణగూడ. వెల నాలుగు అణాలు.

ఇది సహకారోద్యమం ప్రజల్లో ప్రచారం చెయ్యడానికి ఉపయోగించే పుస్తకం. రచయిత దీనిలో బుర్ర కథల ధోరణి పట్టుకుని సహకారోద్యమానికి చక్కగా సమన్వయించారు.

మన ప్రధాని నెహ్రూ.

రచన. 'సింహగురు' ప్రకాశకులు జాతీయజ్ఞాన మందిరము 5. ఏ. మౌబ్రేస్ రోడ్, మద్రాస్ 14. వెల : పన్నెండణాలు.

ఇది ప్రధాని నెహ్రూ జీవితం సంగ్రహంగా వివరించే చిన్న పుస్తకం. నెహ్రూ చిత్రాలు మొదలయిన వాటితో పుస్తకం చక్కగా ఉంది.

యక్షప్రవాసము.

సున్నం వనరాజకవి, ప్రతులకు సున్నం వనరాజకవి. తుని. తూర్పుగోదావరి జిల్లా. వెల : ఎనిమిది అణాలు.

ఇది కాళిదాసు మేఘసందేశం ఇతివృత్తంగా తీసుకుని స్వతంత్రంగా రచించిన పద్యగ్రంథము. పద్యరచన నిర్దుష్టంగా ఉంది. శైలి కుంటుపడకుండా ధారాళంగా నడిచిపోతుంది.

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Press
No 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad